# లోకానికి నేనే వెలుగు



## మహోన్నతుని మన్నన పొందిన పునీత యోసేపుగారి "తండ్రి హృదయం"

సంపుటి : 44 అక్టోబర్ - డిసెంబర్ 2021 సంచిక : 4

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కుర్మ తామస్

## గురువిద్యార్థుల బృందం

బ్రదర్ కొప్పర డేవిడ్
బ్రదర్ గోన పీటర్
బ్రదర్ కంకిపాటి అనిల్
బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెందేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 040-27201427, 27200370, Fax: 27209505
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 44 అక్టోబరు-డిసెంబర్ 2021 సంచిక : 4

## మహోన్నతుని మన్నన పొందిన
## పునీత యోసేపుగారి "తండ్రి హృదయం"

**ఫాదర్ దాసి సురేష్ కుమార్**
సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం,
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
E-mail: stjohnshyd2@gmail.com
Website: stjohnseminary.org

# విషయసూచిక


సంపాదకీయం 5

**1.** ప్రియమైన తండ్రి - పునీత యోసేపుగారు **7**
*- బ్రదర్ అరికోట్ల బాలు*

**2.** ప్రేమ కలిగిన తండ్రి - పునీత యోసేపుగారు **15**
*- బ్రదర్ రాయపు ప్రేమ్‌కుమార్*

**3.** విధేయుడైన తండ్రి - పునీత యోసేపుగారు **22**
*- బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ*

**4.** అంగీకరించిన తండ్రి - పునీత యోసేపుగారు **35**
*- బ్రదర్ గంగారపు జగదీష్ కుమార్*

**5.** ధైర్యముగల తండ్రి - పునీత యోసేపుగారు **46**
*- బ్రదర్ కొండెపొగు ప్రేమ్‌రాజ్*

**6.** పనిచేసే తండ్రి - పునీత యోసేపుగారు **52**
*- బ్రదర్ చింతాడ సుధీర్*

**7.** దేవుని ప్రతిబింబమైన తండ్రి - పునీత యోసేపుగారు **66**
*- బ్రదర్ నందిగామ్ మనిహార్*

8. శ్రీసభ సంరక్షకుడు - పునీత యోసేపుగారు 74
*- బ్రదర్ కొట్టె సుధీర్‌కుమార్*

9. తిరుకుటుంబ పోషకుడు - పునీత యోసేపుగారు 87
*- బ్రదర్ కసుకుర్తి జోసఫ్ తంబి*

10. నీతికి నిలువెత్తు నిదర్శనం- పునీత యోసేపుగారు 98
*- బ్రదర్ చాట్ల అలెగ్జాండర్*

11. దైవసుతునికి సాకుడు తండ్రి - పునీత యోసేపుగారు 106
*- బ్రదర్ మబ్బు డేవిడ్ రాజు*

12. విశ్వాసపూరితమైన తండ్రి - పునీత యోసేపుగారు 118
*- బ్రదర్ జుత్తుగ వెళాంగణి రాజ్*

13. దైవకార్యంలో ఓ నీతిమంతుడు - పునీత యోసేపుగారు 126
*- బ్రదర్ పొలమరశెట్టి దేవరాజ్*

14. దివ్యవాక్కును ధీటుగా అనుసరించిన ధీరుడు -
పునీత యోసేపుగారు 135
*- బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్*

# సంపాదకీయం

దావీదు వంశజుడయిన సహనశీలి
యాకోబు - రాహేలులల పుత్రుడైన వినయశీలి
నజరేతు - నివాసియైన సాదుశీలి
రాజాధిరాజు యేసునకు సాకుడు తండ్రి !
ఆయనే మన పునీత యోసేపుగారు.



ఫ్రాన్సీస్ జగద్గురువుగారి ఆదేశానుసారం మనం ఈ సంవత్సారాన్ని (8. 12. 2020-8. 12. 2021) పునీత యోసేపుగారి పూజిత సంవత్సరంగా కొనియాడుచున్నాము. ఈ పూజిత సంవత్సరం ముగింపు సందర్భంగా, ఫ్రాన్సీస్ జగద్గురువు వ్రాసిన విశ్వ శ్రీసభ లేఖయైన "PATRIS CORDE" (తండ్రి హృదయంతో) వున్న ఆధారముగా పునీత యోసేపుగారి విశ్వాస ఔన్నత్యాన్ని, త్యాగనిరతిని, యేసుకు తండ్రిగా ఆదర్శ జీవన గమనాన్ని తెలియపరుస్తూ ఈ పుస్తకంలోని వ్యాసములో వ్రాయుబడినవి.

వేదాంత పండిత పూజ్య గురువుల పర్యవేక్షణలో వేదాంత శాస్త్రాన్ని అభ్యాసిస్తున్న విద్యార్థులచే పునీత యోసేపుగారి విశిష్ట గుణగణాలను, మహోన్నత జీవన సరళి గురించిన వివరణలను ముఖ్యముగా ఆయన పితృ హృదయ భావాలను ఈ జ్ఞాపికలో పొందుపరిచాం. ఇది క్రైస్తవులందరి విశ్వాస జీవితానికి ఎంతో ఉపయుక్తంకాగలదని భావిస్తున్నాం.

పునీత యోసేపుగారు ప్రియమైన తండ్రి. ఎందుకంటే దేవుడిని మనస్సు పూర్తిగా ప్రేమించి, దేవుని ప్రణాళికను అర్థం చేసుకొని, మరియతల్లిని తన భార్యగా, యేసుని తన కుమారునిగా స్వీకరించి, ప్రేమతో వాళ్ళను పోషించి, దేవుని రక్షణ ప్రణాళికలో తనకర్తవ్యాన్ని నెరవేర్చారు. తల్లి శ్రీసభ మనకు ఆధ్యాత్మిక తండ్రిగా పునీత యోసేపుగారిని దయచేసింది. మనలను సంరక్షించే తండ్రిగా, మార్గచూపరిగా ఉండటానికి ఆయన చూపిన అంగీకారం మహోన్నతమైనది. దైవప్రణాళికకు తన అంగీకారాన్ని అనుగ్రహంగా స్వీకరించిన యోసేపుగారి విశ్వాసం ఘనమైనది. ప్రభు యేసునికి సంరక్షకుడిగా

వర్ణనాతీతమైన ప్రేమ లోతులను అనుభవించిన హృదయం యోసేపునది. ఆ అంగీకారంలోనే సకల సద్గుణాలు దాగి ఉన్నాయి. "దాచబడినది ఏదియు బయలుపడకపోదు, రహస్యమైనది ఏదియు బట్టబయలుకాకపోదు" (లూకా 8:17). దైవచిత్తమునకు యోసేపు సహకారం సకల సద్గుణాలకు మూలాధారం. ఆయన నడిచిన అంగీకార బాటయే మనల్ని అనుగ్రహబాటలో నడిపిస్తుంది. ఈ ఆధ్యాత్మిక బాటయందు శ్రద్ధవహించి అనగా విశ్వాసం కలిగి మన హృదయాలను దివ్య వాక్కు ద్వారా కడిగి పరిశుద్ధం గావించమని తల్లి శ్రీసభ ఆకాంక్ష.

పునీత యోసేపుగారు తనధైర్యంతోనే మరియమ్మగారిని, బాలయేసును కాపాడగలిగారు. తన దగ్గర ఆస్తిలేదు, అంతస్తులు లేవు, ఏమియులేనప్పటికి కూడా, విశ్వాస ధైర్యంతోనే ముందుకు సాగి, ఆయన దేవుని చిత్తము యొక్క ప్రతిబింబముగా మారారు. ప్రతిబింబము చూసి మనం వాస్తవాన్ని తెలుసుకోవచ్చు. ఆ విధంగా దేవుని కోరిక మేరకు తన స్వేచ్ఛను, శక్తిని మరియమ్మను, బాలయేసుని సంరక్షణకై సమర్పించారు. దేవుని ప్రణాళిక కోసం, ప్రేషిత కార్యంకోసం ఆయన చూపించిన విధేయత, ఓర్పు, సహనం ఎంతో ఉన్నతమైనవి. దేవుని ప్రతినిధిగా ఉంటూ బాలయేసు జ్ఞానమందు, ప్రాయమందు వృద్ధి చెందుటకు ఎంతగానో కృషిసల్పి దేవుని వరమును, కృపను పొందుకున్నారు. తిరుకుటుంబ పోషకునిగా, సంరక్షకునిగా ఆదర్శంగా నిలిచారు. దేవుని ప్రణాళికలను విజయవంతం చేయడానికి తిరుకుటుంబాన్ని అన్ని విధాల ఆదుకొని, ముందుండి నడిపించారు.

పునీత యోసేపుగారి జీవితం నీతికి నిలువెత్తు నిదర్శనం. కాబట్టి చరిత్రలోనే మహా నీతిచరితుడుగా వెలుగొందుతున్నారు. తన క్రియలద్వారా విశ్వాసాన్ని చాటి చెప్పిన విధముగ, క్రైస్తవ విశ్వాస పడవ, ఈ జీవిత మహా సముద్రంలో అనేక ఆటుపోటులు తట్టుకొని నిలబడుటకు, క్రీస్తును చేరుటకు, మార్గచూపరి ఆయన. ఆయన జీవితం ద్వారా మనమును నీతిమంతులము కాగలుటకు, దైవప్రణాళికకు తలయొగ్గి జీవించుటకు ఆయన జీవన విధానం దోహదపడుతుంది. ఈ విధముగా ఆయన మనకు సదా ఆదర్శం. పునీత యోసేపుగారా మాకొరకు ప్రార్థించండి.

**ఇట్లు ప్రభు సేవలో**

**ఫాదర్ దాసి సురేష్ కుమార్**

***సంచిక సంపాదకుడు***

# 1. ప్రియమైన తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ అరికోట్ల బాలు



**ఉపోద్ఘాతం**

పునీత యోసేపుగారు ప్రియమైన తండ్రి. దేవుని మనస్ఫూర్తిగా ప్రేమించి, ఆయన ప్రణాళికను తెలుసుకొని, దానిని తు.చ తప్పకుండా పాటించిన ప్రియమైన తండ్రి. పరిశుద్ధ కుటుంబమును మిక్కిలి వినయంతో స్వీకరించి బాల యేసును మరియు మరియమ్మను అనేక ఆపదల నుంచి కాపాడిన ప్రియమైన తండ్రి. ధర్మశాస్త్రాను సారంగా దేవదూత యొక్క మాటలను అనుసరించి పాటించిన ప్రియమైన తండ్రి. మంచి తండ్రిగా, బాధ్యత కలిగిన భర్తగా, సేవకుడిగా, నాయకుడిగా, మరియు నీతిమంతుడిగా, తన యొక్క జీవితం ద్వారా జీవించి, చూపించిన ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు. నీతిగా బ్రతకాలంటే నిజాయితీ ఉండాలి, మనిషిలా బ్రతకాలంటే మంచి మనసు ఉండాలి అని తన జీవితం ద్వారా జీవించి చూపాడు మన ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు. అందుకే పిల్లలకు, తండ్రులకు, సమాజంలో ఉన్న ప్రతి ఒక్క వ్యక్తికి ఒక ఆదర్శం పునీత యోసేపుగారి జీవితం. దేవుడ్ని ఎలా ప్రేమించాలో, ఎలా విధేయుడై ఉండాలో తెలిసిన గొప్ప తండ్రి పునీత యోసేపుగారు. అనుమానమే పెనుభూతంగా వెంటాడిన, దూత మాట విని దైవ సంకల్పమును ఎరిగిన గొప్ప తండ్రి. ఒక్క మాటలో చెప్పాలంటే తండ్రులకు, భర్తలకు, కార్మికులకు, నీతిమంతులకు, పోషకుడు, పాలక పునీతుడు మన ప్రియమైన తండ్రి యోసేపుగారు. అతని యొక్క విధేయత, వినయము, నిస్వార్థము, ధైర్యము,

మరియుతల్లిపట్ల, యేసు పట్ల అతను చూపించిన ప్రేమ స్ఫూర్తిదాయకమైనది. అందుకే ఈనాడు ప్రపంచమంతా కూడా యోసేపుగారిని ప్రియమైన తండ్రిగా కొనియాడుతున్నాం.

## కుటుంబంలో తండ్రి పాత్ర

తండ్రి తన పిల్లలను అన్ని రకాల అన్యాయమైన తప్పుల నుండి, దురాక్రమణ నుండి, మరియు అన్ని విపత్తుల నుండి, కాపాడుతూ తోడునీడగా ఉంటాడు. అదే విధంగా మన ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు కూడ తన యొక్క కటుంబాన్ని అన్ని విపత్తుల నుండి రక్షించి, తోడు, నీడగా నిలిచాడు. కుటుంబంలో తండ్రి పాత్ర చాలా గొప్పది, ముఖ్యమైనది. తండ్రి వారి తప్పులను సరిదిద్దటం ద్వారా వారిని రక్షిస్తాడు తరువాత తనను తాను రక్షించుకో గలుగుతాడు. బాధ్యతాయుతమైన, మరియు సమర్ధులైన, యుక్తవయసు కలిగిన వారి పట్ల ప్రేమ కలిగి ఉండటం, తండ్రి ముఖ్య లక్షణం. వారిలో ఉన్నటువంటి ఆశయాలను బయటకు తీసుకువచ్చి వారి జీవితంలో విజయం సాధించడానికి, అవసరమైన శక్తులను, మరియు వైఖరులను ఏర్పాటు చేయటం తండ్రి యొక్క ముఖ్య లక్షణం. పిల్లల దృష్టిలో తండ్రి జీవితకాల ఉపాధ్యాయుడు; అనేక శారీరక విపత్తుల నుండి రక్షిస్తూ ఉండేవాడు తండ్రి. తండ్రి తన పిల్లలను నేర్చుకొనే దిశగా నడిపించడం, దేవునిలో ఎదుగుటకు, పవిత్రమైన జీవితాన్ని జీవించుటకు తండ్రి పాత్ర చాలా గొప్పది. దేవుడు యోసేపుకు ఒక గొప్ప బాధ్యతను అప్పగించాడు. తన కుమారుడిని పెంచడానికి, మరియు నడిపించడానికి, పునీత యోసేపు గారిని ఎంచుకున్నారు. యేసుప్రభు పుట్టినప్పటినుండి, కంటికి రెప్పలా కాపాడుతూ నజరేతులోని ప్రార్ధన మందిర పాఠశాలకు పంపాడు. అక్కడ యేసు చదవడం, లేఖనాలను బోధించడం, వాటికి సమాధానం చెప్పడం నేర్చుకున్నాడు. అంతేకాకుండా తన భూసంబంధమైన పరిచర్యను చేయడానికి సహాయపడ్డాడు పునీత యోసేపుగారు. బాల యేసును, మరియతల్లిని పాలస్తీనా నుండి ఈజిప్టుకు కష్టతరమైన ప్రయాణాన్ని చేయగలిగాడు. అంతేకాకుండా తన కుమారుడిని హేరోదు ఖడ్గం

నుండి, అతని సైనికుల నుండి తప్పించాడు. దేవుడు తన కుమారుడిని యోసేపుగారి చేతులకు అప్పగించడానికి గల కారణం, అతని నీతి, నిస్వార్థ జీవితం, ధైర్యం. అందుకే ప్రతి ఒక్క తండ్రి కూడా వారి బిడ్డలకు దేవుని నీతిని గూర్చి నేర్పించాలి. ఆయన యొక్క అడుగుజాడల్లో నడిపించాలి. అప్పుడే ఆ కుటుంబము సంతోషంగా మరియు దేవుని శాంతి సమాధానాలతో ఉంటుంది.

## యోసేపుగారు తండ్రులకు ఆదర్శప్రాయులు

పునీత యోసేపుగారు ఆధ్యాత్మిక జీవితానికి మరియు సమాజంలో బాధ్యత గల జీవితాన్ని జీవించడానికి ఒక ఆదర్శప్రాయులు. ఆలయంలో బాలుడైన యేసుని కనుగొన్న తర్వాత మరియతల్లి ఇలా చెప్పింది “కుమారా! మీ నాన్న, నేను చాలా ఆందోళనతో నీ కోసం వెతుకుతూ ఉన్నాము” (లూకా 3:48). ఈ విధంగానే యోసేపుగారు నిజమైన తండ్రిగా, పవిత్ర కుటుంబానికి ఒక ఆదర్శంగా, ఒక మార్గ చూపరిగా ఉన్నారు. పునీత యోసేపుగారు తన వినయపూర్వకమైన నిశ్శబ్ద మార్గంలో మరియ తల్లిని పవిత్రంగా స్వీకరించి, ఆమె గర్భంతో వున్నప్పుడు అనేక ఆపదలనుండి రక్షించాడు. యేసు పుట్టిన తర్వాత పవిత్ర కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకున్నాడు, సకల ఆపదల నుండి రక్షించాడు. మరీ ముఖ్యంగా, హేరోదు రాజు ఖడ్గం నుండి తప్పించుకోవడానికి వారిని ఈజిప్టుకు తరలించాడు. తరువాత అతను తిరిగి నజరేతుకు వెళ్లి వడ్రంగిగా తన దుకాణాన్ని ప్రారంభించాడు, యేసుకు వ్యాపారాన్ని బోధించాడు. యోసేపుగారు తన యొక్క వినయముతో, విధేయతతో, వారి అవసరాలకు తను చేయగలిగినదంత చేశాడు. ఎందుకంటే యోసేపుగారు శ్రద్ధగల, ఆప్యాయతగల, తండ్రి. పునీత యోసేపుగారి వలె మనము కూడా దేవునికి విధేయులై ఉండాలి. అప్పుడే మన కుటుంబాలు దేవుని శాంతి సమాధానాలతో ఉంటాయి. యోసేపుగారు నిస్వార్థుడు, నీతిమంతుడు, తన కుటుంబం పట్ల అతని ప్రేమ, అతని భక్తి ఈ రోజు తల్లి తండ్రులకు ఆదర్శంగా ఉండాలి.

అతని మాటలు ఏ సువార్తలోను వ్రాయబడలేదు కానీ అతని మంచి కార్యాల ద్వారా న్యాయమైన, నీతివంతమైన జీవితాన్ని జీవించాడు. ఆలాంటి పవిత్రమైన జీవితాన్ని గురించి కార్మికుల పోషకుడైన పునీత యోసేపుగారి నుండి మనమందరము కూడ గొప్ప పాఠాన్ని నేర్చుకోవచ్చు.

## పునీత యోసేపుగారు భాధ్యతగల తండ్రి

పునీత యోసేపుగారు మరియమ్మకి భర్తగా, యేసుకు తండ్రిగా, తీసుకున్న ఒక గొప్ప బాధ్యత గురించి తెలుసుకుందాం. దేవుని కుమారుని, అతని తల్లిని రక్షించడం, వారి యొక్క అవసరాలను తీర్చడం యోసేపు గారి వృత్తి. దేవుడు మనకు అప్పగించిన పనులను నెరవేర్చడానికి అవసరమైన కృపలను అందిస్తాడు. లోకపు రక్షణలో పునీత యోసేపుగారిది ముఖ్యమైన పాత్ర. అతను దానిని తు.చ. తప్పకుండా అనుసరించాడు. యేసుప్రభు పెరిగిన సంవత్సరాలల్లో వారి పాత్ర ఊహించుకుందాం. యేసు, కీర్తనలు మరియు ఇతర లేఖనాలను, ఎవరి నుండి నేర్చుకున్నాడు అని మీరు అనుకుంటున్నారు? వారి పవిత్రమైన చిన్న ఇంట్లో భోజనం చేసిన తర్వాత దేవుని స్తుతిస్తూ పాటలు పాడుతూ ప్రార్ధిస్తూ ఉండేవారు. మంచి సమయాల్లోనూ, కష్టతరమైన సమయాల్లోనూ ముగ్గురి మధ్య ఉన్న పరస్పర ప్రేమను అర్ధం చేసుకుందాం. తండ్రిగా ఎన్నో బాధలు ఉన్నప్పటికి కూడా యేసును, మరియతల్లిని వినయంతో స్వీకరించాడు. దేవుడు చూపించిన అడుగు జాడలలో నడిచాడు, చివరికి నీతిమంతుడుగా పిలువబడుతున్నాడు. మన ప్రస్తుత జగద్గురువులు అయినటువంటి ఫ్రాన్సీస్‌గారు తన అపోస్తోలిక్ లెటర్‌లో పునీత యోసేపు గారిని ప్రియమైన తండ్రిగా, కోమలమైన తండ్రిగా, ప్రేమగల తండ్రిగా, అంగీకరించే తండ్రిగా, సృజనాత్మక మరియు ధైర్యవంతుడు అయిన తండ్రిగా అభివర్ణించాడు. పునీత యోసేపుగారు దేవుడు చెప్పిన విధంగా యేసును, మరియతల్లిని రక్షించాడు, వారి పట్ల శ్రద్ధ వహించాడు, వారిని పెంచి పోషించాడు. అందుకే మనమందరం కూడా పునీత యోసేపుగారి వైపు చూస్తూ

మన ప్రార్థనలో వారి యొక్క మధ్యవర్తిత్వాన్ని కోరుదాం. పిల్లలను ప్రపంచానికి తీసుకురావడం ద్వారా మనిషి తండ్రి అవుతాడు కానీ ఆ బిడ్డలను చూసుకొనే బాధ్యతలను అంగీకరించడం ద్వారా ఆ వ్యక్తి బాధ్యత కలిగిన తండ్రిగ పిలువబడతాడు. పునీత యోసేపులో బాధ్యత కలిగిన తండ్రి అంటే క్లిష్టతరమైన, త్యాగపూరితమైన మరియు దృఢమైన మార్గంలో దేవునికి విధేయత చూపడం. పునీత యోసేపుగారు దేవదూత చెప్పిన మాటలను విశ్వసించారు. యేసును తన సొంత కుమారునిగా ప్రేమతో అంగీకరించారు. అంతేకాకుండా యేసు కోసం ఒక రక్షిత గృహాన్ని అందించారు. మరియ తల్లికి భర్తగా, దేవుని కుమారునికి తండ్రిగా ఉండాలనే దైవ పిలుపును అంగీకరించాడు. యోసేపుగారు చేసిన త్యాగం, మోక్షకార్యంలో పాల్గొనడానికి ఒక సాధనంగా నిలిచింది. అతను వడ్రంగిగా చేసిన పని పవిత్ర కుటుంబం అభివృద్ధి చెందడానికి మరియు బెత్లెహేములో దాగి ఉండటానికి ఒక మార్గాన్ని చూపించింది. పునీత యోసేపుగారు మౌనంగా ఉంటూ, శ్రద్ధగా దేవుని యొక్క ప్రణాళికలను తెలుసుకున్నారు. వాటిని తెలుసుకొని ఇది నా చిత్తం కాదు, అంతా దేవుని యొక్క చిత్తం అనుకొని వాటిని చక్కగా పాటించాడు. అందుకే పునీత యోసేపుగారి మాటలు మరియు కార్యాలు అన్నీ కూడా దేవుని చిత్తాను సారముగా ఉన్నాయి. పునీత యోసేపుగారు మంచి తండ్రిగా, మంచి భర్తగా, మంచి పనివాడిగా, మంచి విధేయుడుగా దేవుని యొక్క రక్షణ ప్రణాళికలో కనిపిస్తాడు.

## పనిచేసే తండ్రి - పునీత యోసేపుగారు

పునీత యోసేపుగారు ఒక వడ్రంగి. అతను తన కుటుంబాన్ని పోషించడానికి నిజాయితీగా కష్టపడి పనిచేశాడు. యోసేపుగారు ఒక వర్తకుడు, చెక్క పని చేసేవాడు అంటే వడ్రంగి అని లేఖనాలు చెబుతున్నాయి. అతను ఒక చిన్న పట్టణంలో నివసించాడు. యోసేపుగారు శిల్పకారుడు, నైపుణ్యం కలిగిన హస్త కళాకారుడు. నజరేతులోని ప్రజలకు ఏదైనా కట్టడాలు లేదా

బాగుచేయడం అవసరమైనపుడు యోసేపు దగ్గరకు వెళ్ళేవారు. వ్రడంగి పని అతని కాలంలో సాంకేతికతను, మరియు నైపుణ్యతను చూపిస్తుంది. ప్రతీది కూడ నరుల యొక్క కష్టంతో జరుగుతుంది. చెట్టును నరికి వేయడం, విభజించడం, కలపను లాగడం, కత్తరించడం, చెక్కడం, మరియు కలపటం ఇలాంటి పనులు ఒక వృద్ధుడికి సాధ్యం కాదు. కాని, శక్తి, దైర్యం కలిగి ఉన్న వ్యక్తికి మాత్రమే సాధ్యమవుతుంది. పునీత యోసేపుగారు తన వ్యాపారాన్ని ఇష్టపడ్డాడు. విశ్వాసం ఉన్న వ్యక్తికి పని ప్రతిభను, సామర్థ్యాలను, పెంపొందించ డానికి ఉపయోగపడుతుంది. వాటిని, సమాజానికి మరియు సోదర సమాజానికి సేవ చేయడానికి ఒక అవకాశంగా మారుతూ ఉన్నాయి. యేసు, యోసేపుగారి నుండి విలువలను నేర్చుకున్నాడు. వ్రడంగి నైపుణ్యాలు మాత్రమే కాదు, బోధించడం కూడా నేర్చుకున్నాడు. అతను తన కుమారుడైన యేసుతో కలిసి పని చేసాడు. ఉదయం నుండి రాత్రి వరకు వారు పక్క పక్కనే పనిచేసారు. మరి మనమందరము కూడా పనిచేసే తండ్రి అయినటువంటి యోసేపుగారి వలె మన రోజు వారి పనులను ప్రేమతో కూడిన శ్రమలుగా చేసుకుందాం.

## విధేయుడైన తండ్రి - పునీత యోసేపుగారు

పునీత యోసేపుగారి గురించి ఒక్క మాట కూడా సువార్తలలో వ్రాయబడలేదు. కానీ నాలుగు సందర్భాలలో అతని యొక్క జీవితంలోని క్లిష్టమైన క్షణాలు కనిపిస్తాయి. దేవుడు కలలో దేవదూత ద్వారా అతనితో మాట్లాడాడు. మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ పునీత యోసేపుగారు దానిని గూర్చి విన్నారు, పాటించారు. అలా విన్న దాన్ని చేయడం చాలా కష్టం. తరచుగా మనం మన జీవితంలో, వినాలి అనుకున్న దాన్ని మాత్రమే వింటాము మరియు చేయాలి అనుకున్నది మాత్రమే చేస్తాము. కానీ పునీత యోసేపుగారు మాత్రము, తాను చేయాలనుకున్నది కాకుండా, దేవుడు చూపించిన దానిని, చేయమని చెప్పిన దానిని అనుసరించాడు, మరియు విధేయతతో పాటించాడు. మరియతల్లి రహస్యమైన గర్భాన్ని ఎదుర్కొన్నపుడు అతని పాత్ర ఏమిటో

తెలిసినపుడు, వినయముతో, విధేయతతో దేవుడు చెప్పిన దాన్ని తూచ తప్పకుండా అనుసరించాడు. ఈ సందేశం ద్వారా దేవుడు, పునీత యోసేపుగారిని మరియమ్మకు భర్తగా, యేసుకు తండ్రిగా తన పాత్రను ధృవీకరించాడు. అందుకే యోసేపు ప్రతిస్పందన తక్షణమే అని లేఖనములు చెబుతున్నాయి. పునీత యోసేపుగారు నిద్రనుండి మేల్కొనినపుడు ప్రభువుదూత అతనికి ఆజ్ఞాపించినట్లు చేశాడు (మత్తయి 1:24) పునీత యోసేపుగారు దూత చెప్పినది ఆలకించాడు, విశ్వసించాడు, మరియు పాటించాడు. అతను తన భార్యను ఇంటికి తీసుకుని వెళ్ళడం ద్వారా వివాహిత విధులను నిర్వర్తించాడు. అతని సంరక్షణలో ఉంచబడిన, పుట్టబోయే బిడ్డను స్వాగతించడం ద్వారా, అతనికి పేరు పెట్టడం ద్వారా దేవుడు అతనికి ప్రసాదించిన పితృత్వంపై పనిచేసాడు. ఇది యూదుల ప్రకారం తండ్రి బాధ్యత, ఆచారం, మోషే ప్రవక్త చట్టం. పిల్లవాడు పుట్టిన తర్వాత దేవదూత యోసేపుతో, లేచి బిడ్డను మరియు అతని తల్లిని తీసుకొని ఈజిప్టుకు పోయి, నేను చెప్పునంత వరకు అక్కడే ఉండండి, హేరోదు రాజు పిల్లవాడిని నాశనం చేయడానికి వెదకుతున్నాడు (మత్తయి 2:13). దేవదూత సందేశం ద్వారా యోసేపు తన కుటుంబానికి ఎదురైన ముప్పు నుండి వారిని రక్షించారు. ఆలస్యం చేయకుండా తల్లిని మరియు కుమారుని తీసుకొని ఒక దేశ సరిహద్దు మీదుగా, ఇంకో తెలియని సురక్షితమైన ప్రదేశానికి చేర్చారు. నిజంగా యోసేపు గారికి దేవుడు మరియు క్లిష్టమైన పనిని అప్పగించారు. వినమ్రులు ధన్యులు వారు దేవుని దయను పొందెదరు అన్న వాక్యం పునీత యోసేపుగారి జీవితంలో నెరవేరినది.

**ముగింపు**

పునీత యోసేపుగారు ఒక సాధారణమైన మనిషి. కానీ నీతి నియమాలతో దేవుని యందు విశ్వాసము కలిగి జీవించిన ఒక గొప్ప వ్యక్తి. కష్టపడి పనిచేస్తూ తన జీవితాన్ని జీవించిన ఒక సామాన్య వ్యక్తి. అందుకే పునీత యోసేపుగారు నీతిమంతుడు అని సువార్త పఠనాలు తెలియజేస్తున్నాయి. నీతిమంతుడు అంటే?

వినయము, విధేయత, ఓర్పు, దయ, ధైర్యము, కనికరము, నమ్మకము, విశ్వాసము, నిస్వార్థము, కలిగి జీవిస్తున్న వారిని నీతిమంతులు అంటారు. ఇవి అన్ని కూడా పునీత యోసేపుగారు కలిగి జీవించారు. అందుకే వారు నీతిమంతులుగా పిలువబడుతున్నారు. పునీత యోసేపుగారు నీతిమంతుడు కాబట్టి దేవుడు తన కుమారునికి తండ్రిగా, మరియతల్లికి భర్తగా ఉండటానికి ఎంచుకున్నారు. యోసేపుగారు నీతిమంతుడు కాబట్టి, దేవునియందు విశ్వాసము కలిగి జీవించిన వ్యక్తి కాబట్టి, దేవుని ప్రణాళికలను అర్థం చేసుకొని మరియమ్మను, యేసును తన సొంత వారిగా స్వీకరించాడు, నడిపించాడు, మరియు పోషించాడు. తన జీవితాన్ని పక్కనబెట్టి, తన ఇష్టాలను ప్రక్కనబెట్టి, దేవుడు చెప్పిన పనిని తు.చ. తప్పకుండా పాటించాడు. పునీత యోసేపుగారు తను నడవబోయే దారిలో కష్టాలు మరియు బాధలు ఉన్నాయి అని తెలిసి కూడా, కేవలం దేవుని ప్రణాళికను నెరవేర్చడం కోసం ముందుకు నడిచాడు, నడిపించాడు, దేవుని రక్షణలో పాలుపంచుకున్నాడు మన ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు. అందుకే నీతికి నిర్వచనం మన ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు. ప్రతి ఒక్క కుటుంబం కూడా పవిత్ర కుటుంబముగా పిలువబడాలంటే, పునీత యోసేపుగారి లాగ వినయము, విధేయత, ఓర్పు, దయ, కనికరము, నమ్మకము, విశ్వాసము, ధైర్యము, నిస్వార్థం కలిగి జీవించాలి. అప్పుడే మనమందరము కూడా నీతిమంతులుగా, ప్రతి తండ్రి ప్రియమైన తండ్రిగా మరియు ప్రతి కుటుంబం, పవిత్ర కుటుంబంగా పిలువబడుతుంది.

# ౨. ప్రేమ కలిగిన తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ రాయపు ప్రేమ్‌కుమార్



**ఉపోద్ఘాతం**

పునీత యోసేపుగారు ఎప్పుడు జన్మించారో నిర్దిష్ట తేది లేదు, కాని అతడు క్రీస్తు పూర్వం సుమారు 100 సంవత్సరములో జన్మించాడని చెప్పబడింది. మరియమ్మ మరియు యేసుతో సహా పవిత్ర కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులలో పునీత యోసేపు ఒకరు. పునీత యోసేపుగారు వినయ పూర్వకమైన వ్యక్తి అయినప్పటికి, అతడు రాజవంశము నుండి వచ్చిన వాడు. పవిత్ర గ్రంథమలోని అతని వంశావళిని ఆధారంగా చేసుకొని దావీదు వంశస్థుడుగా గుర్తించవచ్చు. పునీత యోసేపు గారు యాకోబు కుమారుడని పునీత మత్తయిగారు తన సువిశేషములో చెప్పారు. యోసేపుగారు వృత్తిరీత్యా వడ్రంగి. మరియమ్మకు యోసేపుతో వివాహం నిశ్చయమైనది, కాని వారు ఇరువురును కాపురము చేయకముందే పవిత్రాత్మ ప్రభావము వలన మరియమ్మ గర్భము ధరించినది (లూకా 1:18). అందుకు గాను అతడు మరియమాతని పరత్యజించుటకు నిర్ణయించుకున్నాడు కాని బహిరంగముగా చేస్తే, మరియమ్మ రాళ్లతో కొట్టబడుతోందని అతనికి తెలుసు కాబట్టి రహస్యముగా పరిత్యజించుటకు నిశ్చయించుకొనెను. యోసేపు యేసుకు వడ్రంగి పని నేర్పి ఉండవచ్చని కూడ ఊహించవచ్చు. యేసు బహిరంగ పరిచర్య సమయంలో యోసేపుగారు సజీవంగా లేకపోయిన, యేసు చిన్న ప్రాయమున, ఆయనను రక్షించడానికి తన ఇంటిని కూడా విడిచిపెట్టాడు. యోసేపు, మరియమ్మ, యేసుతో కలిసి నజరేతు తిరిగి వచ్చారు. అక్కడ “యేసు

జ్ఞానమందును, ప్రాయమందును వర్ధిల్లుచు దేవుని అనుగ్రహమును, ప్రజల ఆదరాభిమానాలను పొందుచుండెను" (లూకా 2:52). యోసేపుగారు యేసు ప్రభువుకు మంచి ఆదర్శప్రాయుడని, మంచి విలువలు నేర్పాడు అని తెలియజేస్తుంది. గత సంవత్సరం పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు పునీత యోసేపుగారి సంవత్సరముగా ప్రకటిస్తూ అపోస్తోలిక లేఖను విడుదల చేశారు. దీని అర్థం తండ్రి హృదయముతో, అందులో పునీత యోసేపుగారు విశ్వ తిరుసభకు పోషకుడుగా ప్రకటించబడిన 150వ వార్షికోత్సవాన్ని గుర్తిచేస్తున్నారు. ఫ్రాన్సిస్ పోపుగారు డిసెంబర్ 8, 2020 నుండి డిసెంబర్ 8 2021 వరకు పునీత యోసేపు గారి సంవత్సరముగా ప్రకటించడానికి ఈ వార్షికోత్సవం కారణం. దీని సందర్భంగా జగద్గురువులు తన విశ్వ లేఖలో యోసేపుగారి లక్షణాలను అద్భుతంగా వివరించారు. జగద్గురువులు యోసేపు గారిని ప్రియమైన తండ్రిగా, కోమలమైన ప్రేమగల తండ్రిగా, విధేయుడైన తండ్రిగా, అంగీకరించే తండ్రిగా, సృజనాత్మకంగా ధైర్యంగా, ఉండే తండ్రిగా పనిచేసే తండ్రిగా, ఆదర్శంగా తండ్రిగా అభివర్ణించారు.

## సద్గుణాల సంపన్నుడు పునీత యోసేపుగారు

పరిశుద్ధ గ్రంథంలో పునీత యోసేపుగారిని "నీతిమంతునిగా" వర్ణిస్తుంది (మత్తయి1:19). దీనిని "న్యాయమైన" "నిటారుగా" లేదా, "అన్ని విషయాలలో సద్గురువు" అని కూడా అనువదించవచ్చు. పునీత యోసేపుగారి నుండి మనం నేర్చుకోవాలి అనుకుంటే అతని నిశ్శబ్ద జీవితంలో ప్రతిరోజు ఆచరించిన ధర్మాలను అనుసరించడం మనం ప్రారంభించాలి.

## పునీత యోసేపుగారు శ్రీసభ రక్షకుడు

పవిత్ర కుటుంబం శ్రీసభ అయినందున పునీత యోసేపు సర్వ శ్రీసభ తన రక్షణలో కలిగి ఉన్నాడు. యోసేపుకున్న తెలివి, విధేయత, అతని త్యాగం ద్వారా శ్రీ సభను ధైర్యంగా సంరక్షిస్తున్నాడు.

పవిత్ర కుటుంబంలో అంతర్గత ప్రశాంతతను సృష్టించిన పునీత యోసేపుగారి శరీరములోను, హృదయములోను, పవిత్రతను స్వచ్ఛంగా ప్రేమించాడు.

## పునీత యోసేపుగారి నీతి నిబద్ధత

యోసేపుగారి మొట్టమొదటిగా దేవుని యెడల నీతిమంతునిగా ఉన్నాడు. దేవునికి తన జీవితంలో యివ్వవలసిన మొదటి ప్రాధాన్యతను అందించాడు. అన్ని విషయాలలో యోసేపుగారు దేవుని అంటిపెట్టుకునే ఉన్నాడు కాబట్టి, పవిత్రుడైన యోసేపుగారు ప్రార్థనలోను, శ్రమలోను, ప్రేమలోను తన జీవితమంత పవిత్రంగా దేవునికి అర్పించాడు.

## కార్మికులకు ఆదర్శమూర్తి పునీత యోసేపుగారు

మనం కేవలం ప్రేమను ఉద్దేశించి చూడకూడదు, ప్రేమను నెలకొల్పాలి అన్నప్పుడు మనం శ్రమించాలి. ప్రయోజనం, మరొకరి మేలు కోసం శ్రమించడం యోసేపుగారి విషయంలో దేవుని కోసం ప్రత్యక్ష శ్రమ. అతను కనుబొమ్మల చెమటతో ఆదాము శాపంలో పనిచేయడం ఉద్దేశ్యంతో నిండి ఉంది ఎందుకంటే ఇది ఆహారం, బట్టలు, ఆశ్రయం కూడుకున్నటివంటి శ్రమ.

## యోసేపు అత్యంత విధేయుడు, పవిత్ర కుటుంబానికి అధిపతి

ఒక వ్యక్తి మొదట వ్యాఖ్యానానికి విధేయత చూపితే, అది సహజమైన లేదా మతపరమైనదైనా ఒక కుటుంబానికి న్యాయమైన శిరస్సుగా మాత్రమే ఉండగలడు. యోసేపుగారు పరిపూర్ణ విధేయత అతని పవిత్ర కుటుంబానికి పరిపూర్ణ అధిపతిగా మార్చింది.

## పునీత యోసేపుగారు గొప్ప విశ్వాస పాత్రుడు

విశ్వసనీయత అనేది స్థిరత్వాన్ని సూచిస్తుంది. జీవితంలోని ఒడుదుడుకులలో, గందరగోళం, బాధ, వైఫల్యం ఎదురైనప్పుడు స్థిరమైన ప్రేమ, విశ్వసనీయత చాలా అవసరం. వైఫల్యం అంటే ఒక వ్యక్తి విశ్వసనీయతతో

కొనసాగి, దేవుడు తన సంకల్పంను ఫలవంతం కోసం ఉద్దేశించిన దానిని పునీత యోసేపుగారు కనుగొన్నారు.

## పునీత యోసేపుగారు సహనానికి అద్దం

సహనం అంటే బాధలకు సిద్ధపడటం. రోగి తన రోగమును పోగొట్టుకోవడానికి సహనంగా జాగ్రత్త చర్యలు తీసుకుంటాడు. ఆ సహనానికి వచ్చిన ఫలితమే అతని రోగాన్ని బాగుచేస్తుంది. యోసేపు తన జీవితంలో ఎల్లప్పుడు ప్రేమను కనబరుస్తూ ఓర్పుతో జీవించాడు. మరియమాతను, బాల యేసును సంరక్షించిన వ్యక్తి కావడం ద్వారా అతను దేనినైనా ఎదర్కోవడానికి సిద్ధపడ్డారు.

## పునీత యోసేపుగారి అత్యంత వివేకం

వివేకం అనేది సద్గుణాలకు తల్లి, ఇది ఎక్కడ, ఎప్పుడు నిర్ణయాలు తీసుకునే చురుకైన మనస్సుతో పరిపాలన అనుభవంద్వారా పొందిన ఆచరణాత్మక జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. యోసేపు దేవుని చిత్తాన్ని నిరాకరించలేదు, కాని ఇది దైవచిత్తమని గ్రహించి వివేకంతో ముందుకు సాగాడు.

## పునీత యోసేపుగారు దుష్టశక్తులను పారద్రోలే వారు

రాక్షసులు వినయాన్ని ద్వేషిస్తారు. వారు అహంకారం దుర్మార్గాన్ని కలిగి ఉంటారు. యోసేపుగారు వినయం దుష్టశక్తిని భయపెడుతుంది. అతనికి అధికారం కేవలం అతని అంతర్గత బలం కారణంగా కాదు కానీ దేవునిపై పూర్తిగా ఆధారపడటం మరియు విశ్వసనీయత కారణంగా అప్పగింపబడింది.

## మంచి మరణానికి సహాయకుడు - బాధిత వ్యక్తుల ఓదార్పు

మీరు చనిపోయే ముందు దేవుని చూడటం, దేవుడే మిమ్మల్ని వెళ్ళమని చెప్పడం ఎంత ధన్యమైన మరణం. ఇది తన కుమారుని నుండి యోసేపునకు బహుమతి, అతను తన తండ్రిని తన తండ్రికి అప్పగిస్తాడు. ఈ విధంగా క్రీస్తు యోసేపుకు మరణ సమయంలో ఉన్న వారందరికి ప్రత్యేక మధ్యవర్తి శక్తిని కలిగి ఉండమని అప్పగించాడు.

## యోసేపుగారి కుటుంబ, కన్యకల పవిత్ర సంరక్షకుడు

యోసేపుగారు పవిత్రత వృత్తి కారణంగా, అతడు దేవునికి చెందిన స్వచ్ఛమైన వాటిని కుటుంబ సమగ్రతను కాపాడి తన పనిని కొనసాగించటానికి మరింతగా అప్పగించబడ్డాడు. ఈ శక్తి అతని పరిపూర్ణ విశ్వాసం ఈ యువతకు ప్రతిఫలంగా ఇప్పుడు అతని ద్వారా ప్రవహిస్తుంది. అన్ని మతాలు, కుటుంబాలు ఈ అత్యంత శక్తివంతమైన మధ్యవర్తిని ఆశ్రయించాలి.

పునీత యోసేపుగారు సద్గుణంలోని తండ్రి హృదయానికి ఒక సంవత్సరం అంకితం చేయడం సార్వత్రిక కతోలిక దేవాలయానికి ఎంతో బహుమతి!

జగద్గురు ఫ్రాన్సిస్ పాపుగారు అపోస్టోలిక లేఖలో పునీత యోసేపు తండ్రి యొక్క హృదయ లక్షణం, దేవుని ప్రేమకు చిహ్నంగా ఎలా ఉందో తెలియజేస్తూ, పిల్లలకు తండ్రి హృదయం గురించి వివరిస్తాడు. పునీత యోసేపుగారు కనబరచిన ప్రేమ ద్వారా మన హృదయాలు తండ్రిని ప్రతిబింబించేలా చేస్తుంది.

ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు మరియమ్మకు భర్తగా, యేసుకు తండ్రిగా ప్రేమపూర్వకమైన సేవలు చేసుకున్నాడు. "అతను కుటుంబ ప్రేమకు, తన మానవ వృత్తిని, తన హృదయాన్ని, తన సామర్థ్యాలను మానవాతీతమైన అర్పణగా మార్చాడు, తన ఇంటిలో ఎదుగుతున్న దేవుని కుమారుని సేవలో ప్రేమించబడడం చూస్తున్నాము" (PC. 1).

పునీత యోసేపుగారు ఒక మృదువైన, ప్రేమగల తండ్రి. అతడు చూపించిన తండ్రి హృదయం ద్వారా యేసు దేవుని సున్నితమైన ప్రేమను చూసాడు. అతనికి ఎలా నడవాలో నేర్పించాడు. అతను పడిపోయినప్పుడు అతని ప్రేమపూర్వక కౌగిలిని అందించాడు. మన పతనాలను, బలహీనతను, పేదరికములను సున్నితంగా చూడాలని యోసేపు మనకు బోధిస్తాడు. " దుష్టుడు మన బలహీనతలను చూసేల ఖండించేలా చేస్తాడు, అయితే ఆత్మ దానిని సున్నితమైన ప్రేమతో వెలుగులోనికి తెస్తుంది. మనలోని బలహీనతలను ఎదుర్కోవడానికి సున్నితత్వం ఉత్తమ మార్గం"(PC.2).

పునీత యోసేపుగారు విధేయుడు, దేవుని నుండి వచ్చిన ప్రతి సందేశంలో తండ్రి కోరినట్లే చేశాడు. " ప్రతి పరిస్థితిలో యోసేపుగారు తన స్వంత నిర్ణయాన్ని ప్రకటించలేదు. మరియమ్మ ప్రకటనలో, గెత్సమనే తోటలో యేసు లాగా చేశారు" (PC.3).

పునీత యోసేపుగారు అంగీకరించే తండ్రి యోసేపు దేవదూత తనకు చెప్పిన మాటలను విశ్వసించాడు, యేసును తన సొంత కుమారునిగా ప్రేమతో అంగీకరించాడు. మరియమ్మ, యేసు కోసం ఒక సురక్షిత గృహాన్ని అందించాడు. మరియమ్మకు భర్తగా, దేవుని కుమారునికి తండ్రిగా ఉండాలనే అతని పిలుపుని అంగీకరించాడు. "యోసేపుగారి వైఖరి, మినహాయింపు లేకుండా ఇతరులను అంగీకరించడానికి, స్వాగతించమని, బలహీనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపమని ప్రోత్సహిస్తుంది, ఎందుకంటే దేవుడు బలహీనమైన దానిని ఎంచుకుంటాడు" (PC. 4).

పునీత యోసేపుగారు సృజనాత్మకంగా ధైర్యంగల తండ్రి. దేవుడు పవిత్ర కుటుంబాన్ని యోసేపుగారు అప్పగించాడు. పవిత్ర కుటుంబానికి మార్గం నిదర్శనం చేయడానికి రక్షించడానికి అతని సృజనాత్మక ధైర్యం ద్వారా పనిచేశాడు. "బెత్లహేముకు చేరుకొని, మరియమ్మ జన్మనిచ్చే చోట ఎటువంటి స్థలం లేకపోవడంతో, యోసేపుగారు ఒక నిర్ణయం తీసుకున్నాడు, దేవుని కుమారుడు ప్రపంచంలోనికి రావడానికి దానిని స్వాగతించే గృహంగా మార్చాడు"(PC. 5).

పునీత యోసేపుగారు పనిచేసే తండ్రి మోక్ష కార్యంలో పాల్గొనడానికి పని ఒక సాధనం. వడ్రంగిగా యోసేపుగారు చేసిన పని పవిత్ర కుటుంబం అభివృద్ధి చెందడానికి, బెత్లెహేములో ఉండటానికి ఒక మార్గాన్ని అందించింది. యోసేపుగారు ఈ పనిని యేసుకు నేర్పించాడు."పునీత యోసేపుగారు పని మనకు నేర్పేది, దేవుడు మనిషిగా మారడంలో తన పరిపూర్ణ సహకారాన్ని అందించారు." (PC. 6).

పునీత యోసేపుగారు మానవాళికి ఒక ఆదర్శ తండ్రి, మానవుడు ఎలా జీవించాలో నేర్చుకోవాలి. "యేసుకు తల్లిదండ్రులు లేరు, కాని సృష్టించబడ్డారు.

పిల్లవాడిని ప్రపంచంలోనికి తీసుకురావడం ద్వారా మనిషి తండ్రి అవుతాడు, కాని ఆ బిడ్డను చూసుకునే బాధ్యత తీసుకోవడం ద్వారా, ఒక వ్యక్తి మరొకరి జీవితానికి బాధ్యతను స్వీకరించినప్పుడు, ఏదో ఒక విధంగా అతను ఆ వ్యక్తికి తండ్రి అవుతాడు" (PC. 7).

## ముగింపు

ఫ్రాన్సిస్ జగద్గురువు, పునీత రెండవ జాన్ పాల్ బోధనను ప్రతిధ్వనించారు. ఒక పురుషుడు లేదా స్త్రీ బిడ్డకు జన్మనిచ్చినప్పుడు, వారు తమ జీవితం యొక్క అర్థాన్ని నేర్చుకుంటారు. ఉదాహరణకు పునీత యోసేపు మరియమ్మ యేసును పొందినప్పుడు. "యోసేపు తన త్యాగం ద్వారా తాను ఆనంద పడలేదు గాని దేవుని బహుమతితో తన ఆనందాన్ని వ్యక్తపరిచారు,ఇది పరిణితి చెందిన త్యాగం యొక్క ఫలం" (PC. 7).

కావున యోసేపుగారి జీవితం సాధారణమైనది, అసాధారణమైనది. పురుషులు అందరికీ ఒక ఆదర్శవంతమైన ఉదాహరణ. పునీత యోసేపుగారు తనను తాను కేంద్రీకరించ లేదు అతను తన స్వంత బలముపై ఆధారపడ లేదు అతను దేవుని నుండి ప్రతిదీ ఆశించాడు. కావున మనం కూడా మన యొక్క జీవితంలో గర్వంతో ఉండకుండా పునీత యోసేపుగారివలె దేవుని చిత్తాన్ని అనుసరిస్తూ ఒక ప్రేమ కలిగిన తండ్రిలా జీవిద్దాం.

# 3. విధేయుడైన తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ



## ఉపోద్ఘాతం

రక్షణ చరిత్రలో భాగంగా దేవుడు చేసిన వాగ్ధానం ప్రకారం యూదా గోత్రములోని దావీదు వంశంలో జన్మించిన యోసేపుగారిని దేవుడు రక్షణ ప్రణాళికలో భాగస్వామిగా ఎంచుకున్నారు. మనుష్యావతారమెత్త బోవు దైవ కుమారుడికి పోషకుడిగా, సంరక్షుడిగా ఉండే గొప్పభాగ్యాన్ని యోసేపుగారికి ఆ దేవాది దేవుడు అందజేశాడు. ఇటువంటి మహద్భాగ్యం పొందడానికి ప్రధానకారణం యోసేపుగారు నీతివంతమైన జీవితమును జీవించడం. ఆయన జీవితం విధేయత, నిస్వార్థం, ఆదర్శము, గొప్ప కార్మిక లక్షణాలు వంటి ఎన్నో సుగుణాలకు నిలయం. ఇందులో ప్రధానముగా దేవుని ప్రణాళికకు ఆయన చూపించిన విధేయత వర్ణణాతీతం. ఇందులో భాగంగా ఆయన దేవునికి విధేయించిన తీరు, దానికి సంబంధించిన కొన్ని అంశాలను ధ్యానిద్దాం.

## విధేయత నిర్వచనం

విధేయతను అంగ్ల భాషలో ఒబిడియన్స్ (Obedience) అని అంటారు. ఇది లతీను (Latin) భాష పదాలైన ఓబ్ మరియు ఆడిరే నుండి తీసుకోబడినది. దీని అర్థం వినడం. కాని ఇక్కడ శ్రవణ భావం (వినడం) అంటే మనం కేవలం మరొక వ్యక్తి యొక్క ఆదేశాలను స్వీకరించి అనుసరించాలని కాదు. ఇచ్చినటువంటి ఆదేశాలను, ఆజ్ఞలను సంతోషంగా పాటించడం. ఇది బానిసత్వ ధోరణికి పూర్తిగా భిన్నమైనది. బానిసత్వం యొక్క స్వభావంలో దిగ్భ్రాంతిస్థితి,

ఒత్తిడి, భయాందోళనలు ఉంటాయి. కాని విధేయతలో ఆనందంతో భాధ్యతలు స్వీకరించే పరిస్థితులు ఉంటాయి.

బైబిల్ గ్రంథం ప్రకారం విధేయత గురించి చెప్పాలంటే దేవుడు పలికిన వాక్కును విని దాని ప్రకారం నడుచుకోవాలని తెలియజేస్తుంది. మనం పూర్తిగా దేవుని చిత్తానికి, అధికారానికి లొంగిపోయి ఆయన వాక్కు ప్రకారం మన నిర్ణయాలు తీసుకొని, మన కార్యాలను ఆయన చిత్తంతో సమలేఖనం చేయాలని తెలియజేస్తుంది.

## రక్షణ ప్రణాళికకు యోసేపుగారు విధేయత చూపుట

దేవుడు సమయమాసన్నమైనప్పుడు తన ఏకైక కుమారుడిని ఈ భూమిపైకి పంపడానికి సిద్ధమైనప్పుడు ఒక పవిత్ర మందసాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. ఆ పవిత్ర మందసమే మరియతల్లి గర్భం. అటువంటి పవిత్రమైన మరియతల్లిని మరియు బాలయేసును పోషించడానికి, సంరక్షించడానికి, తండ్రివలె ఆలనాపాలనా చూసుకోవడానికి గొప్ప అనుగ్రహం పొందిన వ్యక్తి యోసేపుగారు. ఇది గొప్పవరమే అయినప్పటికి ఒక పెద్ద సవాలుతో కూడుకున్నటువంటిది. కాని దేవుని పట్ల ఆయనకున్నటువంటి గొప్ప విశ్వాసం వలన ఆ సవాలును విధేయతతో స్వీకరించారు.

## పునీత యోసేపుగారు పాతనిబంధనలోని యోసేపుగారి విధేయతతో సారుప్యత కలిగి ఉండుట

పునీత యోసేపుగారి గురించి బైబిల్ గ్రంథంలో ఎక్కువగా కనిపించకపోయినప్పటికి ఆయన క్రీస్తు జీవితంలో మరియు రక్షణ ప్రణాళికలో ప్రముఖపాత్ర పోషించారు. ఫాదర్. మాథ్యూ స్పెన్సర్ OSJ అనే వ్యక్తి పునీత యోసేపుగారిని పూర్వవేదంలోని యాకోబు కుమారుడైన యోసేపుగారితో పోల్చి వివరించారు. యేసుపుట్టుకకు కొన్ని వందల సంవత్సరాల క్రితం రాయబడిన పాత నిబంధన యేసురాకడకు ఎలా మార్గాన్ని సిద్ధం చేస్తుందో తెలియజేస్తుంది. అదే విధంగా పాతనిబంధనలో మనకు నూతన నిబంధన యొక్క వాస్తవాలను సూచించే అనేక సూచనలు ఉన్నాయి. నిజానికి నూతన నిబంధనను, పాత

నిబంధనద్వారా పూర్తిగా అర్థం చేసుకోగలుగుతాము. ఆదికాండము 37వ అధ్యాయము నుండి చదివినట్లయితే యాకోబు కుమారుడైన యోసేపుగారి గురించి వింటాము. వీరికి నూతన నిబంధనలోని యోసేపుగారికి అనేక సారుప్యతలు ఉన్నాయి. అవి ఇప్పుడు చుద్దాం.

| పాతనిబంధనలో యోసేపుగారు | నూతన నిబంధనలో యోసేపుగారు |
|---|---|
| 1. తండ్రి పేరు యాకోబు (ఆది 37:1) | 1. తండ్రి పేరు యాకోబు (మత్తయి 1:16) |
| 2. కష్టాలను, బాధలను అమితంగా చవిచూచాడు.(ఆది 37:5) | 2. కష్టాలను, బాధలను అనుభవించాడు. (మత్తయి 1:19-21) |
| 3. తన జన్మస్థలాన్ని వదిలి ఈజిప్టుకు తరలింపబడ్డాడు.(ఆది 37:36) | 3. తన జన్మస్థలాన్ని వదిలి ఈజిప్టుకు పయనమైపోయాడు. (మత్తయి 2:13-14) |
| 4. కలల ద్వారా భవిష్యత్తు తెలియజేయబడినది.(ఆది 40:12) | 4. దూత కలలో కనిపించి భవిష్యత్తు గురించి తెలియజేస్తుంది.(మత్తయి 1:20, 2:13, 2:19) |
| 5. ఈజిప్ట రాజ్య కోశాధికారిగా నియమింపబడతారు. (ఆది 41:40-44) | 5. యేసు ప్రభువు కుటుంబానికి, సర్వ మానవాళి కుటుంబాలకు అధిపతిగా నియమింపబడతారు. |
| 6. పవిత్రతకు, విరక్తత్వానికి మారు పేరుగా నిలిచాడు. (ఆది 39:7-9,12) | 6. పవిత్రతకు, విరక్తత్వానికి మారు పేరుగా నిలిచాడు.(మత్తయి 1:25) |
| 7. ఇతను ఈజిప్టుకేకాక, ఎన్నో దేశాల ప్రజలకు ఆహార భద్రతను కలిగించారు.(ఆది 41:55-57) | 7. యోసేపు తన కుమారుడినే సమస్త మానవాళికి జీవాహారంగా ఇవ్వ తయారు చేశారు. (మత్తయి 1/21; యోహాను 6:35,41) |
| 8. ఫరోరాజు మన్ననలను పొంది ఎంతో గౌరవాన్ని సంపాదించుకున్నాడు. (ఆది 47:7-12) | 8. దేవుని అనుగ్రహం పొంది దైవకుమారుడికి సాకుడు తండ్రి అయ్యాడు. (లూకా 2:23,48) |

ఇద్దరు యోసేపులు  ఒకే పేరును పంచుకోవడం యాదృచ్ఛికంకాదని చాలామంది వేదపండితులు విశ్వసించారు. దైవిక రూపకల్పన యొక్క పరిపూర్ణతలో పాతనిబంధనలో యోసేపుగారు, నూతన నిబంధనలో యోసేపుగారు ఒకరినొకరు ప్రతిధ్వనించారు. వారిరువురి జీవితాలు దేవుని ప్రజలను రక్షించడానికి, దేవుని ప్రణాళికను బహిర్గతం చేసేవిధంగా పరిమళించాయి. వీటన్నింటికి ప్రధాన కారణం వారిరువురు దేవుని పట్ల చూపించిన విధేయతే.

పాత నిబంధన గ్రంథంలో ఎంతో మంది ప్రవక్తలు, రాజులు ఇంకా ఇతరులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దేవుని స్వరాన్ని వినినపుడు అందరు వెంటనే అంగీకరించలేదు. కొంతమంది మొదట తిరస్కరించారు. నిర్గమ కాండము 4:10-13 వచనములు పరిశీలించినట్లయితే మోషే యావే దేవుడి పిలుపును తిరస్కరించుట గమనించవచ్చు. యోనా గ్రంథము 1:1-3 వచనములు  చూసినట్లయితే యోనా ప్రవక్త దేవుని స్వరానికి వ్యతిరేకముగా తార్షీషునకు వెళ్ళుట గమనించవచ్చు. ఈ విధంగా ఎంతోమంది మొదట దేవుని స్వరానికి  విధేయత చూపించలేదు. పునీత యోసేపుగారు మాత్రం దేవుని స్వరాన్ని ఆలకించినప్పుడు ఏ మాత్రం అవిధేయత చూపకుండా విశ్వసించి ఆయన ప్రణాళిక ప్రకారం కార్యాలను నిర్వర్తించారు.

## దూత సందేశానికి  విధేయత చూపించటం

యోసేపుగారు పలికినటువంటి మాటలు బైబిల్ గ్రంథంలో లిఖించబడలేదు. కాని ఆయన జీవితంలో జరిగిన నాలుగు  క్లిష్ట సందర్భాలను గురించి బైబిల్ గ్రంథంలో చెప్పబడినది. ఈ నాలుగు సందర్భాలలో దేవుడు కలలో దేవదూత ద్వారా యోసేపుగారితో మాట్లాడారు. ప్రతీ సందర్భంలోను యోసేపుగారు దేవదూత పలికిన సందేశాన్ని విని పాటించారు. ఇక్కడ వినడం, పాటించడం అనే పదాలు వినడానికి, వివరించడానికి సులభంగా, సరళంగా ఉన్నప్పటికి వాస్తవానికి పాటించడం చాలా కష్టం. మన నిజజీవితంలో అనేక సందర్భాలలో దేవుని స్వరాన్ని వింటూ ఉంటాం. వినినప్పుడు అనేక సందర్భాలలో

దేవుని ప్రణాళిక వైపు మ్రగ్గుచూపాలని ప్రయత్నం చేస్తాం. కాని ఇహలోక ప్రపంచంలో మునిగిపోయి దేవుని స్వరాన్ని ప్రక్కన పెట్టి మనం వినాలనుకున్నది మాత్రమేవింటాం. మనం చేయాలనుకున్నది మాత్రమే చేస్తాం. కానీ యోసేపుగారు దీనికి భిన్నంగా ఉన్నారు. దూత సందేశం వినిన ప్రతీసారి విశ్వాసంతో నమ్మి విధేయతతో పాటించారు.

పునీత యోసేపుగారు మరియతల్లి వలే పగటిపూట దూత సందేశం వినలేదు. అతను మండుచున్న పొదనుండి గాని, ఉరుములతో కూడిన శబ్ధంలోగాని దేవుని స్వరాన్ని వినలేదు. ఆయన నిశ్శబ్ధంలో మాత్రమే దేవుని స్వరాన్ని విన్నాడు. యోసేపుగారికి దైవ సందేశం నిద్రించేటప్పుడు కలల రూపంలో అందింది.

**మొదటి కల**

మొదటి కల వచ్చేముందు మరియతల్లి గర్భవతి అని తెలుసుకుంటాడు. నియమ నిబంధనలు నిష్టగా పాటించే రోజులవి. వివాహం జరుగక ముందే గర్భవతి అని తెలిస్తే రాళ్ళతో కొట్టి చంపే రోజులవి. ద్వితీయోపదేశకాండము 22:22-24 వచనములు పరిశీలించినట్లయితే వ్యభిచరించిన వాళ్ళను ఊరి వెలుపలకు తీసుకొనిపోయి రాళ్ళతో కొట్టి చంపుతారని తెలియజేస్తుంది. ఈ విధానం చాలా క్రూరంగా, అవమానముగా ఉంటుంది. అటువంటి అవమానకరమైన శిక్షను మరియకు విధించడం ఇష్టంలేక మరియను రహస్యంగా త్యజించాలని నిశ్చయించుకున్నాడు. కలత చెందిన మనస్సుతో యోసేపుగారు సరిగ్గా నిద్రించలేకపోయారు. ఈ విధంగా నిద్రపోతున్న సమయంలో ప్రభువు దూత దర్శనమై తన సందేశాన్ని ఈ విధంగా తెలియజేస్తుంది. మత్తయి 1:20-21 వచనముల ప్రకారం "దావీదు కుమారుడవగు యోసేపు! నీ భార్యయైన మరియమ్మను స్వీకరించుటకు భయపడవలదు. ఏలయన, ఆమె పవిత్రాత్మ ప్రభావము వలన గర్భము ధరించినది. ఆమె గర్భములోని శిశువు దేవుని కుమారుడు అని పిలువబడును. మరియ ఈ బిడ్డకు జన్మనిచ్చును, నీవు ఆ శిశువుకు యేసు అని పేరుపెట్టుము.

ఈ శిశువు లోకరక్షణార్థమై తన జీవితమును అర్పించును. చివరికి దేవుని బిడ్డలను  రక్షించడానికి తన ప్రాణమునే ధారపోయును. పాపము అనే దాస్యమునుండి ప్రపంచములోని సర్వజనులను రక్షించును.” ఈ సందేశాన్ని దూతద్వారా యోసేపు పొందిన వెంటనే నిద్రనుండి మేల్కొని రహస్యంగా మరియను వదిలిపెట్టాలని అనుకున్నటువంటి తనను, దేవుడు ఆమెను ఎన్నుకొన్న రీతిని గ్రహించి తన మనస్సును మార్చుకొన్నాడు.

యోసేపు యొక్క ప్రతిస్పందన తక్షణమే  సువార్త పఠనం తెలియజేస్తుంది. “యోసేపు నిద్ర నుండి మేల్కొన్నప్పుడు, ప్రభువుదూత అతనికి ఆజ్ఞాపించినట్లు తన భార్యను స్వీకరించెను” (మత్తయి 1:24). యోసేపుగారు చెప్పినటువంటి సందేశాన్ని విని, దానిని విశ్వసించి విధేయతతో పాటించారు.

## రెండవ కల

రెండవసారి కలలో దేవదూత యోసేపుగారితో ఈ విధంగా అంటున్నారు. “లేచి బిడ్డను మరియు అతని తల్లిని తీసుకొని, ఈజిప్టుకు పారిపోయి నేను నీకు చెప్పేంతవరకు అక్కడే ఉండు; హేరోదు  పిల్లవాడిని నాశనం చేయడానికి వెదకబోతున్నాడు” (మత్తయి 2:13). యోసేపుగారు ఎటువంటి ఆలోచన లేకుండా వెంటనే అంగీకరించి తన విధేయత చూపించాడు.  కాని అది అంగీకరించడం సులువు కాదు. ఈజిప్టు చాలా దూరంలో ఉంది. అది దాదాపు 430 మైళ్ళదూరం అంటే ఇంచుమించు కాలినడకన 30 రోజుల ప్రయాణం. భరించలేని ఎడారివేడి, బందిపోట్లు, ఇతర దుర్మార్గులు ఉండే ప్రదేశం. యిస్రాయేలు ప్రజలు హింసింపబడ్డ విదేశీ భూమి. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఆ ఈజిప్టు ప్రాంతానికి వెళ్ళడం ఏమాత్రం మంచిది కాదు. ఇంకా ఎన్నో ఆటంకాలు ఉన్నాయి. దూత కలలో  నిర్దిష్ట సమయం అని చెప్పకుండా తిరిగి సందేశం ఇచ్చే వరకు అక్కడే ఉండమని తెలిపింది. యోసేపుగారికి వడ్రంగి పని తప్ప మరి యేమి తెలియదు. ఆ రోజుల్లో అది చాలా చిన్నపని. అటువంటప్పుడు తన కుటుంబాన్ని విదేశీ భూమికి తీసుకొనిపోయి ఏ విధంగా పోషించగలడు? పనిచేయలేకపోతే

కుటుంబాన్ని పోషించలేరు. కుటుంబ పోషణకు సరిపడా ధనం కూడా లేదు. ఇటువంటి వ్యతిరేక పరిస్థితులలో  కూడా తండ్రి సంకల్పానికి పూర్తి విశ్వాసం మరియు విధేయత చూపించి వెనుకడుగు వేయకుండా కుటుంబాన్ని తీసుకొని ఈజిప్టునకు పయనమై పోయాడు. హోషేయ 11:1 వచనం ప్రకారం దేవుని ప్రియమైన కుమారుడు ఈజిప్టునుండి పిలచితిని అను లేఖనం నెరవేరునట్లు ఇట్లు జరిగెను (మత్తయి 2:15).

## మూడవ కల

హేరోదు రాజు మరణానంతరము దేవదూత యోసేపుగారికి కలలో కనిపించి ఇట్లు పలికెను. “లెమ్ము బిడ్డను, తల్లిని తీసికొని యిస్రాయేలు దేశమునకు తిరిగిపొమ్ము. ఏలయన బిడ్డను చంప వెదకిన వారు మరణించిరి” అని పలికెను (మత్తయి 2:20). యోసేపుగారు దూత సందేశం ప్రకారం మరియను, బిడ్డను తీసుకొని యిస్రాయేలుకు ప్రయాణమయ్యాడు. కాని యెరూషలేము సమీపంలోని యూదయా ప్రాంతంలో నివసించడానికి భయపడ్డాడు. ఎందుకంటే హేరోదు రాజు కుమారుడు అర్కెలాసు యూదయా దేశానికి రాజు అయ్యెనని విన్నాడు. ఆ అర్కెలాసు క్రీస్తు జననం సమయంలో రెండేండ్లు నిండని శిశువులను చంపివేయమని హేరోదు రాజు ఆజ్ఞజారీ చేసినపుడు ఇతను దగ్గరుండి దానిని అమలు చేసాడు. ఎందరో శిశుహత్యలకు కారకుడయ్యెను. ఇప్పుడు ఆ యూదయా ప్రాంతానికి వెళ్ళితే యేసును చంపివేస్తారేమో అని యోసేపుగారు భయపడ్డాడు.

## నాల్గవ కల

యోసేపుగారు కలత చెందుతున్న సమయంలో దేవుడు దూత ద్వారా గలిలీయ ప్రాంతానికి వెళ్ళమని హెచ్చరిస్తాడు (మత్తయి 2:22). వారు గలిలీయ ప్రాంతానికి వెళ్ళి నజరేతు అనే పట్టణంలో నివసించారు. గలిలీయ ప్రాంతాన్ని అర్కెలాసు సోదరుడైన ఆంటిపాస్  పరిపాలిస్తున్న సమయం అది. అతను మృదు  స్వభావి మరియు సహృదయం కల్గిన వ్యక్తి అగుటచే యోసేపుగారు గలిలీయలో ఉండడం శ్రేయస్కరం అని భావించి దూత సందేశం ప్రకారం

అచట తన నివాసం ఏర్పరచుకొని జీవనాన్ని సాగించాడు. నజరేతు నగరమున నివాసమేర్పరుకొనెను. "అతడు నజరేయుడు అనబడును అను ప్రవక్తల ప్రవచనం నెరవేరునట్లు ఇది జరిగెను" (మత్తయి 2:23). ఈ విధంగా దూత సందేశానికి తన పరిపూర్ణ విధేయత చూపించాడు.

## విశ్వాసం వలన విధేయత కలుగుట

పునీత యోసేపుగారు నిజమైన విశ్వాసంగల వ్యక్తి. రోమీ 1:5 వచనం ప్రకారము విశ్వాసము ఉంటేనే విధేయత వస్తుంది. యోసేపుగారు దేవుడు ఆజ్ఞ జారీ చేసిన ప్రతీసారి హృదయంతో విశ్వసించి ఆలకించాడు. విశ్వసించిన ప్రతీదానిని విధేయతతో ఆలస్యం చేయకుండా నిర్వర్తించాడు. నమ్మకం మరియు విశ్వాసం ఉంటేనే విధేయత కలుగుతుంది. నమ్మకాన్ని కోల్పోవడం వలన ఆది దంపతులైన ఆదాము, అవ్వలు మానవాళిపాపంలో పడడానికి కారణం అయ్యారు (ఆది 3:17). ఏదేను తోటలో సర్పము పన్నిన పన్నాగంలో చిక్కుకొని దేవుని పట్ల నమ్మకాన్ని కోల్పోయి, చేయవద్దని చెప్పిన పనిని చేసి దేవునికి అవిధేయత చూపించారు. దాని పర్యావసానం పాపము భూమిపైకి వచ్చినది. అప్పటి నుండి మానవాళి దేవునికి విధేయత చూపించడం కష్టతరంగా మారింది.

యోసేపుగారు పరిణితి చెందిన విధేయతతో దేవునికి నమ్మకంగా విధేయత చూపాడు. అతని హృదయం మరియు అంతరంగిక మనస్సు ఎల్లప్పుడూ దేవుడిని ప్రేమించడానికి, తెలుసుకోవడానికి, సేవించడానికి పరితపిస్తూ ఉండేది. దైవప్రణాళిక ప్రకారం మరియను, యేసును రక్షించడం కోసం నిరంతరం దేవుడితో సహవాసంలో ఉండేవాడు. యోసేపుగారు దేవుడి మాటలు నమ్మి, ఆయన ఇచ్చిన వాగ్ధానాలను హృదయంతో విశ్వసించి దేవునికి లోబడి విధేయతతో జీవితాంతం జీవించారు.

## ధర్మశాస్త్రానికి విధేయత చూపుట

పునీత యోసేపుగారు తన జీవితాంతం ధర్మశాస్త్రానికి విధేయుడై జీవించారు. పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు వ్రాసిన రిడెంప్టోరిస్ కస్టోస్ అనే విశ్వలేఖను క్షుణ్ణంగా చదివినట్లయితే ఈ విషయం మనకు సుస్పష్టం

అవుతుంది. బైబిల్ గ్రంథంలోని వివిధ సందర్భాలను పరిశీలించినప్పుడు కూడా యోసేపుగారు ధర్మశాస్త్రానికి విధేయుడై జీవించారనే విషయం మనకు అర్థమవుతుంది. యోసేపుగారు చట్టబద్ధమైన అధికారానికి లోబడి జనాభా లెక్కలలో తమ పేర్లను మరియు యేసు పేరును నమోదు చేయించెను. ఈ విధంగా యేసుపేరు జనాభాలెక్కలలో నమోదు చేయించడం వలన దైవ కుమారుడైన యేసు మానవ కుమారుడిగా, ప్రపంచంలోని పౌరుడిగా గుర్తింపబడతాడు.

కొడుకు సున్నతి అనేది ధర్మశాస్త్రం ప్రకారం తండ్రి ప్రధాన బాధ్యత. ఈ కార్యక్రమాన్ని యోసేపుగారు విధేయతతో నిర్వర్తించాడు (లూకా 2:21). పాతనిబంధనలోని అన్ని ఆచారాలు వాస్తవానికి ప్రతిబింబంగా ఉంటాయి (హెబ్రీ 10:1). ఈ ఆచారాలు యేసు ఎందుకు అంగీకరిస్తాడో వివరించడానికి ఉపయోగపడుతుంది. అన్ని ఇతర ఆచారాల మాదిరిగానే సున్నతి కూడా యేసులో పూర్తిచేయబడుతుంది. సున్నతి అనేది అబ్రహాముతో దేవుడు చేసుకున్న ఒడంబడికకు సంకేతం (ఆది 17:10). ఈ ఆచారాన్ని పరిపూర్ణం చేయడానికి యోసేపుగారు బాలయేసుకు సున్నతి నిర్వహించారు. సున్నతి సమయంలో దూత ముందుగా ఆజ్ఞాపించిన ప్రకారం బిడ్డకు యేసు అని నామకరణం చేశాడు (లూకా 2:21). పేరును ప్రధానం చేయడంలో యోసేపుగారు తండ్రిగా తన కర్తవ్యాన్ని విధేయతతో నిర్వహించారు.

లూకా 2:22-24 వచనాల ప్రకారం ప్రతి తొలిచూలు మగబిడ్డ దేవునికి అర్పింపబడవలయును అని ధర్మశాస్త్రంలో చెప్పిన విధంగా యోసేపుగారు మరియతో కలిసి బాలుని తీసుకొని యెరూషలేము దేవాలయానికి పయనమయ్యెను. ధర్మశాస్త్రానుసారం తన విధులను నిర్వర్తించెను. ఈ విధంగా భూలోకంలో ఒక తండ్రి శాస్త్రానుసారం తన కుమారుడికి నెరవేర్చాల్సిన బాధ్యతలన్నీ యోసేపుగారు తూ.చ. తప్పకుండా నిర్వహించారు. తన జీవితాంతం కూడా ధర్మశాస్త్రానికి విధేయత చూపించారు.

## దైవసంకల్పానికి విధేయించి కుటుంబానికి మూలస్తంభంగా వ్యవహరించుట

13వ లియో పాపుగారు పునీత యోసేపుగారిని విశ్వ తిరుసభకు పోషకుడుగా ఎన్నుకుంటూ "క్వామ్ క్వామ్ ప్లూరిస్" (Quamquam pluris) అనే విశ్వలేఖను ఆగస్టు 15, 1889వ సంవత్సరమున ప్రకటించారు. ఇందులోని సారాంశాన్ని అర్థం చేసుకుంటే దేవాదిదేవుడు ఆది పితామహులకు ఇచ్చినటువంటి వాగ్ధానాలను నెరవేర్చడానికి ఎన్నుకొన్నటువంటి గొప్ప వ్యక్తిగా యోసేపుగారి గురించి ఈ లేఖ వివరిస్తుంది. ఇతనితో పాత నిబంధన ముగింపును సూచిస్తుంది. ఈయన ద్వారా దేవుడు ప్రవక్తలు మరియు పితృస్వాముల గౌరవార్థం వాగ్ధానము చేయబడిన లోకరక్షకుడు ఉద్భవిస్తాడు. యుదాగోత్రములోని దావీదు వంశంనుండి రక్షకుడు ఉదయిస్తాడని దేవుడు చేసిన వాగ్ధానం ప్రకారం యోసేపు ఈ ప్రణాళికకు మధ్యవర్తిగా వ్యవహరించాడు. "క్వామ్ క్వామ్ ప్లూరిస్" లేఖ నం. 3లో చెప్పిన విధంగా యోసేపుగారు దేవుని ప్రణాళికకు విధేయత చూపించి దేవుడి కుమారుడికి సాకుడు తండ్రి అయ్యాడు. దైవ కుమారుడు తన వంశం నుండి ఉద్భవిస్తున్నాడని సంబరపడ్డాడు. తిరుకుటుంబాన్ని పోషించే బాధ్యతను స్వీకరించి, కుటుంబానికి మూల స్తంభంగా నిలిచి, పోషకుడిగా మరియు చట్టపరమైన రక్షకుడిగా ఉన్నాడు.

పునీత యోసేపుగారు యేసును అనుక్షణం కంటికి రెప్పలా కాపాడారు. విద్యాబుద్ధులు నేర్పుచూ, దైవచిత్తానికి విధేయత చూపించే విధంగా పెంచాడు. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు పాత్రిస్ కోర్దె (తండ్రి హృదయంతో) అనే విశ్వలేఖలో యేసు మరియు యోసేపు మధ్యగల బంధం గురించి ఈ విధంగా వివరిస్తున్నారు. యేసు తన భూలోక తండ్రి అయిన యోసేపు ఒడిలో విధేయత గూర్చి నేర్చుకొని తండ్రి చిత్తానికి విధేయించడం ప్రారంభించాడు. యేసు తన తండ్రి చిత్తానికి విధేయతతో సిలువ మరణాన్ని స్వీకరించారని మనందరికి తెలుసు. సిలువ మరణం ముందురోజు రాత్రి గెత్సెమనే తోటలో ఈ పాత్రను తన నుండి తొలగించమని తండ్రిని కోరినప్పుడు, "నా ఇష్టం కాదు, నీ చిత్తమే జరగనిమ్ము" (మత్తయి 26:39) అని తండ్రి ఆజ్ఞకు విధేయించాడు.

క్రీస్తు విధేయత మన ఆది తల్లిదండ్రుల అవిధేయతను అధిగమించి, మన పాపాన్ని తొలగించి, మనకు స్వర్గ ద్వారాలు తెరిచే విధంగా చేసింది. పోపుగారు ఈ లేఖలో యేసు జీవితంలోని నిర్ణయాత్మక ఘట్టం గురించి చెబుతూ ఈ విధంగా అంటున్నారు. యేసు తన స్వంత నిర్ణయం కంటే తండ్రి చిత్తాన్ని చేయాలని ఎంచుకున్నాడు. "మరణం వరకు, సిలువపై మరణం వరకు విధేయుడయ్యెను" (ఫిలిప్పీ 2:8). ఇలా యేసు తన చిన్నతనంలో యోసేపు గారి వద్ద అనుభవించిన దానిని నేర్చుకొని తండ్రి చిత్తానికి జీవితాంతం వరకు విధేయత చూపించారని చెప్తూ తన సారాంశాన్ని లేఖలో ముగిస్తారు.

యోసేపుగారు ఎల్లప్పుడూ వినయపూర్వకంగా, సద్గుణాలను కలిగి ఉన్నారు. ఎల్లప్పుడూ ప్రశాంతంగా, శాంతియుతంగా, దేవుని చిత్తాన్ని సంపూర్ణంగా పాటించడంలో నిర్మలంగా ఉన్నారు. యోసేపుగారి పెంపకంలో పెరిగిన యేసు కూడా దేవునికి విధేయతగల కుమారుడిగా జీవించారు. యోసేపుగారు తన కుటుంబానికి మూలస్తంభంలా ఉంటూ అహర్నిశలు శ్రమిస్తూ తనను తాను త్యజించుకొని దేవునితో జీవించారు.

## ప్రస్తుత సమాజంలో విధేయతకు గల స్థానం

ప్రస్తుత సమాజంలో విధేయత అనేది అనేక సందర్భాలలో తప్పుగా అర్థం చేసుకోవడం జరుగుతుంది. చాలామంది విధేయత వలన వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలుగుతుందని అపార్థం చేసుకుంటారు. వారి దృష్టిలో స్వేచ్ఛ అనేది నచ్చిన పనిని చేయడం. ఈ సందర్భంలో వారికి స్వేచ్ఛ అనేది ఏదో ఒక దాని నుండి ఉంటుంది. అది ఇహలోక వస్తువులతో ముడిపడి ఉంటుంది. కాని నిజమైన క్రైస్తవులకి స్వేచ్ఛ అనేది దైవ సంకల్పంతో ముడిపడి ఉంటుంది. అది శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది మరియు పరలోకముతో ముడిపడి ఉంటుంది. స్వేచ్ఛ మరియు విధేయత రెండింటిని జతచేయడం విరుద్ధంగా అనిపించినప్పటికి ఆ రెండు కలిస్తేనే మనం నిజమైన క్రైస్తవులుగా ఉంటాము. అప్పుడు మన జన్మ సార్థకమవుతుంది.

## విధేయత వలన పొందే దీవెనలు

- మీరు ఎక్కడికి వెళ్ళినా ఆశీర్వదించబడతారు.
- మీ కుటుంబము దీవించబడుతుంది.
- దేవుడు మిమ్ములను రక్షిస్తాడు.
- అతడు మీకు సమృద్ధిగా శ్రేయస్సును అందజేస్తాడు.
- మీరు తలపెట్టిన కార్యాలన్ని విజయవంతమవుతాయి.
- ప్రభువు మీ వెన్నంటి ఉండి మిమ్ములను ముందుకు నడిపిస్తాడు.

బైబిల్ గ్రంథంలో అబ్రహాము, ఇస్సాకు వారి కుమారులు విధేయత కారణంగా దేవుని ఆశీర్వాదాన్ని పొందుతారు. దావీదు రాజు తప్పుచేసినప్పటికి మారుమనస్సుపొంది దేవునికి విధేయత చూపిన కారణంగా దేవుని హృదయాన్ని గెలుచుకుంటాడు. నూతన నిబంధనలో యోసేపుగారు దేవుని ప్రణాళికకు విధేయత చూపిన కారణంగా సాక్షాత్తు దైవకుమారుడికి తండ్రి అయ్యారు. ఈ విధంగా బైబిల్ గ్రంథంలో ఎంతోమంది దేవునికి విధేయులై జీవించి దేవుని అనుగ్రహాలను పొందారు. మనం కూడా దేవుని ఆజ్ఞలకు విధేయత చూపాలి. విధేయత పాటించడానికి కష్టమైనప్పటికి దాని ఆచరిస్తే అది మనలను దేవుని బిడ్డలనుగా చేస్తుంది. ఈ విధేయత దేవునిపై మన విశ్వాసాన్ని మరియు నమ్మకాన్ని ప్రదర్శిస్తుంది. దేవుడు మన అంతరంగిక మనస్సులను తెలుసుకుంటాడు. మన చుట్టూ ఉన్నవారు కూడా ప్రేరణపొంది దేవుని అడుగుజాడలలో నడుస్తారు. కనుక మన జీవితాల్లో దేవుని పట్ల వినయ విధేయతలు చూపి ఆయన ప్రేమకు, కరుణకు ప్రీతిపాత్రులమయ్యి తండ్రి దేవుని దీవెనలు, అనుగ్రహములను పొందడానికి ప్రయత్నిద్దాం.

### ముగింపు

యోసేపుగారు తన జీవితమంతా కూడా విధేయతకు నిలువెత్తు నిదర్శనం లాగా జీవించారు. పురుషులకు మరియు తండ్రులకు ప్రత్యేక ఉదాహరణగా నిలిచారు. పితృత్వం గురించి తన సేవ రూపంలో భోదించాడు. తన జీవితం మొత్తం దేవునికి విధేయత చూపి మరియతల్లికి మరియు బాలయేసుకు సేవ

చేయడం కోసం త్యాగం చేశాడు. భాధామయమైన పరిస్థితులలో కూడా దేవునికి అవిధేయత చూపలేదు. ఈ విధంగా నీతికే నిర్వచనంలా జీవిస్తూ, దైవ సంకల్పం ఎరిగి ఎన్ని ఆటంకాలు వచ్చినా భరించి విధేయతతో జీవించి దేవుని రక్షణ ప్రణాళికకు మధ్యవర్తిగా ఉండే మహద్భాగ్యం పొందాడు. తండ్రి దేవుడు యోసేపుగారి విధేయతకు మెచ్చి ఆయనపై గల విశ్వాసంతో దేవుని అనుగ్రహం పొందిన మరియను, దైవ కుమారుడైన క్రీస్తును పోషించి కాపాడే గొప్ప అదృష్టాన్ని అందజేశాడు. సాక్షాత్తు దేవాదిదేవుడే యోసేపుగారి మీద నమ్మకం కలిగి ఉంటే, మానవ మాత్రులమైన మనం కూడా ఆయనను విశ్వసించి మనలను సంరక్షించి, కాచికాపాడమని ఆయన మధ్యస్త ప్రార్థనా వేడుదల ద్వారా దేవుని అడగాలి. ఆయన వలే మనం కూడా దేవుని చిత్తానికి విధేయులమై దైవ ప్రణాళిక ప్రకారం జీవించడానికి ప్రయత్నించాలి.

# 4. అంగీకరించిన తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ గంగారపు జగదీష్ కుమార్



## ఉపోద్ఘాతం

అంగీకారం దైవ స్వభావం. అటువంటి స్వభావాన్ని పునికి పుచ్చుకోవడం దేవుడు ఒసగే అనుగ్రహం. మన దేవుడైన తండ్రి మనల్ని ఎన్నడూ తృణీకరించడు. తండ్రి ఎలా అయితే తన బిడ్డలను ఆదరిస్తాడో అంతకంటే మిన్నగా దేవుడు మనల్ని ఆదరిస్తాడు. ఈ ఆదరణ మన తల్లిదండ్రులు చూపు ఆదరణ కంటే వందరెట్లు మెరుగైనది. ఒక తల్లి దేవుని గూర్చి ఈ విధముగా సెలవిస్తుంది. "నాయనలారా! మీరు నా కడుపునెట్లు ఊపిరి పోసికొంటిరో నేనెరుగను. మీకు జీవమును, ఊపిరిని ఇచ్చినది నేను కాదు. మీ అవయములను ఒక్కటిగా అమర్చినది నేను కాదు. ప్రపంచమును సృజించిన వాడును, నరులను పుట్టించినవాడును, అన్ని ప్రాణులను చేసినవాడునైన మీ దేవుడే మిమ్ము కలిగించెను. మీరు మీ ప్రాణముల కంటె గూడ ఆ ప్రభువు ఆజ్ఞలను అధికముగా గౌరవించుచున్నారు కనుక ఆ కరుణామయుడైన దేవుడు మీకు మరల జీవమును, ఊపిరిని దయచేయును" (మక్కబీయుల రెండవ గ్రంథము 7:22-23).

దేవునికి ఒక క్రమబద్ధమైన, రక్షణాప్రదమైన ప్రణాళిక వుంది. ఆ ప్రణాళికను నెరవేర్చడానికి మానవ సహకారం అవసరం. ఈ మానవ సహకారమే అంగీకారం. మనల్ని తన ప్రేమతో సృష్టించిన దేవుడు మన ప్రమేయం లేకుండా రక్షించ లేదు. తరతరాలుగా యుగయుగాలుగా దేవుని నిరీక్షణకు మానవుడు అడ్డుకట్టవేస్తూవచ్చాడు, వేస్తున్నాడు. మనలను సృష్టించిన

తండ్రి మన ప్రమేయం లేకుండా ఏమైనా చేయవచ్చు కాని మనల్ని ఆయన రూపమున, ఆయనను పోలివుండేలాగున చేశాడు కనుక, మన అంగీకార ఆమోదం అవసరం.

ఆదిలో దేవుడు ఆదాము, ఏవను సృష్టించాక ఒక చెట్టుపండును మాత్రమే తినవద్దంటాడు. కాని ఆదాము, ఏవ అంగీకరించి కూడా తృణీకరిస్తారు. ఇక్కడ ఏవ పండు తీసుకొచ్చి ఆదాముకిస్తే, అందులకు తిరిగి ఏవనే దూషిస్తాడు. ఏమనంటే "నాకు తోడుగా నీవు ఇచ్చిన ఈ స్త్రీయే ఆ చెట్టు పండు నాకు ఇవ్వగా నేను తింటిని." అని ఆదాము స్త్రీ తప్పిదమును ఎత్తి చూపెను (ఆదికాండము 3:12). ఇటువంటి సందర్భమును మనము క్లుప్తంగా పరిశీలించినట్లయితే ఆదాము నిజానికి ఏవ మీద నిందాపరాధం మోపుతున్నాడు. దేవుని వాక్కును తృణీకరించడమే కాకుండా, దేవుడు తన కిచ్చిన తోడు మీద నిందవేశాడు. అలా వారివురు సత్యాన్ని తృణీకరించారు. దీని ఫలితముగా నరుని పాపం, శాపాన్ని భూమికి తెచ్చింది. ఈ పాపాన్ని (అవిదేయత) నిర్మూలించడానికి దేవుడే స్వయాన మానవ రూపం దాల్చడమైంది. అలాగ దేవుడు మృత్యువైపునకు సాగే నర చరిత్రలో ప్రవేశించి, దాన్ని మూలమైన జీవం వైపుకు మళ్లించాడు. ఈ విధంగా తండ్రి దేవుడు మానవుని మృత్యుముఖంలో మగ్గిపోనీయక పదేపదే అతనితో ఒప్పందం కుదుర్చు కున్నాడు. అదే విధంగా చివరిగా దావీదు రాజుతో చేసిన వాగ్ధాననిమిత్తమై తన ఏకైక కుమారుని తన నిత్య రాజ్యస్థాపకుడిగా మరియు మానవ రక్షణార్ధమై పాపపరిహారబలిగా సమర్పించడానికి పూనుకున్నాడు. స్వయాన దేవుడు అంగీకరించిన కార్యం (త్రియేక దేవుని కార్యం) మానవ హృది అంగీకారానికై దూత ద్వారా మరియ హృది తలుపు తట్టింది. దేవుని మంగళవార్తను చేరవేసింది. పవిత్ర కన్య మరియ అంగీకారం మానవాళి రక్షణకు స్వీకారం చుట్టింది.

అలాగ ఆదిలో వలె ఆదాముకి తోడుగ ఏవను ఇచ్చినట్లు మరియకి తోడుగ సాకుడు తండ్రిగా ఉండుటకై ఎన్నుకోబడిన దావీదు వంశజుడైన, యాకోబు, రాహేలు కుమారుడైన యోసేపుగారి నిర్ణయమై దూత కలలో కనిపించి కలవరపడిన యోసేపుకు వివేచనము నొసగి తనతో ఇది వరకే

నిశ్చితార్థమైన మరియ దేవుని అనుగ్రహము వలన గర్భవతియని తెలియజేసింది. అలా యోసేపు నిద్ర నుండి మేల్కొని ప్రభువు దూత ఆజ్ఞాపించినట్లు తన భార్యను స్వీకరించెను (మత్తయి 1:24). ఒక కుటుంబానికి తండ్రిగా ఆత్మ పూరితుడై మరియను భార్యగా స్వీకరించాడు. ఎంతటి కష్టమొచ్చినా దేవుని మాటకు తలొగ్గి, కావలిదూత చెప్పేసందేశాన్ని వింటూ, అనుసరిస్తూ, రక్షాప్రదమైన ఆ వాక్కును అంగీకరించిన తండ్రిగా నిలబడ్డాడు.

## అర్థం కాని విషయాలను అంగీకరించడం

మానవ జీవితంలో అనేకమైన విషయాలు మనకు అర్థం కావు. అర్థం కాని వాటి కోసం మార్గాలు వెదకడం మానేసి వాటిని అంగీకరించాలి. ఎలాగైతే యోసేపు తనదైన శైలిలో జీవిత గమనాన్ని అంగీకరించాడో అలాగే కుటుంబంలో వున్న ప్రతి తండ్రి జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను, లాభ, నష్టాలను, సంతోష బాధలను, అంగీకరించాలి. ఇలా అంగీకరించిన జీవితం అనురాగంగా మారుతుంది. ఒక సరికొత్త నడవడికకు దారి చూపిస్తుంది.

యోసేపుగారి అంగీకారం పరిపూర్ణ విశ్వాసముతో కూడి కొనియుంది. మంచిని చేయడానికి రహస్యమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. యేసేపు ఒక సాధారణ మనిషిలా కనిపించినప్పటికీ, అయన అందరికంటే నీతిమంతుడు, నియతి, నిబద్దత కలవాడు. కాబట్టి చెట్టు మంచిదయితే కాయ మంచిదైనట్లు, ఆయన నీతిమార్గం దీనికి సాక్ష్యం. దీని ప్రతిఫలంగా రక్షణ చరిత్రలో సత్యానికి (యేసు క్రీస్తు) మార్గ చూపరియైనాడు.

బాలయేసు దేవాలయములో తప్పిపోయినప్పుడు ఏ మాత్రము ప్రశ్నింపలేదు. మరియతల్లి మాత్రం మదన పడి ప్రశ్నించింది. ఈ విధంగా ప్రశ్నలడగని అంగీకారాన్ని, మనం యోసేపు జీవితంలో చూస్తాం. ఏదైనా సందేహం వస్తేనే మనం ప్రశ్నలు అడుగుతాం. యేసేపు బాలయేసుని ఎప్పడూ సందేహించలేదు ఎందుకనగా ఆయన హృదయం బాలుని ముఖకాంతిచే నింపబడినది. తన విశ్వాసాన్ని, ఆధ్యాత్మిక దృష్టితో జత చేస్తూ స్వప్న సందేశాన్ని ధ్యానించేవాడు. యోసేపుగారు యూద జాతివాడు కనుక యూదుల సంప్రదాయం ప్రకారం దేవుని వాక్కును ద్యానించేది (వినేది) చెవులుకాదు,

హృదయం. వినడం చెవి చేసేపని మరి విన్నదాన్ని ధ్యానించేది హృదయం.

ఈ విధంగా వాక్కుని ధ్యానించడమంటే దానితో జీవించడం, దానికి విధేయులు కావడం అని అర్థం. ఈ వాక్కుని యోహాను తన సువార్తలో, ఆది ప్రారంభము నుండి వున్నది అని సంభోదిస్తాడు. దేవుడు ప్రదానంగా తన వాక్కు ద్వారానే నరులతో సంబంధం పెట్టుకొంటాడని యోసేపుకు వచ్చిన కల పరమార్ధం.

సృష్టి ఆరంభం నుండే అనేకమైన తండ్రులు (విశ్వాసపాత్రులు, విధేయులు) దేవుని వాక్కుని ధ్యానించి దానికి బద్ధులై తమ జీవనాన్ని తాము గ్రహించలేని మార్గాలలో పయనింపజేశారు. దేవుని సంకల్పానుసారంగా జీవించారు. ఇందులో మొట్టమొదటిగా నోవా. అతడు నీతిమంతుడు, ఉత్తముడు (ఆదికాండము 6:9) దేవుని మాటకు కట్టుబడి జీవమును కాపాడు ఓడను నిర్మించాడు. సకల ప్రాణ కోటిలో పలురకాలైన జంట పక్షులను, జంతువులను, (సాధు మరియు క్రూర) గింజలను ఓడలోకి కొనివచ్చాడు. ఆ ఓడలో నివసించిన అతని కుటుంబ సభ్యులు విశ్వాసములో స్థిరపరుపబడ్డారు. తమ హృదయాన్ని తాకిన దేవుని వాక్కు మీద పూర్తిగా ఆదారపడ్డారు. అద్భుతాలు, నూతన జీవితము చవిచూశారు.

అదే విధంగా అబ్రాము విశ్వాసానికి పితామహుడిగా పరిగణింపబడ్డాడు. అబ్రాముని దేవుడు పిలిచాడు "అబ్రహాముగా అతని పేరును మార్చాడు." అనేక జాతులకు తండ్రిగా నియమింపబడ్డాడు. దేవుడు అబ్రహాము అంగీకారం ద్వారా సమస్తజాతులను దీవించెనని కతోలిక సత్యోపదేశం బోదిస్తుంది. అబ్రహాము దేవుని మాట ప్రకారమై తన సొంత కుమారుని సైతం బలి అర్పించడానికి అంగీకరించాడు. ఎలా అని తప్ప ఎందుకు ఇలా అని ఎన్నడూ దేవుని ప్రశ్నించలేదు. తనకు అర్థంకాని విషయాలను నిరాకరించలేదు, అంగీకరించాడు. దేనికీ వెనుకాడని సమ్మతితో ఎన్ని వైరుధ్యాలు సంభవించినా సరే అని వాటిలోని పరమార్ధం గ్రహించి ముందుకు సాగాడు.

అటులనే యాకోబు తన కుమారులను ఏ విధంగానైతే స్వీయ

బలహీనతలను అంగీకరించే తండ్రిగా కుమారుల పట్ల అమితమైన ప్రేమానురాగాలు చూపిన తండ్రిగా నిలబడ్డాడో అదే విధంగా యోసేపు వ్యక్తిత్వం యాకోబును పోలివుంది. యాకోబు ఏ విధంగానైతే తన జేష్ఠపుత్రుడు (యోసేపు) చెప్పిన కలను మరువలేదో అలాగే యోసేపుగారికి దూత కలలో చెప్పిన మాటలను ఎన్నడూ మరువలేదు. ఆ విషయాలయందు శ్రద్దవుంచి మరియతో సంభాషిస్తూ తన హృదిలో ధ్యానించేవాడు. దేవుని ఆజ్ఞప్రకారమై బిడ్డకు 'యేసు' అని పేరు పెట్టాడు. హీబ్రూ భాషలో యేసు అనగా రక్షించేవాడు అని అర్ధము. పేగు అమ్మదైతే పేరు నాన్నది అన్నట్లు యేసు నామదేయంలో పరమార్ధం దాగి వుంది, గమ్యం వుంది, సవాలు వుంది. ఆ నామాన్ని అంగీకరించమే ఆనాటి ప్రజలకు ఒక సవాలు అంతే కాకుండా యేసు మాటలలో గమ్యం వుంది. "నా నామమును ఉచ్చరించిన నేను దీవించెదను (సంఖ్యాకాండము 6:27), అన్న యేసునామం రక్షణనిచ్చునామం, రక్షణయే ఆయనతత్వం.

ఈ విధంగా బాలుడుని గూర్చి సిమియోను చెప్పిన ప్రవచనము, సంభవించు సంఘటనల ఉదాంతం అర్థంకాకపోయినా యోసేపు వాటిని అంగీకరించాడు. తన అంగీకారంలో దాగి వున్న బాధ్యతలకనుగుణంగా నడుచుకున్నాడు. దూత మాటలు అనుసరిస్తూ బిడ్డను. తల్లిని తీసుకొని ఐగుప్తునకు ప్రయాణమాయను. ఈ ఉధాంతం పూర్వ వేదంలో మనకు కనిపిస్తున్న యాకోబు జీవితాన్ని సూచిస్తుంది. ఎలాగైతే యాకోబు దేవుడి మాటను ఆలకించి ధైర్యము చేసికొని ఐగుప్తునకు తన కుమారులను, కుమార్తెలను, మనవలను, మనువరాండ్రను యావత్సంతతిని తనతో పాటు తీసుకు వెళ్ళాడో (ఆదికాండము 46:7). ఇక్కడ నూతన వేదంలో యోసేపు కూడా బిడ్డను, తల్లిని అలాగే వున్నదంతటిని ఐగుప్తునకు తీసుకొని వెళ్ళడం గమనార్ధం. అలా సొంతగ ఏనాడు నిర్ణయాలు తీసుకోకుండా దైవ మాటకు విదేయుడై, శ్రమించి నడచాడు.

ఎందరో తండ్రులు నడిచిన దైవ మార్గంలో యోసేపు కూడా నడిచి పరలోకతండ్రి మన్ననను, దణ్యతను పొందాడు. ఆయన నడిచిన మార్గం ఆనాటి ప్రపంచానికి వ్యతిరేకమని తెలిసినాకాని యేసుక్రీస్తునామమునకై అనేక

పాట్లు శ్రమలు అనుభవించాడు. ప్రతి విషయమై దేవుని ఆశ్రయించాడు. ఎందుకంటే "దేవుని వాక్కులో అసత్యము ఉండదు. అతడు తన్నాశ్రయించు వారిని డాలువలె రక్షించును" (సామెతలు 30:5). కష్టించి పనిచేసి, బాలయేసును, మరియను పోషించాడు. దీనికి ఆయన ఎంచుకున్న వడ్రంగి వృత్తే సాక్ష్యం. అనేక నిందావమానాలు అనుభవించాడు. అవి తన హృదయాన్ని ఖండించినా సరే, అలా ఖండించబడిన హృదయాన్ని సైతం అంగీకరించాడు. కనుక ప్రియ స్నేహితులారా! మన హృదయము మనలను నిందింపకున్నచో దేవుని సమక్షమున మనకు ధైర్యము ఉండునని (1యోహాను 3:21), అందుచేత యోసేపునకు, దేవుడు తన హృదయం కంటే గొప్పవాడని, ఆయనకు అన్నీ తెలుసని, అంగీకరించాడు. ఎల్లప్పుడు ఆయన ఒసగిన ఆధ్యాత్మిక మార్గం వైపు నడిచాడు. ఆయనది సారవంతమైన హృదయం. ఇది దైవశాస్త్ర బోధనం. అది మంచి నేలను పోలియుంది. దైవ వాక్కును ఆలకించి, అంగీకరించింది కాబట్టి నూరంతలుగా ఫలించే శక్తి ఒసగబడింది. ఆ వాక్కునకు ప్రతిస్పందించిన అంగీకారం. ఒక ప్రక్కన అనుమానమనే పెనుభూతం వెంటాడి వేదిస్తున్న ఆ వేదనకు ఖండనై నిలిచిన అంగీకారం మన యోసేపునది. వినయ విధేయుడై, శ్రామిక ఆదరువై తోటి ప్రజల పట్ల సంఘీభావం కలిగి నడిచిన హృదయమది. సత్ప్రవర్తన కలిగి అనునిత్యం దైవసంకల్పమే ధ్యేయంగా విరిగి, నలిగిన హృదయమది. పేదరికమును ఆశ్రయించి అన్యోన్య ప్రేమ కలిగి జీవించిన విశాల హృదయమది. అటువంటి హృదయాన్ని మనం స్మరించుకోవడం గమనార్హం.

## అంగీకారం, వివిధ కోణాలు

అంగీకరించడంలో బాధ్యత వుంది, బాధ్యతను నిర్వర్తించడంలో, కష్టాలు భాదలు ఒడిదుడుకులు ఉన్నాయి. కాని అంగీకరించిన దానిని నెరవేర్చడంలో ఆత్మసంతృప్తి అనేది దాగి వుంది. అటువంటి బాధ్యతను నెరవేర్చి, తన జీవితంలో దేవుని రక్షణ ప్రణాళికలో భాగస్తుడై, ఎన్నోకష్టాలు అనుభవించి, కుటుంబం అంటే ఈ విధంగా ఉండాలి అని ఒక సుమాతృకను చూపిస్తూ నీతి పథంతో నడిచి, అంగీకారం అన్న దానికే వన్నె తెచ్చిన వినయ శీలుడు,

సద్గుణాల ప్రదాత, అన్నింటిని దేవుని చిత్తంగా అంగీకరించిన ఓ మంచి పుణ్యమూర్తి యోసేపు.

## అరుదైన అంగీకారం

మానవ జీవితంలో రెండు రకాల అంగీకారాలు వున్నాయి. అవి 1) కష్టాలు, శ్రమలు మరియు ఆత్మసంతృప్తి నిచ్చే అంగీకారం. 2) జీవితాన్ని నిరంతరం, పట్టుపరుపుపై, పయనింప చేసుకోవటానికి తీసుకొనే అంగీకారం. మొదటిది చాలా అరుదైనది. దీన్ని స్వీకరించి జీవితంలో అత్యున్నత స్థాయికి వెళ్ళిన వారు కొందరేవున్నారు. వారిలో యోసేపు ఒకడు. తన జీవితంలో పేదరికం అనే కష్టాన్ని అనుభవించి, దేవుని రక్షణ ప్రణాళికను నెరవేర్చి, ఆత్మ సంతృప్తి పొందాడు.

## అన్నిసద్గుణాలకు మూలాధారమైన అంగీకారం

మన అనుదిన జీవితంలో ఏదైనా ఒక పనిని సాధించాలి అంటే ఆ పని మీద శ్రద్ధ ఉండాలి. ఆ శ్రద్దే సకల సద్గునాలకు మార్గాన్ని చూపిస్తుంది. ఒక ప్రణాళికను నిర్వర్తించడంలో అంగీకారం ఒక్కటే సరిపోదు దానితో పాటు, సరైన ప్రణాళికను రూపొందించుకొని నెరవేర్చటానికి పట్టుదల, సమయస్ఫూర్తి, వినయం, విదేయత మరియు నిజాయితీ అనే సద్గునాలు తోడవ్వాలి. కొన్ని సద్గునాలు దైవ వరం ద్వారా మనకు ప్రాప్తిస్తే కొన్ని మన మీద ఆదారపడివుంటాయి. యోసేపు ముందునుండే సకల సద్గుణ సంపన్నుడు. దీనికి ఆయ అంగీకారమే సాక్ష్యం.

## దేవుని ముద్ర, అంగీకార చిహ్నం

దైవ చిత్తాన్ని నెరవేర్చడం అంటే ఆయన ఏ విధంగా మృదు స్వభావం లేదా మంచి మనస్సు కలిగి వున్నాడో, అలాగే మనము కలిగివుండాలని అని అర్థం. అలా కలిగి జీవించినపుడు దేవుని ముద్ర మనపై ముద్రించబడి, ఆయనకు చెందిన వారముగా మార్చబడతాము. ఎప్పుడైతే యోసేపు దైవ చిత్రాన్ని అంగీకరించాడో, దేవుని ముద్ర ఆయనపై ముద్రించబడినది. ఈ

ముద్ర పవిత్రాత్మ నడిపింపునకు గుర్తు. అలా దేవుని చేత అంగీకార ముద్ర వేయబడింది.

## ఉత్సాహమైన అంగీకారం

ఏదైనా ఒక పనిని చెయ్యాలనుకున్నప్పుడు లేదా ఒక పనిని మనకు అప్ప జెప్పినపుడు. ఆ పనిని సంపూర్ణంగా నెరవేర్చాలంటే మొట్టమొదటిగా కావలసినది ఉత్సాహం ఇష్టపడేతత్వం. ఒక పనిని సంపూర్ణ స్వేచ్ఛతో అంగీకరించినపుడు ఉత్సాహం వెళ్లెబుకుతుంది. అవధులు లేని ఉత్సాహంతో యోసేపు నడిచాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పెద్దవాళ్లు, చిన్నపిల్లలకు ఏదైనా పని చెప్పినప్పుడు వారు ఎంత ఉత్సాహంతో చేస్తారో అదే ఉత్సాహం యోసేపు జీవితంలో కనుబడుతుంది. మాటలతో పనిలేని ఉత్సాహన్ని కనబరిచారు. యోసేపు మాట్లాడినట్లు పరిశుద్ధ గ్రంథంలో ఎక్కడా కనిపించదు. ఆయన తన క్రియల ద్వారా మాట్లాడాడు. అలా దేవుని పై భారం మోపి, నిశబ్దంతో కూడిన జీవితంతో తనకి అప్పగించిన పనిని, సంపూర్తి చేసి, తనకి ఇచ్చిన పాత్రని సంపూర్ణంగా జీవించి, విశ్వ శ్రీసభకు పాలక పునీతుడిగా మిగిలిపోయాడు. పాలక పునీతులు ఎప్పుడూ మన ఆధ్యాత్మిక గురువులు. వీరి మధ్యవర్తిత్వాన్ని మనము గుర్తెరిగి సర్వదా మాకొరకు ప్రార్థించమని వేడుకొనాలి. అప్పుడే వారు నడచిన ఆధ్యాత్మిక మార్గం పట్ల మనం శ్రద్ధ చూపిన వారమవుతాం.

## ఆధ్యాత్మిక మార్గం, లోక పరిత్యాగం

యోసేపుగారిని ఈ లోకం త్యజించింది. దీనికి ఆయన పేదరికమే సాక్ష్యం. పునీత పౌలుగారి మాటలు కూడా దీనికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. "క్రీస్తు యేసునకు చెందినవారు వ్యామోహములతోను, కాంక్షలతోను కూడిన తమ శరీరమును సిలువవేసిరి. "మనము ఆత్మను అనుసరించి జీవించు వారమైనచో ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందము (గలతీయులకు వ్రాసినలేక 5: 24-25). ఇలా పౌలు పలికిన పలుకులు యోసేపు జీవితాన్ని గురించి తెలియజేస్తున్నాయి. పవిత్రాత్మ స్ఫూర్తిని ధైర్యాన్ని నిండుగా పొందిన యోసేపు లోకము తనను త్యజించినా సరే జీవమునిచ్చు వాక్కును రక్షించుటకై,

పోషించుటకై కష్టించి పనిచేశాడు. ఒక సాధారణ వడ్రంగిగా, నిశ్చలమైన జీవితాన్ని సాగించాడు. తన పనిని ప్రార్థనగా మలచాడు. ఎన్నడూ నిరుత్సాహం చెందలేదు. తన ఉత్సాహంతో తోటి వారిలో ధైర్యాన్ని నింపుతూ, వారి స్థితి గతులను ఒక కంట గమనిస్తూ దేవుని చిత్తాన్ని అనుసరించేవాడు. సత్వర మార్గాల కోసం వెతకలేదు. కానీ వాస్తవికతను తెరచిన కళ్లతో ఎదుర్కొన్నాడు, వ్యక్తిగత బాధ్యతలను అంగీకరించాడు.

మోషే చట్టంలో దాగివున్న ప్రేమాజ్ఞను ఆలింగనం చేసుకొన్న నీతిమంతుడు. దీనికి ఆయన మరియమాత మీద చూపిన ప్రేమే సాక్ష్యం. ప్రేమే సమాధానం శ్రీసభ చరిత్రలో తరతరాలుగా దాగివున్న తన ఉనికిని దేవుడు బయలు పరిచాడు. తనను విశ్వ శ్రీ సభకు తండ్రి హృదయంతో అన్న అపోస్టోలిక లెటర్‌తో పరిశుద్ధ పాపుగారి ద్వారా పరిచయం చేశాడు.

17 నుండి 20 సంవత్సరాల యుక్త వయస్సున తండ్రిగా నడుచుకోవడం అంటే కత్తిమీద సాము లాంటిది. ఆ వయస్సున చేసే సత్వర నిర్ణయాలు, ఆలోచనలు జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయి. అనుభవం లేని ఆ వయస్సులో ఆయన ఎంచుకున్న మార్గం ఆత్మ పరమైనది. ఈ మార్గం వివరించేది కాదు, కానీ అంగీకరించేది." ఎంతో మంది తండ్రులు కుంటుంబంలో ఆడపిల్ల పుడితే తల్లిని వేదించే భర్తలు వున్న ఈ సమాజంలో యోసేపుగారు ఒక ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలుస్తున్నారు. తన ప్రమేయం లేకుండా గర్భం ధరించిన మరియని అవమానింపదలచుకోలేదు. రహస్యంగా పరిత్యజింప దలచాడు. కుటుంబంలో ఆడపిల్ల పుడితే తల్లికి అవమానాలే భర్త వేదింపులే అన్న ఈ నాటి సమాజంలో. యోసేపు మరియను అంగీకరించిన తీరు గొప్పదైనది. ఆయన అంగీకారానికి ప్రకృతి సైతం పులకరించింది. దీనికి ఆయన చేతిలోని లిల్లీలు విరసిన కర్రే సాక్ష్యం. ఆ లిల్లీలు అతని పరిశుద్ధతకు మరియ నిష్కళంక మాతృత్వానికి చిహ్నంగా వున్నాయి. ఇది దేవుని సమ్మతికి తొలిమెట్టు. దేవుడు యోసేపుగారిని ఆది నుండి ఎన్నుకొన్నాడు గనుక ఏదియూ తన దగ్గర దాచలేదు. ప్రేమ స్వభావం బయలుపరచే విధానమార్గం. అలా దేవుడు ఎన్నుకొన్న వారికి సకలం దయచేసి, సర్వదా వెన్నంటి నడిచాడు.

దీనిని గమనించిన యోసేపుగారు ఎల్లప్పుడూ దేవుని మనస్సుని, ప్రేమని తన క్రియల ద్వారా తన హృదయంలో చిత్రించారు. అలా తన హృదయం మీద వ్రాయబడ్డ ప్రేమ ప్రజ్వలింపజేసింది.

ప్రతి జీవితానికి అర్థం, అంతరార్థం, పరమార్థం అనేవి ఉంటాయి. ఇలా జీవిత పరమార్థాన్ని తెలుసుకొని నడచిన పునీతులలో ఒకడు యోసేపు. ఎప్పుడైతే మన జీవితము యొక్క అర్థాన్ని, అంతరార్థాన్ని, పరమార్థాన్ని గ్రహించగలుగుతామో అప్పుడే మనము దేవునకు విధేయులమై జీవించగలం. మన విరోధియైన సైతాను మనలో వున్న దేవుని జ్ఞానాన్ని లౌకిక వ్యవహారాల ద్వారా నశింపజేస్తుంది. ఈ లౌకిక జీవితములో పడిపోయిన మనము దేవునికి విరుద్ధముగా జీవిస్తున్నామని కూడా మరిచి, పాపభీతిని కోల్పోతున్నాము. సమస్యలతో సతమతమవుతున్నాము. మన శ్రద్ధ దేవుని యందు లేనిచో అది శూన్యము. లోకమంత సంపాదించి తన ఆత్మను కోల్పోయినచో లాభం ఏమున్నది (మత్తయి 16:26) కనుక పరలోక పౌరులమైన మనము పరలోక విషయాలందు శ్రద్ధ వహించాలి. యోసేపుగారి లాగ ఆధ్యాత్మిక విషయాల పట్ల ప్రీతి పుట్టించమని వినయంతో దేవుణ్ణి అడగాలి. అందులకు యోసేపుగారి మధ్యవర్తిత్వం ద్వారా మనం ప్రార్థించాలి.

**ముగింపు**

యోసేపుగారు తన హృదయాన్ని దేవుని వాక్కుతో పదిలపరచాడు. ప్రభువు పలికిన పలుకులను ఏ ఒక్కటిని మీరలేదు. నిశబ్దంతో తన హృదయంలో ధ్యానించాడు. అందుచేత దేవుడే స్వయాన తనను అంగీకరించే తండ్రిగా మలిచాడు.

పాపం చేసిన ఆదిమానవుడ్ని కష్టించి పనిచేసి బ్రతకమని దేవుడు ఆజ్ఞాపించాడు యోసేపు కష్టించాడు, వడ్రంగి పని చేశాడు. సత్ప్రవర్తన కలిగి దేవుడు చెయాయలనుకున్న పనిని తన అంగీకారంతో మహిమ పరచాడు. విధేయపూరితుడై దేవునితో కలిసి నడిచాడు, అవిదేయత వలన ఆదిమానవుడు దేవునితో కలిసి నడవలేక పోయాడు ఏదేను తోటనుండి వెలివేయబడ్డాడు

(ఇచ్చుట కష్టించ కుండానే దేవుడు అన్ని సమకూర్చాడు) యోసేపు తనకి ఇచ్చిన పనిని ఏనాడు ఆదమరచలేదు. జకర్యా లాగ "ఇది ఎట్లు సాధ్యమని అడగ లేదు", కాని అంగీకరించాడు. శ్రమని దైవ శాసనంగా ఎంచి ఇష్టంగా నిర్వర్తించాడు. దేవుడే పనిచేసేవాడు కనుక పని విలువైంది. గౌరవ ప్రదమైంది.

ఈ విధంగా దేవుడే స్వయానా తనను ఎంచిన పనికి తన వంతు సహకారం అందించాడు. ఇలా సహకరించి పని చేయడమే తన అంగీకార లక్ష్యణం. దేవుని రాజ్య వ్యాప్తికై మన సహాయం, సహకారం అవసరం. మనము దేవుని వాక్కును అంగీకరిస్తున్నామా లేక తృణీకరిస్తున్నామా అన్నది మన చేతులలోనే ఉంది. సహోదరి, సహోదరులైన మనము ఒక తండ్రి బిడ్డలుగా పరలోక రాజ్యవారసులుగా వెలుగొందాలంటే దేవుని ప్రేమను మనం యోసేపులా తెలుసుకొని అంగీకరించాలి. అప్పుడే మనల్ని దేవుని ప్రేమనుంచి వేరు చేసే శక్తులు విచ్ఛిన్నమవుతాయి. సద్గుణాలన్ని మనల్ని ఆవరిస్తాయి. సమస్తమును తండ్రి దేవుడు యేసుక్రీస్తు ఆదీనమునుంచాడు కనుక మనము దేనికి భయపడనక్కరలేదు. యోసేపుగారి వలె ఆయన దివ్యనామమును క్రియల ద్వారా, విశ్వాస పాత్రులుగా శ్రద్ధ కలిగి భోదించే శక్తిని దయచేయమని ప్రార్థిందాం.

పునీత యోసేపుగారా మా కొరకు ప్రార్థించండి. ఆమెన్

# 5. ధైర్యముగల తండ్రి – పునీత యోసేపుగారు

– బ్రదర్ కొండెపొగు ప్రేమ్‌రాజ్



## ఉపోద్ఘాతం

మాటలు కోటలు దాటుతాయి కాని, కాళ్లు గడప దాటవు అనే నానుడివుంది. ధైర్యంగా, నీతిగా జీవించేవారు నిశ్శబ్ధాన్ని వారి ఆయుధంగా చేసుకొని జీవిస్తారు. మాటలను ఆయుధాలుగా చేసుకొని బ్రతికేవారి జీవితాలు నామమాత్రంగానే వుంటాయి. నిశ్శబ్ధాన్ని ఆయుధంగా చేసుకొని బ్రతికేవారు చరిత్రలోనే మరపురాని మరచిపోని మహోన్నత వ్యక్తులుగా నిలుస్తారు. ఈ కోవకు చెందిన వారే మన ధైర్యం గల తండ్రి పునీత యోసేపుగారు. అవమానాలు వచ్చిన తన చుట్టూవున్న వారే తనను నిందించిన తనను చూసి తనను అసహ్యించుకున్నా సరే, ధైర్యంగా ధీరోత్తముడిలా దైవకార్యాన్ని నెరవేర్చిన అసమాన్య సామాన్యుడు పునీత యోసేపుగారు.

ధైర్యాలు అనేక రకాలుగా ఉంటాయి కాని అందులో కుటుంబ బలగం చూసుకొని వచ్చే ధైర్యం, స్నేహితులు, బంధుమిత్రుల అండను చూసుకొని వచ్చే ధైర్యం, నావెనకాల రాజకీయ నాయకులు వున్నారు, నేను ఏది చేసినా వాళ్ళే చూసుకుంటారనే ధైర్యం ఇలా ఈ సమాజంలో మానవుడు తనలో వున్న ధైర్యాన్ని కప్పిపుచ్చి ఒకరిపై ఆధారపడుతూ వారి అండను తన ధైర్యంగా చేసుకొని జీవిస్తున్నారు.

కాని మన ధైర్యం గల తండ్రి పునీత యోసేపుగారికి, తన కుటుంబం నుంచి కాని, బంధుమిత్రుల నుంచి కాని, స్నేహితుల నుంచి కాని, ఆనాటి కాలంలోవున్న అధికారుల నుంచి కాని, మరియు తన సొంత వారి నుండి కూడ ఆయన ఎటువంటి సహాయం తీసుకోలేదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఒక్కడే ధైర్యంగా రొమ్ము విరచి రక్షణ నిచ్చే రక్షకుని సాకుడు తండ్రిగా, బాధ్యత

కలిగిన భర్తగా, దేవునికి అత్యంత ప్రియమైన పుత్రునిగా జీవించిన ధైర్యవంతుడు పునీత యోసేపుగారు. దేవుడే ఆయన ధైర్యం, తనలో ఎన్నో ఆలోచనలు రేకెత్తుతున్న ధైర్యంగా సమదృష్టితో ఆలోచించి జీవితాన్ని ప్రథమబాటలో నడుపుకొనే క్రీస్తుని సాకుడు తండ్రి అయ్యాడు. పురుషులందరిలోనే పుణ్య పురుషునిగా జీవించాడు. పునీత యోసేపుగారిలో వున్న కొన్ని ధైర్య సుగుణాలను మీ ముందు తీసుకొస్తున్నాము.

## విశ్వాసమే ఆయన ధైర్యం

"వినుట వలన విశ్వాసం కలుగును" (రోమీ 10:17) (దైవవాక్కును వినడం) ప్రారంభం నుండి విశ్వాసం ఎక్కడవున్నా కూడ అణిముత్యం వలె, వెలుగుచున్న దీపికవలె నిరంతరం తన ఉనికిని తెలియజేస్తూనే వుంటుంది. చెరువు ఎంత మురికిగావున్న చెరువులో వున్న తామర వికసించి తన అందాన్ని వెదజల్లుతుంది. ఈ లోకంలో విశ్వాసం కూడ తన ఔనత్యాన్ని చాటుతుంది. పాత నిబంధనలో తండ్రియైన అబ్రహాము విశ్వాసానికి సుమాతృకగా నిలచారు. ఆయన విశ్వాసం ఎట్టిదనగా 99సం॥రాల వయస్సులో కూడ దేవుడు తనకు సంతానం కలిగించగలడు అని నమ్మిన విశ్వాసం. అట్లే కొడుకును ఇచ్చినట్లే ఇచ్చి దేవుడు తిరిగి కొడుకునే బలిగా సమర్పించమని అన్నపుడు కత్తిఎత్తడానికి కూడ సాహసించిన శ్రేష్టమైన ధైర్యముగల విశ్వాసం (హెబ్రీ 10:35).

"ధైర్యము కోల్పోకుడు ఆ ధైర్యమే మీకు గొప్ప బహుమనము తెచ్చును". రెండవదిగా నత్తివాడైన మోషేకు ధైర్యమిచ్చి ఫరో వద్దకు నడిపించినది తన ప్రజలను దైవ సన్నిది. శత్రురాజ్యంలో కూడ దేవుడు వేశ్య అయిన రాహబుకు, ధైర్యము ఇచ్చి అక్కడికి వెళ్ళిన వేగుల వారిని సంరక్షించిన దేవుడు. (యెహోషువ 2:4) చిన్నవాడైన గిద్యోనుకు తోడైవుండి దైర్యపరచిన దేవుడు (న్యాయధిపతులు 6:12) ఈ విధంగా దేవుడు తన రహస్య ప్రణాళికను నెరవేర్చుటలో సహకరించిన ప్రతిఒక్కరిని దైర్యపరచి నడిపించిన చోట తండ్రి దేవుడు. నిన్న, నేడు నిరంతరం ఏకరీతిగావున్న దేవుడు, క్రీస్తు ప్రభుని ఈ లోకం లోనికి తీసుకొని రావడానికి సహకరించిన యోసేపుగారిని కూడా ధైర్యపరచి నటువంటి దేవుడు. ఆయన గరుకు మార్గములు ఎన్నో, వక్రమార్గాలు మరెన్నో, హేరోదు, పిలాతు, అగస్తు మొదలైన వారి వలన వచ్చిన అధికార భయాందోళన మార్గాలు

ఎన్నో, కుటుంబ సమాజం, వారి వద్ద నుండి వచ్చిన ఆ ధైర్యపు మాటలు కృంగ దీసే ఆలోచనలు లెక్కకు మిక్కుటముగా వుండెను. ధైర్యపరచే దేవుని శక్తి లోకమంత చీకటిగా వున్న చీకటి భయాన్ని కలిగించిన పరలోక దేవుని మహిమను ధైర్యశాలి అయిన పునీత యోసేపుగారు నిరంతరం తన జీవితములో చూస్తు భయాన్ని కలిగించే ప్రజలను, పరిస్థితులను, పరిస్థితులను పారద్రోలి ధీటైన ధైర్యముతో నడచి దేవుని ప్రణాళికకు తన ప్రాణాలనే పణంగపెట్టి దైవ ప్రణాళికను నేరవేర్చిన ధైర్యము గల తండ్రి ఈ పరిశుద్ధ యోసేపుగారు. ఆయన ధైర్యానికి హద్దులులేవు, ఆయన వినయానికి అవదులు లేవు, సింహాల గుహాలో దానియేలుని ధైర్యముగా నిలబెట్టిన దేవుడే వినయశీలుడైన పునీత యోసేపుగారిని అన్యాయం, అక్రమం, పేదరికం, దోపిడి, దారుణం అనేటివంటి మహా క్రూరమైన సమాజంలో పరలోక దేవునిశక్తి యోసేపునకు తోడుగా వుండెను. కావున పునీత యోసేపుగారు నేటికిని స్మరించ తగ్గ ధైర్యము గల తండ్రిగా మన ముందు ఆదర్శంగా నిలుస్తున్నారు.

## ధైర్యానికి మరో పేరు పునీత యోసేపుగారు

భయపెట్టేవి గాఢాంధకారం, ఎత్తుగా లేచే అలలు, క్రూరమృగాలు, ఆకస్మిక ప్రయాణాలు, ప్రలోభాలు అయినప్పటికి, ఈ లోకం అనే సముద్రం పరిణామం పెద్దదిగా వున్నను జీవితం అనే పడవ ఎంత చిన్నది అయిన ఎత్తుగాలేచి భయపెట్టే అలలు ఎంత గంభీరమైన, ప్రభులో నాటుకొని స్థిరముగా నుండువాడు చలనమొందడు, అట్లే ప్రభువే మన పడవకు నావికుడైన భయమెందుకు మనకికా (మార్కు 4:36-41) ఆదిలో వాక్కు అయిన క్రీస్తు, పడవ ప్రయాణం చేస్తున్న శిష్యులు తుఫానులో చిక్కుకొని అలల మధ్యలో భయంతో మునిగిపోయిన వీరికి తుఫానును గద్దించి, అలలను ఆదేశించి శాంతిని స్థాపించి శిష్యులకు ధైర్యము ఇచ్చిన విశ్వరూపి అయిన మన క్రీస్తు ప్రభువు. ఇదే వాక్యాన్ని ఆదిలో నుండి వున్న వాక్యాన్ని తన నిధిగా మార్చుకున్న నీతిమంతుడైన యోసేపు భయముతో చలనమునొందక, విశ్వాసముతో ధైర్యముగా నిలబడ్డాడు. హేరోదు రూపంలో వచ్చిన అలలను, గాడంధకారపు లోయలో ప్రయాణము వలెనున్న ఐగుప్తు ప్రయాణము ధైర్యముతో ధీటుగా ఎదురించిన మహా గొప్ప, ధైర్యశాలి మన యోసేపుగారు.

ఆస్తులు అంతస్తులు, ఆప్తులు అయినవారు ఎవ్వరు తోడు లేకున్న దేవుడే సమకూర్చుతాడు అని ధైర్యముతో నమ్మి ఐగుప్తునకు ప్రయాణమైపోయి (ఆది 22:14) పరదేశీగా ఐగుప్తులో తన కష్టాన్ని, తన నీతిని, వీటికంటే మిక్కుటముగా దేవునియందు తన నమ్మికను వుంచి, ధైర్యముతో తల్లి, బిడ్డలను అన్యదేశములో కాపాడ గలిగిన ధైర్యశాలి, నీతిమంతుడు మన యోసేపుగారు. కుటుంబానికే తలగా వున్నటువంటి పునీత యోసేపుగారు తను ధైర్యముగా వుండుటయే కాగా ఉన్నదే అన్య దేశమయిన కట్టుబట్టలతో స్వదేశాన్ని వీడివచ్చి తనకంటు ఆధారం ఎవ్వరు లేకున్న తన ధైర్యాన్ని విడువక నిష్కల్మషమైన హృదయముతో తల్లి మరియను, బాలయేసును అనునిత్యము ధైర్యపరుస్తూ కలిమి చెలిమిలో కూడ ధైర్యానికి మరో రూపముగా నిలిచిన మానవోత్తముడు, ధైర్యశాలి మన పునీత యోసేపుగారు. జీవితంలో వచ్చే సవాళ్లను ధైర్యముగా ఎదుర్కొన్న ధీటైన ధైర్యశాలి పునీత యోసేపుగారు.

## ధైర్యముతో నిలిచిన దైవ సేవకుడు

"ఏ వ్యక్తియు ఇద్దరు యాజమానులను సేవింపజాలడు" (మత్తయి 6:24) ఎవడును, ఎన్నడును దైవమును, ద్రవ్యమును సేవింపజాలడు దేవుడు రాజులను సింహాసనముల నుండి కూలద్రోసి వినయాత్ములను గద్దె నెక్కించును (సిరా 10:4) దేవునితో సాహచర్యం ఈ లోక సాహచర్య నుండి వేరుచేయును దేవుని పరిశుద్ధ నామమునకు ఆయన విధి, విధానాలకు లోబడివున్న పునీత యోసేపుగారు దైవభయము కలిగిన వ్యక్తి, దేవునినే అత్యున్నతముగా ఘనపరచిన భక్తుడు దేవుడే తన జీవిత సర్వమునకు యాజమాని అని భావించిన ధీనుడైన సేవకుడు ఈ లోక పోకడలను ఎరిగియున్న పునీత యోసేపుగారు ఇహలోక సంపదలను విడచి దేవునినే తన యాజమానిగా సేవించుటకు కృత నిశ్చయుడయ్యాడు. ఈయన యాజమానిగా అంగీకరించిన ఆ పరలోక దేవుడు పునీత యోసేపుగారి కొరకై ఏర్పరచివుంచిన పని మహోన్నతమైన పని చిన్న విషయములలో శ్రద్ధవహించి వుండిన ఈ మహసేవకుని అన్నింటికి పూర్వమే వాక్యరూపి అయివున్న దేవుడు.

యేసు రూపమును మానవునిగా ఈ భూలోకాన్ని ముద్దాడడానికి వచ్చే ఈ మహత్తర కార్యాన్ని పునీత యోసేపుగారి పర్యావేక్షణాలో, సంరక్షణాలో

పరలోక దేవుని సేవకుడిగా, పరలోక దేవప్రియపుత్రునికి సంరక్షకునిగా వుండుటకుగాను (ఎఫెసీ 1:4) "లోక సృష్టికి పూర్వమే" యోసేపుగారిని తన ఉత్తమమైన సేవకునిగా దేవుడు ఎన్నుకొనెను. పునీత యోసేపుగారు తనయొక్క దైవ సేవలో భాగంగా తనకు అప్పజెప్పబడిన పని మహా భయంకరమైనది. దుష్టమార్గ పనులకు పాల్పడుచున్న హేరోదుని కనుచూపు మేరనుండి రాజ్యాలను దాటించుకుంటు, పరలోక ప్రియ పుత్రుని సంరక్షించి తీసుకొని శత్రుదేశమైన ఫరో రాజ్యంలో (బిడ్డను) పసికందును ఏ కీడు వాటిల్లకుండ కాపాడవలసిన, పరమేశ్వరుని సేవ, ఇట్టి సేవకు లోక మనుష్యులే కాక.

అధ్యాత్మిక శక్తులు కూడ విరోధులై పొరాటం సలుపుచుండగా అన్నింటిని మహాగొప్ప ధైర్యముతో ఎదిరించి, పొరాడి, హేరోదునుండి, హేరోదు సైన్యము నుండి, ఫరోనుండి, ఫరో సైన్యము నుండి, ప్రధానులతోను, అధికారులతోను, అంధకార శక్తులను ఆకాశమందలి దురాత్మలలోను (ఎఫెసీ 6:12) పొరాటం చేసి, అంతేకాక చిన్నారి బాలుడైన ఆత్మశరీర కీడులనుండి కాపాడి తండ్రి దేవుని దివ్యప్రణాళికను నెరవేర్చుటలో మంచి పోరాటము పోరాడి విశ్వాసాన్ని నిలబెట్టుకున్న ఉత్తమమైన, ధైర్యవంతుడైన పరలోక సేవకుడు ఈ పరమేశ్వరుని సంరక్షకుడు పునీత యోసేపుగారు.

## ఆదర్శప్రాయమైన ధైర్యం

రాజ్యానికి రాజు ఆదర్శం, తనయుడికి తండ్రి ఆదర్శం ఇలా ప్రతి ఒక్కరి జీవితంలో ఆదర్శప్రాయమైన అడుగుజాడలు చూపించే ఉన్నతమైన వ్యక్తులు ప్రతి తరానికి ముందుగా నడుస్తునే వుంటారు. పరులకు ఆదర్శంగా వుండటం అంటే వారిపై వున్న ఉన్నత వ్యక్తులకు, ఉన్నత విలువలకు, అత్యున్నతమైన దేవునికి భయపడుతు భక్తి విశ్వాసాలతో ప్రయోజనకరంగా జీవించడమే ఆదర్శ ప్రాయమైన జీవితం.

తనను తాను తగ్గించుకొని పరులకు వెలుగునిచ్చే దీపిక వలెవున్న క్రొవొత్తి కూడా మన జీవితానికి ఒక ఆదర్శప్రాయం. ఉదా: పునీత కలకత్తాపురి మదర్ తెరెస్సా గారు, మనందరికి తెలిసిన విధంగా తన జీవితశైలిలో ఆదర్శ ప్రాయమైన సేవకురాలువలె నిలిచింది. ఈమె తన సాక్ష్యంలో తనకున్న ఆదర్శం, బలం, బలగం, సరస్వం క్రీస్తే అని చెప్పెను. ఈ క్రీస్తు ప్రభువు కూడ తనకు ఆదర్శమైన

తండ్రి దేవుని గురించి సాక్ష్యమిచ్చారు కాని, తండ్రిదేవుడు తన స్థానంలో నీతి మంతుడైన పునీత యోసేపుగారిని భౌతికమైన ఈ ప్రపంచంలో మానసిక, శారీరక, ఆధ్యాత్మికమైన ఆదర్శ తండ్రిలా ఈ భువికి పంపించారు.

అట్లే పునీత యోసేపుగారు కూడ తన ఆశలను, ఆశయాలను, కోర్కెలను ఆనందానికి లెక్క చేయక అంతే త్యాగ పూరితమైనటువంటి భావాలలో లోక రక్షణకు తోడ్పడే తన సహకరాన్ని పరిపూర్తిగా అందించడానికి తను శారీరకముగా కలువకున్నను దేవుని చిత్త ప్రకారం పరిశుద్ధాత్మ ప్రభావం వలన కన్యమరియకు, భర్తగా, జన్మించిన బిడ్డకు సాకుడు తండ్రిగా నుండ నిర్చయించుకున్న ఆదర్శ ప్రాయుడైన పునీత యోసేపుగారు.

తన దగ్గర ఆస్తిపాస్తులు, లేకున్న తల్లి, బిడ్డలను ఇద్దరిని పోషించుటకు వెనుకంజవేయని ఆదర్శనీయుడైన శ్రామికుడు. మోషే దర్శశాస్త్ర ప్రకారం దూత చెప్పినట్లు దేవుని వాక్యానికి లోబడి బాలుడైన యేసుని సున్నతి శుద్దీకరణ కొరకు యెరూషలేము దేవాలయంలోని నియమనిబంధన ప్రకారం తన భాధ్యతను నెరవేర్చిన ఆదర్శప్రాయుడైన తండ్రి. అన్నీటి కంటే మిన్నగా లోకశక్తులకు, ఎదురుగా పోరాడుతూ దైవానికి తలవంచి, నిశబ్ధంతోనే దైవచిత్తాన్ని తనవంతు పరిపూర్తిగా నేరవేర్చిన ఆదర్శ ప్రియుడైన దైవ భక్తుడు, ధైరవంతుడు పునీత యోసేపుగారు.

**ముగింపు**

ఈ సువిశాలమైన కుటుంబములో మన మందరము ఒక కుటుంబ సభ్యులముగా ఎదో ఒక పాత్రను పోషిస్తునే వుంటాము. ఈ మన జీవిత ప్రయాణంలో మనతోటి కుటుంబీకులను, స్నేహితులను ధైర్యపరుస్తూ కృంగిన వేళలో ఓదారుస్తూ అవసరములలో ఆదుకుంటూ ఉన్నత విలువలను కలిగి ఈ మానవత్వంలో కూడ దైవత్వాన్ని చూపించడమే మన క్రైస్తవ జీవితానికి పిలుపు. ఇట్టి ఉన్నత పిలుపును పొందుకున్న నీవు, నేను కూడ ధైర్యముకలిగి దయనిది, అగు దేవుని సింహాసనమును సమీపించుటకు, పునీత యోసేపుగారి గుణగణాలు మరియు ధైవభయం మనందరి జీవితంలో కూడ వుండాలని ఆ ప్రభువును ప్రార్థించుదాం.

# 6. పనిచేసే తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ చింతాడ సుధీర్



## ఉపోద్ఘాతం

పునీత యోసేపుగారికి అంకితమైన ఈ సంవత్సరం ఆ పుణ్యాత్ముని శరణు వేడుకోవడం, అతని జీవిత విశేషాలను భక్తి విశ్వాసాలను స్మరించు కోవడం జరుగుతుంది. ప్రతి ఒక్క క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితంలో మేలు చేకూరాలని, విశ్వాసంలో బలపడాలని, ఒకింత అయినా ఆ పుణ్యాత్ముని అనుకరించాలని మరియు యోసేపుగారిలా కష్టించి పనిచేసి మానవత్వపు విలువలు పాటించాలని మన జగద్గురువులు పోప్ ఫ్రాన్సిస్ గారు ఒక చక్కటి అవకాశాన్ని శ్రీసభ సభ్యులమయినా మనకు కల్పించారు. తండ్రి దేవుని సంకల్పమే పునీత యోసేపుగారి జీవితం. దేవుని కనుసన్నల్లో పెరిగి పెద్దవాడై ఆయనకు అనుగుణంగా జీవించి క్రైస్తవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. నిండు చూలాలు అయినా మరియకు చిన్ని బాల యేసుకు సేవలు చేశాడు. చెమటోడ్చి కష్టించి పనిచేసి యేసు మరియమ్మను కంటికి రెప్పవలె కాపాడాడు. తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పెంచి పోషించిన గొప్ప శ్రామికుడు పునీత యోసేపుగారు.

అసలు ఎందుకు ఈ 2020 మరియు 2021 వ సంవత్సరాన్ని పునీత యోసేపు గారికి అంకితం చేశారు. చరిత్రలో చూసుకున్నట్లయితే పునీత యోసేపు గారిని విశ్వకతోలిక పాలక పునీతునిగా ప్రకటించమని ఎన్నో ఉత్తరాలు వచ్చాయి, నాటి 9వ భక్తినాద పోపు గారికి. అయితే 1868 లో ఫాదర్ జాన్ జోసెఫ్ ఒక డొమినికన్ సభకు చెందిన గురువు పోపు గారికి ఒక ఉత్తరం

రాశారు. అసలు ఆ ఉత్తరంలో ఏమని రాసారు అంటే పునీత యోసేపు గారిని విశ్వా కతోలిక పాలక పునీతులుగా ప్రకటించండి. దీనికోసం నా ప్రాణ త్యాగానికైనా నేను సిద్ధం అని ఒక అభ్యర్థనతో కూడినటువంటి ఉత్తరాన్ని ఫాదర్ జోసఫ్‌గారు నాటి జగద్గురువులు అయినటువంటి తొమ్మిదవ భక్తినాథ పాపుగారికి వ్రాసారు. ఉత్తరాన్ని చూసిన వెంటనే జగద్గురువులు కూడా ఎంతో చలించిపోయారు, ఏదైనా చెయ్యాలి అనుకున్నారు. ఆ మరుసటి సంవత్సరమే అనగా 1869 లో ఫాదర్ జాన్ జోసఫ్‌కి టీబీ రావడం ఆయన మరణించడం జరిగింది. ఆ వెనువెంటనే అనగా 1870 సంవత్సరంలో తొమ్మిదవ భక్తినాద పాపుగారు పునీత యోసేపు గారిని విశ్వ శ్రీసభకు పాలక పునీతులుగా ప్రకటించారు. అలా ప్రకటించడానికి ఇంకో కారణం కూడా లేకపోలేదు అది ఏమిటంటే క్రీస్తుశకం 1869–70 లో జరిగిన మొదటి వాటికన్ మహాసభలో పాల్గొన్న 300 మంది పీఠాధిపతుల కోరికపై తొమ్మిదవ భక్తినాథ పాపు గారు పునీత యోసేపుగారిని విశ్వ శ్రీసభకు పాలక పోషకులుగా ప్రకటించారు మరియు శ్రీసభ ఆస్తిపాస్తులకు వారిని సంరక్షకులుగా ఏర్పరిచారు. అటు తరవాత చాలా ఉత్తరాలు పునీత యోసేపు గారికి ఒక సంవత్సరం అంకితం చేయమని చాలా మంది రాశారు. వాటినన్నింటినీ పరిగణలోనికి తీసుకున్న ప్రస్తుత పోపు గారు సమయం తీసుకొని పునీత యోసేపు గారిని విశ్వ శ్రీసభ పాలక పునీతునిగా కొనియాడుతూ వచ్చిన ఇన్ని సంవత్సరాల్ని పరిగణలోనికి తీసుకుని. ఇదియే సరైన సమయం అని పోప్ ఫ్రాన్సిస్ గారు 150వ సంవత్సర వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సంవత్సరాన్ని పునీత యోసేపు గారికి అంకితం చేశారు. పునీత యోసేపుగారని విశ్వశ్రీసభ పాలక పునీతులుగా ప్రకటించిన సంవత్సరం 1870 నుండి 2020 మరియు 2021 వరకు మనం లెక్కపెట్టినట్లు అయితే సరిగ్గా 150 సంవత్సరాలు. ఈ 150వ సంవత్సర వార్షికోత్సవాన్ని కొని కొనియాడుకుంటూ ఈ సంవత్సరాన్ని పునీత యోసేపు గారికి అంకిత సంవత్సరంగా మనం కొనియాడుకుంటూ వచ్చాం.

మన ప్రస్తుత పాపుగారు అయినటువంటి ఫ్రాన్సిస్ గారికి మనం ఎంత రుణపడినా తక్కువే ఎందుకంటే ఒక సంవత్సరాన్ని ఒక పునీతునికి అంకితం చేయడం అంటే మాటలు కాదు. దైవ ప్రణాళికలో ముఖ్య పాత్ర పోషించి

నటువంటి పునీత యోసేపుగారి కోసం మనకు చాలా తక్కువ తెలుసు కానీ అంకితంచేయబడిన ఈ సంవత్సరం ద్వారా అనేక పుస్తకాలు పునీత యోసేపు గారి మీద ప్రచురించబడ్డాయి. అనేక కొత్త విషయాలు వెలుగులోనికి వచ్చాయి. అదే విధంగా ఎన్నో మంచి లక్షణాలు, సుగుణాలు. శ్రమజీవి అయినటువంటి పునీత యోసేపుగారిని పనిచేసే తండ్రిలా చూపించే అవకాశం కల్పించినందుకు దేవునికి కృతజ్ఞతలు. 'కష్టేఫలి' యని తన జీవితంలో దీనత్వం పేదరికం వల్ల పునీత యోసేపుగారు ఆశీర్వదింపబడి మంచి మరణం పొందారు. ఏసు మరియ హస్తాల్లో పరలోక ప్రాప్తినొందారు. సజీవ మహిమ కిరీటాన్ని ధరించారు. భూ పరలోకాల్లోని ఆస్థిపాస్తులకు, శ్రమైక జీవులకు సంరక్షకునిగా, పోషకునిగా, తండ్రిగా దైవంచే ఎన్నుకొనబడినారనడంలో అనుమానం లేదు.

## పనిచేసే తండ్రి

కథోలిక క్రైస్తవ సంఘం యోసేపుని పనిచేసే తండ్రిగా ఆదర్శంగా మన ముందు ఉంచింది. యోసేపు వృత్తిరీత్యా వడ్రంగి. యేసు తన పరిచర్య మొదలుపెట్టినప్పుడు చాలా మంది ఆయన జ్ఞానాన్ని చూసి ఈయన వడ్రంగి కుమారుడు కాడా అని అన్నట్లు మనం మార్కు సువార్త 6:3 చుస్తాం. అయితే యోసేపుని ఆదర్శం నైపుణ్యతలో లేదు కానీ ఆయన పనితీరులో ఉంది. ఆయన దేవుని ఆశయం ప్రకారం శక్తివంచన లేకుండా పనిచేస్తూ దేవునితో సహకరిస్తూ ఆయన పథకాలను నెరవేర్చ ప్రయత్నించ జీవించాడు. అందుచే యోసేపు గారు నీతిమంతుడుగా పరిగణించబడ్డారు మత్తయి సువార్త 1:19. నిస్వార్ధజీవి గా ఆదర్శనీయుడు. దేవుని ప్రణాళికలో భాగస్వామిగా సృష్టికి సహకారునిగా మరియు శ్రామికులకు, ప్రేరణగా నిలుస్తున్నాడు పునీత యోసేపుగారు. యోసేపు యందు కష్టపడి పని చేయుడం, పనిలో సంతృప్తిని పొందడం, కలుపుగోలుతనంతో వెలగడం, పనిలో శ్రేష్టతను ప్రదర్శించడం, పరస్పర ప్రోత్సాహాన్ని చూపడం మొదలగు పని గుణములు కనబడతాయి. అందుకే ఆయనను పనిచేసే తండ్రి అని మన సత్య శ్రీసభ మనకు ఆదర్శంగా నిలిపింది.

యోసేపు ఒక వడ్రంగి ఆయన తన కుటుంబాన్ని పోషించడానికి నిజాయితీగా శ్రమించి జీవించాడు. యెసేపు తన వృత్తిని ఇష్టపడి చేసేవాడు

ఎందుకన అది అతని కుటుంబాన్ని పోషించడానికి ఎంతో తోడ్పడింది. అతను తన వేతనానికి విలువైన గొప్ప పని వాడు మరియు శ్రామికుడు. యోసేపును వర్ణించే ఒక అంశం పని మరియు శ్రమ కోసం మాట్లాడేటప్పుడు నాకు ముందుగా గుర్తొచ్చేది లియో 13వ భక్తినాథ పాపుగారు రాసినటువంటి "రెరుమ్ నోవరం" అనే మొదటి సాంఘిక ఈ లేఖ పని యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. మరియు లేఖలో పని అనేది మోక్షమని, పని మోక్ష భాగ్యానికి భాగస్వామి అవుతుంది. అని మనం చుడచ్చు. అదేవిధంగా ప్రతి ఒక్కరి సొంత సామర్థ్యాలను మరియు వారిలోని నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి, సమాజాన్ని పునర్నిర్మించడానికి దోహద పడుతుంది. ఏసు తన సాకుడు తండ్రి అయినటువంటి యోసేపు గారి నుండి ఎన్నో విలువలను నేర్చుకున్నాడు వడ్రంగి నైపుణ్యాలు మాత్రమే  కాదు. యోసేపుగారు తన పనిని ఎంతో ఆనందంగా ఇష్టంగా చేసేవాడు ఎందుకంటే అతను తన కుమారుడైన క్రీస్తుతో కలిసి పని చేసాడు. ఉదయం నుండి రాత్రి వరకు వారు పక్క పక్కనే ఉండి ఒకరికొకరు మాట సహాయంగా తోడుగా పని చేసేవారు. నేటి సమాజంలో పని చేయకుండా సోమరిగా ఉన్న కుటుంబాలు శాంతి సమాధానాలతో ఉన్నట్లు మనం ఎక్కడ పరిగణించలేము. అటువంటి కుటుంబాలు అనేక ఇబ్బందులు, ఉద్రిక్తతలు వలన విడిపోవడానికి కూడా గురి అవుతున్నారు. పని చేయకుండా ప్రతి ఒక్కరు సక్రమంగా జీవించకుండా మనం మానవ గౌరవం గురించి ఎలా మాట్లాడగలం? కాబట్టి మానవమాత్రులమైన మనకు యోసేపుగారిని ఆదర్శంగా తీసుకుంటూ పునీత యోసేపు గారా మాకును మీరు తండ్రిగా ఉండండి. 'మా జీవన మార్గంలో మాకు మార్గచుపరిగా ఉండండి' దేవుని కృపను, కరుణను, ధైర్యమును ప్రాప్తింప చేయండి అని మనం నిరంతరం వేడుకోవాలి.

## నిత్య శ్రామికుడు

మనకు దేవుడిచ్చిన గొప్ప వరం ఈ జీవితం. మనకు ఒసగ బడిన ఈ జీవితాన్ని ఎలా అయినా జీవించొచ్చు ఉదాహరణకు స్వార్ధంతో జీవించవచ్చు, అసూయతో జీవించవచ్చు, అవినీతితో జీవించవచ్చు ఇంకా ఎన్నో ఎన్నెన్నో కానీ నిత్య శ్రామినిగా, దేవుని ప్రణాళికగా జీవించాలి అంటే పునీత యోసేపు

గారి బాటలో నడవాలి అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. నజరేతు వాసి అయిన యోసేపుగారు వడ్రింగిగా, నిత్య శ్రామికునిగా జీవిస్తూనే చిన్నారి బాలయేసుని పెంచే క్రమంలో వృత్తిలో శిక్షణనిస్తూ, తన నీతివంతమైన జీవనవిధానం ద్వారా విద్యాబుద్ధులు నేర్పించారు. అతనికి ఈ జ్ఞానము, ఈ అద్భుతశక్తి ఎచటనుండి లభించినది? ఇతడు వడ్రంగి కుమారుడు కాదా?" (మత్తయి 13:54,55) అని ఆనాటి ప్రజలు ఆశ్చర్య చకితులయ్యారంటే, పిల్లల ఎదుగుదల, నడవడిక, క్రమశిక్షణ, తెలితేటలు, జ్ఞానప్రదర్శనలో తల్లిదండ్రుల పాత్ర ప్రధానమన్నది నిజం. తన వృత్తిపట్ల అంకితభావంతో తన కుటుంబ పోషణకు అవసరమైన ఆర్థిక తోడ్పాటును నిజాయితీతో సంపాదించుకొని ఎటువంటి అక్రమమార్గాలకు చోటివ్వక కుటుంబాన్ని పోషించుకోవటంలోనే ఆనందముందని, శ్రమకు తగ్గ ఫలితం ఆశించడమే సన్మార్గమని, శ్రమించి సంపాదించిన దానితోనే దానధర్మాలు చేయుటంలోనే సంతోషముంటుందని నిరూపించిన నీతిమంతుడు పునీత యోసేపుగారు. సంపాదనే ధ్యేయంగా అక్రమంగా అన్యాయంగా నైనా సంపాదిస్తూ శ్రమకు తగ్గ ఫలితాన్ని ఆశించడం అమాయకత్వంగా భావిస్తూ దోపిడీలకు, దౌర్జన్యాలకు పాల్పడుతూ తోటివారు, అవసరతతో ఉన్నవారి యెడల కపటం, నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించే నేటి సమాజం, నిత్య శ్రామికుడు, నీతిమంతుడు, నిజాయితీకి నిలువుటద్దం తోటివారి యెడల కనికర స్వభావం కలిగిన యోసేపుగారి మార్గంలో జీవించడానికి ప్రయత్నించాలి.

నిత్య శ్రామికునిగా శ్రమించడం, సంపాదించటమే తన లక్ష్యం అనుకోకుండా దైవ చట్టాన్ని అనుసరించి చిన్నారి యేసుకి సాకుడు తండ్రిగా, సంరక్షకునిగా క్రూరుడైన హేరోదు రాజు బారి నుండి రక్షిస్తూ విసుగు లేకుండా సహనంతో భార్యా బిడ్డలను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సురక్షితంగా చేర్చి, సంరక్షించి, పోషించి సాకుడు తండ్రిగా పేదరికంలోను నీతినిజాయితీలతో తన జీవితాన్ని సంపూర్ణం గావించుకున్న శ్రామికజీవి, ఆదర్శనీయ ఋషిపుంగవులు పునీత యోసేపుగారు.

"పరిశుద్ధము, దేవునికి ప్రీతికరము అయిన సజీవ యాగముగు 'మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని కనికరమునుబట్టి మిమ్ము బ్రతిమాలుకొనుచున్నాను" (రోమీ 12:1) పునీత పౌలుగారు వ్రాసిన ఈ మాటలను బట్టి పునీత యోసేపుగారి ఆదర్శన్ని కలిగి ఉండాలనే ఆలోచనతో జీవించాలి.

మరియతల్లి భర్త, గొప్ప శ్రామికుడు మరియు వినయశీలి అయినటువంటి పునీత యోసేపుగారి పట్ల ఎంతోమంది ప్రత్యేకమైన భక్తి భావాన్ని కలిగి ఉన్నారు. ఉదాహరణకు 9,10,11,12వ భక్తినాథ పాపుగార్లు, 13వ సింహరాయ, 15వ బెనడిక్ట్, 23వ జాన్ పాల్ పాపుగార్లు యోసేపుగారి యెడల ప్రత్యేకమైన భక్తిభావాన్ని కలిగి వారి ఆదర్శంగా జీవించినందు వలన, వీరు పునీత యోసేపు భక్తిని వ్యాపింపచేయటానికి చేసిన కృషి ఫలితంగా విశ్వకతోలిక శ్రీసభ విశ్వాసం, నమ్మిక, నిరీక్షణ.

ఆదరణ గల భక్తునిగా, సాకుడు తండ్రిగా, సంరక్షకునిగా, నీతిమంతునిగా, శ్రామికునిగా, వినయ విధేయతలు గల ప్రార్ధనాపరునిగా యోసేపు గారి యెడల సమున్నత గౌరవాభిమానములు చూపుచుండగా, యోసేపుగారి నీతివంతమైన జీవితధర్మాన్ని తెలుసుకున్న మనం వారివలె సాధుస్వభావంతో కూడిన వినయ విధేయతలను అలవర్చుకొని దైవ ఇష్టాన్ని ఎరిగిన వారంగా "దేవుని తెలుసుకొని, ప్రేమించి, సేవించి ఆపై మోక్ష రాజ్యన్ని పొందవలెను." అనునది మానవుని యెడల దేవుని సంకల్పం అని సత్యోపదేశంలో నేర్చుకున్న విశ్వాసులంగా జీవించాలి. "పునీత యోసేపుగారు ముళ్ళపోదల మధ్య ఉన్న లిల్లీ పుష్పం వలే జీవించియున్నారు. ముళ్ళు లిల్లీ పుష్పానికి గుచ్చుకొని బాధించినా అవి ఎప్పుడూ సువాసనను కోల్పోవు" అని పునీత బెర్నార్డ్ వారి మాటలు ననుసరించి జీవించడానికి ప్రయత్నించుదాం.

అందుకు కావలసిన శక్తినిమ్మని పునీత యోసేపు గారి ప్రార్ధనా సహాయంతో ప్రభువును వేడుకొందాం.

## దేవుని చట్టమును పాటించుటలో యోసేపుగారి నిస్వార్ధ శ్రమ

గాయం విలువ తెలిసినవాడే సహాయం చేస్తాడు అని మనం విన్నట్లుగా దేవుని చట్టమును నిష్టగా పాటించి తన జీవితాన్ని సార్ధకం చేసుకుని మనకు దైవ చట్టం ఎలా పాటించాలో మార్గం ఏర్పరిచిన గొప్ప పునీతుడు పునీత యోసేపుగారు. తన జీవితాంతము యోసేపుగారు దైవచట్టమును పాటించుటలో అలసత్వము ప్రదర్శించలేదు. ఎప్పుడూ వైదొలగలేదు దేవుని ఎంతో గొప్పగా ప్రేమించాడు. ఇది ఎంతో చెప్పుకోదగ్గ విషయము, తన పూర్ణశక్తితోను ఆత్మీయ బోధనలకనుగుణంగా దేవుని ప్రేమించి, ఆ ప్రేమను తోటివారికి కూడ పంచి, వారందరిపై ఈ లోక, పరలోక సహాయం అందిచడంలో యోసేపు ఎప్పుడు ముందుండేవాడు ఎలాంటి అవసరాలలో వున్నా వారికి సహాయం చేయడానికి ఎల్లపుడు సంసిద్ధంగా వుండేవారు. ఇలా తోటివారికి సహాయం చేయటంలో తన సొంత అవసరాలను సహితం మరిచిపోయేవాడు. అవసరంలోవున్న ప్రతి వ్యక్తికి ఏదోలా సాయపడాలి అనే తపన జోజప్పులోవుంది. కొన్ని సమయాలలో సహయపడలేనప్పుడు, వారికై తండ్రిదేవుని ప్రార్ధించి వారికి ఏదోలా సహాయపడమని అర్ధించేవాడు. అందుచేతనేనేమె ఒక గొప్ప పునీతుడు ఈ విధంగా యోసేపుగారి గురించి ఇలా అన్నారు "కొంతమంది పునీతులు వాళ్లప్రత్యేక కార్యసాధకతతో కొన్ని అవసరాల్లోనే వాళ్ల సహకారిన్ని మనకందిస్తారు. కాని మన పవిత్రపాలకులైన పునీత యోసేపుగారు ప్రతి అవసరం, ప్రతిపనిలో అన్ని సందర్భాలలో మనకు సహాయంచేసే శక్తి కలిగి ఉన్నారు." (పునీత తోమాసు అక్వినాసు)

యోసేపుకు కుమారుడైన యేసుకు, తండ్రిదేవునికి మధ్య వున్న ఆత్మీయ సంబంధం పూర్తిగా అర్ధం కాకపోయినా దేవుని ఆజ్ఞల ప్రకారం జీవించాలి, అందరిని ఆ దారిలో నడపాలని, రానున్న లోకరక్షకుడే సర్వమానవాళికి మార్గదర్శకమని తెలుసుకున్నాడు. చిన్నతనవమునుండి యోసేపు యేసు ప్రతిఅడుగును గమనించేవాడు. తన ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చ ఆసక్తి చూపాడు. దేవుని దృష్టిలో యోసేపు గొప్ప విశ్వాసిగా సర్వమానవాళికి మాతృకగా నిలిచారు.

జీవితంలో పేదరికం, కష్ట బాధలు, అవమానాలు అన్ని పరిచూచిన గొప్పవ్యక్తిగా తెలియజేయబడ్డాడు. ఇవన్ని దేవునిపై ప్రేమతో ధైర్యంగా ఎదుర్కొని లోకరక్షకున్ని అనుసరించి ఆయన లాగ జీవింప సాహసించాడు, అంతేకాక ఒక పుణ్యజీవి, గొప్ప శ్రామికుడు, నిస్వార్ధజీవిని తనకు తోడుగా ప్రసాదించి ఆయన సంరక్షణలో దేవునిప్రణాళిక నెరవేర దేవుని నిర్ణయాన్ని బట్టి దేవునికి వందనాలు అర్పించింది మరియ తల్లి.

## వడ్రంగి పనిలో యోసేపుగారు

ఒకనోక రోజు యోసేపుగారు ఉదయాన్నే నిదురనుండి లేచి త్వరత్వరగా నడచి యెరుషలేము దేవాలయమునకు వెళ్ళి అక్కడ దేవునికి వందనాలు అర్పించి తన జీవిత పరమార్ధమును వివరించినందులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఇలా యోసేపు తన వద్ద వున్న ధనాన్ని కొంచెం పేదలకు పంచాడు. కొంచం తన దగ్గర వుంచుకున్నాడు. ఒకరోజు తనకు ఎవరైనా వడ్రంగి పనిని నేర్పిస్తారేమోనని వెతకనారంభించాడు. వెంటనే ఆ పని తెలిసిన ఒక వ్యక్తి వద్ద యోసేపు పనినేర్చుకుని ప్రతిభావంతుడయ్యాడు. తన పనితో పాటు అనుదిన ప్రార్ధనలను కొనసాగిస్తూ, తనకు విద్యనేర్పిన వ్యక్తికి ఎంతో కృతజ్ఞతగా వున్నాడు. అది చూచిన ఆ వ్యక్తి జోజప్పను ఎంతగానో ప్రేమించాడు. యోసేపు ఎంతో వినయ విధేయతలతో మెలుగుతూ అందరి మన్ననలను పొందుతూ వచ్చాడు. యోసేపు దాన ధర్మాలతో జీవితం సాగించడం చూచి విద్య నేర్పిన వ్యక్తి ఇలా అడిగాడు. యోసేపు, నీవే పేదరికములో వున్నావు, మరి నీకున్న కొద్ది ధనముతో ఇతరుల కష్టంలోను, పేదరికములోను సహాయం చేస్తున్నావు. నీ పరిస్థితి యేంటి? జవాబుగా – యోసేపుగారు, ఇప్పుడు నాకున్న దానిలో నేను సహాయం చేస్తే నా అవసరంలో దేవుడు నాకు సహాయపడతాడని పలికారు. అది విన్న వ్యక్తి ఎంతో ఆనందం మరియు ఆశ్చర్యాన్ని వ్యక్త పరచాడు. ఇలాంటి పుణ్యకార్యాలు దేవుడికి ఎంతో ప్రియమైనవని, తన దూత తనకు వెల్లడిచేశారు.

వడ్రంగి పనిలో సామర్ధ్యాన్ని సాధించేసరికి యోసేపుకు ఇరవై సంవత్సరాలు నిండాయి. తన పనితనంతోపాటు దైవ భయంలోను, భక్తిలోను దిన దినాభివృద్ధి చెందాడు. మరియు మరణావస్థలో వున్న వారికై ప్రార్ధించడం, సహాయం చేయడంలో ఎంతో ఆనందాన్ని పొందేవారు.

తన కుటుంబం గురించి శ్రమించడానికి ముందుకు వచ్చారు. ఏ బాధ అయినా సరే పొందటానికి ఆయన సిద్ధపడ్డారు. పునీత యోసేపుగారు అనుకున్నట్లయితే నాకు ఎందుకు ఇన్ని బాధలు అని తప్పించుకోవచ్చు. నా బిడ్డ కాదు కాదా? నా వలన వచ్చిన బిడ్డ కాదు కదా? నేను ఎందుకు ఇన్ని బాధలు అనుభవించాలి? నేనెందుకు ఇన్ని శ్రమలు భరించాలి? అని యోసేపు గారు తలవంచలేదు. యేసు మరియమాత గురించి తన కుటుంబం గురించి ఏ శ్రమకైనా సరే ఆయన సిద్ధపడ్డారు. ఎలాంటి కష్టం అయినా సరే భరించడానికి ఆయన సిద్ధపడ్డారు.

యోసేపుగారు కృతజ్ఞతలు తెలుపుతూ దేవుని చిత్తానికి బద్ధుడై జీవింప సాగారు. తన అనుదిన జీవితాన్ని కష్టపడి పనిచేయటంలోను మరియు దేవుని స్తుతించి ఆరాధించడంలోను ఎంతో ఆశక్తి, శ్రద్ధ జూపాడు. పేదరికముతోను, నిబద్ధతతోను జీవించ ప్రారంభించాడు. తనతో పాటు పనిచేసేవారు, అనవసర మాటలతో జీవిస్తూ ఎన్నో లోక వ్యసనాలకులోబడ్డారు. కాని యోసేపు మాత్రం ఈ విషయమై వారితో జతపడక, దూరంగా వుంటూ దేవునికి దగ్గరగా జీవించాడు. నీకు సేవచేయటానికి, నేను దారిద్ర్యాన్ని కష్ట బాధలను సహింప సిద్ధంగా వున్నానని ఎంతో వినయపూర్వకంగా భగవంతుని ముందు సాగిలపడి ప్రార్థించేవాడు.

## యేసు తన తండ్రి పనిలో నిమగ్నమగుట

యేసు చిన్నప్రాయములో దినదినాభివృద్ధి చెందుతూ, తన తండ్రి పనిలో సాయంచేయ సంసిద్ధతను వ్యక్తంచేశాడు. కాని యోసేపు యేసుతో ఏ పనిచేయించ ఇష్టపడలేదు. తండ్రిదేవుడు తనకు తెలియపరచేవరకు యేసుతో ఇలాంటి మామూలు పని చేయనివ్వనని తలంచాడు యోసేపు.

'యేసువైపు చూస్తు యోసేపుగారు తండ్రిదేవునికి ప్రియమైన కుమారుడైన యేసు నేను నిన్ను ఎలా ఈలాంటి శ్రమలకు ఎలా గురిచేయగలను? నీవు చాలా సున్నితమైన వాడవు ఇలాంటి కష్టమైన మరియు శ్రమతో కూడిన పనిచేయ నేను నిన్ను ఎలా కష్టపెట్టగలనని ఎంతో బాధపడ్డాడు. దివ్యబాలుడు నేను సేవచేయుటకే ఈ లోకానికి వచ్చాను కాని సేవచేయించుకొనుటకుకాదని,

ఇవన్ని దేవుని చిత్తప్రకారమే జరగాల్సి ఉందని, తెలియజెప్పారు. యోసేపు ఈ విషయమై ఎలాంటి సందేహము లేకుండ, అన్ని దేవుని చిత్తము ప్రకారమే జరుగునని, యేసుబాలుడు తనతోపాటు వుండి తన పనిలో సహాయపడునని సంతోషించాడు.

యేసు, సాకుడుతండ్రి యోసేపు పనిలో సహాయపడటం మరియు తనకు తోడుగావుండటం చూచి చుట్టు ప్రక్కలవాళ్ళు, ఎంతో ఆశ్చర్యపడేవారు, ఇంత చిన్నవయసులో తండ్రికి అంత సహాయపడుతున్న యేసునుచూచి వారు సంతోషాన్ని వ్యక్తంచేసేవారు. వారి పని స్థలానికి వచ్చేవారందరు యేసులోని గొప్పతనాన్ని, స్నేహాన్ని మరియు రాచరికపు అనుభవాన్ని చూచి ఆశ్చర్య పోయేవారు. యోసేపుతో ఆ దివ్య బాలునికి తండ్రిగా పిలివబడడం నీ అదృష్టమని చెప్పేవారు. ప్రతిరోజు యేసును చూడటానికి చాలా మంది వారి దుకాణానికి వచ్చేవారు. ఇలా యోసేపుకు ప్రతిరోజు సరిపోయేంత పని దొరికేది. యోసేపు కష్టపడి చెమటోడ్చి పనిచేస్తుండగ యేసు, యోసేపు నుదిటి పైన చెమటను తుడిచి తనకు ఎంతో ఊరటను ఇచ్చేవాడు, యోసేపు ఎంతో శక్తిని పొందేవారు.

పునీతుడైన యోసేపుగారు తన పనిని తను చేసుకుంటువుండేవాడు తన పని స్థలానికి వచ్చిన వాళ్ళు ఎంతో తృప్తినిపొందేవారు. వారి పనికి తగ్గ వేతనాన్ని జోజప్పు పుచ్చుకునేవారు. తన కుటుంబానికి అవసరమైనది వాడుకుని మిగిలినదంతా పేదలకు సాయంచేసేవారు. ఇది చూచిన యేసు ఎంతో ఆనందించాడు. యోసేపుకు సహాయపడుతున్న యేసును చూచి చాలామంది పరిచయస్తులు మీ కూమారున్ని మా దుకాణములో పనిచేయ పంపించండి, మేము తనను చక్కగా చూచుకుంటామని చెప్పేవారు తనకు కావలసిన విద్యను, అవసరాలన్ని తీరుస్తాము ఎందుకంటే నీవు పేదరికంలో వున్నావు కదా అని చెప్పేవారు. ఇది విన్న యోసేపుగారు, ఎంతో కలత చెందాడు. వారిలోని ఉదారస్వభావాన్ని చూచి వారికి వందనాలు తెలిపాడు కాని యేసు దివ్య బాలుడు తనతో వుంటేనే తనకు తృప్తి అని, తన కుమారుడే తనకు సర్వం అని వారికి తెలియజేశాడు.

## శ్రమజీవి - శ్రమజీవుల నాయకుడు

అది 1955 మే 1వ తేదీ ఇటలీ దేశములోని రోమ్నగరంలో ఉన్న పునీత పేతురు దేవాలయ ఆవరణమంతా ఎంతో సందడిగా ఉంది. ఇటలీ కతోలిక కార్మిక సంఘ సభ్యులతో కిటకిటలాడుతోంది. వారంతా శ్రీసభ అమలుచేస్తున్న సాంఘిక కార్యక్రమాల యెడల తమ సుహృద్భావాన్ని విధేయతను వెల్లడిస్తూ, మరొకసారి తమ కార్మిక సంఘం పదవ వార్షికోత్సవం సందర్భంగా తమ అంకిత భావానికి ప్రతీకగా ప్రతిజ్ఞ చేసేటందుకు సంసిద్ధంగా ఉన్నారు.

ఆ రోజున 10వ పయస్ (భక్తినాథ) పాపుగారు అచటచేరిన వారందరి సమక్షంలో మే నెల 1వ తేదీని కార్మికుడైన పునీత యోసేపుగారికి అంకితంచేసి ఆ రోజున ప్రతి సంవత్సరము కార్మిక దినోత్సవం కొనియాడి ఆ దీన శ్రమైకజీవి ఆదర్శాన్ని, ఆశీర్వాదాన్ని బడసి తరింపుడని శ్రీసభ మాటగా సందేశమిచ్చారు. ఇంకా పోపుగారు తమ ఉపదేశంలో ప్రపంచంలోని యావత్తు శ్రామిక వర్గాన్ని కాపరిగా, సంరక్షకుడుగా, తండ్రిగా పునీత యోసేపుగారు సహాయంగా, సహకారిగా ఉంటారని ప్రకటించారు. స్వయంగా శ్రమజీవియైన యోసేపుగారు తన కాయకష్టంతో చెమటోడ్చి వడ్రంగి వృత్తి పై వచ్చే ఆదాయంతోనే యేసు, మరియ యోసేపులనబడే పవిత్ర తిరుకుటుంబాన్ని పోషించుకున్నట్లు బైబిలు ద్వారా స్పష్టమవుతోంది.

ఈ కారణమును బట్టి పునీత యోసేపుగారికి కార్మక వర్గానికి సారూప్యతకలిగి అపూర్వ అవినాభావ సంబంధముందనడంలో సందేహంలేదు. ఇదిలా ఉండగా పరిశుద్ధ 13వ లియో (సింహరాయలు) పాపుగారు 1889లో పునీత యోసేపుగారిని శ్రామికులు, కార్మికులు, కష్టజీవులు, నిర్లక్ష్యం చేయబడిన దీనజనులందరికి పాలకునిగా, మార్గదర్శకునిగా శ్రీసభ తరపున పునరుద్ఘాటించారు.

అలాగే కార్మికులు, చెమటోడ్చి కుటుంబ పోషణ భారాన్ని మోసేవారంతా పునీత యోసేపుగారిని మాతృకగా గైకొని తమ ప్రత్యేక మార్గచూపరిగా భావించి, వారిని స్వర్గరాజ్య పోషకునిగా గౌరవించాలని 15వ బెనడిక్ట్ పాపుగారు

ఆదేశించారు. నాస్తిక కమ్యూనిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకుగాను శ్రీసభ సంరక్షకులుగా పునీత యోసేపుగారినే ఎంపికచేశారు.

## కార్మిక యోసేపు గురించి 11వ భక్తినాథ పాపుగారి మాటలు

కార్మిక ప్రజా తరగతికి చెందిన యోసేపుగారు పేదరికపు భారాన్ని మోస్తూ, జీవితాంతం వరకు శ్రమించి, మొద్దుకష్టంచేసి పరిశుద్ధ తిరుకుటుంబ పోషకులుగా నిలిచారు. అందుకే అనునిత్యం తమ బాధ్యతల్ని నిర్వర్తిస్తూ శరీరకష్టంతో చెమటోడ్చి ఆహారాన్ని సంపాదించేవారికి యోసేపుగారు ఆదర్శంగా ఉన్నారని 11వ పయస్ (భక్తినాథ) జగద్గురువులు వివరించారు.

ఇలా కార్మిక దినోత్సవం రోజున పునీత యోసేపుగారి ఉత్సవాన్ని ఏర్పాటు చేయబడటం వల్ల ఈ రోజు గొప్ప విశిష్టత ఆపాదింపబడిందనవచ్చును. శ్రమ, పని, కృషి మానవప్రయత్నంకు ఎనలేని గౌరవం, ప్రాధాన్యత, ఘనత, విలువ, గుర్తింపు ఇవ్వబడిందనవచ్చును. పనికి తగ్గ ప్రతిఫలం గుర్తింపు లేనియెడల మానవ హృదయం ఒకింత కలత పడుతుంది, వ్యధచెందుతుంది. కాని పునీత యోసేపుగారి మధ్యవర్తిత్వం వలన కాయకష్టం ఏనాడూ వృథాపోదు. కావున కార్మిక కుటుంబాలను పునీత యోసేపుగారు అనునిత్యం తన జ్ఞాన వాక్కులతో, దీవెనలతో కాచికాపాడుతారు. అసలు వారి తత్వమే అదికదా! క్రైస్తవ కార్మికుడికి సజీవ మాతృకయై నిరంతర మాదిరియై ఆదర్శ ప్రాయులైన పునీత యోసేపుగారిని గౌరవించడం, మన కుటుంబాల్లోకి ఆహ్వానించి మర్యాద చేయడం మన కనీస బాధ్యత. శ్రమను గౌరవించడమే యోసేపుగారిని గౌరవించినట్లు. బాధ్యతతో మెలగడం లేక కష్టపడి పనిచేయడంలో ఎలాంటి సమస్యలు, చిక్కులు తారసిల్లినా వాటిని సామరస్యంగా పరిష్కరింప యోసేపుగారు తయారుగా ఉన్నారు. వారు కార్మికులకు అన్నివిధాలా వారి నైజంను బట్టి తోడ్పడతారు.

అందువల్ల ప్రతి క్రైస్తవ కార్మికుడు ఏ సంస్థలో, ఏ వృత్తిలో, ఏ హోదాలో ఎలాంటి పనిచేస్తున్నా శ్రమ యెడల పూజ్యభావంకలిగి పని అంటే ప్రభుని పూజించడమేయని భావించి సమయంను వ్యర్థపరచక బాధ్యతగల కార్మికునిగా ఆ పునీత యోసేపుగారి అడుగుజాడల్లో పయనింప ప్రయత్నించాలి. శ్రమ

ఒక్కటే. శ్రమైక జీవులంతా ఒక్కటే. యోసేపు అంటే దేవుడు సమృద్ధి చేయును, హెచ్చించును లేక ఎక్కువ చేయును అని అర్థం.

**ముగింపు**

డిసెంబరు 8 నాటి అపోస్టోలిక్ లేఖ, "పాత్రిన్ కోర్దే" ("తండ్రి హృదయంతో") లో, క్రైస్తవులు పునీత యేసపు గారిని తమ అనుదిన జీవితాలలో గౌరవిస్తూ ప్రార్ధనా సహాయాన్ని కనుగొనగలరని ఫ్రాన్సిస్ పాపుగారు అన్నారు. అతను తరచుగా గుర్తించబడనివాడు, "కష్ట సమయాల్లో ఒక మధ్యవర్తి, మద్దతు మరియు మార్గదర్శకుడు". దాచుకున్న లేదా నీడలో కనిపించే వారు మోక్ష చరిత్రలో సాటిలేని పాత్ర పోషించారని మనకు గుర్తు చేస్తున్నారు.

మరియ భర్తగా మరియు దేవుని కుమారుని సంరక్షకునిగా, పోషకులుగా పునీత యోసేపు కుటుంబ ప్రేమకు తన మానవ వృత్తిని తన హృదయాన్ని మరియు అతని అన్ని సామర్థ్యాలను మానవాతీతమైన అర్పణగా మార్చాడు. పరిపక్వతకు ఎదుగుతున్న క్రీస్తు సేవలో ఆయన సర్వం ఉంచబడింది.

పునీత యోసేపు, మరియ గర్భం కారణంగా మొదట ఇబ్బంది పడినప్పటికీ, యోసేపు దేవుని చిత్తానికి విధేయత చూపించాడు. ఆ ప్రణాళికలో ఉన్న కష్టాలను పట్టించుకోకుండా ప్రతి పరిస్థితిలో యోసేపుగారు తన సొంత విశ్వాసాన్ని ప్రకటించాడు. మరియమాత స్తుతిగీతంలో ఆమె విశ్వాసం కనపరిచినట్లు మరియు గెత్సమనే తోటలో క్రీస్తు తన విశ్వాసాన్ని ప్రకటించినట్లు యోసేపుగారు అదేవిధంగా తన విశ్వాసాన్ని ప్రకటించారు అని పరిశుద్ధ పాపుగారు అన్నారు.

మరియను యోసేపుగారు బేషరతుగా అంగీకరించడం మరియు ఆమె "మంచి పేరు, ఆమె గౌరవం మరియు ఆమె జీవితాన్ని రక్షించాలనే అతని నిర్ణయం" నేటి పురుషులకు కూడా ఉదాహరణగా నిలుస్తుందని పోప్ జోడించారు.

"నేడు, మన ప్రపంచంలో స్త్రీల పట్ల మానసిక, మౌఖిక మరియు శారీరక హింస చాలా స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు, యోసేపు గౌరవప్రదమైన మరియు

సున్నితమైన వ్యక్తిగా కనిపిస్తాడు" అని అతను రాశారు. అంతేకాక పోప్ ఫ్రాన్సిస్ గారు పునీత యోసేపు యొక్క "సృజనాత్మక ధైర్యాన్ని" కూడా చాలా గొప్పగా రాసారు.

"తన కుటుంబానికి పోషణ అందించడానికి నిజాయితీగా జీవించే" వడ్రంగి వలె, క్రీస్తు యొక్క భూసంబంధమైన సంరక్షకుడు అయినా పునీత యోసేపుగారు కార్మికులకు మరియు ఉపాధిని కోరుకునే వారికి మరియు వారి కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితాన్ని పొందే హక్కు కోసం కూడా ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. "ప్రస్తుత రోజుల్లో, ఉపాధి మరోసారి మండుతున్న సామాజిక సమస్యగా మారినప్పుడు మరియు కొన్ని దశాబ్దాలుగా కొంతవరకు శ్రేయస్సును అనుభవిస్తున్న దేశాలలో కూడా నిరుద్యోగం పెరుగుతున్న స్థాయికి చేరుకున్నప్పుడు, గౌరవప్రదమైన పని యొక్క ప్రాముఖ్యతను అభినందించాల్సిన అవసరం ఉంది. ఇందులో పునీత యోసేపుగారు ఆదర్శప్రాయమైన పోషకుడు, శ్రామికుడు" అని అతను చెప్పారు.

అలాగే ఇంకొక పునీతురాలు యోసేపుగారి కోసం ఇలా అన్నారు "నేను పునీత యోసేపుగారిని ఒక వరం అడగటం ఆయన ఆ వరాన్ని ప్రభువు నాకు ప్రసాదించేలా ప్రార్ధన చేయకపోవడం అనేటటువంటిది నా జీవితంలో నేను ఎప్పుడు కూడా ఎరుగను. అదే భక్తి విశ్వాసాలతో మన జీవితాలను ముందుకు కొనసాగిస్తూ ఈ విధంగా ఆ పునీతుని వేడుకుందాం.

పునీత యోసేపుగారా! మిమ్ము నమ్ముకొనిన ఏ వ్యక్తిని మీరు ఎన్నడు వమ్ముచేయలేదు. మిమ్ము నమ్ముకొనిన అనేకులను ఏ విధంగా ఆశీర్వందించారో, అదే విధముగా మమ్ము కుడా, మా అనుదిన జీవితంలో నిరాశా, నిస్పృహలకు. లోనుకాకుండా, మిమ్ము నమ్ముకొని, మీ ప్రార్ధనా సహాయాన్ని కోరుకుంటు, ఉన్నతమైన ఆశయాలతో కూడిన జీవితం జీవించేలా, శ్రమించేలా చేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.

# 7. దేవుని ప్రతి బింబమైన తండ్రి - పునీత యోసేపుగారు

– బ్రదర్ నందిగామ్ మనిహార్

## ఉపోద్ఘాతం



శ్రీసభలో మొదటి స్థానం యేసు ప్రభువుకు. మరియతల్లికి రెండోవస్థానం ఉంటే, మూడోవస్థానం పునీత యోసేపుగారిదే. శ్రీసభ యోసేపుగారిని యేసు ప్రభువుకు తండ్రిగా, పెంపుడు తండ్రి గౌరవం ఇస్తుంది. ప్రతి సంవత్సరం తపస్సు కాలములో శ్రీసభ ఒక గొప్ప పునీతుని పండుగను కొనియాడుతుంది. వారే పునీత యోసేపుగారు. మరి దీనిని బట్టి శ్రీసభ పునీత యోసేపుగారికి ఎంతటి గొప్పస్థానాన్ని, ఔన్నత్యాన్ని కల్పించినదో మనకు విదితమవుతుంది. పునీత యోసేపుగారు గొప్ప విశ్వాసపాత్రుడు. ఆత్మ నిగ్రహం కలవాడు, నీతిమంతుడు, పవిత్రుడు, కష్టజీవి, కుటుంబ సంరక్షకుడు, ప్రార్ధనపరుడు, దైవకుమారునికి తండ్రిగా ఉండే గొప్ప భాగ్యం పొందిన సుగుణశీలుడు. సువార్త పఠనాలు పునీత యోసేపుగారిని యరియతల్లికి భర్తగా, యేసు ప్రభువుకు సాకుడు తండ్రిగా తెలియజేస్తున్నాయి.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 8 డిసెంబర్ 2020 నుంచి 8 డిసెంబర్ 2021 వరకు యోసేపుగారి సంవత్సరంగా ప్రకటించారు. పునీత యోసేపుగారి జీవితం నుంచి మనం అనేక విషయాలను నేర్చుకోవచ్చు. దేవుని యెడల ఏ విధంగా జీవించాలో, శత్రువుల బారి నుండి కుటుంబమును ఎలా రక్షించుకోవాలో కుటుంబమును ఏ విధంగా ప్రేమతోను, సమాధానంతోను శాంతియుతంగా నడిపించాలో పునీత యోసేపుగారి నుంచి నేర్చుకోవచ్చు.

దేవుని ప్రణాళికను నేరవేచ్చటానికి పునీత యోసేపుగారు చేసిన కృషిని, పట్టుదలను చూసి ఆయన జీవితం నుంచి మనం గ్రహించవచ్చు.

"పునీత యోసేపుగారు స్వర్గపు తండ్రి యొక్క ప్రతిబింబము. తండ్రి దేవుడే తన ప్రియమైన కుమారునికి తండ్రిగా ఉంటే భాగ్యం యోసేపుగారికి ఇచ్చారు. దేవుడు భూలోకం అనే తోటలో గూలాబి మొక్క పెంచాలి అని భావించారు. భూమిని ఎన్నుకొని, గూలాబి విత్తనం వేసారు. ఆ గూలాబిని చూసిన వారందరికి ఆనందం ఇవ్వాలని తలంచారు. తాను పెంచే గులాబికి నీరుపోయడానికి, పురుగుల నుంచి మరియు కీటకాల నుంచి ఆ గూలాబి మొక్కను రక్షించడానికి ఒక తోటమాలిని ఎన్నుకున్నారు. ఆ మొక్క పెరిగి అందరికి ఆనందాన్ని పంచింది. ఆ భూమి మరియతల్లి గర్భం, ఆ గులాబి మన యేసు ప్రభువు ఆ గులాబిని రక్షించే తోటమాలి పునీత యోసేపుగారు. ఆ గూలాబి ద్వారా మనకు వచ్చే ఆనందం దేవుడు మనకు ఇచ్చే నిత్యజీవం.

గులాబి అనే యేసు ప్రభువును సంరక్షించడానికి మరియు ఆయనను (యేసు ప్రభువును) జ్ఞానమందును, మరియు ప్రాయమందును ధృడ పరచడానికి దేవుడు తోటమాలిగా పునీత యోసేపుగారిని ఎన్నుకున్నారు. యోసేపుగారు కూడా తనకు అప్పగించిన బాధ్యతకు ప్రాతినిధ్యం వహించారు. యేసు ప్రభువును తన ఇష్టానుసారంగా జీవించకుండా దేవుని ప్రణాళికను, దేవుని ప్రేషిత కార్యం నేరవేర్చే దైవ కుమారునిగా పెంచారు.

## యేసు ప్రభువునకు భూలోక తండ్రిగా పునీత యోసేపుగారు

ఏ వ్యక్తి అయిన బిడ్డను ఈ లోకానికి తీసుకొని రావడం ద్వారా తండ్రి అవుతాడు. కాని పునీత యోసేపుగారు "దావీదు కుమారుడవగు యోసేపూ! నీ భార్యయైన మరియ్మను స్వీకరించుటకు భయపడవలదు. ఏలయన ఆమె పవిత్రాత్మ ప్రభావమువలన గర్భము ధరించినది. మత్తయి 1:20. కలలో దేవుని సందేశాన్ని ఆలకించి, మరియతల్లిని భార్యగా స్వీకరించడం మరియు యేసు ప్రభువుని బాధ్యతను స్వీకరించడం ద్వారా యేసు ప్రభుకు ఈ భూలోక

తండ్రిగా అయినారు యోసేపు గారు. మానవ జీవితంలో బిడ్డకు జన్మనివ్వడం ద్వారా తల్లిదండ్రుల అవుతారు ఇది నిజము. కాని బిడ్డ బాధ్యతను తీసుకోవడం ద్వారా, ఆ బిడ్డకు మంచి భవిష్యతూ ఇవ్వడం ద్వారా, నేను ఉన్నాను అన్న అభయం ఇవ్వడం ద్వారా కూడా మనం తల్లిదండ్రులు అవుతాము. పునీత యోసేపుగారు మరియతల్లిని భార్యగా స్వీకరించిన సమయం నుంచి ఆమెను సంరక్షిస్తూ కుటుంబ పోషణకై కష్టపడి పనిచేసి, మరియకు సమస్తం సమకూర్చారు. బాలయేసుకు తండ్రి పేమను అందిస్తూ, సక్రమ మార్గంలో నడిపించారు. "నీ తండ్రి ఉపదేశము నీకు దీపముగా, నీ తల్లి బోధన నీకు వెలుగుగా ఉండును, నీ తల్లిదండ్రులు శిక్షణార్థమైన గద్దింపులు నీకు జీవమార్గములు" (సామెతలు 6:23) పునీత యోసేపుగారు బాలయేసుకు మంచిచెడ్డులను బోధిస్తూ, జీవితపు విలువలను నేర్పారు. బాలయేసును ఒక ఔన్నత్యమైన, గొప్ప జీవితానికి నడిపించారు. మరియతల్లి కూడా దేవుని ప్రేమను, పవిత్రమైన జీవితం గురించి మరియు ఆ కాలపుచట్టలను, శాసనాలను ఆయనకు నేర్పించింది. మరియతల్లి, యోసేపులు అవసరం వచ్చినపుడు బాలయేసును గద్దిస్తూ సక్రమైన మార్గంలో నడిపించారు. మనకు ఒక సామెత ఉంది "పిల్లలకు మొదటి గురువు తల్లిదండ్రులు" పిల్లలపై తల్లిదండ్రులు చూపే శ్రద్ధ వారిని ఎంతో ఉన్నతమైన గొప్పస్థానంలో వారిని నిలుపుతుంది. మరియు తల్లిదండ్రుల ప్రేమ, పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి తప్ప వారిని చెడు జీవితానికి నడిపించకూడదు. మరియతల్లి, యోసేపుగారు ఎంతో పవిత్రమైన జీవితం జీవించారు. వారి ప్రేమ మధ్యలో పెరిగిన బాలయేసు కూడా ఇతరులను ప్రేమిస్తూ, అందరి మన్ననను పొందుకున్నారు.

## దేవుని నీడ అయిన పునీత యోసేపుగారు

పునీత యోసేపుగారు పవిత్ర కుటుంబానికి అధిపతి మరియు క్రీస్తు యొక్క శ్రద్ధగల రక్షకుడుగా మూర్తిభవించినారు. దేవునికి, దేవుని చిత్తానికి పునీత యోసేపు గారు చూపిన వినయాన్ని మరియు వీరోచిత ఏక రూపతను తండ్రి హృదయం ద్వారా మనం తెలుసుకోవచ్చు. పునీత యోసేపుగారు తన

స్వేచ్ఛను, తన ఇష్టాన్ని తండ్రికి సమర్పించారు. స్వర్గపు ప్రేరేపణలకు విధేయతతో సహకరించారు మరియు తండ్రి ప్రేషిత కార్యాన్ని, ప్రణాళికలను భక్తితో స్వీకరించారు. పునీత యోసేపుగారు దేవుని చిత్తానికి తాన్ను తాను పూర్తిగా సమర్పించినందున యోసేపుగారు దేవుని ప్రతిబింబంగా మారినారు "నీ రెక్కల నీడలో నేను ఆశ్రమం పొందుతున్నాను"(కీర్తన 57:1) మనం కూడా ఎప్పుడు అయితే స్వర్గపు తండ్రి చిత్తానికి మన స్వేచ్ఛను, స్వాతంత్ర్యంను, మనశక్తి బలమును ఏకం చేసినప్పుడు మనం అత్యంత నిశ్చయంగా ఆయన రెక్కల నీడలో జీవించగలము. దేవుని కార్యాన్ని విశ్వాసంతో నెరవేర్చే విశ్వాసవీరులుగా మారడానికి మరియు యేసు ప్రభువు, మరియ తల్లితో కలిసి శాశ్వతమైన ప్రేమలో నమ్మకంగా ప్రయాణించి, దేవుని మేలు పొందుకోగలము.

## దేవుని యెడల ధృడమైన విశ్వాసం చూపిన తండ్రి పునీత యోసేపుగారు

పునీత యోసేపుగారు దేవుని ఎడలా ధృఢమైన విశ్వాసం చూపించారు. తనకు ప్రధానం చేయబడిన మరియతల్లి, గర్భం దాల్చిన విషయం తెలిసి ఎంతో కలతచెందినారు. తాను ప్రాణంగా ప్రేమించిన మరియతల్లిని అనుమానించవలసి వచ్చినందుకు ఎంతోగానో బాధపడినారు. "మరియమ్మకు, యోసేపుకు వివాహేము నిశ్చయింపబడింది. కాని వారు ఇరువురును కాపురము చేయకముందే పవిత్రాత్మ ప్రభావమువలన మరియమ్మ గర్భము ధరించినది." (మత్తయి 1:18) కాని గాబ్రియేలు దూత మరియతల్లికి ముఖాముఖి కనిపించి, యేసు ప్రభువుని జనన శుభవార్తను ప్రకటించిన విషయం తెలిసి ఎంతో ఆనందించాడు. ప్రభువు దూత కలలో కనిపించి చెప్పినదంతము విశ్వాసించాడు "నిద్ర నుండి మేలుకొని" (మత్తయి 1:24). ప్రభుదూత ఆజ్ఞాపించినట్లు మరియతల్లిని భార్యగా స్వీకరించాడు" అప్పటి వరకు ఆయన మదిలో మెదిలిన వాటిని సరిదిద్దుకొన్నాడు. నిండు విశ్వాసముతో, ఆనందంతో, మరియతల్లిని స్వీకరించి తన విశ్వాసమును దేవుని ఎదుట క్రియల రూపంలో వ్యక్తి పరిచారు పునీత యోసేపు. "క్రియలు లేని విశ్వాసము నిర్జీవమే" (యాకోబు 2:17). ఆయన బాలయేసును సంరక్షించటంలో, మరియతల్లికి, బాలయేసునకు లోటు

లేకుండ పోషించడంలో మరియు దేవుని యెడల తనకు తన ఉన్న విశ్వాసమును వ్యక్తపరిచారు. దేవుని ప్రేషితకార్యనికి, మానవ రక్షణ ప్రణాళికకు మరియతల్లి, యోసేపుగారు వారి వంతు సహకారం ఇచ్చారు. మానవ జీవితంలో కొన్నిసార్లు భార్యకు భర్తపట్ల, భర్తకు భార్యపట్ల అపోహాలు, అనుమానలు వస్తాయి. కాని బార్య భర్తలు వాటిలోని నిజాలు, అబద్ధాలు, వాస్తవాలు తెలుసుకొని ఒకరి తప్పులు మరొకరు క్షమించుకుంటూ, పోరపాటును సరిదిద్దుకుంటూ జీవించాలి. బార్యభర్త లిద్దరు కలిసి వారి కుటుంబాన్ని ప్రేమలయంగా చేసుకోవాలి.

## విధేయత కలిగిన తండ్రి

యూదుల ఆచారం ప్రకారం ఎనిమిది దినములు గడిచిన పిమ్మట శిశువునకు సున్నతి చేసి దూత సూచించినట్లుగా ఆ బాలునకు యేసు అని పేరు పెట్టారు (లూకా 2:21). యోషే చట్ట ప్రకారము మరియమ్మ, యోసేపులు బాలయేసుని యెరుషలేము దేవాలయమునకు తీసుకొనిపొయి ఒక జత గువ్వలను సమర్పించారు. లూకా 2:23 ఈ విషయములను పరిశీలించి నట్లయితే యోసేపుగారు దేవుని ఆజ్ఞలను తూ.చ తప్పకుండా పాటించినట్లు మనకు అర్థం అవుతుంది. దేవునికి లోబడి ఏవిధంగా జీవించాలో మరియు దేవుని చిత్తాను సారం ఈ లోకములో ఏ విధంగా బ్రతకాలో బాలయేసు తన సాకుడు తండ్రి నుంచి చక్కగా నేర్చుకున్నారు. యోసేపువలె ప్రతి తల్లిదండ్రులు కూడా దైవాజ్ఞలను పాటించటంలో శ్రద్ధచూపిస్తే, వారి బిడ్డలు కూడా దైవమార్గంలో నడుస్తారు. “తాను పెరిగి పెద్దవాడైన నజరేతునకు వచ్చి అలవాటు చోప్పన విశ్రాంతి దినమున ప్రార్థనా మందిరమునకు వెళ్లెను” (లూకా 4:16). ఈ వాక్యమును జాగ్రత్తగా పరిశీలించినట్లుయితే, ఆయన అలవాటు చోప్పున విశ్రాంతి దినమున ప్రార్థనా మందిరమునకు వెళ్లెను అనగా యేసు చిన్నప్పుడు తల్లిదండ్రులు అయిన మరియ్మతోను, యోసేపుతోను కలిసి తరుచుగా ప్రార్థనా మందిరమునకు వెళ్ళేవారు అన్ని అర్థం అవుతుంది. సువార్త పఠనములలో యేసు నిర్జన ప్రదేశమునకు వెళ్ళి ప్రార్థించెను అని చెప్పబడెను, అంటే బాలయేసును యోసేపు, మరియతల్లి ప్రార్థన జీవితంలో పెంచారు. “చిన్నపిల్లలు

మనం చెప్పింది చేయరు కాని మనం చేసేది చేస్తారు" అను సత్యమును ప్రతి తల్లిదండ్రులు గ్రహించాలి. తల్లిదండ్రులు కుటుంబ ప్రార్థన జీవితానికి, వ్యక్తిగత ప్రార్థన జీవితానికి చిన్నపిల్లలను అలవాటు చేయాలి అప్పుడే వారు పెరిగిన తరువాత దైవమార్గంలో, దేవుని చాత్తానుసారంగా జీవించగలుగుతారు. "దుష్టులు కొనసాగరు" కాని నీతిమంతులు భక్తి విశ్వాసముల వలన జీవింతురు (హబక్కుకు 2:4) పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలి అని తలంచిన ప్రతి తల్లిదండ్రులు ముందు ముందుగా వారు నీతిమంతులై, భక్తి విశ్వాసములతో జీవిస్తే రేపు వారి బిడ్డలు కూడా సన్మార్గంలో, దేవుని పుణ్యమార్గంలో నడుస్తారు.

## ఓర్పుతో దేవుని మనస్సును గెలిచిన తండ్రి

"ఓర్పుతో ఎదుటివారి మనస్సును గెలుచుకో" అనే సామెత ఉంది. పునీత యోసేపుగారి జీవితంలో ఇదే జరిగింది. "మరియమ్మకు, యోసేపుతో వివాహము నిశ్చయింపబడింది. కాని వారు ఇరువురును కాపురము చేయకముందే పవిత్రాత్మ ప్రభావము వలన మరియమ్మ గర్భము ధరించినది (మత్తయి 1:18)
యోసేపుగారు, మరియమ్మ గర్భం దాల్చిన విషయం తెలిసి ఎంతో బాధపడినారు. ఆ ఇరువులు కాపురము చేయకముందే మరియమ్మ గర్భము ధరించడం తెలిసి తనలోతాను ఎంతగానో కుమిలిపోయాడు. ఓర్పుతో నిజం ఏమిటి అని ఆలోచింపసాగాడు. మరియమ్మను బహిరంగముగా అవమా నించాలి అని తలంచలేదు. దేవదూత యోసేపునకు కలలో కనిపించి, "శిశువును చంపుటకు హేరోదు వెదకబోవుచున్నాడు, కావున నీవు లేచి, బిడ్డను, తల్లిని తీసుకొని ఐగుప్తునకు పారిపొయి, నేను చెప్పువరకు అచటనే యుండుము" (మత్తయి 2:13) అని చెప్పిన వెంటనే దేవదూత మాటలపై నమ్మకం ఉంచి ఎంతో ఓర్పుతో ఆ రాత్రి బాలయేసును, మరియతల్లిని తీసుకొని ఐగుప్తునకు ప్రయాణం చేసారు "మరియతల్లి యోసేపు ప్రతిసంవత్సరము పాస్కపండుగకు యోరుషలేమునకు వెళ్ళెడివారు" బాలయేసు యెరుషలేములోనే ఉండిపోయెను (లూకా 2:41-43). పాస్కపండుగకు దేవాలయమునకు వెళ్ళినప్పుడు బాలయేసు యెరుషలేములోనే ఉండిపొతారు. అప్పుడు యోసేపుగారు ఎంతో

ప్రేమతో బాలయేసు కొరకు ఓర్పుతో అన్ని చోట్లా వెతికారు. మళ్ళీ దేవాలయంలో బాలయేసును గుర్తించినప్పుడు ఎంతో సంతోషించారు. మనం చదివిన ఈ మూడు సంఘటనలో ఏవిధంగా యోసేపుగారు ఎంతో ఓర్పును చూపించి తండ్రి దేవుని మనస్సును గెలుచుకున్నారు మరియు ఈ విధంగా యోసేపుగారు చూపిన ఓర్పుకు మనుజరూపధారునికి తండ్రిగా ఉండే భాగ్యం కలిగింది. మన జీవితంలో అనేకసార్లు సహనం, ఓర్పు కోల్పోయి, ఎదుటివాళ్ళను బాధపెడతాము, కొడతాము, దూషిస్తాము. కాని సహనం, ఓర్పుతో ఉంటేనే ఎదుటివాళ్ళ ప్రేమను గెలుచుకుంటాము అనే విషయం మరిచిపోతాము. కొన్నిసార్లు సహనం, ఓర్పులేక సంబంధములను వదులుకుంటాము. దేవున్ని అనుగ్రహములు అడిగినప్పుడు అవి తొందరగా జరగని పక్షంలో దేవుని సైతం దూషిస్తాము. కానీ యోసేపు గారి వలె ఓర్పుతో ఉంటే దేవుని రాజ్యమును, దైవవరములను పొందుకోవచ్చు.

నేను దేవుని ప్రతిబింభమైన తండ్రి అని ధ్యానించినప్పుడు, నాకు ఒక సంఘటన గుర్తు వచ్చింది. చిన్న పిల్లలు ఎండలో ఉన్నపుడు వాళ్ళ నీడను చూసి ఆనందిస్తారు. అదే విధంగా తండ్రి దేవుడు కూడా పునీత యోసేపు గారిని చూసి ఎంతగానో ఆనందించి ఉంటారు. ప్రతిబింభమును చూసి మనం నిజాన్ని, వాస్తవాన్ని తెలుసుకోవచ్చు. మనం కూడా పునీత యోసేపుగారిని చూసి మన తండ్రి ఆయిన దేవుడు ఎంత ప్రేమామయుడో, దయామయుడో, ఓర్పుకలవాడో, తన బిడ్డలను రెక్కల నీడలో దాచుకొని రక్షించేవాడో అని మనకు అర్ధమవుతుంది. తన చేతులతో మలచి ప్రాణం పోసిన మానవుని కోసం తన కుమారున్ని పంపిన తాగ్యమూర్తి అని మనం గ్రహించవచ్చు.

దేవుడు, యిస్రాయేలు ప్రజలను రక్షించినప్పుడు వారి యెడలా ఆయన చూపిన ప్రేమ, కరుణను యోసేపుగారిలో కూడ చూడవచ్చు. యిస్రాయేలు ప్రజలు తప్పులు చేసినప్పుడు తండ్రివలె సహనం, ఓర్పుతో వారిని క్షమించారు దేవుడు. యోసేపుగారు కూడా తండ్రివలె మరియతల్లి విషయంలో, బాలయేసును పెంచే విషయంలో ఎంతో ఓర్పు సహనం చూపించారు. దేవుని చిత్తాన్ని నెరవేర్చి

తన సర్వస్వం దేవునికి సమర్పించారు. దేవుని రక్షణలో పాలుపంచుకునే భాగ్యం పొందుకున్నారు.

## ముగింపు

కాబట్టి ప్రియ మిత్రులారా! జ్ఞానస్నానం ద్వారా దేవుని బిడ్డలమైన మనం, పునీత యోసేపుగారివలె ప్రతిరోజు, ప్రతిగంట, ప్రతి నిమిషం మరియు ప్రతిక్షణం దేవుని ప్రేషితకార్యం కోసం, దేవుని ప్రణాళికల కోసం మరియు దేవుని చిత్తని నేరవేర్చడానికి ప్రయత్నం చేయాలి. ఈ భూలోక సోదరిసోదరులకు దేవుని ప్రతిబింబాలు అయిన వారిగా ఆయన యొద్దకు మన జీవితాలను నడిపించాలి. తద్వార దేవుని అనుగ్రహములను, పరలోక రాజ్యమును మన జీవితంలో పొందుకోగలము. మరియు పునీత యోసేపుగారి వలె మనం దేవుని వాక్యము చదివి అనుసరించడం ద్వారా మరియు దేవుని నియమాలు, ఆజ్ఞలను పాటించడం ద్వారా మనం దేవుని, ప్రతిబింభములుగా ఈ భూలోకంలో జీవించవచ్చు. కాబట్టి దేవుని ప్రేషితకార్యాన్ని దేవుని చిత్తాన్ని, మన జీవితాలలో పునీత యోసేపుగారివలె నెరవేర్చుశక్తిని, బలమును, దయచేయుమని ప్రార్థించుదాం, దేవుని రక్షణ కొరకు వేడుకుందాం.

# 8. శ్రీసభ సంరక్షకుడు - పునీత యోసేపుగారు

- బ్రదర్ కొట్టె సుధీర్ కుమార్



## పరిచయం

సుభాషిత రత్నాలలాంటి మాటలు పునీత యోసేపుగారు మాట్లాడినట్లు సువార్తలో లేనప్పటికి తన మౌనంలో దేవుని సందేశాన్ని ఆచరించడంలో మునిగి యున్నాడు. ఈ విధంగా ఒక సువార్త సుగంధములా, మౌన మునిలా యోసేపుగారు ఉన్నారు. మనం తండ్రి గురించి ఆలోచించినప్పుడు మన మనస్సులో మెదిలే మొదటి ఆలోచన ధైర్యం మరియు సంరక్షణ దేవుడు మన తండ్రి కూడా ఎల్లవేళలా మనలను సంరక్షిస్తూనే ఉన్నాడు. సంరక్షించడమే కాదు రక్షించడం కూడా ఆయనకు తెలుసు. అందుకనే రక్షకుడైనా క్రీస్తుని పునీత యోసేపుగారి సంరక్షణలో ఉంచారు.

సంరక్షించడం దేవుని వ్యక్తిత్వాన్ని ఉనికిని మానవులకు చాటి చెపుతుంది. 23వ కీర్తనలో దావీదు 'దేవుడును తనను రక్షించే కాపరిగా' పేర్కొంటాడు. కీర్తన 46:1లో ప్రభువే మనకు ఆశ్రయము, బలము ఆపదలలో ఆదుకునే వాడు ఆయనే. కీర్తన 138:7 నేను కష్టములలో చిక్కుకొని ఉన్నప్పుడు నీవు నన్ను కాచి కాపాడెదవు. ఆగ్రహపూరితులైన నా విరోధులను ఎదురించి నీ బలముతో నన్ను రక్షింతువు. నిర్గమ 3వ అధ్యాయములో ప్రభువైన యావే యోషేను పిలిచి తన ద్వారా తన ప్రజలను విముక్తులను చేయడానికి, రక్షించడానికి పిలుస్తాడు.

నూతన నిబంధనలో క్రీస్తు ప్రభువు పరలోక తండ్రి ద్వారా ఈ లోకమునకు వచ్చి, మనల్ని సంరక్షించుటకు, రక్షించుటకు వచ్చాడని యోహాను 17:12

ఈ విధంగా అంటాడు. నేను వారితో ఉన్నప్పుడు నీవు నాకు ఒసగిన వారిని కాపాడితిని. నేను వారిని భద్రపరచితిని అని, క్రీస్తు ప్రభు తన సంరక్షక గుణాన్ని వ్యక్త పరస్తూ తండ్రికి ప్రార్థించాడు. ఈ సంరక్షక గుణం క్రీస్తు ప్రభువుకు, తన చిన్న వయస్సు నుండే తన సాకుడు తండ్రియైన పునీత యోసేపుగారు వ్యక్తపరుస్తూ వచ్చాడు. ఇది చూసి క్రీస్తు ప్రభువు తన ప్రజలను రక్షించే ముందు ఏ విధంగా సంరక్షించాలో తన కుటుంబంలో నుండి నేర్చుకున్నాడు. అదే విధంగా మరియతల్లి కూడా పునీత యోసేపుగారు, క్రూరుడైన హేరోదు బారి నుండి వారిని దేవుడు ఏ విధంగా కాపాడి ఐగుప్తునకు చేర్చాడో మళ్ళీ అక్కడి నుండి బేత్లహేముకు సురక్షితంగా చేర్చాడో అనేకసార్లు క్రీస్తుకు చెప్పి ఉండవచ్చు.

సువార్తీకులు పునీత యోసేపుగారు సువార్తలో మాట్లాడినట్లు ఎక్కడ పేర్కొనలేదు. ఎందుకంటే పునీత యోసేపుగారు తన కుటుంబాన్ని సంరక్షించ డంలో నిమగ్నులైనారు. ఈ విధంగా మాటల కన్నా తన చేతల ద్వారానే పునీత యోసేపుగారు బలంగా సువార్తను ప్రకటించారు. యోసేపుగారు నిద్రిస్తున్న సమయంలో కూడా సరే దేవుని ప్రణాళికలను తెలుసుకోవడానికి ప్రయత్నించారు.

## పూర్వ నిబంధన యోసేపు – నూతన నిబంధన యోసేపు సంరక్షణకు సూచన

పూర్వ నిబంధనలో యోసేపుగారు తన కుటుంబాన్ని కరువు నుండి కాపాడటం మరియు వారి ప్రాణాలను నిలబెట్టడం ఒక గొప్ప రక్షణ సంకేతం. (ఆది 37:36, ఆది 39:1). యోసేపు పోతీఫరుకు అమ్మబడ్డాడు కాని దేవుడు తనను లేవనెత్తి, రాబోయే యిస్రాయేలు తరాలను రక్షించాడు. చివరగా, లోకమంతట తీవ్రమైన కరువు సంభవించినప్పుడు ప్రజలు ఫరో మహారాజును సమీపించారు. ఫరోరాజు యోసేపు తెలివి తేటల మీద నమ్మకం ఉంచారు. అదే విధంగా నూతన నిబంధనలో పునీత యోసేపుగారు బాలయేసును కాపాడుట ద్వారా రక్షణ ఫలాలు అందించబడ్డాయి. ఎండిన బీడు భూముల వంటి మన జీవితాలను, కరువుతో కూడిన జీవితాలను, దైవ కృప అనుగ్రహము

అనే స్లీవ ఫలాలను, సమృద్ధిగా మనకు అందించడానికి పునీత యోసేపు గారు బాల యేసును, మరియమాతను తీసుకుని ఐగుప్తుకు పారిపోయి అక్కడ తలదాచుకున్నారు. ఈ విధంగా రాబోయే కరువును ముందుగానే గుర్తించిన పూర్వ నిబంధన యోసేపు ధాన్యాన్ని ముందే సేకరించి తన గిడ్డంగులలో దాచిపెట్టినట్లే పునీత యోసేపుగారు బాలయేసుకు సమీపించే ఆపదను ముందుగానే పసిగట్టి అప్రమత్తుడై బాలయేసును, మరియమాతను రక్షించి, మనకి అందించారు.

## మరియమాత – పునీత యోసేపుగారి సంరక్షణపై నమ్మకం

నీతిమంతుడైన యోసేపు మరియమ్మతో నిశ్చితార్థం అయినప్పటికి మరియమ్మ ప్రభువుకు అంగీకారం అని ఎలా చెప్పగలిగిందో మనం ఆలోచిద్దాం. అప్పటికే ఇద్దరికే నిశ్చతార్ధం అయింది కాబట్టి ఇరువురికి వారివారి మనస్సులు తెలుసు. దేవదూత శుభవర్తమానము తనకు అందించినపుడు, మొదటగా తనని కలవర పెట్టిన ఆలోచన ఏమిటంటే పునీత యోసేపుగారు తన గురించి ఏవిధంగా భావిస్తాడో అనే ఆలోచన. రెండవదిగా ఈ లోకం తనను రాళ్ళతో కొట్టి చంపుతుందేమోననే భయం. ఇన్ని ఆలోచనల కన్న పునీత యోసేపు గారు తనను అర్థం చేసుకొని తనను స్వీకరిస్తాడు మరియు ఈ సమాజం నుండి తనని సంరక్షిస్తాడు అని ఒక ప్రగాఢమైన నమ్మకం తనకి పునీత యోసేపుగారి పట్ల కలిగింది. అందుకే మరియమాత దేవదూత ఇచ్చిన శుభ సమాచారానికి తలయొగ్గి 'అవును' అని దేవుని మాటకు విధేయించింది (లూకా 1:38).

## యోసేపు దగ్గరికి వెళ్ళుము

ఫ్రాన్సిస్ జగద్గురువులు తన విశ్వలేఖ అయిన తండ్రి హృదయం (Patris Corde) తో పాత నిబంధనలో ఉన్న యోసేపును గుర్తు తెచ్చుకుంటూ కరువు సమయలలో ఈజిప్టు యొక్క ఫరోరాజు తన వద్దకు వచ్చిన వారితో "యోసేపు వద్దకు వెళ్ళండి, అతడు చెప్పినట్లు మీరు చేయండి (ఆది 41:55) అనెను. ఈ

విధంగా పునీత యోసేపుగారిపై మనకు నమ్మకం కలగడానికి ఇది ఒక ప్రసిద్ధ వచనం అని చెప్తున్నారు.

పాత నిబంధనలో కరువు సమయంలో పశుపక్షి ప్రాణాలు మరియు మానవుడు తమ ప్రాణాన్ని పోగొట్టుకునే ప్రమాదం ఉన్నట్లే బాలయేసు ప్రాణం అంతరించి పోయే ప్రమాదంలో ఉన్నప్పుడు తండ్రి అయిన దేవుడు ఈ లోకంలో తన ప్రేమకు ప్రతీకగా నిలచిన పునీత యోసేపుగారి వద్దకు గాబ్రియేలు దూతను పంపించి తన తిరుకుటుంబాన్ని తన శక్తి సామార్థ్యములతో రక్షించమని తండ్రియైన దేవుడు పునీత యోసేపుగారిని తమ కుటుంబ సంరక్షకునిగా స్థాపించారు. అదేవిధంగా మరియతల్లి కూడా మరోమాట మాట్లాడకుండా యోసేపుగారు చెప్పినట్లు నడిచింది. ఈ విధంగా పునీత యోసేపుగారి వద్ద మరియు తన సంరక్షణలోఉన్న వారిని పునీత యోసేపుగారు ఎన్నడు చేయి విడువ లేదు.

## శ్రీసభ సంరక్షకుడు పునీత యోసేపుగారు

IX భక్తినాధ పాపుగారి నుండి ప్రస్తుత జగద్గురువులు ఫ్రాన్సిస్‌గారు యోసేపుగారి పట్ల తమ నమ్మకం :-

## IX భక్తినాధ పాపుగారు

IX భక్తినాధ పాపుగారు మొదటిసారి ప్రపంచానికి పునీత యోసేపుగారు శ్రీసభ పోషకుడు అని మరియు సంరక్షకుడు అని ప్రకటించారు. అది మొదటి వాటికన్ మహాసభ సమయం. ఈ పాపుగారే ఆ మహాసభకు అధ్యక్షతను వహించారు. తన పాలన కాలంలో శ్రీసభ ఎన్నో కష్టాలకు పరీక్షలకు గురి అవుతున్న సమయం.ఏన్నో అటుపోటులను శ్రీసభ లోపటి నుండే ఎదుర్కోవలసిన రాజకీయ పరిస్థితులు పాపుగారిని తన వసతిలోనే ఖైధిగా ఉంచిన కష్టకాలలు విశ్వాసం, నైతిక విషయాల్లో పాపుగారిపై తప్పుపట్టలేని సిద్ధాంతాన్ని (Dogma of Infallibility of Pope) శ్రీసభ శత్రువులు తీవ్రంగా వ్యతిరేకించారు. సముద్రంలోని తుఫానులో చిక్కుకున్న నావలా శ్రీసభ

కొట్టుమిట్టాడుతు ఒడ్డుకు చేరుకోలేని సమయంలో పరిశుద్ధాత్మ ప్రేరణ ద్వారా డిసెంబర్ 8న 1870 సం॥లో IX భక్తినాధ పాపుగారు దిసెక్రిడ్ కాంగ్రిగేషన్ ఆఫ్ రైట్స్ ద్వారా క్యూమాడ్మోడమ్ డ్యూస్ పునీత యోసేపు గారిని సార్వత్రిక శ్రీసభ యొక్క పోషకుడిగా మరియు సంరక్షకునికి ప్రకటించారు.

IX భక్తినాధ పాపుగారు ఈ క్లిష్ట సమయంలో ఈ మాటను పలికి ఉన్నారు "సర్వశక్తి మంతుడైన ప్రభువు ప్రజల కోసం ధాన్యాన్ని ఆదా చేయడానికి ఈజిప్టు దేశానికి యాకోబు కుమారుడైన యోసేపును దేవుడు పోషకునిగా నియమించాడు. అలాగే సమయం సంపూర్ణంగా నేరవేరినప్పుడు దేవాది దేవుడు తన ఏకైక కుమారున్ని భూమికి పంపబోతున్న సమయంలో క్రీస్తు ప్రభు కృపావరములను ఆత్మీయ దాహం అనే నిరీక్ష కలలో జీవిస్తున్న ప్రతి ఒక్కరికి పునీత యోసేపుగారు క్రీస్తు ప్రభు యొక్క వరప్రసాదం పంచిపెట్టే ఒక మధ్యవర్తిగా నిలిచారు మరియు క్రీస్తును కాపాడి పాత నిబంధనలో యోసేపులాగా ఒక సుమాతృకగా నిలిచారు. ఈ సిద్ధాంతాన్ని ప్రకటించి ఇది 150వ సంవత్సరం.

## పునీత పాల్ VI పాపుగారు

1969వ సం॥లో మార్చి 27న ఈ పాపుగారు పునీత యోసేపుగారి యొక్క సంరక్షణ అనే లోతైన మర్మాన్ని గ్రహించి పునీత యోసేపుగారు శ్రీసభకు రక్షకుడు అని పిలువడంలో ఏమాత్రం సందేహం లేదని తేటతేల్లం చేశారు. సువార్తలో పునీత యోసేపుగారు ఎక్కువశాతం రక్షకునికే సంరక్షకుడు అనే పాత్రను ఎంతో చక్కగా పోషించారు. క్రీస్తు ప్రభువు కూడా తన పూర్తి స్వేచ్ఛలో తన సంరక్షణని తన సాకుడు తండ్రియైన యోసేపుగారికి అప్పగించారు. అందుకనే తాను తన తల్లిదండ్రులకు విధేయులై జీవించినట్లు సువార్త మనకు బోధిస్తుంది (లూకా 2:51). మరిశ్రీసభ ఈ లోకంలో క్రీస్తుకు వధువుగా నిలుస్తుంది. క్రీస్తు కూడా తన సాకుడు తండ్రియైన యోసేపుగారి సంరక్షణలో ఉంచడానికి ఎంతో ప్రీతి చెందుతారని VI పాల్ పాపుగారు జగద్గురువులు చెప్పియున్నారు.

## పునీత XXIII జాన్ పాపు గారు

ఈ పాపుగారిని పునీత యోసేపు పాపుగారు అని పిలుస్తారు. ఇతడు జగద్గురువుగా ఎన్నుకొనబడినప్పుడు నీవు ఎవరి నామాన్ని తీసుకోదలిచావు అని అడిగినప్పుడు తన మనస్సులో మెదలిన బలమైన ఆలోచన నేను యోసేపు అనే పేరు తీసుకుంటాను అని ఆలోచన కలిగింది. కానీ కొన్ని కారణాల వలన అట్లు చేయట్లే. కాని మార్చి 19న పునీత యోసేపుగారి  పండుగ రోజు జాన్ అనే పేరు స్వీకరించారు. పునీత యోసేపుగారి పట్ల భక్తిని శ్రీసభలో వ్యాప్తి చేయడానికి తన పోన్‌చిపికేట్ అంత కష్టపడి పనిచేసారు. తన 1959వ సం॥ నా క్రీస్తు సందేశంలో పునీత యోసేపుగారు ఒక సంరక్షించే తండ్రి అని చెప్పుతూ, పునీత యోసేపుగారు, ఈ లోకంలో నిత్యతండ్రి నీడగా ఉన్నారని పేర్కొన్నారు. జాన్ పోపుగారు రెండవ వాటికన్ మహాసభకు పిలుపు నిచ్చినపుడు ఈ సభలో మనకు ఒక ఉన్నతమైన పరలోకపు ఆశీర్వాదము మరియు సంరక్షణ కావాలంటే పునీత యోసేపుగారిని మనం శరణు వేడాలి మరియు ఈ మహాసభను సిద్ధం చేయడానికి మరియు నిర్వహించడానికి ఆ దైవశక్తిని మహోన్నతుని సన్నిధి నుండి ఈ భూలోకానికి దించే ప్రార్థన శక్తి ఎవరికి ఉంది. ఇది కేవలం పునీత యోసేపుగారి ప్రార్థన వేడుదల శక్తికే అప్పగించుదాం. నజరేతూ పవిత్ర కుటుంబం యొక్క విశిష్ఠ అధిపతి అయిన యోసేపు సంరక్షకుడు మాత్రమే చేయగల పని. డిసెంబర్ 8, 1962 సరిగ్గా 92 సం॥రాల 9వ భక్తినాధ పాపుగారు పునీత యోసేపుగారిని శ్రీసభకు సంరక్షకునిగా ప్రకటించిన  సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ  పునీత 23వ జాన్ పాపుగారు పునీత యోసేపుగారి  పేరుని దివ్యపూజలో తన భార్యమైన మరియతో తన పేరుని చేర్చి గౌరవించారు.

## పునీత XIII సింహరాయ లియో పాపుగారు

ఈ పాపుగారు యోసేపుగారి పట్ల భక్తిలో పునీత యోసేపుగారి ఉత్తరీయాన్ని (Scaplar) ఆమోదించారు. ఉత్తరీయం సంరక్షణకు చిహ్నం. మరియు పునీత యోసేపుగారి పట్ల భక్తిని పెంపొందించడానికి (Quamquam pluries) క్వామ్

క్వామ్ ప్లూరిస్ అనే విశ్వలేఖను రచించారు. ఈ విశ్వలేఖ 15వ ఆగష్టు 1889 లో శ్రీసభకు అందించారు.

## XI. పదియవ భక్తినాథ పాపుగారు

ఈ జగద్గురువులు పునీత యోసేపు గారి పట్ల భక్తితో, యోసేపుగారి పేరున ఒక దేవాలయాన్ని నిర్మించి ప్రజల భక్తికృత్తం కోసం ఉపయోగించుకోమని ఆదేశించారు.

## XV వ బెనెడిక్ట పాపుగారు

ఈ జగద్గురువులు యోసేపు గారి పట్ల గౌరవంతో విశ్వ శ్రీసభకు పునీత యోసేపుగారి వేడుదల ప్రార్థన పట్టికను అందించారు. మరియు తన సంరక్షణ గుణాన్ని గుర్తించి (Proper preface)లో తన పేరు జోడించి గౌరవించారు.

## XI వ భక్తినాథ పాపుగారు

ఈ జగద్గురువులు పునీత యోసేపుగారిని కమ్యూనిజానికి వ్యతిరేకంగా ప్రత్యేక సంరక్షకుడిగా పేర్కొన్నారు.

## పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు

ఈ పోపు 1989వ సం॥ 15 ఆగష్టులో తన విశ్వలేఖ అయిన రిడెంప్టోరిస్ కస్టోస్‌లో (Redemptoris Custos). పునీత యోసేపుగారిని సంరక్షణ కోరమని ప్రార్థించారు. సరిగ్గా 100వ సం॥రాల క్రితం పునీత పదమూడవ సింహరాయలు పోపుగారు కూడా రెండవ జాన్‌పాల్ జగద్గురువులాగానే అప్పటి పరిస్థితులను మదిలో పెట్టుకొని యావత్తు శ్రీసభ పునీత యోసేపుగారి సంరక్షణ కోరమని ప్రోత్సహించారు. మరియు క్వామ్ క్వామ్ ప్లూరిస్ (Quamquam pluries) అనే విశ్వలేఖలో పునీత యోసేపుగారి యొక్క ఔనత్యాన్ని పొగుడుతు పునీత యోసేపుగారు ఒక ప్రేమించే తండ్రియని మరియు పరలోకపు తండ్రి ప్రేమకు చిహ్నం అని బాలయేసును సంరక్షించే సంరక్షకుడు అని మరియు

పవిత్ర తిరుకుటుంబం యొక్క దైవ సంరక్షకుడు తన ప్రసంగంలో గుర్తుచేసుకుంటున్నారు. మరియు పవిత్రమైన దాతృత్వ బంధం ద్వారా ఏ విధముగానైతే మరియు తల్లికి ఒక భర్తగా ఉన్నారో అదే విధంగా మానవ కుటుంబాన్ని వణికించే ప్రమాదాల నుండి విడిపించే ఆపద్భాందవుడు అని పునీత రెండవ జాన్ పోపుగారు శ్రీసభకు, పునీత యోసేపుగారికి ఉన్న సంబంధం గుర్తు చేస్తు మాట్లాడారు.

## XVI బెనెడిక్ట్ పాపుగారు

మార్చి 19, 2009 క్యామెరిన్ మరియు హంగోలా (ఆఫ్రికా) విశ్వలేఖ రాస్తూ పీఠాధిపతులను, విశ్వాసులను ఉద్దేశించి ఈ విధంగా చెప్పియున్నారు. ఆఫ్రికా సంఘానికి సంరక్షణ ఎంతో అవసరం. పునీత యోసేపుగారు క్రూరుడైన హేరోదు బారి నుండి తన కుమారుడైన బాలయేసు కత్తివాటం పడకుండా సంరక్షించినట్లు ఆఫ్రికా కతోలిక సంఘన్ని కష్టాలనుండి రక్తం చిందించే దానినుండి మరియు మారణహోమాలనుండి పునీత యోసేపుగారు మాత్రమే సంరక్షించే శక్తివంతులై ఉన్నారని తన లేఖలో పేర్కొనియున్నారు.

## ఫ్రాన్సిస్ పాపుగారు

ఈ పోపుగారు తను గురు విద్యాలయంలో ఉన్నప్పటి నుంచే పునీత యోసేపుగారి పట్ల ప్రగాఢమైన విశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. వీరు తన వాటికన్ నివాసంలో తనగదిలో నిద్రిస్తున్న యోసేపుగారి స్వరుపాన్ని ఉంచుకున్నారు. వీరికి ఏదైనా కష్టం అనిపిచ్చినప్పుడు, అసాధ్యం అనిపించినప్పుడు ఈ స్వరూపం క్రింది ఒక చీటిలో తనకు ఉన్న సమస్యను రాసి పెడతారు. వీరు తన మనస్సులో పునీత యోసేపుగారు ఈ సమస్యకు సంబంధించిన పరిష్కారాన్ని కలల రూపంలో కంటారు అని తన మీద నమ్మకంతో వీరు ప్రశాంతంగా నిద్రిస్తారు. పైన విన్నట్లు ఇవన్ని గొప్ప పునీతుల యొక్క మాటలు. వీరు శ్రీసభను సంరక్షించే భాద్యత కల్గిన ప్రథములు అనగా పోపుగార్లు. జగద్గురువులే తమకు మరియు శ్రీసభకు కష్టాలు ఎదుర్కొన్నప్పుడు,

సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు దిక్కు తెలియని పరిస్థితుల్లో పరిశుద్ధాత్మ ప్రేరణ ద్వారా దైవ సహాయం పునీత యోసేపుగారి యొక్క రూపంలో వారు కనుగొన్నారు. కనుగొనడమేకాదు విశ్వశ్రీసభకు ఈ గొప్ప ప్రార్ధన సహాయన్ని అందించారు.

## పునీత యోసేపుగారు తన దర్శనాల ద్వారా శ్రీసభను సంరక్షించుట నాక్ వద్ద దర్శనం (1879)

నాక్ ఐర్లాండ్ దేశానికి చెందిన ఒక మారుమూల గ్రామం. ఐర్లాండ్ దేశంలో శ్రీసభ ఎన్నో కష్టాలను పరీక్షలను ఎదురుకుంటున్న సమయం. సంవత్సరాల తరబడి విశ్వాసులు, దైవాంకితులు మరియు పీఠాధిపతులు దైవ సహాయం కోసం మరియు తన సంరక్షణ కోసం ఎండిన నేల వర్షపు బిందువుల కోసం ఎదురుచూస్తున్నట్లు, ప్రభు సహాయం కోసం ఐర్లాండ్ శ్రీసభ ఎదురు చూస్తున్న సమయం. (యెషయా 41:10) చెప్పినట్లుగా "భయపడవలదు నేను మీతో ఉన్నాను. ఎందుకన! నేను మీ దేవుడను నేను నిన్ను బలపరచువాడను. నేను నీకు సహాయం చేసేదను. నా విజయవంతమైన కుడి చేతితో నిన్ను ఆదరిస్తాను. ఈ వాగ్ధానం ప్రకారం ప్రభుయొక్క దయ, ప్రపంచం పట్ల ముఖ్యంగా ఐర్లాండ్ దేశ కతోలికుల పట్ల ఎంతగానో కురిసింది. అది 21 ఆగష్టు 1879న జరిగింది. అప్పటికే సాయం సమయం అయింది. ప్రజల జీవితంలో చీకటి కమ్ముకుంది. ఎక్కడ చూసిన నిశ్శబ్ధం. సరిగ్గా ఈ సమయంలోనే చినుకులు కురుస్తున్న సమయంమునా ఆ గ్రామానికి చెందిన మేరిటెరిస్ మరియు గురువు ఇంటి కాపరి మేరి మెక్‌లాగ్లిన్‌లో కలసి ఇంటికి వెళ్తున్న సమయంలో చర్చిని సమీపించగానే ఒక అద్భుతమైన వెలుతురులో చీకటిలను పారద్రోలే కాంతిలో ముగ్గురు వ్యక్తులు సజీవ శిలల్లాగా ఉండుట వీరు చూసారు. చూసిన దర్శనాన్ని పరిగెత్తుకొని పోయి మేరి తన తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే గ్రామంలోని వ్యక్తులు ఆ చర్చి వద్ద సమావేశం అయ్యారు. వారు మరియతల్లిని పునీత యోసేపుగారిని మరియు సువార్తికుడై పునీత యోహానుగారిని చూసినట్లు తమ సాక్షాన్ని చెప్పారు. మరియతల్లి పునీత

యోహానుగార్లకు కొంచెం ఎడమవైపున ఒక బలిపీఠం ఉందని దర్శనం చూసిన వారు చెప్పారు. ఈ బలిపీఠం మీద దేవదూతలు ఒక గొర్రె పిల్లను మరియు స్లీవను ఆరాధించడం జరిగింది. ఈ దర్శనం మూడు గంటల పాటు కొనసాగింది. మరియతల్లి ఈ దర్శనంలో ఎంతో సుందరమైన కన్యకగా కనిపించింది తను భూమినుండి కొన్ని అడుగులు పైకి నిలుచోని ఉండి మరియు తెల్లని వస్త్రములను ధరించినట్లు ప్రజలు చూసారు. తాను బలిపీఠం వద్ద ఉన్న గొర్రె పిల్లను మరియు ఆ స్లీవను చూస్తూ ప్రార్థనలో మంత్రముగ్ధురాలైనట్లు అదే పనిగా తన కన్నులను గొర్రెపిల్లవద్ద నుండి తప్పకోజాలనంతగా ఆరాధించడం మొదలు పెట్టింది.

పునీత యోసేపుగారు తెల్లని వస్త్రాలు ధరించి మరియతల్లి కుడిభుజం వైపున కొంచెం వంగి తాను కూడా ఆ మహోన్నత బలిపీఠం వైపు చూచుచున్నట్లు మరియు ప్రార్థిస్తున్నట్లు అలాగే నిల్చుని ఉండిపోయారు. సువార్తీకుడై పునీత యోహానుగారు మరియతల్లి ఎడమవైన నిల్చుని ఉన్నారు. తాను పొడవాటి దవళ వస్త్రాలను ధరించి పీఠాధిపతులు ధరించే మైటర్‌ను ధరించినవాడై గొర్రె పిల్లవైపు అలాగునే చూస్తూ చేతులు జోడించి ప్రాధేయ పడుతున్నట్లు కనిపించాడు. ఈ దర్శనం అంతట తల్లి మరియ, పునీత యోసేపుగారు మరియు పునీత యోహాను గారు ఒక్క మాటకూడా మాట్లాడలేదు. దివ్యదర్శనం మొత్తం మౌనంగా, నిశ్శబ్ధంలో ప్రార్థన వాతావరణంలో లోతైన ప్రభు ఆరాధనలోనే జరిగింది. ఈ దర్శనంలో పునీత యోసేపుగారు ప్రార్థన పద్ధతిలో చేతులు జోడించి ప్రభుక్రీస్తు వైపే మౌనంగా విన్నవిస్తున్నట్లు కనిపించింది. పునీత యోసేపుగారు సువార్తలోనేకాక, ఇక్కడ కూడా ఒక మౌన మునిగా, ప్రార్థించే మునిలా కనిపించారు. ఐర్లాండ్ దేశమునకు చెందిన కపూచిన్ ఫాదర్ హబెర్ట్ పునీత యోసేపుగారి గురించి ఈ విధంగా వర్ణిస్తున్నారు. పునీత యోసేపుగారు క్లిష్ట సమయాల్లో నజరేతు కుటుంబం ఎదుర్కునే ఘోరమైన పరిస్థితుల నుండి తన కుటుంబాన్ని ముఖ్యంగా బాలయేసును ఐగుప్తుకు తరలించుకొని వెళ్ళే సమయంలో ఎంతో కష్టాలు అవలీంగా మౌనంతో దైవంపైనే భారంవేస్తూ ముందుకు సాగారో, అదేవిధంగా ఇక్కడ కూడ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న

ఐర్లాండ్ కతోలికులను మీరు మౌనంలో నిశ్శబ్ధంలో క్లిష్ట సమయంలో దైవ చిత్తాన్ని వెదకండి. ప్రభువు మిమ్ములను చూస్తునే ఉన్నాడు. అతడు మిమ్ములను పరిక్షిస్తాడే తప్ప శోధింపడు మరియు తన హస్త బలంతో మిమ్ములను రక్షిస్తాడు అనే భావం కలిగినట్లు పునీత యోసేపుగారు నిల్చొని ఉన్నట్లు వారు వివరించారు.

## ఫాతిమా నగరిలో పునీత యోసేపుగారి దర్శనం (1917)

అది మొదటి ప్రపంచం యుద్ధం జరుగుతున్న సమయం. శాంతికోసం మరియు తండ్రి హృదయం కలిగిన నాయకుని కోసం ప్రజలు తల్లడిల్లుతున్న సమయం. మారణహోమం నుండి జనులు తప్పించుకోవడానికి తలదాచుకోలేని పరిస్థతుల్లో ఉన్న సమయం. భూమి మీద రక్తం నదిలా ప్రవహించింది. మృత దేహాలు కుప్పలు కుప్పలుగా పడిపోయి ఉన్నాయి. రాజకీయ నాయకుల కఠినత్వంలో సాధారణ ప్రజలను సైన్యంలో చేరమని భయపెడుతున్న సమయం. ప్రజలు వారిని ఈ సాధక భాదల నుండి రక్షించమని పరలోక తండ్రికి ప్రార్థిస్తున్న సమయం. ఈ సమయంలోనే పోర్చుగల్ దేశంలో ఫాతిమా అనే చిన్న గ్రామంలో దేవుని కృప వెల్లడైయింది. 1917 సం॥ మే 13న తల్లి మరియ, గొర్రెల కాపరులు అయిన లూసి. జేసింత, ఫ్రాన్సిస్‌లకు దర్శనం ఇచ్చింది. అక్టోబర్ 13న 1917సం॥లో తల్లి మరియ తన చివరి దర్శనాన్ని ఇచ్చింది. అంత ముగిసిపోయింది (అనే సమయంలో పునీత యోసేపుగారు బాలయేసును చేతిలో ఎత్తుకొని ఎర్రటి దివళ వస్త్రాలు ధరించి లూసి, జేసింత, ప్రాన్సిస్‌లకు కనిపించారు. పునీత యోసేపుగారు అక్కడ గుమికూడిన 30,000 మంది దైవభక్తులను చూసి ఎంతో ప్రేమతో వారిపై మూడుసార్లు స్లీవ గుర్తుతో తను ఆశీర్వాదాన్ని అందించారు. మరియు తల్లిమరియ సిస్టర్ లూసిగారితో ఈ విధంగా అంటున్నారు. మీరు పునీత యోసేపు గారి హృదయం పట్ల భక్తి కలిగి ఉండండి. ఆయన బలమైన ప్రార్ధన వేడుదల శక్తి చేత మిరు అధికమైన కృపాదారలను సంపాదించుకుంటారు అని చివరిమాటలు పలికి అదృశ్యులైయ్యారు).

## బ్రెజిల్‌లో పునీత యోసేపుగారి దర్శనం (1994)

1994 వ సం॥లో మానేస్ అనే గ్రామంలో, 22 సంవత్సరాల ఎడ్సన్ గ్లాబెర్‌కు తల్లి మరియ. బాలయేసు మరియు పునీత యోసేపుగారు దర్శనమిచ్చారు. ఇతను పానోపాలోకు 650 మైళ్ళ దూరంలో మరియు రిమోడిజనీరో నుండి 880 మైళ్ళు దూరంలో ఉన్న తన స్వస్థలమైన ఇటపెరున (Itaperuna) తిరిగి వెళ్తునప్పుడు ఈ దర్శనం కలిగింది. ఎడ్వర్డ్ తల్లి డోకార్మో కూడా ఈ దర్శనమును చూసింది. అప్పటి పీఠాధిపతుల ఈ దర్శనాలకు తమ ఆమోదం తెలిపి ఇక్కడ ఒక దేవాలయాన్ని కట్టించారు. ఇచ్చట మరియతల్లి జపమాల రాణి మరియు, సమాధాన రాణిగా ప్రత్యక్షమైంది. ఫాతిమాలో మాదిరిగానే ఇక్కడ కూడా మరియతల్లి పాపంలో చిక్కుకున్న ప్రపంచాన్ని దేవుడు రక్షించాలంటే జపమాలను జపించండి. హృదయ పరివర్తన చెందండి. మరియు తపో ప్రార్థనతో కలిగిన జీవితాన్ని జీవించమని కోరింది. మార్చి 1న 1989లో పునీత యోసేపుగారు తమ ప్రధాన దర్శనాన్ని కలిగించారు. పునీత యోసేపుగారు ఎడ్వర్డ్ ఈ విధంగా అంటూ దేవుని యొక్క రక్షణను మీరు పొందాలంటే, నా పవిత్రమైన హృదయం పట్ల భక్తిని పెంపొందించు కోమని పిలుపునిచ్చారు. ఈ విధంగా చెప్తూతూ నా ప్రియమైన కుమారుడా, దేవాది దేవుడు నన్ను ఈ లోకమునకు అవసరమైన కృపావరములను మీరు నా ద్వారా పొందాలని బాలయేసు మరియు కన్యకయైన మరియతల్లి వారికి దేవాది దేవుడు ఎన్నో కృపావరాలను ఇచ్చి మిమ్ము రక్షించునని ఆయనకోరిక.

చివరిగా ఈ మూడు దర్శనాలలో శ్రీసభ క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు దైవకృపావరాల కోసం జనులు కోరుకుంటున్న సమయంలో పునీత యోసేపుగారు తనదైన శైలిలో మనకు దేవుని అనుగ్రహాలని సంపాదించే తండ్రిగా, తనను తాను విశదం చేసుకున్నారు.

**ముగింపు**

యోసేపు అనగా ప్రభువు సమకూరుస్తాడు మరియు ప్రభువు పెంపొందిస్తాడు అని అర్థం. పునీత యోసేపుగారు సువార్తలో పేర్కొన్నట్లే నిశ్శబ్ధంలో జీవించే వ్యక్తి. ఆయన నిశ్శబ్ధంలో ఆయన స్వరాన్ని ఆలకించే పనిలో నిరంతరం నిమగ్నుడైయున్నాడు. ఆయన తన కుటుంబ సంరక్షణ గురించి కలలు కంటూవున్నాడు. తన కుటుంబ జీవితంలో తాను ఒక పోషకునిగా, సంరక్షకునిగా తన పాత్రను పోషించారు. పునీత యోసేపుగారి పట్ల భక్తికృత్యం శ్రీసభలో అచంచలంగా పెరుగుతూనే వచ్చింది. అనేకమంది పునీతులు పోపుగార్లు, వీరి శరణువేడారు. పునీత తోమాసు అక్వినస్‌గారు ఈ విధంగా అంటారు, “మన పవిత్ర పోషకుడు, పాలకుడైన పునీత యోసేపు గారు, ప్రతి, సందర్భంలో అన్ని అవసరాలల్లో సహాయం చేయగల శక్తి కలిగి ఉన్నారు.” మహామ్మారి అయిన కోవిడ్-19 సమయంలో ఫ్రాన్సిస్ పాపుగారు (Patris Corde) తండ్రి హృదయంతో అనే విశ్వలేఖ ద్వారా ప్రపంచానికి యోసేపుగారిని ఒక ఆదర్శ ముర్తిగా ఇచ్చారు. అంతేకాక వీరు ఈ మహామ్మారి నుండి మనలను రక్షిస్తాడని దృఢమైన ఆశాభావాన్ని వ్యక్తపరిచాడు. డిసెంబర్ 8,2020 నుండి డిసెంబర్ 8, 2021 వరకు పునీత యోసేపు గారి సంవత్సరంగా ఫ్రాన్సిస్ పోపుగారు ప్రకటించారు. యోసేపు గారు క్లిష్ట పరిస్థితులో తమ కుటుంబాన్ని రక్షించినట్లే ప్రతి నాయకుడు తన ప్రజలను తండ్రి హృదయంతో పరిపాలించి సంరక్షించాలి అని చెప్పియున్నారు. లోకరక్షకునికై సంరక్షకులుగా నిలచిన పునీత యోసేపుగారు అన్ని వేళలా మనలను కూడా సంరక్షిస్తాడు అనే ధృడ నమ్మకంతో అతని పట్ల భయభక్తులు కలిగి జీవించుదాం.

# 9. తిరుకుటుంబ పోషకుడు - పునీత యోసేపుగారు

**- బ్రదర్ కసుకుర్తి జోసఫ్ తంబి**



## ఉపోద్ఘాతం

పునీత యోసేపుగారు పరిశుద్ధ మరియకు సంరక్షక భర్తగా ఉండి తన కర్తవ్యాన్ని నేరవేర్చారు. బాల యేసుకు (సాకుడు) తండ్రిగా తన భాధ్యతను నెరవేర్చారు ఎల్లప్పుడు బాలయేసును క్రమశిక్షణలో, దైవభక్తిలో పెంచారు. యాజమానిగా ఉంటూ తన వడ్రంగి వృత్తి ద్వారా కుటుంబాన్ని పోషించారు. కుటుంబానికి కావలిగా ఉంటూ దూత చెప్పిన మాటలను విధేయించి, నడడిచిన గొప్ప ఆదర్శమూర్తి పునీత యోసేపుగారు. గొప్ప విశ్వాసం, విరక్తత్వం, విధేయత, శ్రామికజీవితం, బాధ్యతపాలన, వివేకం, వివేచనం, మితవ్యయం, మితభాషితం, అమాయకత్వం, తనను తాను తగ్గించుకోవటం దయ, ధానధర్మము, దీక్కు లేని వారిని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, నిగర్వం, నిశ్చలత, నిరాడంబరత్వం ఇలా మంచి గుణాలన్నీ పుణికి పుచ్చుకున్న మహామనిషి. కార్మిక ప్రజాతరగతికి చెందిన యోసేపుగారు పేదరికపు భారాన్ని మోస్తూ జీవితాంతం వరకు శ్రమించి, మొద్దు కష్టం చేసి తిరుకుటుంబ పోషకులుగా నిలిచారు. అందుకే అను నిత్యం తమ భాధ్యతల్ని నిర్వర్తిస్తూ, శరీరకష్టంతో చేమటోడ్చి ఆహారాన్ని సంపాదించే వారికి యోసేపు ఆదర్శంగా ఉన్నారు.

## యోసేపు : తిరుకుటుంబ యజమానులకు పాలిక పునీతులు

కతోలిక సంప్రదాయంలో కుటుంబాలకు ఆదర్శం తిరుకుటుంబం. తిరుకుటుంబంలో యోసేపుగారికి ప్రత్యేక స్థానముంది. ఆయున

తిరుకుటుంబానికి పోషకుడు. పరస్పరం ప్రేమించుకోవడం, పరస్పరం స్వీయా కానుక గావించుకోవడం, దేవుడు చిత్తాన్ని నెరవేర్చడానికి పరిపూర్ణంగా కంకణ బద్దులు కావడంలో తిరుకుటుంబం తప్ప మరి ఏ తిరుకుటుంబం సాటిరాదు. సాధారణ కుటుంబాలు మాత్రమే కాదు, కుటుంబ వాతావరణం గల మతసంఘాలకు, నాయకులకు, అధిపతులకు యోసేపు ప్రేరణాత్మక ఆదర్శం. కుటుంబ పాలకుడుగా, యేసు మరియల సేవలో, యోసేపు తరించారు. వారి సేవకు పూర్తిగా అంకితమయ్యారు. వినయం ఆయన భూషణం, తను గూర్చి తన పరపతి గూర్చి, తన ఘనతను గూర్చి, స్థాయిని గూర్చి అధికారం గూర్చి ఆలోచించలేదు. యేసు మరియలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రాకులాడలేదు. వాటి పట్ల దేవుని చిత్తాన్ని ఆచరించడానికి వారికి స్వేచ్ఛ నిచ్చారు. వీరు దేవుని చిత్తాన్ని పాటించ ప్రయత్నించి నప్పుడు వారికి దన్నుగా వారి ప్రక్కనే నిలిచాడు. ఆయన గురి దేవుని పైన ఉండేది. మరియ జీవితంలో దేవుడు చేస్తున్న విషయ వివరాలను పూసగుచ్చినట్లు ఆమె వివరించలేదు, యోసేపు వాటిని గ్రహించగలిగాడు. దేవుని చిత్తాన్ని ప్రేమించాడు, తన చిత్తాన్ని పరిత్యజించాడు. తన కలలో కూడా దేవున్ని మాత్రమే ఆలకించడానికి సిద్ధమయ్యాడు, దేవుని పథకంతో నిరతం ఏకీభవించాడు. ప్రభువు చనిపోయే సమయానికి యోసేపు ప్రాణాలతో బ్రతికివుంటే మరియతో పాటు సిలువ క్రింద నిలిచి ఉండేవారు. తిరుకుటుంబానికి పోషకునిగా, సంరక్షకునిగా ఆదరువుగా నిలిచాడు. దేవుని పథకాలను విజయవంతం చేయడానికి తిరుకుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుని ముందుండి నడిపిస్తాడన్న నమ్మకంతో ఆయనను విశ్వవ్యాప్తి శ్రీసభ పాలకునిగా తలంచి ప్రార్థించారు. ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు కూడా 1989లో "రెడంప్తోరిస్ కుస్తోస్" రక్షకుని సంరక్షుకులు అను అపోస్తొలిక లేఖను క్రీస్తు శ్రీసభల జీవితంలో, పునీత యోసేపుని జీవిత ఆదర్శంగా తీసుకొని వ్రాసారు. ఆధునిక మానవాళికి యోసేపుని కుటుంబం చక్కని ఆదర్శం. నజరేతు తిరుకుటుంబ సభ్యులు వ్యక్తిగతంగా వారివారి పిలుపులకు సార్థకత చేకూర్చారు. తల్లిగా మరియ, తండ్రిగా యోసేపు బాలుడైన యేసుని ప్రేమించారు. బాలయేసు

వారికి విధేయుడై జ్ఞానంలోను ప్రాయంలోను పెరిగాడు. యోసేపు తల్లి, బిడ్డల క్షేమానికి శ్రమించాడు. త్యాగాలు చేశాడు. దాంపత్యబంధ పవిత్రతను కనబరిచాడు మరియ బాలయేసుల క్షేమానికి, ఆనందానికి శ్రమించాడు. సంతోషంతో సేవలందించాడు, దేవుని నుండి స్వీకరించిన జీవన కానుకలు ఇతరుల సేవలో వెచ్చించాడు. మరియు యేసులకు కానుకగా సమర్పించుకున్నాడు. దాంపత్యబంధాలు కుటుంబ బంధాలు పలచబడిపోయిన నేటి రోజులలో, 'యోసేపుని కుటుంబ పాలన' ఎంతో స్ఫూర్తి దాయకం.

## నజరేతుకు – తిరుగు ప్రయాణం

ఒక రోజు ఉదయాన యోసేపుగారు బయలుదేరి యెరుషలేము వెళ్ళాలనుకుని భగవంతుడా నేను ప్రయాణమై పోవుచున్నాను, నా ప్రయాణంలో తోడుగా ఉండు అని ప్రార్థించాడు. నన్ను చేయివిడువవద్దు, నీ ఆశ్వీరాదములు, రక్షణ నాకెప్పుడు కావాలని ప్రార్థించాడు. తండ్రి నీ అశీర్వాదము నాపై నిండుగ వుండాలని మరియు నా రాకపోకలయందు నన్ను నీకు అర్పించుకుంటున్నాను అని దేవునితో సంభాషించి, సంతోషంతో లేచి, దేవుడు నిండుగ తోడు వున్నాడని విశ్వసించి తన ప్రయాణం సాగించారు. ఇలాగే ఉదయాన్నే బయలుదేరి ఎవరి కంట పడకుండ త్వరగా యెరుషలేము దేవాలయం చేరుకోవాలని మరియు అక్కడ దేవుని సన్నిధిలో గడపాలని, దేవుని చిత్తప్రకారం అన్ని జరగాలని ప్రార్థించారు. యోసేపుగారు ఊరు వదలి వెళ్ళిపోయారని నజరేతు నగరం అంతటా తెలిసిపోయింది. కొంతమంది సంతోషించారు ఎందుకంటే యోసేపుగారు ఆస్తులను వారు మోసపూరితంగా స్వాధీనం చేసుకొని, వారు ఆనందంగా గడపవచ్చు అని తలంచారు. ఇవన్ని తెలిసి యోసేపుగారు దేవునిపై భారం వేసి శాంతముగా నుండ ప్రయత్నించాడు. యెరూషలేము చేరిన వెంటనే యోసేపుగారు దేవాలయానికి వెళ్ళి ప్రార్థనలోను, స్తుతి ఆరాధనలలోను తన సమయం గడిపాడు. దేవుని ఆశీర్వాదములు పొంది సంతోషముతో ఆ రాత్రి గడపటానికి స్థలం వెదుకుటకు బయలుదేరాడు. ఆ సమయంలో దేవుడు ఆ రాత్రి దర్శనమిచ్చి ఇంతకుముందు చెప్పినట్లుగానే, తనవద్ద వున్న సొమ్మును

మూడు వంతులు మందిరములో ఇవ్వమని మరియు ఒక్క భాగం తన స్వంత అవసరాలకు మరియు పేదసాదలకు వినియోగించమని వివరించారు. ఉదయాన్నే నిదురనుండి లేచిన తర్వాత త్వరత్వరగా నడచి యెరూషలేము దేవాలయమునకు వెళ్ళి అక్కడ దేవుడికి వందనాలు అర్పించి తరువాత తన జీవిత పరమార్థమును వివరించినందులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఇలా యోసేపుగారు తన వద్ద వున్న ధనాన్ని కొంచెం పేదలకు పంచి, కొద్దిగా తనకై ఉంచుకున్నారు. ఒక్కరోజు తనకు ఎవరైన వడ్రంగి పని నేర్పిస్తారేమోనని వెదకటం అరంభించాడు. వెంటనే ఆ పని తెలిపిన ఒక్క వ్యక్తి వద్ద యోసేపు పని నేర్చుకుని ప్రతిభావంతుడయ్యారు. తన పనితోపాటు అనుదినం ప్రార్థనలు కొనసాగిస్తూ, తనకు విద్య నేర్పించిన వ్యక్తికి ఎంతో కృతజ్ఞతగా వున్నారు. అది చూచిన ఆ వ్యక్తి యోసేపుగారిని ఎంతోగానే ప్రేమించారు. యోసేపు ఎంతో వినయ విధేయలతో మెలుగుతూ అందరి మన్ననలను పొందుతూ వచ్చారు. యోసేపు నీతి ధర్మాలతో జీవితం సాగించడం చూచి తనకు విద్య నేర్పిన వ్యక్తి ఇలా అడిగాడు యోసేపుగారిని, “నీవే పేదరికములో ఉన్నావు, మరి నీకున్న కొద్ది ధనముతో ఇతరుల కష్టంలోను, పేదరికములోను సహాయం చేస్తున్నావు. నీ పరిస్థితి ఏమిటి?” అప్పుడు యోసేపుగారు “నీకున్న దానిలో నుండి సహాయం చెయ్యి. నీకు నీ అవసరంలో దేవుడు సహాయపడతాడు” అని పలికాడు. అది విన్న వ్యక్తి ఎంతో ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని వ్యక్తిపరిచాడు. ఇలాంటి పుణ్యకార్యములు దేవునికి ఎంతో ఇష్టమైనవని తన దేవదూత తనకు వెల్లడి చేశారు. వడ్రంగి పనిలో సామర్థ్యాన్ని సాధించే సరికి యోసేపుకు ఇరవై సంవత్సరాలు నిండాయి. తన పనితనంతో పాటు దైవ భయంలోను, భక్తిలోను దినదినాభివృద్ధి చెందాడు. మరియు మరణావస్థలో ప్రక్క వారికై ప్రార్థించడం, సహాయం చేయడంలో ఎంతో ఆనందాన్ని పొందేవాడు. ఒకసారి తన గురువుగారు అస్వస్థతకు గురయ్యారు. యోసేపు ఆయన దగ్గర వుండి తన సొంత తండ్రికి చేసినట్లు సేవలు చేసేవారు. ఆయన మంచి మరణం పొందేలాగ ప్రార్థించాడు. యోసేపుగారి ప్రార్థన దేవుడు ఆలకించాడు. దేవదూత చెప్పిన ప్రకారము యోసేపు ఎంతోగానో నిరాడంబర జీవితం జీవింప నిశ్చయించు

కున్నాడు. అంతేకాక తన పనికి అవసరమైన పని ముట్లతోనే పనిచేసుకుంటూ జీవనం సాగించాడు. దేవదూత తనకు వెల్లడి చేసిన విషయాలకై దేవునికి కృతజ్ఞతలు తెలిపాడు.

## వడ్రంగి పనిలో యోసేపు దీవెనలు

యోసేపుగారు కృతజ్ఞతలు తెలుపుతూ దేవుని చిత్తానికి బద్ధుడై జీవింపసాగాడు. ఇలా తన అనుదిన జీవితాన్ని కష్టపడి పనిచేయుటంలోను మరియు దేవుని స్తుతించి ఆరాధించండంలోను ఎంతో ఆశక్తి, శ్రద్ధ చూపించాడు. పేదరికములోను, నిబద్ధతలోను జీవింప ప్రారంభించాడు. తనతో పాటు పనిచేసేవారు. అనవసర మాటలలో ఎంతోమంది జీవిస్తూ ఈ లోక వ్యసనాలకు లోబడ్డారు. కానీ యోసేపుగారు మాత్రం ఈ విషయమై వారితో జతపడక దూరంగా ఉంటూ దేవునికి దగ్గరగా జీవించాడు. యోసేపు తోటివారు, ఆయనను ఓ అమాయకుడిగాను మరియు బుద్ధిహీనునిగాను పరిగణించి ఎంతో అవమానించేవారు. ఎంతో మంది పనికై యోసేపు దగ్గరకు వచ్చేవారు. ఆ పనికి సరిపడ వేతనమును మాత్రమే స్వీకరించేవాడు. దేవుడు తనకు చేస్తున్న మేలులకూ దేవాలయమునకెళ్ళి వందన సమర్పణ గావించేవాడు. ఆయన పనితనమును గుర్తించి ఎంతో మంది ఆయన వద్దకు వచ్చేవారు. ఇదంతా దేవుని సహకారంతోనే జరుగుతుందని విశ్వసించి ఎంతో కృతజ్ఞతగా వుండేవాడు. సమయం దొరికినప్పుడు మోకరించి ప్రార్థించడమే తనలోని తగ్గింపుతనమును, దైవభక్తిని తెలియజేస్తుంది. ఒక్కోసారి ఇలా ప్రార్థించేవాడు 'ప్రభు నేను నీ సొంతం, నీ నుండి నన్ను ఎవరు వేరుచేయలేరు. నీవు తప్ప నా సొంతం ఏమిలేదు. నీవే సర్వస్వం. నీ నుండి మాత్రమే నాకు సహాయం లభించును. నిన్ను తప్ప నేను దేనిని ఆశించను, ఈ లోకంలో అన్ని వ్యర్థమని ప్రతీదాన్ని నేను త్యజించుచున్నాను. నీకు సేవచేయటానికి, నేను కష్టబాధలను సహింప సిద్ధంగా వున్నానని, ఎంతో వినయపూర్వకంగా భగవంతుని ముందు సాగిలపడి ప్రార్థించేవాడు. ఓ సారి దూత మరియ గురించి ఆమె కన్యత్వాన్ని, ప్రేమను గురించి భగవంతునికి అర్పించుకున్న విషయాలు యోసేపుగారికి

వివరించారు. అలాగే మరియకు కూడ యోసేపుగారు గురించి వివరించింది. మరియలోని ఈ నిర్మలత్వాన్ని దేవునికి అర్పింప నిశ్చయించి జీవింపసాగాడు. కన్యత్వం స్వీకరించి దేవుని ముందు పవిత్రులుగాను నిలబడ్డారు. యెరూషలేము మందిరమునకు వెళ్ళి దేవుడు తనకు విశదపరచిన రహస్య సత్యాలన్నింటికి కృతజ్ఞతలు తెలిపాడు. దేవుడు యోసేపుగారిలో కపటంలేని మనస్తత్వాన్ని చూచి ఎంతో ఆనందించి, ఆయన సహోకారం తోడు ఎప్పడు ఉంటుందని ఆశీర్వదించారు. యోసేపుగారు దేవుని ముందు చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉంటానని వాగ్ధానం చేసుకున్నాడు. దేవుడు యోసేపుగారిని ఎంతగానో ఆశీర్వదించారు. ఇలా తను ఈ ఆనందంలో ఉన్నప్పుడు ఒక రాత్రి దూత కలలో కనిపించి, యేసయ్య రాక కన్య మరియ ప్రార్థనల ద్వార తథ్యమని వివరించాడు, కన్యమరియలాగ యోసేపుగారు కూడ సంసిద్ధుడవుకమ్మని తెలియజేయపడింది. అది విని యోసేపుగారు వెంటనే మోకరించి ఇంకా ఎక్కువ వినయముతో ప్రార్థింపసాగాడు. ఈ విధంగా రాబోయే లోకరక్షకుని గురించి కలలు కనటం ప్రారంభించాడు. మరియు ప్రార్థన ద్వారా దేవుని రాక ఈ భువి పైకి రావాలని ఆశించేవాడు. రక్షకుని రాక అనే వార్త యోసేపుగారికి ఎంతో ప్రమోదాన్ని కలుగజేసింది. అందుకని తను ఒక దేవదూత లాగ అనుక్షణం దేవునికి స్తుతులు అర్పిస్తూ దేవుని ప్రేమలో మునిగిపోయారు. తాను చేసే ప్రతి పనిద్వారా దేవున్ని స్తుతింప నిశ్చయించుకున్నాడు. దేవుడు తన జీవితములో ఎన్నో విషయాలు తనకు తెలియజేశాడని, మరియు మెస్సయ రాక గురించి విన్న తరువాత ఆ సంతోషములో తిండికూడ మరిచిపోయి సంతృప్తిని పొందే వాడు, అలా ఆ ఆనందములో ఇలా చెప్పేవాడు. "ఓ భగవంతుడా నీ అనంత ప్రేమ, నీవు తెలియజేసిన ఈ రహస్యాలకు నేనే పాటివాడిని. నీ అనుగ్రహాలకు నన్ను ప్రాప్తున్ని చేస్తున్నావని ఎంతో కృతజ్ఞతా భావముతో చెప్పేవాడు. నీ మంచి తనమునకు నేనేమిచ్చి నీ రుణంను తీర్చుకోగలను" అని వాపోయేవాడు. యోసేపుగారు దేవుని కోసం ఏమి చేయటానికైన వెనకాడలేదు. దూత ఇలా చెప్పింది, 'సమయం దగ్గరలోనే ఉంది, తన మనస్సులోని కలలన్నీ నెరవేరతాయి, కృషి చేయమని చెప్పింది,

ఈ వార్త విని యోసేపు ఎంతో ఆనందంతో పరవశించాడు. ఆ సమయం కోసం యోసేపుగారు ఎంతో ఎదురుచూస్తూ దేవునికి ప్రీతిగా జీవించడం ప్రారంభించాడు.

## తిరుకుటుంబం - దేవాలయ దర్శనం

యేసు మరియు యోసేపుగారు యెరూషలేము దేవాలయములో ప్రవేశించగానే, ప్రయాణికులు నేరుగా యెరూషలేము దేవాలయములోకి ప్రవేశించారు. మరికొందరు దివ్యబాలుని అందం, మరియ తల్లిని చూచి ఆనందించారు. ప్రయాణబడలికతో ఆకలి, దాహంతో అలసిపోయారు. కాని ఒక్కరైనా వారి అవసరంలో ఆదుకోవడానికి ముందుకురాలేదు. ఆ సమయంలో భగవంతుడు యోసేపుగారికి తన ప్రణాళికలు, రహస్యాలను వివరించాడు. యోసేపు అన్నీ అర్థంచేసుకొని వినయంతో అంగీకరించాడు. దేవాలయంలో మోకరించి తల నేలపై వంచి, స్తుతి ఆరాధన సల్పాడు. వారు యెరూషలేము దేవాలయం వదిలి వెళ్ళేటపుడు యోసేపుగారు దేవుడు చేసిన గొప్ప కార్యాలకుగాను వందనాలు అర్పిస్తూ, దారిలో ఇతరులు గమనించకుండా మోకరించి, ప్రార్థన చేస్తూ బాలయేసు పాదాలపైపడి, నాకు ఇంతటి అనుగ్రహం దయచేసినందులకు తండ్రి దేవునికి వందనములు చెప్పమని యోసేపుగారు యేసును అడిగారు.

యోసేపుగారిలోనే ఇంత ప్రేమ, నిగ్రహం దైవభయం ఉంటే మరి పవిత్రాత్మ పూరితురాలైన మరియలో ఇంకెన్ని సుగుణాలు ఉన్నాయో ఎవరు వర్ణింపగలరు, అని యేసు నా తల్లిలోనే నీ ఆదరణ, ఆమే నీ ఆదర్శమని' తెలియజేసారు. అలాగే సాకుడు తండ్రియైన యోసేపు కూడ ఈ గొప్ప సుగుణాల నిధి. ఈ ఇద్దరిని దీవించి, జన్మనిచ్చిన తల్లిగ, సాకుడు తండ్రిగ ప్రసాదించాడని వందనాలు చెల్లించాడు. తండ్రి దేవునికి యోసేపుగారికి వసతి గృహాన్ని ఆ ప్రాంతంలోనే వెదకి అన్ని సమకూర్చుడు. అంతేగాక వారికి ఆహారం, కొన్ని కూరగాయలు సమకూర్చాడు. భుజించాక ఆ రాత్రంత వారు ప్రార్థనలో గడిపారు. చాలా తక్కువ సమయం విశ్రాంతి తీసుకున్నారు. ఆ తరువాత

రోజు ఉదయాన్నే వారు ప్రార్థనకై యెరూషలేము దేవాలయమునకు బయలుదేరారు. యోసేపు మరోకసారి దేవుడు చేసిన గొప్ప మేలులన్ని గుర్తుకు తెచ్చుకొని దేవుని స్తుతించారు. మరియు తనకు మరియతో జరిగిన వివాహాన్ని దేవుని ప్రణాళికను బట్టి స్తుతించాడు. యోసేపుగారికి ప్రవక్త సిమియోను ప్రవచనాలు గుర్తుకువచ్చాయి. తల్లి, మరియ, హృదయంలో ఓ ఖడ్గము దూసుకవెళ్ళుతుందని గుర్తుకు వచ్చి యోసేపు ఎంతో బాధపడ్డాడు. జరుగబోయేవన్ని అలోచిస్తున్న యోసేపు కన్నీరు ఆగలేదు. వారి ప్రార్థనలు ముగిశాక యెరూషలేము దేవాలయ ప్రాంగణం వదలి బెత్లెహేమునకు బయలుదేరారు. యోసేపు దివ్యబాలుని జన్మస్థలం ధర్శించ బోతున్నానని ఎంతో సంతోషంతో వడివడిగా నడువ ప్రారంభించారు. యోసేపు తన జీవితంలో దేవుడు చేసిన మేలులన్ని గుర్తుకుతెచ్చుకుని, యేసు బాలునికి వివరించారు. ఇంతకుముందు దేవదూత తన కలలో కనిపించి తెలియజేసిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇది ఇలా ఉండగా యేసు తన తల్లియైన మరియను, సాకుడు తండ్రి యోసేపును రమ్మని పిలిచి మనం దేవుని స్తుతించి ఆరాధించుదామని, ఇలావారు ప్రార్థన మొదలు పెట్టగ, తల్లి మరియను గొంతెత్తి దేవుని స్తుతించమని అడుగగా ఆమె ఎంతో తియ్యగా చక్కగా పాడి దేవుని స్తుతించింది. అది విని పరలోకము నుండి దేవదూతలు ఆశ్చర్యకితులయ్యారు. మరియతో కలసి, యేసు యోసేపు కూడ తండ్రి దేవుని స్తుతించారు. వీరి మధురమైన స్తుతులను విని ఆకాశపక్షుల కూడ వారితో కలిసి దేవుని స్తుతించాయి. యోసేపు ఈ పరలోక గణములు ఆకాశపక్షులు పాడటం విని ఎంతో ఆనందించాడు. కాని మానవ మాతృనికి కంటికి కనిపించకుండా వింటున్న ఈ సంగీతాన్ని విని బహుశ పరలోక దూతలు ఈ గానాలు చేస్తున్నారు అని ఎంతో సంతోషించాడు. తల్లి మరియను కూడ ఈ విషయమై ప్రశ్నించ సాహసపడలేదు. పరలోక దూతలవలె మనము కూడ దేవుని స్తుతిద్దాం. ఈ జీవ గీతాలాపన నీవు వినలేదా? అని మరియ యోసేపుగారిని అడిగింది. అపుడు యోసేపు ఎంతో మృధుమధురంగా చెవులకు ఇంపుగా వుందని తెలియజేశారు. దూతలతో పాటు నీ స్వరము కూడ వినసొంపుగ ఉందని

మరియకు తెలియజేశారు. మరియ యోసేపుగారు తెలియజేసినవన్ని వినయంగా విని సంతోషించింది. యేసు తన పరలోకపు తండ్రితో, సంభాషణతో గడిపేటప్పుడు మరియ, యోసేపుగారు కూడా సంభాషణలో గడుపుతూ, దేవుడు చేసిన గొప్ప కార్యాల గురించి స్తుతించేవారు. చాలా సందర్భాలలో వారి ప్రయాణంలో యేసు మోకరించి తండ్రి దేవునితో సంభాషించేవాడు. మానవరక్షణం నిమిత్తం తండ్రితో ముచ్చటించేవారు. కుమారుని ప్రార్థనలన్ని ముగిసేవరకు మరియ యోసేపులు పరలోక విషయాలు గురించి, జరగబోయే విషయాలను గురించి, దేవుని ఆశీర్వాదాల గురించి సంభాషించేవారు. ఎవరి ప్రార్థనలు వారు ముగించాక అందరు కలిసి మోకరించి, దేవుని స్తుతించి, ఆరాధిస్తూ గడిపేవారు.

## తిరుకుటుంబ - పోషకుడు

అది 1955, మే 1వ తేదీన ఇటలీ దేశములో రోమానగరంలో ఉన్న పునీత పేతురు దేవాలయ ఆవరణమంతా ఎంతో సందడిగా ఉంది. ఇటలీ కతోలిక కార్యక సంఘ సభ్యులతో కిటకిటలాడుతుంది. వారంత తీరుసభ అమలు చేస్తున్న సాంఘిక కార్యక్రమాల యెడల తమ సహృద్భావాన్ని, విధేయతను వెల్లడిస్తూ, మరోకసారి తమకార్మిక సంఘం పదియవ వార్షికోత్సవం సందర్భంగా, తమ అంకిత భావానికి ప్రతీకగా, ప్రతిజ్ఞ చేసేటందుకు సంసిద్ధంగా ఉన్నారు. ఆ రోజున 10వ పయస్ (భక్తినాధ) పాపుగారు అచట చేరిన వారందరి సమక్షంలో మే నెల 1వ తేదీన కార్మకుడైన పునీత యోసేపుగారికి అంకితంచేసి ఆ రోజును ప్రతి సంవత్సరము కార్మిక దినత్సవంగా కొనియాడి, ఆ దీన శ్రామిక జీవి ఆదర్శాన్ని, ఆశీర్వాదాన్ని బడిసి తరింపుదని శ్రీసభ మాటగా సందేశమిచ్చారు. తండ్రిగా, సంరక్షకుడిగా, కాపరిగా, పునీత యోసేపుగారు సహాయం సహకారంగా ఉంటారని ప్రకటించారు. స్వయంగా శ్రమజీవియైన యోసేపుగారు తన కాయ కష్టంలో చెమటోడ్చి వడ్రింగి వృత్తిపై వచ్చే ఆదాయంలోనే యేసు మరియ యోసేపు అనబడే పవిత్ర తిరుకుటుంబాన్ని పోషించుకున్నట్లు బైబిలు ద్వారా సృష్టమవుతోంది. ఈ కారణమును బట్టి

పునీత యోసేపుగారికి, కార్మిక వర్గానికి సారూప్యత కలిగి అపూర్య అవినాభావ సంబంధాలలో సందేహంలేదు. ఇదిలా ఉండగా పరిశుద్ధ 13వ లియో (సింహరాయులు) పాపుగారు 1889లో పునీత యోసేపుగారిని శ్రామికులు, కార్మికులు, కష్టజీవులు, నిర్లక్ష్యం చేయబడిన దీనజనావళికందరికి పాలకునిగా, మార్గదర్శకునిగా శ్రీసభ తరపున పునరుద్ఘాటించారు. అలాగే కార్మికులు చెమటోడ్చి కుటుంబ పోషణ భారాన్ని మోసేవారంతా పునీత యోసేపుగారిని మాతృకగా గైకొని తమ ప్రత్యేక మార్గచూపరిగా భావించి, వారిని స్వర్గరాజ్య పోషకునిగా గౌరివించాలని 15వ బెనడిక్ట్ పాపుగారు ఆదేశించారు. నాస్తి కమ్యూనిజానికి వ్యతరేకంగా పోరాడేందుకు గాను శ్రీసభ సంరక్షకులుగా పునీత యోసేపుగారిని ఎంపికచేశారు. 11వ పయస్ (భక్తినాథ) పాపుగారు ఇలా కార్మిక దినోత్సవ దినాన్ని పునీత యోసేపుగారి ఉత్సావాన్ని ఏర్పాటు చేయబడం వల్ల, గొప్ప విశిష్టత ఆపాదింపబడిందని చెప్పవచ్చును. శ్రమ, పని, కృషి, మానవ ప్రయత్నంకు ఎనలేని గౌరవం, ప్రాధాన్యత, ఘనత, విలువ, గుర్తింపు ఇవ్వబడిందని చెప్పవచ్చును. పనికి తగ్గ ప్రతిఫలం, గుర్తింపు లేని యెడల మానవ హృదయం ఒకింత కలత పడుతుంది, వ్యధ చెందుతుంది. కాని పునీత యోసేపుగారి మధ్యవర్తిత్యం, కాయకష్టం ఏనాడు వృధాపోదు. 'కష్టేఫలి'యని తన జీవితంలో పేదరికం వల్ల పునీత యోసేపుగారు ఆశీర్వదింపబడి, మంచి మరణం పొందారు. ఏసు మరియ హస్తాల్లో పరలోక ప్రాప్తిపొందారు. సజీవ మహిమ కిరీటాన్ని ధరించారు. శ్రామిక జీవులకు సంరక్షకునిగా, పోషకునిగా తండ్రిగా, దేవునిచే ఎన్నుకోనబడినారనడంలో అనుమానంలేదు. కార్మిక కుటుంబాలను పునీత యోసేపుగారు అను నిత్యం తన జ్ఞాన ధృక్కులతో, దీవెనలతో, కాచికాపాడతారు. అసలు వారి తత్వమే అది కాదా! క్రైస్తవ కార్మికుడికి సజీవ మాతృకయై నిరంతం ఆదర్శప్రాయులైన పునీత యోసేపుగారిని గౌరవించడం, మన కుటుంబాల్లోకి ఆహ్వానించి మర్యాద చేయడం మన కనీస బాధ్యత. శ్రమను గౌరవించడమే యోసేపుగారిని గౌరవించినట్లు. బాధ్యతలు అరమరికలు లేకుండా కష్టపడి పని చేయడంలో ఎలాంటి సమస్యలు, చిక్కులు వచ్చినా వాటిని సామరస్యంగా పరిష్కరింప

యోసేపుగారు తయారుగా ఉన్నారు. వారు కార్మికులకు అన్ని విధాలా తోడ్పడతారు. అందువల్ల ప్రతి క్రైస్తవ కార్మికుడు ఏ సంస్థ, ఏ వృత్తిలో ఎలాంటి పనిచేస్తున్నా, శ్రమ యెడల పూజ్యభావం కలిగి పనిచేస్తే, ప్రభుని పూజించడమేయని భావించి, సమయంను వ్యర్ధపరచక భాధ్యతగల కార్మికునిగా ఆ పునీత యోసేపుగారి అడుగుజాడల్లో పయనింప ప్రయత్నించాలి. శ్రమ ఒక్కటే శ్రమైక జీవనం ఒక్కటే. యోసేపు అంటే దేవుడు సంసిద్ధి చేయును, హెచ్చించును లేక ఎక్కువ చేయును అని అర్ధం. కాబట్టి నేడు ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా, పునీత యోసేపుగారిని ఆదర్శంగా తీసుకుందాం. ఆయనలా జీవించుదాం.

### ముగింపు

దేవుడు ఏ ఒక్కరిని ఒంటరిగా జీవించుటకు పిలువలేదు, గాని సహవాసంతో జీవించడానికి పిలిచారు. సహవాసంలో జీవిస్తూ కుటుంబంలో దంపతులిద్దరూ కూడ సన్మార్గంలో నడుస్తూ, తమబిడ్డలను పుణ్యమార్గంలో నడిపిస్తారు. సాక్షాత్తు దేవుడు పరిశుద్ధ కుటుంబాన్ని ఎన్నుకున్నారు, ఎన్నుకోవడమే గాక తన చిత్తాన్ని వారి ద్వారా నెరవేర్చారు. ఈ ఆధునిక కుటుంబాలను కూడా పరిశుద్ధ కుటుంబం వలె దేవుడు ఎన్నిక చేసారు. కనుక మన కుటుంబాలు కూడా తిరుకుటుంబం వలె సుగుణాలు కలిగి, దేవుని చిత్తాన్ని నెరవేరిస్తే దేవుని యెక్క ప్రణాళిక ప్రకారం నడచిన వారమవుతాము. ఇతరులకు తిరుకుటుంబంవలె మరోక ఆదర్శ కుటుంబంగా ఉంటాము.

# 10. నీతికి నిలువెత్తు నిదర్శనం- పునీత యోసేపుగారు

- బ్రదర్ చాట్ల అలెగ్జాండర్



## ఉపోద్ఘాతం

పునీత యోసేపుగారి జీవితం, నీతికి నిలులెత్తు నిదర్శనం వంటిది. కష్టాలు, నిందలు, అవమానాలు, భరించి, దేవుని ఆజ్ఞలను అనుసరించి, తనను తాను త్యజించుకుని, తన ఆలోచనలను అణచిపెట్టుకుని దేవుని కార్యాన్ని నెరవేర్చిన ఓ మౌనముని. పునీత యోసేపుగారు, దేవునియందు నీతిగల భక్తుడిలా మరియమ్మ దగ్గర నీతిగల భర్తలా, బాలయేసు దగ్గర, నీతిగల తండ్రిలా, సమాజంలో నీతిగల వ్యక్తిలా, తిరుసభ చరిత్రలోనే నీతిగల పునీతుడిలా, తన జీవితాన్ని నీతియుక్తంగ జీవించి క్రైస్తవంలోనే నీతికి నిలువెత్తు నిదర్శనంగ నిలిచాడు. అందుకే నేటికి కూడ పునీత యోసేపుగారి పేరు వినగానే రెండు చేతులు జోడించి నమస్కరించని క్రైస్తవులు లేరు అంటే వాస్తవమనే చెప్పాలి. పరిశుద్ధ 13వ లియో పోపుగారు 1889వ సంవత్సరం ఆగస్టు 15వ తారీకున, పునీత యోసేపుపై భక్తి అనే ఒక విశ్వలేఖను రాశారు. (Quamquam pluries on devotion to St. Joseph), Encyclical of Pope Leo XIII promulgated on August 15, 1889). ఈ విశ్వలేఖలో, పోపుగారు ఈ విధంగ తెలియజేశారు. క్రైస్తవులుగ మనం యోసేపు గారి పై భక్తిని కలిగి జీవించాలి అని, ఆయన వలె నీతిగా జీవించడానికి, శక్తినివ్వమని ఆయన ప్రార్థన వేడుదలను అర్థించాలి అని ఈ విశ్వలేఖ ద్వారా తెలియజేశారు. అందుకే, పునీత యోసేపుగారి గురించి, ఆయన నీతివంతమైన జీవితం గురించి, తెలియని క్రైస్తవులు, విశ్వాసులు

లేరు. యోసేపుగారు సుగుణాల సంపన్నుడు, అంటే అన్ని మంచి గుణాలలో అధికుడు అని అర్థం. దేవుడు యోసేపుగారిని అద్భుత రీతిగ ఆశీర్వదించారు. అందుకే ఆయనకు దేవునితో సహవాసం చేసే మహాద్భాగ్యం, దేవుని కొరకు మాత్రమే జీవించే సదవకాశం. ఆయన తలుపు తట్టాయి. ఆనాటి నుండి యోసేపుగారు తన ఆత్మను పరమాత్మతో ఏకం చేసి దైవసంకల్పాన్ని నెరవేర్చారు. అటువంటి పునీతుని పుణ్య సంస్మరణ సంవత్సరాన్ని ముగించుకుంటున్న ఈ తరుణంలో ఆ పుణ్యపురుషుని గురించి మరియొక సారి నెమరుసుకునే అవకాశాన్ని దేవుడు మనకు ఇస్తున్నాడు. ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకుని ఆయన వలె పవిత్రమైన, నీతియుక్తమైన జీవితం జీవించడానికి ప్రయత్నం చేద్దాం. ఈ మౌనముని గురించి ధ్యానించడానికి కొన్ని అంశాలను మీ ముందుకు తీసుకువస్తున్నాను.

## యోసేపుగారి తపో:ధ్యానము నీతికి ఉద్యానవనము

"మంచి తనం మనిషై జన్మిస్తే పునీత యోసేపుగారి వలె ఉంటుంది అని నిస్సందేహంగ చెప్పవచ్చు". పరిశుద్ధ గ్రంథంలో మనం పరిశీలించి నట్లయితే అక్కడ ఈ విధంగ ఉంటుంది. "మరియమ్మకు యోసేపుతో వివాహము నిశ్చయింపబడినది. కాని వారు ఇరువురు కాపురము చేయకముందే పవిత్రాత్మ ప్రభావమువలన మరియమ్మ గర్భము ధరించినది. ఆమె భర్తయగు యోసేపు నీతిమంతుడగుటచే మరియమ్మను బహిరంగముగా అవమానించుట ఇష్టంలేక రహస్యంగా పరిత్యజించుటకు నిశ్చయించుకొనేను. (మత్తయి 1:18-19). తనతో నిశ్చితార్థం చేయబడిన స్త్రీ గర్భం ధరించింది అన్న వార్త, ఆయన హృదయంలో ఒక ఖడ్గంలా దూసుకుపోయింది. ఆయనకు మనఃశాంతి లేకుండ చేసింది. కట్టలు తెంచుకునే ఆవేశం తనలో ఉన్న, తనను తాను త్యజించుకుని ఆ విషయంపై ధ్యానిస్తు ఉన్నాడే తప్ప మరియ తల్లిని తన నోటితో ఒక్కమాట కూడ అనలేదు. తన ఆగ్రహాన్ని ఎక్కడకూడ వ్యక్తం చేయులేదు. ఆ విషయం పై మౌనంగ తపోఃధ్యానం చేస్తు ఉండిపోయాడు. ఒక్కసారి ఆలోచించండి కేవలం నీతి కలిగిన వాళ్ళు మాత్రమే చేయగలిగే కార్యం ఇది. మరియ తల్లి

తప్పుచేయదు అని, అలుపెరుగని ఆశతో, నమ్మకంతో, నీతిగా, తెలివిగా ఆలోచించాడు. దేవదూత కలలో కనిపించి చెప్పేవరకు ఆయన తపోః ధ్యానంలోనే ఉన్నాడు. ఈ వాక్యాన్ని పరిశుద్ధ గ్రంథంలో మనం చూడవచ్చు. యోసేపుగారు ఇట్లు తలంచుచుండగ, ప్రభవు దూత కలలో కనిపించి, "దావీదు కుమారుడవగు యోసేపూ! నీ భార్యయైన మరియమ్మను స్వీకరించుటకు భయపడవలదు. ఏలయన ఆమె పవిత్రాత్మ ప్రభావము వలన గర్భము ధరించినది. ఆమె ఒక కుమారుని కనును. నీవు ఆయనకు యేసు అని పేరు పెట్టుము. ఏలయన ఆయన తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించును అని చెప్పెను." (మత్తయి 1:20-21). దేవదూత ఈ మాటలు పలికిన తరువాత అనుమానాన్ని అనుగద్రొక్కి నీతిని తన ఉధ్యానవనంగా చేసుకుని, ధీరుడిలా అడుగుముందుకు వేసి, మరియతల్లిని తన భార్యగా స్వీకరించి, పవిత్రాత్మ ప్రభావముచే మరియతల్లి గర్భమునందు అవతరించిన, ఆ పవిత్రాత్మ పుత్రుని ప్రాణాలకు తెగించి కాపాడుకుంటు, తన జీవితాన్ని దేవుడు చెప్పిన విధంగా మలచుకుంటు, దేవుని మెప్పించె రీతిగా జీవించి, ధీరోదత్తుడిలా వెలుగొందాడు. ఆయన జీవితం నాటికి, నేటికి ఏనాటికైన పవిత్రం, ప్రత్యేకం. అందుకే పోపు పయాస్ గారు 1870, డిసెంబర్ 8వ తారీఖున యోసేపుగారిని తిరుసభ పాలక పునీతుడిగా ప్రకటించారు. (Quemadmodum Deus' - Pope Pious de Clares St. Joseph to be patron of the universal Church. Dec.8, 1870). అలానే పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు కూడ మార్చి 26, 2003 సంవత్సరంలో తన ప్రసంగంలో యోసేపుగారిని తిరుసభ పాలక పునీతుడిలా ప్రభోదించారు. వీళ్ళుమాత్రమే కాదు. ఇంకా ఎన్నో విశ్వలేఖలు ఆయనను అనేక బిరుదులో మనకు చూపిస్తున్నాయి. యావత్ తిరుసభకు మాత్రమే ఈయన పాలక పునీతుడు కాదు, ప్రతి క్రైస్తవునికి ఆధ్యాత్మిక తండ్రి కూడ. ఇలా మహోన్నత విధంగ గౌరవింపబడుతున్న ఈ వ్యక్తి సామాన్యుడు కాదు, కాని అసమాన్య సామాన్యుడు. తన మౌనంతో, మనస్సులను గెలుచుకున్న మౌనముని, మానవుల మనస్సునే కాదు, దేవుని మనస్సును సైతం గెలుచుకున్నాడు. ప్రపంచ తిరుసభలోనే పాలక పునీతుడిగా నిలిచి,

మరపురాని, మరువలేని గౌరవాన్ని పొందుతున్నారు. ఈ గొప్ప పునీతుడిని మనం ఆదర్శంగ తీసుకోవాలి. ఆయనవలె నిబద్ధత కలిగి జీవించాలి.

## నిబద్ధతగల నీతిమంతుడు

జనాభా లెక్కలకు యోసేపుగారు మరియతల్లిని తీసుకుని బెత్లహేమునకు వస్తారు. వారు అక్కడ ఉన్నప్పుడే మరియతల్లికి ప్రసవకాలం ప్రారంభమవుతుంది. యోసేపు, దావీదు వంశస్థుడైనందున గలిలీయసీమలోని నజరేతు నుండి, యుదయా సీమలో ఉన్న దావీదునగరమగు బెత్లహేమునకు జనాభా లెక్కలలో తమ పేర్లు చేర్పించుకొనుటకై తనకు ప్రధానము చేయబడినట్టి. గర్భవతియునైన మరియమ్మను కూడ వెంటబెట్టుకొని వెళ్ళను, వారచట ఉన్నప్పుడే మరియమ్మకు ప్రసవకాలం సమీపించినది. (మత్తయి 2:4-6). పురిటి నొప్పులతో భాధపడుచున్న తల్లిమరియవైపు చూచి చలించిపోయాడు. ఆమె ఆవేదన చూడలేక ఇంటింటికి వెళ్ళి, తలుపు తట్టి, వినయంతో కరము జోడించి, అయ్యా....నా భార్య పురిటినొప్పలతో బాధపడుతుంది, మీ ఇంట్లో కాస్త చోటుంటే ఇస్తారా అని దీనంగఅడుగుతాడు. కాని ఎవరు ఇసుమంత స్థలం కూడ ఇవ్వరు. మనసులు లేని, మానవత్వం లేని మనుషులను చూచి ఆయన హృదయం ఆవేదన చెందుతున్నా నిబద్ధతగల నీతిమంతుడిలా మౌనాన్ని వహించాడు. పురిటినొప్పులతో బాధపడుతూ కనీసం నడవడానికి కూడ ఒపికలేని, మరియతల్లి దీనస్థితిని చూచి ఆయన హృదయం చలించిపోయింది, ఆ స్థితిని చూచి ఓర్వలేక తల్లిని, బిడ్డను రక్షించాలి అనే తపనతో దగ్గరలో ఉన్న పశువుల సత్రానికి తీసుకువస్తాడు. కటిక చీకటి, ఎముకల్నిసైతం కొరుక్కుతినే చలి, సాయం చేసే నాధుడులేడు. ఎటుచూసిన అవమానమే ఎదురౌతున్నా, విశ్వాసముతో, నిబద్ధత గల నీతిమంతుడై ముందుకుసాగడు. తన ప్రాణాలను పనంగ పెట్టి, మరియతల్లిని, బాలయేసుని రక్షించుకున్నాడు. దేవుడు తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండ, దేవుని ఎదుట నమ్మకంగ నిలిచాడు. నమ్మక పాత్రుడిలానే జీవించాడు. మరియతల్లి తన జీవితంలో తాను దేవునిపై నమ్మకముంచి జీవించింది. యోసేపుగారి పై నమ్మకముంచి

ఆయనతో కలిసి అడుగులేసింది. అంటే, యోసేపుగారు నమ్మదగిన వ్యక్తి. అందుకే పునీత రెండవ జాన్ పాల్ పోపుగారు, 1980, మార్చి 19వ తారీఖున తన ప్రసంగంలో 'యోసేపుగారు నమ్మదగిన వ్యక్తి'గా ప్రబోధించారు. (St. Joseph: Man of trust, St. John Paul II, March 19, 1980). ఈ ఒక్క విషయంలోనే కాదు. దేవుడు తనకు చెప్పిన ప్రతి పనిని నమ్మకంగ చేశాడు. ప్రభువుదూత యోసేపునకు కలలో కనిపించి, "శిశువును చంపుటకు హేరోదు వెదకబోవుచున్నాడు. కావున నీవులేచి, బిడ్డను తల్లిని తీసుకొని, ఐగుప్తునకు పారిపోయి, నేను చెప్పువరకు అచటనే యుండుము అని ఆదేశించెను. (మత్తయి 1:3) దేవదూత ఈ మాటలు చెప్పగానే, దేవమాతను, దైవకుమారుడిని తీసుకుని వినయముతో, విశ్వాసముతో, ఐగుప్తునుకు పలాయనమైనాడు. ఆయన తన వంటిలో ఉన్న ఒపికనంతా దైవకార్యం కోసమే ఉపయోగించాడు. తను తిన్నను, తినకున్నను, కంటినిండ నిద్రలేకపోయినను, ఒళ్ళు అలిసిపోయేలా పనిచేశాడు. అందుకే ప్రతి క్రైస్తవుడు యోసేపుగారి వలె పనిచేయాలి. ఒళ్ళు అలసిపోయేలా, చెమటలు ధారలుగా కారేలా, దేవుని ఉధ్యానవనంలో పనిచేయాలి అని పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు మార్చి 19, 2001వ సంత్సరంలో తన ప్రసంగంలో ప్రబోదించారు. (Love and Serve the Church like St. Joseph - St. John Paul II, March 19, 2002 on his Sermon on St. Joseph)

బాలయేసుని దేవాలయంలో సమర్పించినప్పుడు, మోషే చట్టప్రకారము వారు శుద్ధిగావించు కొనవలసిన దినములు వచ్చినవి. ప్రతి తొలిచూలు మగబిడ్డ దేవునికి అర్పింపబడవలయును అని ప్రభువు ధర్మశాస్త్రములో వ్రాయబడి యున్నట్లు మరియమ్మ, యోసేపులు బాలుని యెరుషలేమునకు తీసుకుని పోయిరి. (మత్తయి 2:22-23). తండ్రిగా తన కర్తవ్యాన్ని నెరవెర్చుటయె కాకుండ, నీతిమంతుడిలా, అటు మరియ తల్లిని, ఇటు బాలయేసుని వెన్నంటి నిలిచాడు. పన్నెండు యేళ్ళు ప్రాయమున బాలయేసు తప్పిపోయినప్పుడు ఎంతో ఆవేదనతో నిబద్ధుడై, మరియుతల్లిని వెంటబెట్టుకుని, బాలయేసుని వెదుకనారంభించాడు. దేవాలయంలో యేసుని కనుగొనెవరకు ఆయన

ఎంతగానో చలించిపోయాడు. తన శక్తిని, సామర్థ్యాన్ని, ఆలోచనల్ని తన సమయాన్ని అంతా కుటుంబ రక్షణకే ఉపయోగించాడు. తన కుటుంబ పోషణకై ఎంతగానో కష్టపడ్డాడు. కష్టం తన గడపతొక్కిన ప్రతీక్షణం, అప్రమత్తుడై, దాని ఎదురువెళ్ళాడే తప్ప ఏనాడు భయపడలేదు. యోసేపుగారికి, కోటలు, మేడలు, మిద్దెలు, వజ్రవైడుర్యాలు, ఆస్తిపాస్తులు, పంచభక్షపరమాన్నములు ఏమిలేవు. తనకంటు ఉన్నది, తన రెక్కల కష్టం. దేవుడు తనతో ఉన్నాడు అనే ధృడమైన విశ్వాసం, నమ్మకమే ఆయన నమ్మిన సిద్ధాంతం. పునీత యోసేపు గారిని కుటుంబ ఐక్యతకు మరియు గౌరవ ప్రధమైన జీవితానికి చిహ్నంగ చూపిస్తు, 1981, మార్చి 19వ తారీఖున పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు తన ప్రసంగంలో బొదించారు. (St. Joseph: Unity of the family and respect for life. St. John Paul II, March 19, 1981 Sermon on St. Joseph). అలానే యోసేపుగారిని రక్షకుని సంరక్షకునిగా పునీత రెండవ జాన్ పాల్ పోపుగారు తన విశ్వలేఖలో తెలియజేశారు. (Redemptoris Custos (guardian of the redeemer) (Apostolic Exhortation by John Paul II, August 15, 1989) కావున యోసేపుగారి చూచి మనం ఎన్నో నేర్చుకోవాలి.

## నీతిమంతుడైన యోసేపుని చూచి నేర్చుకో......

కొందరిని చూస్తే కొట్టబుద్ధి అవుతుంది. మరికొందరిని చూస్తే పెట్టబుద్ధి అవుతుంది, అనే నానుడి ఉంది. అలానే పునీత యోసేపుగారిని చూస్తే నేర్చుకోబుద్ధి అవుతుంది. ఆయనను చూచి మనం నేర్చుకోవలసినది నీతి, వినయం, క్రమబద్ధత కలిగిన జీవితం, అన్నింటికి మించి, సహించె గుణం ఆలోచించె గుణం, అర్థం చేసుకునే మనస్సు, అంగీకరించే మనస్సు, ఇలా చెప్పుకుంటే పోతే, ఆయన వ్యక్తిత్వాన్ని వివరించి, వర్ణించడానికి పదాలు కూడ ఉండవేమో. యోసేపుగారు మానవత్వానికి మధుర స్వభావి. తండ్రి హృదయం కలిగిన వ్యక్తి. అందుకే పరిశుద్ధ ఫ్రాన్సీస్ పోపుగారు డిసెంబర్ 8,2020 యోసేపుగారిని తండ్రి హృదయంతో అనే విశ్వలేఖ ద్వారా, ఆయన గురించి

తెలియజేశారు. Patris Corde (with a Fathers Heart) Apostolic Letter on St. Joseph as Patron of the Universal Church 2020 of Pope Francis on December 8, 2020. యోసేపుగారు తన జీవితంలో వేసిన ప్రతి అడుగులో తండ్రి హృదయం కలిగి ఉండటం మనం గమనించగలము. యోసేపుగారు చేసిన ప్రతి కార్యాన్ని ఏమి ఆశించకుండ చేశారు. అందుకే ఆయనను చూచి మనం చాలా నేర్చుకోవాలి. ఈ మౌనముని మౌనంగానే తన మానవత్వాన్ని వెల్లపించిన మహానుభావుడు. యోసేపుగారు వృత్తిరిత్య వడ్రంగి. అంటే ఏ ఆకారం లేని చెట్టు మొద్దులను చెక్కి, వాటికి ఆందమైన రూపాన్ని ఇచ్చి, మనసులను ఆకట్టుకునే సామార్థ్యం కలవాడు. మనసును మైమరపించే ఆకర్షణియమైన సౌందర్యాన్ని రూపించే ఈ వడ్రంగి, తన హృదయాన్ని ఇంకెంత సౌందర్యంగా ఉంచాడో ఒక్కసారి ఆలోచించండి. యోసేపుగారు సౌందర్య మనస్కుడు. కాబట్టే జీవితాన్ని రమణీయంగ జీవించి, విజయిభవుడై వెలుగొందుచున్నాడు. అందుకే పునీత యోసేపుగారిని చూచి నేర్చుకోవాలి. ఈ గొప్ప పునీతుని నుండి మనం ఎంత నేర్చుకున్న తక్కువే అనిపిస్తుంది. ఆయన వలె జీవించడం కష్టమనే అనిపిస్తుంది. కాని క్రైస్తవులుగ మనం క్రీస్తుని పోలిజీవించాలి అంటే యోసేపుగారి వలె, దేవుని ఆజ్ఞలను పాటిస్తూ, చెప్పిన మాటకు కట్టుబడి తుది శ్వాస విడిచేవరకు, దేవుడే ఆశగ శ్వాసగ, ధ్యాసగ, మలచుకుని జీవించాలి. అందుకే నీతిమంతుడైన యోసేపుని చూచి నేర్చుకో. పునీత రెండవ జాన్‌పాల్ పాపుగారు మార్చి 2, 1999న పునీత యోసేపుగారిని తండ్రి ప్రేమకు చిహ్నంగ తన ప్రసంగంలో ప్రసంగించారు. (Joseph, Image of God's fatherly love - St. John Paul II March 22, 1999) తండ్రి ప్రేమకు చిహ్నంగా, పునీత యోసేపు గారిని చూచి, మనం, (నీ) మన కుటుంబాలలో తండ్రిగ, తల్లిగ, నీ కర్తవ్యాన్ని సక్రమంగ నెరవేరుస్తున్నామా? ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకొనండి ఒకవేళ నీ కర్తవ్యాన్ని సక్రమంగ నెరవేర్చని యెడల, పునీత యోసేపుగారిని చూచి నేర్చుకో. నీ జీవితాన్ని దేవుని అడుగుజాడలలోకి మలచుకో.

## యుద్ధం చేయలేదు కాని నీతిగలయుద్ధ వీరుడే....

యోసేపుగారు, ఒక యుద్ధ వీరుడు. ఆయన చేసినయుద్ధం, రాజ్యం కోసమో, రాణికోసమో కాదు; దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి యుద్ధం చేశాడు. ఆయన చేసినయుద్ధం, సైనికులతోనో, రాజులతోనో, బలసంపన్నులతోనో కాదు. మాటలను తూటాలుగ పేల్చె, తన సొంత ప్రజలతో, తన చుట్టూ నివశించే వారితో యుద్ధం చేశాడు. మరియతల్లి గర్భం ధరించినది, అనే వార్తను తెలుసుకున్న ప్రజలు, ప్రశంశల వర్షం కురిపించలేదు, కాని ప్రశ్నల వర్షం కురిపించారు. వారు అడిగే ప్రశ్నలు యుద్ధంలో దూసుకొచ్చె బాణాలులా ఉన్నాయి. తన ప్రజలు తనవైపు చూస్తున్న చూపులు ఆయనను ఎంతోగానో కృంగదీశాయి. తన మనసులో అనేక ఆలోచనలు రేకెత్తుతున్న తన మనస్సు తననే ప్రశ్నిస్తున్నా, నిశబ్ధంగ వుంటు, నిశబ్ధాన్ని, వారు అడిగే ప్రశ్నలకు జవాబుగా నిలిపి, యుద్ధం చేశాడు. ఆయన చేసిన యుద్ధం కత్తులతోనో లేదా ఆయుధాలతోనో కాదు. నిశబ్ధాన్ని ఆయన ఆయుధంగా చేసుకుని యుద్ధం చేశాడు.

యోసేపుగారి జీవితం మహా అద్భుతంగా ప్రారంభం కాలేదు. కాని ఆయన జీవించిన జీవితం, నడిచినబాట, ఆలోచన విధానం, అన్వయించి అనుసరించే విధానం ఇలా తను వేసిన ప్రతి అడుగును దేవుడు మహా అద్భుతంగ మార్చాడు. ఎంతలా అంటే అసలు ఒక మనిషి ఇంతనీతిగా ఎలా బ్రతకగలడు? సాధ్యమేనా? అనేంతగా దేవుడు ఆయనను దీవించి, ఆయన జీవితవిధానాన్ని, నడివడికను, మనకు చూపించి పరలోక రాజ్య పౌరులంటే ఇటువంటి జీవితవిధానాన్ని పోలి ఉండాలి అని దేవుడు మనకు యోసేపుగారి నీతిగల జీవితం ద్వారా మనకు తెలియజేస్తున్నారు. కావున నీతికి నిలువెత్తు నిదర్శనమైన పునీత యోసేపుగారిని ఆదర్శంగ తీసుకుని మన జీవితాలను దేవునికి ఇష్టమైన రీతిగ మలచుకుందాం! నీతి కలిగి జీవిద్దాం! నీతి బాటులో పయనిద్దాం!

# 11. దైవసుతునికి సాకుడు తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ మబ్బు దేవిడ్ రాజు



## పరిచయం

పునీత యోసేపుగారు, క్రీస్తు ప్రభువుకు, సాకుడు తండ్రి. అతను ఇక్కడ భూమిపై తండ్రి అయిన దేవుని ప్రేమ యొక్క స్వరూపుడు. మరియమాతకు ఒక మంచి భర్తగా, యేసు ప్రభువుకు సాకుడు తండ్రిగా, సంరక్షకునిగా, విశ్వకతోలిక శ్రీసభ పాలక పునీతునిగా, నీతిమంతునిగా శ్రామికుల పాలక పునీతునిగా కొనియాడతున్న పునీత యోసేపు గారి గుణగణాలను ఆదర్శవంతమైన నైతిక జీవిత విశ్వ జనావళికి తెలియపరిచారు.

యోసేపుగారిని గూర్చిన చారిత్రక సమాచారం అందుబాటులో లేదు. మత్తయి, లూకా సువార్తలలోని జనన కథనాలలో యోసేపుగారిని గూర్చి వింటాం. తరువాత పరోక్షంగా యేసుని వ్యక్తిగత ఇహలోక గుర్తింపును గూర్చి మాట్లడవలసి వచ్చినపుడు యోసేపు కుమారుడు అని, వడ్రంగి కుమారుడు అని ప్రస్తావించడం చూస్తాం. అంతకుమించిన సమాచారం మనకు దొరకదు. ఇందులో తప్పేమీ లేదు. వాస్తవానికి సువార్తలు విశ్వాస సంక్షిప్తాలు లేక విశ్వాస సారాంశాలు అవి యోసేపు, దావీదు వంశస్తుడు, ఆయనకు మరియమ్మతో నిశ్చితార్థం తరువాత ఆమె గర్భము ధరించెను, అది గుర్తించిన యోసేపు మరియమ్మను బహిరంగముగా అవమానానికి గురిచేయడానికి ఇష్టపడని వ్యక్తి పునీత యోసేపుగారు. (మత్తయి 1:19) నిశ్శబ్దంగా అమెకు విడాకులు ఇవ్వాలని

నిర్ణయించుకుంటాడు. కాని దేవదూత ఆయనకు కలలలో కనిపించి, ఆమె గర్భములోని శిశువు దైవ కుమారుడని ఆమె పరిశుద్ధాత్మ ద్వారా గర్భం దాల్చబడింది అని దేవదూత యోసేపుకు తెలియపరచినపుడు, ఆయన ఆమెను మనస్ఫూర్తిగా అంగీకరిస్తాడు. నిజానికి యోసేపు యేసుకు జన్మనిచ్చిన తండ్రి కాదు, సాకుడు తండ్రి మాత్రమే. భార్యయగు కన్యమరియమ్మతో ఆయనకు శారీరక సంబంధం లేదు. ఆమెకు ఈయన విరక్తత్వ భర్త. దైవ చిత్తానికి, తలవంచిన విధేయుడు.

కతోలిక శ్రీసభ వీరి కుటుంబాన్ని "తిరుకుటుంబం లేక పరిశుద్ద కుటుంబం" అని కీర్తిస్తుంది. ప్రతియేటా క్రీస్తుజయంతి తరువాత వెనువెంటనే వచ్చు ఆదివారం నాడు తిరు కుటుంబ పండుగను కొనియాడుతుంటాం. యేసు మరియ యోసేపులుగల తిరుకుటుంబానికి పెద్దగానున్న యోసేపు గారిని కుటుంబాలకు పాలక పునీతునిగాను, సంరక్షకునిగాను భావిస్తూ వారి ప్రార్థనా సహాయాన్ని వేడుకుంటుంది.

వీరిది మామూలు సామాన్య కుటుంబంకాదు. లోకరక్షణార్థం దేవుడు మానవుడుగా జన్మించటానికి వారి దివ్య అవసరార్థం స్వయాన వారే ఎన్నిక చేసి ఏర్పరచుకున్న కుటుంబం అది. సర్వోన్నతుడగు దేవుడు, నరరూపధారిగా జన్మించు నిమిత్తం సామాన్య మానవ కన్య మరియ చెంతకు, గాబ్రియేలు దూతను పంపి దేవుని పవిత్రాత్మ ప్రభావంచేత ఆమె గర్భం దాల్చవలయునన్న దైవచిత్తాన్ని ఆమెకు ఎరిగించి ఆమె సమ్మతిని కోరుకున్నాడు.

తిరుకుటుంబంలో తల్లిగానున్న మరియ, తండ్రిగానున్న యోసేపు సాధారణ వ్యక్తులు కారు. దేవుడు నరరూపధారిగా, ఈలోకాన ఉదయించటానికి స్వయాన ఆయనయే ఏరికోరి ఎన్నుకొని జతపరచిన దంపతులే మరియ యోసేపులు.

## యోసేపుగారు ఎవరు?

పునీత యోసేపుగారు నూతన నిబంధనలో ఒక కీలకమైన వ్యక్తి మరియు యేసు క్రీస్తు యొక్క భూ సంబంధమైన సాకుడు తండ్రి. యోసేపుగారు మరియకు భర్తగా పిలువబడ్డాడు. ఆయన చారిత్రక వృత్తాంతాలు చాలా వరకు అస్పష్టంగా ఉన్నాయి. యోసేపు గూర్చి రెండు సువిశేష పఠనాలలోనే వినిపిస్తుంది. అంతకు మించి ఎక్కువగా ఎక్కడ మాట్లాడినట్లు మనకు తెలియదు. యోసేపు దావీదు వంశస్తుడని, మరియ కన్యగా ఉన్నప్పుడే వారికి నిశ్చితార్థమయిందని మనము బైబులు గ్రంథంలో చదువుతాం. తరువాత మరియమ్మ పవిత్రాత్మ వలన గర్భం ధరించినదని తర్వాత ఆమెను వివాహం చేసుకున్నాడని చెప్పబడింది. అటు పిమ్మట యోసేపు, మరియ గర్భము ధరించినది అని తెలిసి ఆమెను విడనాడుటకు నిశ్చయించుకున్నాడు. అది తెలుసుకున్న దేవదూత ఆయనకు కలలో కనిపించి ఆమె పవిత్రాత్మచేత గర్భవతి అయినది పలికిన దూత యొక్క మాటలకు విధేయుడయ్యాడు. అటు తరువాత ఆయన తన నిర్ణయాన్ని మార్చుకొని మరియతో కలసి జీవితాంతం ఆమెకు తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. మరియతల్లి ప్రసవించగానే బాలయేసును హేరోదు రాజు చంపుటకు తన సైన్యాన్ని పంపినాడని, దేవుడు యోసేపుకు దూత ద్వారా సమాచారం అందించినపుడు తన భార్యను మరియు తన కుమారుని రక్షించుటకు యోసేపు నజరేతులో స్థిరపడ్డాడు. సువార్త పఠనాలు ఆయన మరణాన్ని ప్రస్తావించలేదు. ఏదేమైనప్పటికి క్రీ.శ. 1వ శతాబ్ధంలో యేసును సిలువ వేయడానికి ముందు మరణించాడని భావించబడింది.

కొన్ని తూర్పు వృత్తాంతాలు యోసేపుగారు మరియమ్మను వివాహం చేసుకొనే ముందు వారికి సంబంధము ఉందని ప్రొటెస్టంట్స్ చెపుతారు కాని అది వాస్తవం కాదు మరియు ఆయనకు చాలా మంది పిల్లలు ఉన్నారని లేని పోని ఉహా మాటలు చెప్తుంటారు. మరియతల్లి, జీవితాంతం కన్యగా ఉండి పోయిందని, మరియ యోసేపులు ఎప్పుడు లైంగిక సంబంధాలు పెట్టుకోలేదని దాదాపు అన్ని సువార్తలు పేర్కొంటున్నాయి.

కతోలిక సంప్రదాయాలలో యోసేపుగారు ఎల్లపుడు పునీతునిగా పరిగణించ బడుతున్నప్పటికి మధ్య యుగాల చివరి సగం వరకు, పాశ్చాత్య దేవాలయాలలో యోసేపుగారి పండుగను జరుపుకోలేదు. డిసెంబరు 1870లో IX వ భక్తినాథ పాపుగారు, యోసేపును ప్రపంచ వ్యాప్తంగా శ్రీసభ యొక్క పోషకుడిగా ప్రకటించారు. పునీత యోసేపుగారి మహోత్సవం మార్చి 19వ తేదీన జరుపుకోవాలని శ్రీసభ నిర్ణయించింది. యోసేపుగారు అనారోగ్యంతో బాధపడేవారికి, మంచి మరణం పొందుటకు ప్రార్థించేవారికి పాలక పునీతునిగా ప్రకటింపబడ్డారు.

## దైవ కుమారుడు (ఆది 3:15) ఎవరు?

1. "నీకును స్త్రీకిని - నీ సంతతికిని ఆమె సంతతికిని తీరని వైరము కలుగును". ఆమె సంతతి వారు నీ తల చితకగొట్టుదురు. ఆదికాండములో చూచిన విధంగా దేవుడు దైవరూపాన్ని దాల్చి ఈ ప్రపంచంలోనికి ఒక సాధారణ మనిషి రూపంలో వచ్చాడని పాత నిబంధన గ్రంథంలోనే చెప్పబడినది. ఒక దైవ కుమారుడు మానవరూపాన్ని దాల్చి ఏ విధంగా ఈ భూలోకమునకు వచ్చాడు అనే ఆలోచన మనకు తట్టవచ్చు? కాని దేవునికి అసాధ్యమైనది ఏదియుకూడ లేదు అని మనము పరిశుద్ధ గ్రంథంలో చూస్తున్నాము. దేవుడు తన కుమారుని భూలోకమునకు పంపుటకు ఒక సాధారణమైన అవివాహితులను ఎన్నుకున్నాడు. (మత్తయి 1:18-21)

"యేసుక్రీస్తు పుట్టుక రీతి యెట్టిదనిన: ఆయన తల్లియైన మరియమ్మకు యోసేపుతో వివాహం నిశ్చయమైనది. కాని వారు ఇరువురును కాపురము చేయక ముందే పవిత్రాత్మ ప్రభావము వలన మరియమ్మ గర్భము ధరించినది. ఆమె భర్తయగు యోసేపు నీతిమంతుడుగుటచే, మరియమ్మను బహిరంగముగా అవమానింప ఇష్టము లేక రహస్యముగా పరిత్యజించుటకు నిశ్చయించుకొనెను. యోసేపు ఇట్లు తలంచుచుండగా, ప్రభువు దూత కలలో కనిపించి దావీదు కుమారుడవగు యోసేపు! నీ భర్యయైన మరియమ్మను స్వీకరించుటకు

భయపడవలదు. ఏలయన  ఆమె పవిత్రాత్మ ప్రభావము వలన గర్భము ధరించినది. ఆమె ఒక కుమారుని కనును. నీవు ఆయనకు యేసు అను పేరు పెట్టుము. అని దేవుడు  స్వయంగా దేవుదూత  ద్వారా ఈ మాటలు మరియమ్మకు, యోసేపుకు చెప్పెను.

## యోసేపును బాలయేసుకు సాకుడు తండ్రిగా దేవుడు  నియమించుట (మత్తయి 1:20-21)

యోసేపు ఇట్లు తలంచుచుండగా ప్రభువు దూత యోసేపునకు  కలలో కనిపించి దావీదు  కుమారుడవగు యోసేపు! నీ భార్యయైన మరియమ్మను స్వీకరించుటకు భయపడవద్దు. ఏలయన, ఆమె పవిత్రాత్మ ప్రభావము వలన గర్భము ధరించినది. ఆమె ఒక కుమారుని కనును, నీవు ఆయనకు  తండ్రిగా యేసు అను పేరు పెట్టుము అని దేవుడు తన దూత ద్వారా యోసేపుతో మాట్లాడి అదృశ్యమాయెను. ఆ మాటలు విన్న యోసేపు దేవుని మాటను అంగీకరించి దేవునికి విధేయుతను చూపి యేసుకు సాకుడు తండ్రిగా మరియమాతకు భర్తగా, కటుంబానికి యజమానిగా బాధ్యతను నిర్వహించాడు. ఆనాటి సమాజంలో యూదుల సంప్రదాయవాదులు స్త్రీలపట్ల కఠినత్వాన్ని చూపేవారు, అటువంటి సమాజంలో ఉండి కూడ అనేక అవమానాలను, ఎదుర్కొని,  కష్టసుఖాలను దిగమింగి,  కష్టమే తన వృత్తిగా భావించి, యేసుకు తండ్రిగా, మరియమ్మకు భర్తగా తన జీవితంలో వారికి అండగా నిలిచాడు. వారిరువురిని ఎల్లవేళల కంటికి రెప్పలా అన్ని అపాయములనుండి కాపాడుతూ, వారిని పోషిస్తు, అదే కాక వారిని ఆధ్యాత్మికంగా ఒక మంచి విశ్వాసంలో విద్యను  నేర్పుతూ, ఒక మంచి సత్పురుషునిగా తీర్చిదిద్దాడు. యోసేపు గారు కష్టాన్ని నమ్ముకొని జీవిస్తూ తన కుమారుడైన బాలయేసును పెంచే క్రమంలో వృత్తిలో శిక్షణనిస్తూ తన సాధారణ జీవనవిధానం ద్వారా విద్యాబుద్ధులు నేర్పించారు. ఆయనకు ఈ జ్ఞానము, ఈ అద్భుతశక్తి ఎచటనుండి లభించినది? అతడు వడ్రంగి  కుమారుడు  కాదా? (మత్తయి 13:54-55) అని ఆనాటి

ప్రజలు ఆశ్చర్య చకితులయ్యారంటే, పిల్లల ఎదుగుదల, నడవడిక, క్రమశిక్షణ, తెలితేటలు జ్ఞాన ప్రదర్శనలో తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనది. తన వృత్తిపట్ల అంకితభావంతో తన కుటుంబ పోషణకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని నిజాయితీతో సంపాదించుకొని ఎటువంటి అక్రమమార్గాలకు పాల్పడకుండా, తన కుటుంబాన్ని పోషించుకోవటంలోనే నిజమైన ఆనందముందని దేవుని మీద విశ్వాసముతో కుటుంబాన్ని ముందుకు నడిపించాడు.

తను కష్టపడి సంపాదించిన కొద్దిపాటి సంపాదలోనే ఇతరులకు సహాయ పడుతూ, మానవత్వాన్ని చాటుకున్నారు పునీత యోసేపుగారు.

యోసేపుగారికి యేసు ప్రభువు, సొంత కుమారుడు కాకపోయిన దైవ చిత్తాన్ని అనుసరించి, చిన్నారి యేసుకి సాకుడు తండ్రిగా యోసేపు, యేసు మరియలను కాపాడాడు. ఆ కాపుదల వైనాన్ని స్మరించుకోవాలి. యోసేపులో కొండంత సృజనాత్మక, నిర్భరత, ధైర్యం వుంది. ఆయన గొప్ప యుక్తిపరుడు. అవసరానికి తగిన సత్తా ఆయన వద్ద వుంది. ఆయన శ్రీ యేసుని సంరక్షించి, పెంచి పెద్దచేశాడు. మానవాళి రక్షణార్థం దేవుడు మనిషి అవ్వాలని అనుకున్నపుడు హఠాత్తుగా ఆ దేవుడు యేసునిగా దిగి రాలేదు. యోసేపు కుమారునిగా మన మధ్యకు రావడానికి నిర్ణయించుకొన్నాడు అందరిలానే మానవ మాత్రునిగా పెరిగాడు. అందరిలాగే, ఆయనకు ఒక తండ్రి అవసరమయ్యాడు, ఆ తండ్రియే పునీత యోసేపుగారు.

## పునీత యోసేపుగారి యొక్క సద్గుణాలు

పవిత్ర గ్రంథంలో పునీత యోసేపుగారు "న్యాయమైన వ్యక్తి" (మత్తయి 1:19) అని వర్ణిస్తుంది, దినిని "నీతిమంతుడు లేదా అన్ని విషయాలలో సద్గురువు" అని కూడా అనువదించవచ్చు. పునీత యోసేపుగారి నుండి మనం మంచి నేర్చుకోవాలనుకుంటే ఆయన మౌనంలో దాచిన జీవితంలో ప్రతిరోజు ఆచరించిన ధర్మాలను అంగీకరించుటకు మనం ఆయనను వేడుకోవాలి.

## అత్యున్నత నీతిమంతుడు

యోసేపుగారు మొట్టమొదటిగా దేవునికి న్యాయంగా ఉన్నాడు, దేవునికి ఇవ్వాల్సిన వాటిని దేవునికి ఇచ్చాడు. యోసేపుగారి ప్రార్థనను, శ్రమను మరియు ప్రేమను తన జీవితమంతా దేవునికి సంపూర్ణంగా సమర్పించాడు.

## పేదరికాన్ని ప్రేమించేవాడు

యోసేపుగారు భూలోకంలో ఆస్తిగాని, ధనమునుగాని, తన సొంతం చేసుకోలేదు. ఆయన తన పేదరికాన్ని అంగీకరించి తన కష్టమును నమ్ముకొని కష్టమే తన జీవితముగా భావించాడు. వారు బెత్లెహేముకు, ఈజిప్టుకు, చివరకు నజరేతుకు తీర్ధయాత్రలో ఉన్నందున ఆయనకు ఉన్నదంతా విడిచిపెట్టి సాధ్యమైన విధంగా కుటుంబాన్ని పోషించాడు.

## యోసేపుగారు కార్మికుల ఆదర్శమూర్తి

యోసేపుగారు తన కష్టము ద్వారా కేవలం ప్రేమను ఉద్దేశించలేదు. కాని తను చేసే ప్రతి పని ద్వారా ఇతరులకు మేలునుచేస్తూ, దేవునికి ప్రీతిగా తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. సాటి మనిషికి కష్టముగూర్చి తన జీవితం ద్వారా నేర్పించాడు. ఆయన తన స్వార్థము కోసం పనిచేయలేదు, ఆయన చేసే పనిని ఇష్టపడ్డాడు మరియు కష్టమును నమ్ముకున్నాడు. ఆయన సత్యమే ఆయనను ఒక ఆదర్శవంతునిగా, కష్టానికి ఫలితంగా దైవకుమారుని సాకుడు తండ్రి అని గుర్తించింది.

## మరియతల్లి జీవితంలో యోసేపుగారి పాత్ర

యోసేపుగారు యేసు, మరియతల్లి యొక్క జీవితాలలో నాటకీయ పాత్ర ఎంతగానో పోషిస్తాడు. అయినప్పటికి, ఆయన చాలా అరుదుగా ప్రస్తావించబడ్డాడు.

యోసేపుగారు మరియమ్మను విడిచిపెట్టినట్లయితే ఆమె చాలా అవమానాలకు గురయ్యేది. యోసేపు అది గ్రహించి ఆమెను భార్యగా

మనస్ఫూర్తిగా అంగీకరించాడు. యోసేపుగారు, మరియమ్మ మొదటి శతాబ్దంలో నజరేతులోని ఒక సాధారణ యూదుల కుటుంబాలకు చెందినవారు. యోసేపు మరియతల్లి కంటే చాలా సంవత్సరాలు పెద్దవాడు. వారు అధికారికంగా నిశ్చితార్థం వేడుక పెద్దల సమక్షములో జరిగినప్పటికి వారు శారీరకంగా కలిసి జీవించలేదు. ఆ సమయంలో మరియ గర్భవతి అని కనుగొన్న తర్వాత గర్భధారణను బహిరంగంగా బహిర్గతం చేయడానికి మరియు ఆమె ప్రమేయాన్ని ఖండించడానికి యోసేపు తన హక్కుల పరిధిలో ఉన్నాడు. (ద్వితీయో 22:21) దీని ఆధారంగా మరియమ్మను రాళ్లతో కొట్టి చంపి ఉండవచ్చు, అయితే ఈ చట్టం పూర్తి స్థాయిలో మొదటి శతాబ్ధంలో అమలు చేయబడిన దాఖలాలు లేవు. ఆమెను బహిరంగంగా అందరి ముందు అవమానించడం చాలా సాధారణ ఎంపిక. ఒక వేళ యోసేపుగారు తన ప్రణాళికను అమలు చేసినప్పటికి, ఆమె చాలా ప్రమాదకరమైన స్థితిలో మిగిలి ఉండేది. కాని యోసేపుగారు మరియతల్లిని స్వీకరించాలని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే ప్రభు యొక్క దూత ఆయనకు కలలో కనిపించింది. (మత్తయి 1:20-23) మరియమ్మను తన భార్యగా చేసుకొమ్మని దేవదూత యోసేపుకు చెప్పింది. యోసేపు దూత మాటలకు విధేయించి, ఆమెను తన ఇంటికి తీసుకెళ్లాడు. యోసేపు మరియను భార్యగా అంగీకరించిన తరువాత పొరుగువారి ప్రశ్నార్థకమైన చూపులను విస్మరించాడు. అందుకు యోసేపు వారి పాత్ర యొక్క నిస్వార్థతను మరియు ఈ అతీంద్రియ సూచనలను వినడానికి ఆయన సముఖతను చూపుతాడు.

## యోసేపుగారి విధేయత

దేవుడు దేవదూత ద్వారా మరియమ్మతో మాట్లాడిన విధంగా, దేవుడు తన కుమారుని యొక్క ప్రణాళికను పునీత యోసేపుగారి ద్వారా వెల్లడించాడు. (మత్తయి 1:1)

మరియ గర్భము దాల్చడంవల్ల యోసేపుగారు బాధపడ్డాడు ఎందుకంటే తను మరియను ప్రజా అవమానానికి గురిచేయాలని కోరుకోలేదు. కాని అమె

గర్భము దాల్చినది అని తెలిసికూడ అమెను మనస్పూర్తిగా అంగీకరించి (1:19) దేవునికి విధేయుడయ్యాడు. మొదట ఒక దేవదూత అతనికి కలలో కనిపించి యోసేపు నీవు భయపడవలదు నీవు మరియను భార్యగా స్వీకరించు అని దూత చెప్పినపుడు ఆయన తనను తాను తగ్గించుకొని, మరియమ్మను తన భార్యగా ఆంగీకరించాడు, దూతచెప్పిన విధంగా వారికి పవిత్రాత్మ ద్వారా ఒక శిశువు జన్మించును, ఆయనకు నీవు యేసు అను పేరు పెట్టుము, ఎందుకన ఆయన ప్రజలందరి పాపములను క్షమించును అని దూత చెప్పెను (మత్తయి 1:20)

ఈనాటి సమాజంలో స్త్రీల యెడల పురుషులు ప్రదర్శించే శారీరక మానసిక దాడులు సంఘటనలు అనేకము. అన్ని మతాలు బోధించే పవిత్ర వివాహ సాంగ్యంలో పురుషుడు స్త్రీతో మరియు స్త్రీ కూడ ప్రజలందరి సమక్షములో ఇరువురు కష్టంలోను, సుఖంలోను, వ్యాధిలోను, సౌఖ్యంలోను ఒకరికి ఒక్కరు తోడుందునని ప్రమాణం చేస్తారు. కానీ వారు ఎంతవరకు పాటిస్తున్నారు, ఎంతగా ఒకరిని ఒకరు పునీత యోసేపుగారి వలె అర్థం చేసుకుంటున్నారు అనేది ఈనాటి సమాజంలో ఒక ప్రశ్నగా మన అందరిని ప్రశ్నించుకోవాలి. అనాటి సమాజంలో స్త్రీలను ఆగౌరపరిచే సంప్రదాయాలలో ఉండి కూడ, దేవుని పట్ల విధేయత, స్త్రీలపట్ల గౌరవముతో ఆయన ఒక సాటిమనిషిగా మరియమ్మను బాలయేసును తన వినయ విధేయతతో బాధ్యతను చేపట్టాడు. క్రైస్తవులందరికి, మరియు కుటుంబాలకు, ఒక మంచి విధేయుడిగా నిలిచాడు.

## ప్రియమైన తండ్రి పునీత యోసేపుగారు

యోసేపుగారి యొక్క గొప్పతనం ఏమిటంటే మరియమ్మ యొక్క జీవిత భాగస్వామి మరియు యేసు తండ్రి. ఈ విధంగా తనను తాను నిరూపించు కున్నాడు అని పునీత క్రిసోస్టోమ్ మాటలతో మనకు తెలియపరుస్తున్నాడు. అయన పునీత యోసేపుగారి పితృత్వాన్ని గురించి స్పష్టంగా వివరించాడు.

పునీత యోసేపుగారు క్రైస్తవులందరికి తను ఒక మంచి ప్రియమైన తండ్రిగా ప్రజలందరిచేత గౌరవించబడ్డాడని, ప్రపంచవ్యాప్తంగా అతనికి లెక్కలేని చర్చిలు అంకితం చేయబడినవి. అతని ఆధ్యాత్మికత మరియు అనేక మతపరమైన సంస్థలు అతని పేరును కల్గివున్నాయి. పునీత యోసేపుగారి పట్ల ఎంతోమంది యువకులు, పెద్దలు, మరియు స్త్రీలందరికి ఆయన పట్ల ఎంతో మక్కువతో ఉంటారు. వారలలో కొందరైన పునీత చిన్న తేరెసమ్మగారు అయనను తనకు న్యాయవాదిగా మరియు మధ్యవర్తిగా ఎన్నుకుంది. తరుచుగా అయనను ఆశ్రయించింది. ఆమె అయన నుండి కొన్ని వరాలను ప్రార్థన సహాయంతో పొందింది. ఆమె తన ప్రగాఢమైన అనుబంధము చవిచూచింది. అందుకు ఆమె పునీత యోసేపుగారి పట్ల గొప్ప భక్తిని ప్రేమను ఇతరులకు నేర్పించింది. మనకు పునీత యోసేపు ప్రియమైన తండ్రి కనుక మనము ఆయనను ప్రతి బుధవారం మరియు ముఖ్యముగా మార్చి నెలలో ఆయనకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తాము, ఆయనపైగల భక్తిని గౌరవిస్తాము.

## అంగీకరించే మనస్సు

పునీత యోసేపుగారు మరియమ్మకు భర్తగా యేసును సొంత కుమారునిగా అంగీకరించారు. అతను దేవదూత మాటలను విశ్వసించాడు. స్త్రీలను గౌరవించడం ఆపదలలో ఉన్నవారిని ఆదుకోవడం యోసేపుగారిలో ఉన్న గొప్ప లక్షణం. అందువలననే దేవుడు యోసేపుగారిని మరియకు భర్తగా యేసుకు ఒక గొప్ప తండ్రిగా ఎన్నుకున్నాడు. యోసేపుగారు గౌరవప్రదమైన మరియు సున్నితమైన వ్యక్తిగా కనిపిస్తాడు. ఆయన హృదయం ఎల్లప్పుడు ఇతరులను అంగీకరించే తండ్రిగా దేవుడు ఆయనను దీవిస్తాడు. ఆరోజు యోసేపుగారు యేసుప్రభుకు తండ్రిగా, అంగీకరించ పోయినట్లయితే ప్రభువు ఈ లోకానికి వచ్చేవాడు కాదు, మరియు మనకు రక్షణ వచ్చేది కాదు, యోసేపు అంగీకరించడంద్వారా గొప్ప విశాలహృదయం కలవాడని తెలుస్తుంది.

కాబట్టి మనము పునీత యోసేపు గారినుంచి నేర్చుకోవలసిన మంచి లక్షణాలు ఎన్నో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది ఏమిటంటే ఇతరులను

అంగీకరించడం లేక ఇతర మనుష్యులను అర్థంచేసుకొని వారిని వారిగా గుర్తించడం అనేది ఒక గొప్ప లక్షణం. ప్రస్తుత సమాజంలో చాలా మంది పురుషులు మరియు స్త్రీలుకు ఆదర్శవంతమైన భర్త మరియు తండ్రి ఏమిటో తెలియదని స్పష్టమవుతుంది. పురుషులు భార్యల కోసం, డాక్టర్లు, ఇంజనీర్లు మరియు ఆర్థికంగా భద్రత ఉన్నా వారి కోసం చూస్తున్నారు. మరోవైపు మహిళలు స్థిరపడిన, అందమైన భర్తలకోసం అన్వేషణలో ఉన్నారు. పురుషులు మరియు స్త్రీలు మతపరమైన విశ్వాసాలు మరియు నైతికతలను ప్రాధాన్యతగా పేర్కొనడం చాలా అరుదు. మరియు ఇపుడు మనలో చాలా మందికి ఆదర్శవంతమైన భర్త మరియు తండ్రి ఎవరు అంటే ధనవంతుడు, మరియు ప్రభావంతమైన కుటుంబం నుండి వచ్చినవాడు. కాని యోసేపులాంటి ఆదర్శవంతమైన భర్త మరియు తండ్రి గుర్తించడం చాలా అరుదు.

కాబట్టి మనము పునీత యోసేపుగారివలె మంచి ఆదర్శవంతునిగా ఆంగీకరించే ఒక గొప్ప తండ్రిగా ఉండుటకు ఆయన లక్షణాలను దయచేయమని దేవుని ప్రార్థించుదాం.

**ముగింపు**

పునీత యోసేపుగారు ఒక దైవ కుమారునికి సాకుడు తండ్రిగా నియమించ బడినాడు. తరువాత యోసేపుగారు దేవునికి మధ్య వున్న సంబంధమును ఆయన యొక్క కష్ట జీవితమును అవమానాలను ఎదుర్కొన్న రీతిని గురించి తెలియజేయబడింది. ఆయన కేవలము దైవకుమారునికే తండ్రికాక మానవులందరికి ఒక మంచి అదర్శమూర్తిగా, దైర్యవంతునిగా వివరించబడింది. దైవ చిత్తాన్ని యెరిగినవారై, దేవదూత ద్వారా పలికిన 'దైవాజ్ఞను శిరసావహించి మరియమాత వ్యక్తిత్వానికి ఎటువంటి కలంకం రానివ్వకుండా ఉత్తమ భర్తగా కష్టాలలో సహాయపడుతూ సహకారాన్నిందిస్తూ మరియమాత యెడల గౌరవభావం ఇనుమడించే విధంగా తనలోని సద్గుణాలను వ్రాయబడింది. యోసేపు, యేసు-మరియలను కాపాడాడని, ఆ కాపుదల వైనాన్ని స్మరించబడింది. యోసేపు జీవితం సాధారణమైన జీవితం కాదని, ఆయన జీవితం సృజనాత్మకమైనదిగా ఒక ప్రదేశం నుండి వేరొక ప్రదేశానికి మారుతూ

దేవునికి విధేయుడైన విలువలను వ్రాయబడింది. మరియతల్లి పట్ల తన కుమారుని పట్ల ఆయన చూపిన ప్రేమ, దయ, కనికరం మానవులమైన మనకు ఆదర్శాన్ని, ధైర్యాన్ని ప్రతి ఒక్కరి జీవితంలో నింపింది.

చివరిగా ఆయన ఒక గొప్ప మానవ విలువలకు తండ్రిగా కష్టపడు వారులకు అండగా, విధేయతలేని వారికి మంచి ఆదర్శమూర్తిగా ఆయన యొక్క సద్గుణాలు ప్రభావితం చేస్తాయని తెలియజేయబడింది.

కాబట్టి పునీత యోసేపుగారి జీవితమును మనం ఒక ఆదర్శంగా తీసుకొని మన జీవితాలలో ఎదురైన కష్టాలను బాధలను ఓర్చుకొని ముందుకు నడువడానికి కావలసిన దైవ అనుగ్రహాలను ఆ దేవుడు మనందరికి ప్రసాధించుమని  పునీత యోసేపుగారి ద్వారా వేడుకుందాం. ఆయన యొక్క ప్రార్థన మనందరికి మంచి విశ్వాసాన్ని బలపరిచి మనకు దేవుని మధ్య విశ్వాస సంబంధం బలపరిచేలాగున దేవాది దేవుని ప్రార్థించుకుందాం.

# 12. విశ్వాసపూరితమైన తండ్రి - పునీత యోసేపుగారు

- బ్రదర్ జుత్తుక వెలాంగణి రాజ్



## ఉపోద్ఘాతం

లోకాశలను త్యజిస్తూ లోకేశ్వరుని పూజిస్తూ విశ్వాసంతో నిలచిన విశ్వాస తండ్రి పునీత యోసేపు గారు. శ్రీసభ సంరక్షణాలో, మోక్షప్రణాళికలో ముఖ్యపాత్ర పోషిస్తున్న పునీత యోసేపుగారి గూర్చి తెలుసుకుందాం. ప్రపంచపు పోకడలు త్యజించి దైవమానవ పుత్రుడైన యేసు క్రీస్తును, మరియ తల్లిని స్వీకరించి, విశ్వాస విధేయతతో దైవ మార్గంలో నడచిన మౌన ధ్యాన ధీరుడు పునీత యోసేపు గారు. తిరు కుటుంబ పోషకుడిగా, కుటుంబాన్ని సర్వవిపత్తుల నుండి కాపాడారు మన పునీత యోసేపు గారు. త్రీత్వైక సర్వేశ్వరుని పై ప్రగాఢమైన విశ్వాసం కలిగి దైవ చిత్తానికే శిరము వంచి నిలచినారు పునీత యోసేపు గారు. వినయమనే మకుటాన్ని ధరించి పితృలకు సుమాతృకగా నిలచి, యేసు నాథుని సర్వకీడుల నుండి రక్షించి, మరియతల్లిని ప్రేమతో స్వీకరించారు పునీత యోసేపు తండ్రి. "ప్రియమైన తండ్రి, కోమలమైన తండ్రి, ప్రేమగల తండ్రి, విధేయుడైన తండ్రి, అంగీకరించే తండ్రి, సృజనాత్మకంగా ధైర్యంగా ఉండే తండ్రి, పనిచేయు తండ్రి మరియు తండ్రి యొక్కనీడ" అని పోప్ ఫ్రాన్సీసు గారు అభివర్ణించారు. ఇలాంటి బిరుదులు ఈ మహపునీతునికి ఇవ్వబడినాయి అంటే అతని పవిత్ర మరియు వినమ్ర జీవితమే ఇందుకు కారణం. దైవంపై తన విశ్వాసాన్ని శ్వాసగా, విధేయతను బాటగా, ప్రేమను ప్రాణంగా నిలిపిన పుణ్యమూర్తి పునీత యోసేపు గారు.

అలాంటి విశ్వాసము, విధేయత మరియు వినయం దయచేయుమని ప్రార్థిస్తూ మరింత లోతుగా ఆయన గూర్చి తెలుసుకుందాం.

## పితృలకు ఆదర్శమూర్తి

ఫ్రాన్సీసు పాపుగారు తన లేఖలో పునీత యోసేపు తండ్రి యొక్క పితృత్వ లక్షణాలను అధ్భుతంగా వివరించారు. క్రైస్తవ పురుషులందరూ ఇలాంటి సద్గుణాలు పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలి. పునీత యోసేపు గారి వలె దయగల హృదయం, ధృఢమైన మరియు విశ్వాపాత్రమైన లక్షణాలు కలిగి ఉండాలి. పునీత యోసేపుగారు తండ్రులందరికి పితృత్వం యొక్క సున్నితమైన మరియు నిరంతర నమునా. మరియతల్లికి గొప్ప భాగస్వామిగా నిలిచారు. నిశబ్దంగా ఉన్నంత మాత్రానా ఆ మహనీయునికీ తెలివితేటలు లేవు అని అర్ధంకాదు, తన సృష్టికర్త యొక్క ప్రణాళిక నేరవేర్చడానికి తనను తాను అంకితం చేసుకున్నాడని అర్ధం. పునీత యోసేపు తండ్రి యొక్క పవిత్ర జీవితం మనకు ఆదర్శం కావాలి. ఆయన జీవించినది తన కోసం కాదు, కానీ మోక్ష ప్రణాళికను సంపూర్తిచేయుటంలో భాగస్థులైయ్యారు.

నేటి ఆధునిక సమాజంలో పునీత యోసేపు గారిన పోలిన తండ్రులు మనకి కావాలి. కుటుంబాన్ని దైవ విశ్వాసంలో నడిపించడానికి, పిల్లలను కథోలిక విశ్వాసంలో ధృడపరచడానికి, కుటుంబ యజమాన్నులైన తండ్రులు పునీత యోసేపుగారిని పోలి జీవించాలి. ఇలాంటి జీవితం జీవించినప్పుడే దైవ ప్రణాళికలో మనం భాగస్తులం కాగలము.

## విశ్వాస విధేయుడైన మహనీయుడు

పునీత యోసేపు గారు దైవ నిర్ణయాన్ని తూచ.తప్పకుండా పాటించారని మనం సువార్త పఠనాలలో అనేక పర్యయాలు వినియున్నాము. దేవుడు తనని ఏదైనా చేయుమని అడిగిన ప్రతీసారి, అవును అని చెప్పడానకి పునీత యోసేపుగారు ఎల్లప్పుడు విశ్వాసంతో, విధేయతతో సంసిద్ధముగా ఉన్నారు. ఉదా: మరియతల్లిని భార్యగా స్వీకరించమన్నప్పుడు, జనాభా లెక్కల కోసం బెత్లెహేమునకు వెళ్లమన్నప్పుడు, బాలునితో ఈజిప్టుకు పలాయనము చేయమనప్పుడు పునీత యోసేపు గారు దైవచిత్తాన్ని విశ్వాసంతో విధేయించారు.

పనులు మన స్వంత మార్గములో చేయాలని చెప్పబడిన నేటి ప్రపంచంలో, మన స్వంత చిత్తాన్ని కాకుండ దైవనిర్ణయాన్ని అనుసరించడంలో నిజమైన విశ్వాస విధేయతలు కనబర్చారు. అదే విధంగా, బైబిల్‌లో పునీత యోసేపు గారు ఒక్కమాట కూడ మాట్లడినట్లు మనం చూడము ఎందుకంటే, ఆయన చాల మౌనంగా ఉండేవారు. ఈ నిశబ్దం కారణంగా దేవుని స్వరాన్ని వినగలిగారు మరియు కుటుంబాన్ని పవిత్ర కుటుంబంగా నడిపించగలిగారు. ఎందుకంటే దేవుడు నిశబ్దంగా ఉన్న వారితో, నిశబ్ద స్థలాలలో మాట్లడతారు. పునీత మథర్ తెరిస్సా గారు ఈ విధంగా పలుకుతారు "మీరు ప్రార్థనలో మౌనంగా దైవాన్ని తలస్తే, ఆ దైవం మీతో మాట్లడుతారు."

మన అనుదిన జీవితాల్లో నిశబ్దం అనే గుణాన్ని అలవర్చుకోవాలి. ఇలా ఎప్పుడైతే నిశబ్ధంగా ఉంటామో దైవ స్వరాన్ని ఆలకించగలము మరియు ఆయన చిత్తాన్ని పాటిస్తూ పవిత్ర జీవితం జీవించగలము. ఆ మౌన ధ్యాన పునీతుని వలే మనము కూడ మన జీవితాలను పావనం చేసుకోగలము.

## విశ్వాసంతో తిరుకుటుంబాన్ని రక్షించిన పునీత యోసేపుగారు

పునీత యోసేపు తండ్రి తిరుకుటుంబాన్ని త్రీత్వైక సర్వేశ్వరుని పోలినడిపించుటకు ఆయన ఎంతో శ్రమించారు. మత్తయి 1:20 వచనంలో మనం చూసినట్లయితే "దావీదు కుమారుడైన యోసేపు నీ భార్య మరియను స్వీకరించడానికి భయపడకు, ఎందుకంటే ఆమె పవిత్రాత్మ వలన గర్భం ధరియించినది," అన్న ఈ వచనం ఆయనను తన కుటుంబాన్ని మరింత పవిత్రంగా నడిపించడానికి దోహదపడింది. ఆయన కుటుంబ పోషణకై రేయంత శ్రమించి, ప్రజలకు దైవానికి వినయ, విధేయతలు కలిగి జీవించారు.

యేసు, మరియలను కాపాడుటమే ఆయన ప్రధాన లక్షణంగా స్వీకరించాడు. దైవ కుమారునకు తండ్రి (సాకుడు) అయిన సరే, దేవునికి ఎప్పుడు అవిధేయత కానీ, అవిశ్వాసం కాని కనబర్చలేదు. దైవ కుమారునికి తండ్రిగా ఉండటానికి అతడు సమర్థుడు అనుకోలేదు. కానీ దైవ నిర్ణయం ప్రకారం దూత మాట విని, దైవం పై విశ్వాసం కొల్పోకుండా, పవిత్ర కుటుంబాన్ని స్వీకరించాడు. పునీత యోసేపు గారి యొక్క విశ్వాసం చాలా

బలంగా ఉంది మరియు అతను పవిత్రమైన జీవితాన్ని గడపడానికి తనను తాను దేవునికి అంకితం చేసుకున్నారు. దీనికి కారణంగా పునీత యోసేపు గారి హృదయం తరుచుగా యేసునాధుని తిరు హృదయంతో మరియు పరిశుద్ధ మరియతల్లి నిష్కళంక హృదయంతో పాటు గౌరవించబడుతుంది. ఆయన చాలా పవిత్ర జీవితం గడిపారు కాబట్టి తన సద్గుణాలలో మనం ఎదగాలని తరచుగా కోరుతారు మరియు మనకు తన తిరుకుటుంబ రక్షణ, సహాయం అర్థిస్తారు.

## తిరుసభలో పునీత యోసేపుని ఔనత్యం

క్రైస్తవులుగా మనం మరియతల్లిని మన ఆధ్యాత్మిక తల్లిగా మరియు పరాక్రమశాలి అయిన పునీత యోసేపు తండ్రిని మన ఆధ్యాత్మిక తండ్రిగా స్వీకరిస్తాము. కన్య మరియ తల్లి ప్రేమ పూర్వకంగా పరలోకం నుండి మనలను నడిపించునట్లే, మన శ్రీసభను కాపాడి, నడిపించుమని పునీత యోసేపుగారిని ప్రార్థించాలి. ఇలాంటి మహానీయునికి మన సత్య శ్రీసభ ఎంతో గొప్ప స్థానం కల్పించింది.

1870 – పునీత 9వ భక్తినాధ పాపుగారు, "యోసేపు తండ్రిని శ్రీసభ యొక్క పాలక పునీతులు"గా ప్రకటించారు.

1889 – 13వ సింహరాయులు పాపుగారు, పునీత యోసేపు తండ్రిని గూర్చి, "క్వామ్ క్వామ్ ఫ్లూరీస్" అనే లేఖను రాసారు. దీని ముఖ్య ఉద్దేశం "పునీత యోసేపు తండ్రి" పై భక్తిని అధికం చేయుటం.

1908 – పునీత లుయిగి గ్వానెల్లో రోములో పునీత యోసేపుకు అంకితం చేయబడిన బ్రహ్మాద్దే దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. ఇది 1912లో పూర్తి చేసి (Basilica) గా పవిత్రం చేయబడింది.

1921– 15వ బెనడిక్టు పోపుగారు, "దైవస్తుతులు"లలో "Blessed Be St. Joseph," అనే "ఆమె పవిత్రమైన జీవిత భాగస్వామి" అనే పదబంధాన్ని చేర్చారు.

1962– పునీత 23వ జాన్ పోపుగారు "Canon of the Mass" లో అనగా "కృతజ్ఞత ప్రార్థన క్రమము–1లో పునీత యోసేపు" గారి పేరును చేర్చారు.

1989– పునీత 2వ జాన్ పాల్ పోపుగారు పునీత యోసేపుని పై ఒక లేఖను రాసారు. అది "Redemptoris Custos".

2013– ఫ్రాన్సిస్ పాపుగారు, విశ్రాంత ఎమెరితుస్ పాపుగారు 16వ బెనదిక్టు యొక్క ఉద్దేశాలను ప్రతిధ్వనిస్తూ మరియు అవి నెరవేరుస్తూ, అన్ని కృతజ్ఞత క్రమాలలో పునీత యోసేపు పేరును చేర్చారు. అతను వాటికన్ నగరాన్ని పునీత యోసేపుకు అంకితం చేశారు.

రక్షణ చరిత్రలో పునీత యోసేపుని పాత్ర వర్ణింప తరము కానిది. ఫాదర్ కాలోవే తన పుస్తకములో "St. Joseph Help for Us", "మన కాలంలో, పునీత యోసేపుని యొక్క ఆధ్యాత్మిక పితృత్వాన్ని శ్రీసభ తెలుసుకోవాలని, ప్రేమించాలని, గౌరవించాలని మరియు ఆయన ఆశ్రయం పొందాలని యేసు ప్రభువు కోరుతున్నారు" అని వర్ణించారు.

## శ్రీసభ సంరక్షకుడు పునీత యోసేపు తండ్రి

తల్లియైన శ్రీసభ పునీత యోసేపుగారిని శ్రీసభ సంరక్షకులుగా నియమించి, ఆయన అడుగు జాడలలో నడువ నిశ్చయించుకుంది. ఏ విధముగా అయితే కన్య మరియను భార్యగా స్వీకరించి, జీవిత సహాచారిగా, ఆమె గౌరవాన్ని కాపాడరో, అలానే శ్రీసభను అన్ని సంక్షోభాలనుండి కాపాడుమని, ఆయనకు అంకితం చేసారు. దైవిక సంకల్పంతో ఏకం అయినారు మరియు వినయపూర్వకంగా దూత మాటను పాటించారు కాబట్టి ఆయనకు తిరుసభ కాపుదలకు అంకితం చేశారు. ఏ విధంగా నజరేతులో కుటుంబ అవసరాలన్నిటినీ తీర్చి, తన రక్షణతో చుట్టి ముట్టినట్లు, ఇప్పుడు పరలోక పోషణ అనే అంగీతో కప్పి ఉంచడం, యేసునాధుని, తిరుసభను రక్షించడం ఎంతో విలువైనది. కావున ఆయన ఎల్లప్పుడు తిరుసభను సకల విపత్తుల నుండి సంరక్షించి కాపాడతారు.

## పాతనిబంధన యోసేపునకు మరియు పునీత యోసేపునకు గల తారతమ్యం

మొదటి జోసఫ్ తన యజమాని యొక్క అభిమానాన్ని మరియు ప్రత్యేక శ్రేయస్సును పొందాడు మరియు జోసెఫ్ పరిపాలన ద్వారా అతని కుటుంబానికి ఎంతో శ్రేయస్సు, సంపద చేకూరింది. అతను గొప్ప శక్తితో రాజ్యానికి అధ్యక్షత వహించి, పంటలు నాశనం చెందిన సమయంలో, దేవుని యొక్క జ్ఞానంతో ఈజిప్తు దేశీయులను కరువుకాటకాలనుండి విముక్తిగావించాడు. ఆ విధంగా చేసినందుకు ఫరో రాజు అతనికి "ప్రపంచ రక్షకుడు" అనే బిరుదుతో బహుకరించాడు. రెండవ యోసేపు, క్రైస్తవ మతానికి సంరక్షకుడిగా నిర్ణయించబడి, దేవుని తిరుసభకు రక్షణ కవచముగా నిలిచి తిరుసభ భూమిపై దేవుని ఇల్లు మరియు అతని (త్రిత్వైక దేవుని) రాజ్యం అని నిరూపించారు. అందుచేత తిరుసభ కాపరులైన పునీత యోసేపుగారికి తమను తాము అర్పించు కొంటారు. ఏలన నజరేతులో ఏ విధముగా తిరుకుటుంబాన్ని కాచికాపాడారో మమ్ములను కూడ సంరక్షించుమని. అనేక వర్గముల వారు (ధనికులు, గొప్పవారు, క్రైస్తవ వేతరులు) ఈయన గుణాలు అలవర్చుకుంటారు.

## పునీత యోసేపు – పాలక పునీతులు

పునీత యోసేపుగారు దేవుని మీద నిండు విశ్వాసంతో తన జీవితాన్ని సాగించారు కావున, వీరిని, శ్రీసభ పనిచేయు వారికి అనగా పనివారు, చేతి వృత్తిని చేయువారికి, తక్కువ స్థాయిలో పనిచేయువారిని, మంచి మరణము పొందబోవువారికి పాలక పునీతులుగా నియమించినవి.

పునీత అవిలాపురి తేరేసమ్మగారు, ఈ మహానీయుని న్యాయవాదిగా మరియు మధ్యవర్తిగా ఎన్నుకుంది. తరుచుగా పునీత యోసేపు గారిని ఆశ్రయించేది మరియు ఆమె అతనిని నుండి కోరిన అనేక వరములను పొందినది. తన స్వంత అనుభవంతో ప్రోత్సహింపబడిన భక్తిని పునీత యోసేపుని పట్ల పెంపొందించుకోవడానికి ఇతరులను కూడ ఒప్పించింది. ఉదాహరణకు: ఈజిప్టు దేశీయులు ధ్యానం కోసం ఫరోను ఆశ్రయించినప్పుడు, ధాన్యకోశాధి కారియైన "యోసేపు" వద్దకు వెళ్లు అనే భావంతో, పునీత యోసేపుపై భక్తిని

వ్యాపింప చేశారు. ఆది 41:55 “యోసేపు దగ్గరకు వెళ్లు, అతను నీతో ఏమి చెప్పాడో అది చేయి,” అన్న వాక్యం ఆమెను పునీత యోసేపు (సాకుడు తండ్రి), వైపు విశ్వాసంతో నడిపించింది.

దేవుని పై విశ్వాసంతో మన భయాలు, బలహీనతలు మరియు అతను పనిచేయగలడని విశ్వసించడం ఇమిడి ఉందని మనకు భోదించాడు ఈ పునీతుడు. యోసేపు గారు విశ్వాసంతో విధేయించడానికి ఎన్నడు వెనుకాడలేదు. ఎన్ని కష్టాలు ఎదురువచ్చిన దైవాన్ని విడువలేదు. పునీత యోసేపుగారు తన విశ్వాసాన్ని ప్రకటించారు. విశ్వాసం వలన విధేయత కలుగును అనే సత్యాన్ని ప్రభోదించాడు మరియు మోక్షానికి మార్గదర్శి అయ్యాడు.

విశ్వాసం అంటే సులభమయిన మరియు ఓదార్పునిచ్చే పరిష్కారాలు అని మనం ఎప్పుడు అనుకోకూడదు. క్రీస్తు మనకు భోధించిన విశ్వాసమే పునీత యోసేపులో కూడ కనిపిస్తుంది. తాను స్వంతమార్గాల కోసం వెతుకలేదు, కానీ వాస్తవాన్ని కళ్ళు తెరచి ఎదుర్కొన్నాడు మరియు వ్యక్తిగత బాధ్యతను స్వీకరించాడు.

## ముగింపు

“యోసేపు దగ్గరకు వెళ్లుము, అతను నీతో ఏమి చెప్పునో అది చేయుము” (ఆది 41:55). కతోలిక విశ్వాసి పునీత యోసేపుని పట్ల మిక్కుటమైన భక్తిని పెంపొందించుకోవాలి. “ఈయన పవిత్ర జీవితం మనకు ఆదర్శం కావాలి.” అని పునీత తోమస్ అక్వినాస్ వివరించారు. ఈ పునీతుని ఆధ్యాత్మిక మార్గం వివరించేది కాదు, అంగీకరించేది అని వర్ణిస్తారు. దేవుడు యోసేపునకు చెప్పినట్లు “దావీదు కుమారుడా! భయపడకుము” (మత్తయి 1:20), కాబట్టి దేవుడు మనకు ఇలా హెచ్చరిస్తున్నారు కోపాన్ని, నిరుత్సాహన్ని ప్రక్కన పెట్టి, మనం కోరుకున్నవి జరుగకున్నను, పరిస్థితులు ఎలా ఉన్నాయో! అలా వాటిని స్వీకరించాలి. కేవలం రాజీపడటం కాదు, ఆశతో మరియు ధైర్యం మరియు దేవునిపై విశ్వాసంతో సాగాలి.

పవిత్రత అనేది ఒకరి జీవితంలో, ప్రతి రంగంలో స్వాధీనత నుండి విముక్తి. ప్రేమ యొక్క తర్కం ఎల్లప్పుడు స్వేచ్ఛ. పునీత యోసేపు తన కోసం ఎప్పుడు ఆలోచించలేదు. దైవ మోక్ష ప్రణాళిక కోసం, బాలయేసు, మరియల కోసం తపనపడ్డారు. పునీత యోసేపుగారు స్వయం త్యాగంలోనే కాదు, స్వయం బహుమానంలో ఆనందాన్ని పొందారు. అతనిలో మనం ఎప్పుడు నిరాశ చూడలేదు, ఎందుకంటే ఈ పునీతుడు దైవంపై విశ్వాసం కోల్పోలేదు. ఆయన ఓపిక మరియు నిశ్శబ్దం విశ్వాసమునకు ప్రతీక.

మరియతల్లి ఏ విధంగా పునీత యోసేపుని పై తన ప్రగాఢ నమ్మకం, విశ్వాసం ఉంచారో, ఆ విధమైన విశ్వాసం మనం కూడ మన అనుదిన జీవితంలో కనబర్చుదాం. “కొంతమంది పునీతులు వారి ప్రత్యేక మధ్యవర్తిత్వంతో మనకు కొన్ని సంధర్భాల్లో మాత్రమే సహాయం చేయగలరు, కానీ మన శ్రీసభ పాలకుడు, పోషకుడు అయిన పునీత యోసేపుగారు మన ప్రతి అవసరంలో మన కోసం మధ్యవర్తిత్వం వహిస్తారు మరియు మనకు సహాయం అందిస్తారు.” (పునీత అక్వినాస్ గారు).

కాబట్టి, దీని నుండి ప్రేరణపొంది, పునీత యోసేపుని పట్ల మనకు ఉన్న భక్తిని ప్రక్కకు నెట్టకుండా, ఏ విధంగా ఈ లోకంలో యేసునాధునకు మార్గ నిర్దేశం చేశారో, మనకు కూడ ఎల్లప్పుడు చేయమని ప్రార్ధించుదాం, అర్ధించుదాం మరియు వరములను స్వీకరించుదాం.

# 13. దైవకార్యంలో ఓ నీతిమంతుడు-పునీత యోసేపుగారు

- బ్రదర్ పొలమరశెట్టి దేవరాజ్



## ఉపోద్ఘాతం

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను... కాని "దేవుని గ్రహించువాడును, అన్వేషించువాడను ఒక్కడును లేడు" (రోమీ 3:11). దేవునికి దూరమై మానవజాతి తమకు ఇష్టమైన పాపపు జీవితాన్ని జీవిస్తున్నారు. మానవులందరు దేవుని మహిమకు దూరమయ్యారు. దేవుని గ్రహించు స్థితిలో లేరు. కాని మానవుని పట్ల దేవుని అపారమైన ప్రేమ వర్ణనాతీతం. మానవాళిని రక్షించాలన్నదే దేవుని ఉద్దేశం. ఆ రక్షణ ప్రణాళికలో తన కుమారుని దివి నుండి భువికి పంపిన ఆ దేవుని ప్రేమ అనిర్వచనీయం. ఈ రక్షణ ప్రణాళికలో భాగంగా దేవుడు కొంతమందిని తనకై తాను ముందుగానే ఏర్పరచుకున్నారు. అందులో యోసేపుగారి పాత్ర ఎంతో ఆవశ్యకం.. దైవకుమారునికి భూలోక తండ్రిగా ఉండ యోసేపుని దేవుడు ప్రత్యేకించుకున్నాడు అని చెప్పడంలో అతిశయోక్తి ఏమి లేదు. ఎందుకంటే, యోసేపునే ప్రత్యేకించుకోవడం దేవుని ప్రణాళిక కాకపోతే, దేవుడు మరొక వ్యక్తిని ఎన్నుకునేవాడు. కాని సృష్టి స్థితి లయ కారకుడు తన సంకల్పానుసారం తాను ఉద్దేశించువారిని ఎన్నుకుంటునే ఉన్నారు. అలా దేవుని దైవిక కృపావరములో యోసేపు నీతిమంతుడిగా పరిగణింపబడి దేవునిచే, దైవకార్యంలో ఒక సాధనంగా ఉండాలని భగవంతుడు తలంచాడు. మానవ జీవితంలో జరిగే ప్రతీ సంఘటన భగవంతునిచే అనుమతించబడినదే. జీవితంలో ప్రతీ క్షణం, ఆయన సమాధానం.

## 1. పరిశుద్ధ గ్రంథంలో - నీతిమంతులు

పరిశుద్ధ గ్రంథంలో ఎందరో జీవిత గాథలను మనం చదువుకున్నాము. వారి జీవన శైలి, వారు నడచిన మార్గం, వారి వ్యక్తిత్వం మొదలగు విషయాలు

మనకు తెలిసినవే. మరి పరిశుద్ధ గ్రంథంలో: అటు పూర్వ నిబంధన, ఇటు నూతన నిబంధనలో కూడా కొందరి జీవితాలను పరిశీలిస్తే, వారి నీతిమంతమైన జీవన విధానాన్ని మనం గమనించగలం. పూర్వ వేదంలో యేహెజ్కేలు గ్రంథం 14వ అధ్యాయం 14వ వచనంలో ప్రవక్త మనకు కొందరిని పరిచయం చేస్తున్నాడు వారు: నోవా, యోబు మరియు దానియేలు. వారి నీతివంతమైన జీవితం వారిని ఏ విధంగా కాపాడిందో మనకు తేటతెల్లమవుతుంది. నోవా గురించి ఈ విధంగా చెప్పబడింది, “నోవా నీతిమంతుడు తమ కాలము వారిలో ఉత్తముడు” (ఆది 6:9). అతని న్యాయమైన ప్రవర్తన, మొత్తం మానవ జాతిని రక్షించడానికి దారితీసింది. అన్యాయమైన తరంలో, ప్రపంచంలో నోవా మాత్రము న్యాయవంతుడు. అతడు దేవునితో నడుస్తూ, దోషరహితుడుగా మెలిగాడు. “నోవా ఏమరుపాటు లేకుండా దేవుడు ఆజ్ఞాపంచినట్టే చేసెను” (ఆది 6:22). నోవా దేవుని ప్రేమకు పాత్రుడయ్యాడు. స్వయాన దేవుడే నోవాతో, “ఈ తరము వారిలో నీవు ఒక్కడితే నీతిమంతుడవు” (ఆది 7:1) అని నుడివెను.

యోబు నిరపరాధి. పరిశుద్ధ గ్రంథం ఈ విధంగా తెలియజేస్తుంది అతడు న్యాయవంతుడు, మరియు దేవుని పట్ల భయభక్తులుకలవాడు (యోబు 1:8, 2:3). యోబు న్యాయబద్ధమైన జీవితం జీవస్తూ, దేవుని ప్రణాళికను అర్థం చేసికొనటానికి మానవ జ్ఞానం సరిపోదని వివరిస్తాడు. తన సృష్టిని దేవుడు నడిపించే తీరు, తనకే అవగతమవుతుంది. ఆయనేకదా చివరి శాసనకర్త, ఆయనికదా చివరి న్యాయాధపతి! అంటూ నీతియుక్తమైన తన మాటలతో దేవుని పొగడతాడు యోబు. దానియేలు దేవుని ఆజ్ఞలకు నమ్మకంగా నడిచాడు. పరిశుద్ధ గ్రంథంలో పేర్కొనబడిన నీతిమంతుల ప్రదాన ఉదాహరణలలో దానియేలు ఒకరు. అతను తన జీవితంలోని అన్ని అంశాలలో దేవునికి నమ్మకంగా ఉన్నాడు.

ఇప్పుడు మనం నూతన వేదంలో ఉన్న నీతిమంతులను గూర్చి తెలుసుకుందాం. మొదటగా క్రీస్తుకు సాక్ష్యమివ్వటానికి తానొక స్వరాన్ని అని పేర్కొన్న “బప్తీస్మ యోహాను నీతిమంతుడు, పవిత్రుడు. అందుచే హేరోదు భయపడి అతనిని కాపాడ చూచెను” (మార్కు 6:20). యేరూషలేము దేవాలయమునందు అర్చకుడుగా ఉన్న సిమిమోను గూర్చి కూడా మనకు తెలియజేయబడింది.

“యేరూషలేములో సిమియోను అను ఒక నీతిమంతుడు, దైవభక్తుడు ఉండెను” (లూకా 2:25).

బప్తిస్మ యోహాను తల్లిదండ్రులైన “జెకర్యా, ఎలిశబేతమ్మ దేవుని దృష్టిలో నీతిమంతులై, ఆయన ఆజ్ఞలకును, నియమములకును బద్ధులైయుండిరి” (లూకా 1:6). దావీదు వంశస్థుడును, మరియ భర్తయగు యోసేపు నీతిమంతుడు. మోషే చట్టాన్ని తు.చ. తప్పకుండా పాటించి, తన జీవితాన్ని త్యజించి, దైవం చూపిన మార్గంలో పయనించాడు. కీర్తనాకారుడు ఈ విధంగా అంటున్నాడు: 'సత్పురుషులు నీతిని పాటింతురు. (కీర్తన 94:15). అతను తనివితీరని ఓ తపస్వి. అతను తన తపస్సు దీక్షతో నిర్వహించాడు, దక్షతతో కొనసాగించాడు.

యోసేపును 'నీతిమంతుడిగా' వర్ణిస్తూ మత్తయి అతన్ని మోషే ధర్మశాస్త్రానికి అంకితం చేసిన వ్యక్తిగా గుర్తించాడు, 'నీతిమంతుడైన యూదుడు' అని ప్రశంసించాడు. యేసు ప్రభు పుట్టుకలో భాగంగా మరియను మొదట రహస్యంగా విడిచిపెట్టాలని తలంచినా చివరకు మరియ నిందను కాపాడిన తీరును చూస్తే ఆయనలోని నీతి ధారలుగా ప్రవహించటం మనం చూడగలం. ఆమెను స్వీకరించి ఆమెకు, యేసుకు అన్నీ తానై అండగా నిలుస్తూ... ఎన్ని ఆటు పోట్లు ఎదురైనప్పటికి చేయి విడువకుండా, మాట తప్పకుండా, దైవానికి తన జీవితమే ధారపోసాడు. భగవంతునిచే ఎన్నుకొనబడిన యోసేపు భగవంతుని శాసనానికి శిరసావహించి దైవకార్యాన్ని తనదైన శైలిలో నిర్వర్తించాడు. పరిశుద్ధ గ్రంథంలోనే ఓ గొప్ప నీతమంతుడిగా ముద్రింపబడ్డాడు.

## 2. విశ్వాసం – మనిషిని నీతిమంతుడిని చేస్తుంది

విశ్వాసం ఓ వరం. అబ్రహాము విశ్వసించాడు. తన నిరీక్షణలో ఆయన విశ్వాసం లోతుగా పాతుకుపోయింది. విశ్వాసం హృదయంలో మరియు ఆత్మలో ఉంటుంది. నిరీక్షణకు ఆధారమేలేనప్పుడు అబ్రహాము దేవుని విశ్వసించెను. అబ్రహాము ఇశ్రాయేలు ప్రజలకు పితృపాదుడు. తన ఆదర్శవంతమైన జీవితంతో అత్యున్నత స్థానాన్ని పొందినవాడుగా యూదులు విశ్వసిస్తారు. కేవలం దేవునిపట్ల తనకున్న నమ్మకాన్ని బట్టి దేవుడు అబ్రహామును నీతిమంతునిగా ఎంచెను (ఆది 15:6). దేవునితో సత్సంబంధం కలిగి జీవించాడు. విశ్వాస కవచం ధరిస్తూ

దేవునికి ప్రాధాన్యతనిచ్చాడు. పునీత పౌలు అబ్రహామును గూర్చి ఈ విధంగా అంటాడు, "అబ్రహాము విశ్వసించెను. కనుకనే దీవింపబడెను. అతనివలె విశ్వాసము కలవారు దీవింపబడుదురు" (గలతీ 3:9). అబ్రహాము విశ్వాసానికి పితామహుడు. "విశ్వాసమువలన అన్యజనులను నీతిమంతులుగ దేవుడు చేసికొనును" (గలతీ 3:8). ఒక వ్యక్తి దేవుని దృష్టిలో స్థానాన్ని పొందాలంటే అతనికి ఉండవలసిన మొదటి లక్షణం లేదా అర్హత, అతని పట్ల విశ్వాసం. ఆ విశ్వాసమే అతనిని ముందుకు నడిపిస్తుంది. జీవితంలో ఎదురయ్యే ఏ సమస్యనైన అవలీలగా ఎదుర్కొనగలడు. "విశ్వాసము ద్వారా నీతిమంతుడు జీవించును" (గలతీ 3:11). యోసేపుగారు కూడా దేవునియందు తన ప్రగాఢ నమ్మకముంచారు. కష్టాలలో కూడా సత్యనిష్టను వీడలేదు. అతడు దేవునికి స్పందించాడు. దేవులపట్ల అతనికి విశ్వాసమే లేనట్లయితే అతను ఆ కార్యానికి శిరసావహించి ముందుకు సాగేవాడు కాదు. ఆత్మలో ధైర్యాన్ని నింపుకొని, భగవంతుని మీద ఆధారపడుతు, ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించినట్లు తాను అన్నియు చేసియున్నాడు. విశ్వాసమే ఆయనను దైవకార్యంలో ఎలాంటి కష్టాలనైనా తట్టుకునేలా చేసింది. అందుకే ఆయన మనందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. దేవుని పట్ల ఆయనకున్న విశ్వాసం గమనించదగినది. పరిశుద్ధ గ్రంథంలో ఆయనను గూర్చి ఎక్కువగా ప్రస్తావించక పోయినప్పటికి, యోసేపుగారు మనకు ఆదర్శవంతుడు. మనం దేవునిపై ఆధారపడినప్పుడు అన్నియు మంచికే సమకూరునట్లు దేవుడు చేయును. మనం కూడా దేవునిచే నీతిమంతులముగా అంగీకరింపబడవలయును. ఆయన పిలుపు కొందరికే పరిమితం కాదు. కాని, "'అతడు నీతిమంతుడుగా అంగీకరింపబడెను', అను మాటలు అతనికొక్కడి కొరకే వ్రాయబడలేదు. నీతిమంతులుగా అంగీకరింపబడవలసిన మనలను గూర్చి కూడా అవి వ్రాయబడినవి" (రోమీ 4:22-23). మనమును వారివలె దేవునిపై అచంచల విశ్వాసం కలిగి నీతిమంతులముగా పరిగణింపబడాలి. మన విశ్వాసం ద్వారా నీతిమంతులమైనప్పుడు మనం దేవునితో శాంతిని అనుభవిస్తాము. అప్పుడు మన జీవితపు బాధాకరమైన ఇబ్బందులు మనలను కలవర పెట్టువు, మనం నిరుత్సాహానికి గురికాని ఆశతో ఉంటాము. మోక్షానికై మనం వేసే ప్రతి అడుగు మనలను క్రీస్తుతో ఐక్యం చేస్తుంది. ఎప్పుడైతె విశ్వాసంతో నీతివంతమైన జీవితం

జీవిస్తామో, మనం శాశ్వతమైన మోక్షాన్ని పొందగలం.

## 3. నీతిమంతునికి ఉండవలసిన లక్షణాలు

నీతి అనేది అత్యంత ఆసక్తికరమైనది మరియు ప్రత్యేకమైనది. అది భగవంతుని గుణాలన్నిటిని వ్యాపింపజేస్తుంది. నీతి అనేది మంచి అన్నింటి కలయిక మరియు సమ్మేళనం. ఇది స్వర్గపు శక్తి సూత్రాలను కలిగి స్వర్గానికే మానవుని నడిపిస్తుంది. జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి సందర్భంలోను ముందుకు సాగడానికి సరైన మార్గం లేదా తప్పుడు మార్గం ఉంటుంది. సరైన మార్గాన్ని అన్వేషించి ముందుకు సాగితే పరలోకం చేరుకుంటాం లేదా అదోగతి పాలవుతాము. అది మన ఎంపికపై ఆధారపడి ఉంటుంది. కిర్కగార్డ్ అనే తత్వవేత్త ఈ విధంగా అంటాడు: జీవితంలో ప్రతీది స్వచ్ఛమైన ఎంపికపై ఆధారపడి ఉంటుంది. ఒకదానిని నిర్వహించడానికి స్వచ్ఛందంగా నిర్ణయించుకునే సామర్థ్యం. పరిశుద్ధ గ్రంథంలో కూడా ఇటువంటి తత్వశాస్త్రం ఉంది. "జీవమును, మరణమును నేడు నేను మీ ముందు ఉంచుచున్నాను. ఈనాడు నేను మీకు విధించిన ప్రభువాజ్ఞలు పాటింతురేని, ఆయనను ప్రేమించి, ఆయనకు విధేయులై, ఆయన శాసనములెల్ల నెరవేర్తురేని, మీరు అభివృద్ధి చెందుదురు. ప్రభువు మిమ్ము దీవించును. కాని మీరు ప్రభువును విడనాడుదురేని తప్పక నశింతురు (ద్వితి 30:15-18). కావున మన నిర్ణయాలపైననే మన జీవితం ఉంటుంది. ప్రభువు మనలను నీతిమంతులుగా పరిగణించాలంటే మనం ఈ క్రింది లక్షణాలు లేదా అర్హతలు కలిగి ఉండాలి.

### అ. ఋజువర్తన

ఒక వ్యక్తి నీతిమంతునిగా ఆదరించబడాలి అంటే అతనికి నిండైన మంచి ప్రవర్తన ఉండాలి. కీర్తన 1:1-3, (మొదటి భాగంలో) రెండు త్రోవలలో మొదటిది సత్పురుషులు పయనించు మార్గం. అలాంటి త్రోవలో నడచు నరులు ధన్యులు అని తెలియజేస్తుంది. తాను చేపట్టిన కార్యములన్నిటను విజయమును బడయును. "నీతిమంతుల మార్గము ప్రభువునకు తెలియును" (కీర్తన 1:6). ఋజువర్తన కలిగిన వారు ఎల్లకాలము ఫలింతురు. వారు మంచిని ఆస్వాదించి చెడును

విసర్జిస్తారు. వారు ప్రభువు నీతిమంతుడనియు, నాకు ఆశ్రయదుర్గమైన దేవునియందు దోషమేమియు లేదనియు రుజువు చేయుదురు" (కీర్తన 92:15). వారు దేవుని నుండి గ్రహించిన నీతిని అలవరచుకొని వారి జీవితాలలో అన్వయించుకుంటారు. "ఋజువర్తనులు ఆనందమును బడయుదురు" (కీర్తన 97:11).

## ఆ. దేవుని పట్ల భయభక్తులు

దేవుని పట్ల భయభక్తులు అంటే అతనికి భక్తి, విధేయతలు చూపడం. తద్వారా అతనితో ఉన్న సంబంధాన్ని గ్రహించడం. నీతిబద్ధంగా జీవించడానికి ప్రయత్నించడం అంటే విధేయతతో మనం చేయగలిగినదంతో చేయడానికి ప్రయత్నించడం. మన తరపున దేవుని ప్రణాళిక నెరవేరుతుందన్న అంతర్గత శాంతి వస్తుంది. నీతిమంతునిగా జీవించడానికి మనం చేయగలిగినదంతా చేస్తున్నాం అని తెలుసుకోవడం కంటే మన ఆత్మలో మరే ఇతర అనుభూతి ఆనందాన్ని తీసుకురాదు.

"దేవునిపట్ల భయభక్తులు కలిగియుండుటయే విజ్ఞానమునకు మొదటిమెట్టు" (సామెతలు 1:7). అంటే దేవుని చిత్తానికి గౌరవప్రదమైన మరియు ప్రేమపూర్వక విధేయతను కలిగి జీవించడమే. దేవుని పట్ల భయభక్తులు కలిగిన జీవనశైలిని పెంపొందించుకోవడంలో కనీసం మూడు విషయాలు ఉంటాయి. అవి :

(1). దేవునితో సాన్నిహిత్యం (2). ఆధ్యాత్మిక జీవన విధానం (3). మనల్ని మనం జవాబుదారీలుగా చేసుకోవడం. మనం దేవునికి 'భయపడినప్పుడు' ఆయన దివ్యమైన, అపారమైన జ్ఞానం మనకు అందుబాటులోకి వస్తుంది. ఆ జ్ఞానం మనకు మంచి, చెడులను ఎంపిక చేసుకోవడంలో దోహదపడుతుంది. "దేవునిపట్ల భయభక్తులు చూపుటయనగా దుష్టత్వమును అసహ్యించుకొనుటయే" (సామె 8:13). చేడు నుండి దూరంగా ఉండటమే జ్ఞానం. మన జీవితంలో ఎలాంటి చెడును నివారించడానికైనా భగవంతుడు ప్రసాదించే జ్ఞానం మనకు శక్తినిస్తుంది.

భగవంతుడు నరుని సవరించి, సరిచేసి, సరయిన, నీతియుక్తమైన మార్గంలోకి తీసుకువస్తాడు. అప్పుడు ఆయన ప్రేమకు పాత్రులమవుతాం. యోసేపుగారు

దేవునిపట్ల భయభక్తులు కలిగి భోగాన్ని వదలి, త్యాగాన్ని వలచాడు. సత్యమైన మార్గాన్ని అనుసరించాలన్న వ్యక్తిత్వం ఆయనలో ఎప్పుడూ ఉంది. అటువంటి తన ధోరణి లేదా వైఖరి దేవునిపట్ల భయభక్తులు కలిగి జీవించేలా చేసింది.

### ఇ. పాపమునకు దూరంగా ఉండుట

పాపమునకు దూరంగా ఉండడమంటే నిరంతరం మంచిని అంటిపెట్టుకొని జీవించడమే. మన మనసాక్షే మనం చేసే పనుల యొక్క నైతికతను నిర్ధారించడానికి మనకు సహాయపడే అంతర్గత స్వరం. మంచిని చేయడం మరియు చెడును విడిచిపెట్టడం ద్వారా దేవుని అనుసరించటానికి మనకు మార్గనిర్దేశం చేస్తుంది. మంచిని చేయుటయే మీ ధ్యేయంగా పెట్టుకొనండి. “అవకాశము దొరికినపుడెల్లా మనము అందరకును మంచిని చేయుచుండవలయును” (గలతీ 6:9). దేవుని వాగ్దానానికి అనుగుణంగా “నీతికి నిలయమగు క్రొత్త దివిని, భువిని దేవుడు వాగ్దానమొనర్చెను” (1 పేతురు 3:13). దేవుడు వచ్చునప్పుడు పాపమునకు దూరంగా ఉంటూ, సాధ్యమైనంత కృషి ఒనర్చువారు ఆ నీతికి నిలయమగు క్రొత జీవితంలోకి అడుగుపెడతారు. యోసేపుగారు, మానవ జీవితములో ఉన్న పరిమితులను తన సొంత ఇష్టంతోనే స్వీకరించారు. నీతిమంతుడయిన ఒక యూదుడుగా పాపమునకు దూరముగా ఉంటూ, ధర్మబాటను వీడలేదు.

## 4. పరిశుద్ధ గ్రంథంలో నీతి యొక్క ప్రాముఖ్యత

నీతి యొక్క ప్రస్తావన పరిశుద్ధ గ్రంథంలో అనేక సార్లు అనేక సందర్భాలలో ఉపయోగించబడినది. యేసు ప్రభువే నీతిని వెదకమని ఆహ్వానిస్తున్నారు. “మొదట ఆయన రాజ్యమును, నీతిని వెదకుడు. అప్పుడు అన్నియు మీకు అనుగ్రహింపబడును” (మత్తయి 6:33). నీతి అనే పదానికి గ్రీకు పదం డికైయోసిన్ (Dikaiosyne) దీని అర్థం ‘దేవునికి ఆమోదయోగ్యమైన స్థితి’. మన రోజువారి జీవితములో మనం చేసే ప్రతి పని న్యాయవంతంగా వర్తించేలా ఉండాలి. ఈ లోకంలో ఏ ఒక్కరూ నీతిమంతులు కాదు. నిజమైన నీతి సూర్యుడు – క్రీస్తే. తన నిష్కళంక జీవితంతో మనలను ఆధ్యాత్మిక జీవనంలో ఉద్రూతలూగిస్తూ, మనం నీతిపథంలో నడవాలని ఆయన వాంఛ. మానవ నీతి ప్రథమంగా దేవుని నీతి నుండి ఉద్భవించినదై ఆయనను చేరుకోవడానికి మనకు దోహదపడుతుంది.

## అ. దేవుడు మన నుండి కోరుకునేది నీతి

దేవుడు మన నుండి పెద్ద పెద్ద బహుమానాలు ఏమి కోరడు. ఆయనకు అవి ఎక్కువ ప్రీతిని కలిగించవు. మన జీవిత విధానం ఆయనను ఎక్కువ సంతోషపెడుతుంది. మనం అర్పించు బలులవలను కూడా ఆయన కదిలిపోడు. అందుకనే ఈ విధంగా చెప్పబడింది: "బలినర్పించిన దానికంటె గూడ అధికముగా నీతి న్యాయములవలన ప్రభువు ప్రతిచెందును" (సామెతలు 21:3). మతపరమైన అర్పణలు కంటే మన చర్యలు న్యాయమైనవిగా ఉండాలి. అది మాత్రమే ఆయన మన నుండి ఆశించేది.

## ఆ. నీతిని మనం తప్పనిసరిగా అలవరచుకోవాలి

యోసేపు గారి గురించి కేవలం ఒక్క సుగుణం మాత్రమే చెప్పబడింది. ఆయన నీతిమంతుడని, ఈ నీతి అను గుణములో సర్వ గుణములు ఇమిడి ఉన్నాయి. అందుకనే ఆయనకు ప్రతీ సుగుణం చక్కగా ఆపాదించబడుచున్నది. అనేక ప్రతిభలు ఒక మనిషిలో సమకూరటం నిజముగా ఓ గొప్ప విశేషం. 1వ యోహాను 2:29 లో "క్రీసు నీతిమంతుడని మీకు తెలియును", అని యోహాను తెలియచేస్తున్నాడు. మనము నీతిని కలిగి ప్రవర్తించినట్లయితే మనం దేవుని మూలముననే జన్మించి ఉన్నామని అందరు తెలుసుకొందురు. నీతి మూలముగా యేసు క్రీస్తు పరిపాలించును (రోమీ 5:21). "మీ శరీరములయందలి అవయవములను నీతికి సాధనములుగా ఆయనకు సమర్పించుకొనుడు" (రోమీ 6:13). పదే పదే మనలను మనం పవిత్రీకరించుకోవాలని పరిశుద్ధ గ్రంధం తెలియజేస్తుంది. కావున నీతిని తప్పనిసరిగా మనం అలవరచుకోవాలి.

## ఇ. మనం నీతిలో ఎదగాలి

మన దైనందిన జీవితంలో నీతిలో ఎదగాలి. మనం ఎంత ఎక్కువగా నీతిని ఆచరిస్తామో మనం దేవుని దృష్టిలో అంత గొప్పగా ఉంటాము. నీతిమంతుల మార్గం ప్రకాశించే సూర్యుని వంటిది. మనిషిలోపల నీతిపరమైన ఎదుగుదల లేకపోతె అతని ఆత్మలోకంలో ఘర్షణ ఎదురవుతుంది. అష్ట భాగ్యములలో ప్రభువు, "నీతి నిమిత్తం ఆకలిదప్పులు గలవారు ధన్యులు, వారు సంతృప్తి పరపబడుదురు"

(మత్తయి 5:6). మనకు క్రీస్తుకు సంబంధిన నీతి ఉండాలి. అటువంటి నీతి నిమిత్తం మనం తహతహలాడాలి. ఎడారిలో నీటి కొరకు ఒకరు ఏవిధంగా అయితే పరితపిస్తారో అలాగున మనం నీతి కొరకు చలించిపోవాలి. మన ఆకలి మరియు దాహం ఆయన కోసం ఉండాలి. ఆయనను చేరాలి అన్న తృష్ణ మన జీవితాలలో పాతుకుపోవాలి. ప్రపంచానికి బదులుగా దేవుని చిత్తానికి అనుగుణంగా జీవించాలి. యోసేపుగారు తనకంటూ తాను ఏమి చేయలేదు. దేవుని చిత్తానికి తలవంచాడు. ఈ విషయాన్ని పరిగణలోనికి తీసుకోవాలి. ఆయన తనకంటూ ఒక నిర్దిష్టమైన స్థానాన్ని కోరుకోలేదు. ఆయనలా మనమును ఎదగాలి అంటే నీతి నిమిత్తం నడచుకోవాలి, అప్పుడు సంతోషంగా మరియు సంతృప్తిగా ఉండగలము.

**ముగింపు**

విశ్వసృష్టి వేదికపై విధాత, క్రీస్తు, చేసిన బలిదానానికి ఎందరో ఉపకరించారు. మానవులందరు రక్షింపబడాలి అన్న దైవ సంకల్పం ద్వారా దేవుడు ఎన్నుకున్న వారిలో, అర్హత పొందిన వారిలో యోసేపుగారు ఒకరు. అతని జీవన విధానం నిశ్శబ్దంగా ఎక్కువ మాట్లాడకుండా ఉన్నప్పటికి, ఆయన ఆధ్యాత్మిక బల సంపన్నుడు. ఆధ్యాత్మికత అన్నది ఆకాశంలో లేదు, అది భూమి మీదే ప్రాణం పోసుకోవాలి అని తన నీతియుక్తమైన జీవితం ద్వారా మనలను ఆహ్వానిస్తూ, మన హృదయాలలో ఆసక్తిని ప్రేరేపిస్తూ ఒక నిజమైన స్ఫూర్తిదాతగా నిలుస్తూ ఉన్నారు. దేవునిపట్ల ఆయనకు ఉన్న ఔన్నత్యం, అచంచలమైన ప్రేమ మొదలగు సుగుణాల మూర్తిగా దైవకార్యంలో చెప్పుకోదగ్గ, నమ్మదగిన, ఆదర్శ వ్యక్తిగా నిలిచాడు. మనం నీతిమంతులముగా ఉన్నామని నిర్ధారించుకోవటానికి ఒకే ఒక మార్గం, అది ఏమిటంటే, అన్నిటికంటే ముందు దేవునికి మొదటి స్థానం ఇవ్వడం. యోసేపుగారు అటువంటి స్థానాన్ని దేవునికి ఇస్తూ, అనిశ్చిత మరియు హింసల మధ్య అతను అద్భుతమైన ధైర్యాన్ని చూపించాడు. అతను వినయపూర్వకమైన వడ్రంగి జీవితాన్ని గడుపుతూ తనకు ఒప్పజెప్పబడ్డ కర్తవ్యాన్ని దీక్షతో నిర్వహించాడు.

# 14. దివ్యవాక్కును ధీటుగా అనుసరించిన ధీరుడు - పునీత యోసేపుగారు

- బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్



## పరిచయము

పరలోక దేవుని రక్షణ ప్రణాళిక ఒక రహస్య ప్రణాళిక. అనేక తరముల నుండి రహస్యముగా భద్రపరచబడినది. ఇప్పుడు దేవుడు మనకు విశద మొనర్చెను. పరలోక దేవుడు విశదము ఒనర్చిన పరమ రహాస్యము (ఎఫెసీ 1:9), సజీవమును, చైతన్యమైన వాక్కును (హెబ్రీ 12:4) ఆదిలో ఉన్న వాక్కును (యోహాను 1:1) దేవుడు యుక్తసమయమున ఆయన ప్రణాళిక సాధనములుగా వినియోగించబడిన సాధారణమైన సాధనములే కానీ ఉత్తమ సాధనములుగా, పవిత్ర సాధనములుగా నీతియుక్తమైన సాధనములుగా దేవుని దృష్టిలో ఎంచబడి సాదుశీలులు, వినంమ్ర హృదయులు అయిన పరిశుద్ధ యోసేపు, మరియమ్మ గార్లకు ఎరుకపరచబడెను. వీరు ఇరువురు కూడా వారి స్వంత ఆలోచనలు కంటెను, స్వలాభం కంటెను దేవుని చిత్తాన్ని చేయుటమే వారి హృదయ వాంఛగా నిర్ణయించుకున్న వీరి "నోటి మాటలు, హృదయ తలంపులు దేవుని మన్నన బడసినవిగా ఉండెను" (కీర్తన 19:14). రక్షణ ప్రణాళిక పరిపూర్తి చేయువరకు వారి జీవితములో "దేవుని వాక్కే వారి త్రోవలకు వెలుగు"గా (కీర్తన 119:105) మార్చుకొన్న విశ్వాస వీరులు వీరు. "రాబోవు కాలములో దైవ వాక్కు కరువు వచ్చును" (ఆమోసు 8:11) అని చెప్పబడెను. అనేకుల జీవితములో దైవ వాక్కుకు కరువు వచ్చెను కాని దేవునికి ప్రియ దాసులైన యోసేపు మరియ జీవితములో దైవాక్కు సంమృద్ధిగా ఉండెను, ఈ దైవ వాక్కు ప్రతి నిత్యము వీరికి దేవుడే స్వయముగా

బోధించుచుండెను (యెషయా 63:9), "వీరి కాలిని కుడికి గాని ఎడమకు గాని తొట్రిల్ల నీయక" దేవుని త్రోవలో ప్రయాణింప చేసెను నడిపిన (యెషయా 30:20-21) దైవస్వరం.

నేడు స్వర్గరాజ్య సియోనులో దేవదూతలతో కలిసి దేవుని కీర్తిస్తూ ఉన్న వీరు, లోకంలో ఎన్నో రకాల గంభీర ధ్వనులు అలజడులు ఉన్నప్పటికి వారి హృదయమును మాత్రం అనునిత్యము దేవుని వాక్కుని వినడానికి తమను తాము నియంత్రించకొనడమే కాక ధనబలమో, కండబలమో, గుండె బలములపై ఆధారపడక (జెకర్యా 4:6, సామేతలు 3:6) "దేవుని వాక్కును మాత్రమే ఆధారముగా చేసుకుని", దేవునికి ప్రీతికరమైన జీవితం జీవించి "దృష్టి వలన కాక విశ్వాసం వలన నడిపిచిన" (2 కొరింతీ 5:7) వీరి జీవితాలు మనకు ఆదర్శనీయం. వీరి జీవన గమనానికి దివ్య వాక్కు మాత్రమే మూలం అనునది అగత్యం (ప్రశంసనీయము). దేవుని వాక్కు జరిగి తీరును అని విశ్వసించిన వీరు ధన్యులు. దివ్య వాక్కును మాత్రమే అలకించి, అంగీకరించి అనుసరించిన పరలోక దేవుని సైనికులు వీరు.

## 1. దేవుని మహోన్నత స్వరం - పునీత యోసేపుగారి వినయామృత హృదయము

పరిశుద్ధగ్రంధం ఆధారముగా చూస్తే పునీత యోసేపు గారికి ఉన్న బలం, బలగం, ఆధారం ఏమి లేదు, తనకు సలహాలు ఇచ్చి మంచి మార్గంలో నడిపించడానికి ఎవ్వరి దగ్గరికి వెళ్ళినట్లు దాకలాలు కూడా లేవు. కాని గమనార్హం ఏమనగా, ఆయనకు ఉన్న ఆధారం అంతా దైవవాక్కు ఒక్కటే. దేవుని స్వరాన్ని అందరూ వినాలి అనుకుంటాం, దేవుని చూడాలి అనుకుంటాం కాని పదేపదే దేవుని స్వరానికి బదులుగా ఈలోక శబ్ధం, అలజలడులు వైపు మన మనస్సులను లగ్నం చేస్తూ ఉంటాం కానీ పునీత యోసేపుగారు మాత్రం ఈలోక పోకడలకు, మాటలకు, శబ్ధాలకు తన మనస్సును విడచిపెట్టక, వచ్చినది ఏదో కేవలం కలయే కదా అని విడచిపెట్టక తనతో మాట్లాడినది దేవుని స్వరం అని గ్రహించి గొప్ప భయ భక్తులతో, వినయ వినమ్రతతో దైవ వాక్కుకు,

తాను ఉన్నది మౌనంగానే అయినా తన మౌనంతోనే "మాట్లాడుమో మహాప్రభు ఆలకించుచునే ఉన్నాను" సమూవేలు 3:10 అని, తన భౌతికమైన ఆలోచనా శక్తికి, తెలివితేటలతో, తప్పించుకుని పోవుటకు ప్రయత్నించక నేను నీ దాసుడను అని హృదయము విప్పి దివ్వ వాక్కును మౌనంగా మనస్సునందు పదిల పరచుకున్న పరమోన్నతుడు.

మలాకీ నుండి మత్తయి వరకు కొన్ని వందల సంవత్సరముల కాల వ్యవది ఉన్నను లోక రక్షకుడు మెస్సయ్య కొరకు యూదులు అందరూ భౌతికంగా ఎదురుచూచుచున్నారు. కానీ, ఆ దేవాది దేవుని ధర్మించుటకు నిర్మల హృదయముతో, పూర్ణ ఆత్మ శరీరములలో పవిత్రత కలిగి, యెషయా పలికిన ప్రవచనం నెరవేరుబడును అని, దివ్య వాక్యం కార్యరూపం దాల్చునని వేచియున్న ఆశాజీవి పునీత యోసేపుగారు. ఈ లోకం, మనుష్యులు, లేదా యోసేపు గారి స్వీయ ఆలోచనజ్ఞానము తన భవిష్యత్తు గురించి కాని, లేక సమాజాన్ని ఎదుర్కోవడం పట్ల పలు రకములైన బయములు మనస్సులో కలిగి ఉండవచ్చు కాని, (యిర్మియా 23:29) "దేవుని వాక్కు నిప్పువంటిది, సమ్మెట వలే రాళ్ళను బ్రద్దలు చేయునది కాదా?" (యిర్మియ 5:14) "ప్రభూ మాటలు మన నోటిలో అగ్ని వలే ఉండును". యోసేపు గారి వ్యక్తిగత జీవితములో ప్రవేశించిన అగ్ని వంటి దివ్యవాక్కు తనలో వస్తున్న అవమానములకు, భయములకు సవాళ్ళు ఎదుర్కోవడానికి యోసేపుగారిని కృంగదీస్తు వెనకుకు లాగుతున్న అన్నింటిని దివ్యవాక్కు కాల్చివేసినది.

దివ్యవాక్కు యోసేపుగారిలో చెలరేగుతున్న భయములను జయించే శక్తి దయచేసినది, పునీత పౌలుగారి మాటలలో "నేను ఎక్కడ బలహీనుడనో అక్కడే బలవంతుడను" (2 కొరింతీ 12:10) దైవవాక్కును ఆలకించిన యోసేపు గారిలో నూతన జీవం ప్రవహించినది (యిర్మియా 20:9). తనలో ప్రవేసించిన వాక్యం శారీరిక మరియు సామాజిక పరిస్థితులను అధిగమించి తనకు అప్పగించిన పనిని సంపూర్ణమొనర్చుట మొదలపెట్టెను, "వాక్కు అణగద్రొక్క బడడం అసాధ్యం" (2 తిమోతీ 2:9). వాన మంచు భూమి మీద పడి ఎలా

మొక్కలు పెరుగుటకు దోహదపడునో, "వాన మంచు వ్యర్థంగా పోకుండా ఎట్లు జీవాన్ని ఇచ్చునో అట్లే దేవుని వాక్కు కూడా వ్యర్థంగా పోక దైవ కార్య సాధనకు ములరాయిగా నిలచినది" (యెషయా 55:10).

## దేవుని వాక్కును నెరవేర్చుటకు నిశ్చయించుకొనిన నీతిమంతుడు

"ఆ కాలంలో దేవుని వాక్కు చాలా అరుదు" అని 1 సమూ 3:1 చదువుతూ ఉన్నాము, తరువాత ప్రవక్తల ద్వారా, రాజుల ద్వారా అనేక పర్యాయములు దేవుడు, తన వాక్కును ప్రజలకు అందచేసి తన ప్రణాళికను నెరవేర్చుట చూస్తూ ఉన్నాం. పాత నిబందన గ్రంథంలో చివరి ప్రవక్త అయిన మలాకి నుండి నూతన నిబంధనలో జెకర్యకు (ప్రవచనం) వాగ్దానం ఇచ్చేవరకు దేవుని స్వరం జాడ మనకు ఎరుక పరచబడలేదు. కానీ దేవుని స్వరం నీతిమంతులైన జెకర్య ఎలిజబేత్తమ్మ కుటుంబంలో దైవ ఆశీర్వాదం, రక్షణ ప్రణాళికకు మార్గం సిద్ధపరుస్తూ దేవుని వాక్యం వారికుటుంబంలో పునీత బప్తిస్మ యోహను గారి రూపంలో ఫలించెను. ఇది అట్లు ఉండగనే "నీతిమంతుడైన యోసేపు" (మత్తయి 1:19), దేవుని దూత కల రూపంలో దైవ స్వరం ద్వారా మాట్లాడెను పరలోక దేవుని దర్శనమును (Divine Revelation) యోసేపు గారికి ఎరుకపరచెను (మత్తయి 1:21) "ఆ కుమారునికి యేసు అని పేరు పెట్టవలెను" అని దూత పలికెను ఇది మొదటి ఘట్టంగా చూస్తున్నాం. "హేరోదు శిశువు హత్యకు పాల్పడుబోవుచున్నాడు కావున వెంటనే తల్లిని, బిడ్డను తీసుకుని ఐగుప్తు దేశమునకు పయనమై పోవుమని" ఆజ్ఞాపించిన దేవుని స్వరం దేవదూత ద్వారా రెండవ పర్యాయము కూడా యోసేపుకు వినబడెను (మత్తయి 2:13,14). ఒక వేళ ఈ బిడ్డతో ఇలా పలాయనమై పోవుట ఎవరైనా రాజోద్యోగులు గమనించినచో ముగ్గురు ప్రాణాలకు ముప్పే. ప్రాణాలనే పణంగా పెట్టి దైవ వాక్కును అంగీకరించిన ఉత్తమ సేవకుడు. (I will appoint you as guard over the David's house hold) ఎన్నో కష్టాల మధ్యలో హేరోదునుండి తప్పించుకొని ప్రాణాపాయ పరిస్థితులలో అన్య దేశానికి అందులోను శత్రుదేశంలో అనాదగా ఎదో తనకు ఉన్న చిన్న చేతిపనిని చేసుకుంటూ ఇప్పుడే స్థిరపడుతున్న అనుకునే సమయంలో మరొక్కసారి దేవుని వార్త యోసేపుకి

వినిపించినది. అది (మత్తయి 2:20) అన్ని విడచి పెట్టి దేవుని వాక్యానికి తలవంచి నాబుద్ధి, నా బలములు కాదు కాని దేవుని వాక్యమే ఆధారంగా చేసుకొన్న యోసేపుగారు "ఐగుప్తు నుండి నజరేతుకు ప్రయాణమై నజరేతు వాసిగా స్థిరపడెను".(మత్తయి 2:23)

పరిశుద్ధ గ్రంథమునందు ఈ విదంగా మూడు పర్యాయములు యోసేపుగారు దేవుని వాక్కును విన్నారు, వినడమే కాక అంగీకరించారు అంగీకరించడం కాక ఆచరణలో ఉంచారు ఈ సంఘటనలు అన్ని పునీత యోసేపుగారు దైవ వాక్కును తూచా. తప్పక పాటించే మహా గొప్ప గుణగణములు కలిగిన నీతిమంతుడైన యూదుడు అని అర్థం అవుతుంది. పైన చర్చించిన మూడు సంఘటనలు ఏదో ఆకస్మికముగా జరిగినవి కావు కానీ ముందుగానే ఎరుకపరచబడినవి. దివ్య వాక్కులో పరిష్టత కలిగిన యోసేపు మూడు పర్యాయములు కలలో దూత కనిపించి పలికిన పలుకులు అన్నియు పూర్వనిబంధనలో గ్రంథస్థం చేయబడినవి. మరి ముఖ్యంగా ఇవి పూర్వ నిబంధన ప్రపచనములు. ఇవి దైవ వాగ్ధానములు నెరవేరును అని గొప్ప ఆశతో ఎంతోమంది నిరీక్షించుచుండిరి కాని నీతిమంతుడైన యోసేపు మాత్రం తనకు కలలో కనిపించి పలికిన మాటలు దేవుడు తమ పితరులకు చేసిన వాగ్ధానములు ప్రవచనములు ఇవే అని ఎరిగి, అట్టి వాగ్ధానములు, ప్రవచనములు కార్యరూపం దాల్చుడానికి, దైవ వాక్కును ఎరిగి, దైవవాక్కును పాటిస్తున్న యోసేపు గారు దేవుని ప్రణాళికను గ్రహించుకొని వచ్చినది కల మాత్రమే అని భావించక దేవుని ప్రసన్నతను అనుభవించి అనుమానం కానీ, భయం కానీ ఆయనను అధిగమించుటకు అనుమతించలేదు. ఇక్కడ గ్రహించవలసిన విషయం ఏమనగా "ప్రవక్తల మూలమున ప్రభువు పలికినది నెరవేరునట్లు ఇది అంతము సంభవించెను" (మత్తయి 2:15). తనకు కలలో కనిపించి దేవుడు తన దూత ద్వారా పలికిన ప్రతీ పలుకు కూడా పూర్వము ప్రవక్తల ద్వారా పలికినది మరియు యూదా సమాజము అంతము నిరీక్షిస్తున్న ప్రవచనములు నెరవేరుటకు దేవుని వాక్కు నెరవేర్చు సాధనముగా దేవుడు యోసేపు గారిని ఎన్నుకొనెను అని ఎరిగి దివ్య వాక్కును దేవదూత చెప్పుచుండగా

పూర్వ ప్రవచనములు నెమరువేసుకొంటూ వినయ విధేయతలతో ఆలకించి ప్రధాన సేవకునికే సేవకుడుగా యోసేపుగారు నిలిచారు.

## ఆశలను అణగద్రొక్కుకుని దేవుని వాక్కును అంగీకరించుట

ప్రతీ యవ్వనస్తుడు తన వివాహ జీవితాన్ని గురించి, అందులోను నిశ్చితార్ధం చేయబడిన తరువాత తన ఆశలు, ఆశయాలు మరియు వైవాహిక జీవితం పట్ల తనకు ఉన్న ప్రణాళికలు, ఆలోచన విధానం ఇంకను వ్యక్తిగత జీవితం గూర్చిన ఆలోచనలు, శారీరక ఇష్టాఇష్టాలు, మనోభావాలు మన రోజు వారి కుటుంబ జీవితంలోను, స్నేహితుల విషయంలోను చూస్తూనే ఉంటాం సరిగ్గా ఇదే సందర్భంలో ఉన్నారు యోసేపుగారు. నిశ్చితార్ధం జరిగించబడి ఇక వైవాహిక ఒప్పందం కొరకు గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్న యోసేపు గారి జీవితంలో అనుకోని సంఘటన, ఒక దైవదర్శనం తన ఆలోచనలు అన్నీ వమ్ము చేసినట్లు అయింది. కానీ దైవ భయం, దైవ జ్ఞానం కలిగిన యోసేపుగారు తన ఆశలకు కానీ లేదా సమాజం పలికే మాటలకు చోటు ఇవ్వకుండా, తన ఆలోచనలు కాదు కాని దేవుని ఆలోచనే తన ఆలోచనగా మార్చుకోవాలని నిశ్చయించుకున్నాడు.

కన్య అయిన మరియ గర్భం ధరించినది అని తెలుసుకొని రహస్యముగా విడనాడుటకు తలంచెను కానీ ప్రవక్తల ప్రబోధమును ప్రభువు పలుకులు దేవదూత ద్వారా తెలియపరచబడిన పిదప తన వ్యక్తిగత, సామాజిక ఆలోచనలకు స్వస్తి చెప్పి దేవుని మాటలు జరిగి తీరును అని నమ్మెను యోసేపు గారు. తన ఆలోచనలు దైవార్పితం చేసి పునీత పౌలుగారి మాటలలో రోమీ 12:1 “శరీరములను సజీవయాగంగా సమర్పించి” దేవునికి ప్రీతి కలిగించి దైవ చిత్తాన్ని నెవవేర్చడానికి లౌకిక, శారీరక, మానసిక అడ్డుగోడలు దాటి యోహాను 12:24 ప్రకారం “ఒక గోధుమ గింజ భూమిలో పడి నశించినట్లే” పునీత యోసేపుగారు తన స్వంత కొరికలను, ఆలోచనలు నశింప చేసి దైవత్వంలో ప్రవేశించి దైవచిత్తనుసారిగా మెలగిన మహానీయుడు.

యోసేపుగారు మరియగర్భం ధరించినది అన్న విషయం ఎరిగి ఎలిజబేత్తమ్మను సందర్శించడానికి వెళ్ళిన మరియ తిరిగి వచ్చువరకు పునీత యోసేపుగారు మరియమ్మ కొరకు వేచి ఉండెను. లూకా 1:56 "మూడు మానములు తరువాత మరియమ్మ తన స్వగ్రామమునకు వెళ్ళెను".

- యువకుడైన యోసేపు ఇస్రాయేలు యొక్క ఆచార కట్టుబాట్లు దాటి మరియమ్మను తన భార్యగా అంగీకరించాడు (మత్తయి 1:20).
- జనాభా లెక్కలలో పేర్లు నమోదు చేయించుకొనుటకు మరియమ్మను తీసుకొని బెత్లెహేమునకు ప్రయాణమైపోయెను (లూకా 2:4).
- దేవుని మాట ప్రకారం, పుట్టిన బిడ్డకు "యేసు" అని నామకారణం చేసెను (మత్తయి 1:21).
- యోసేపుగారు తన భాధ్యత ప్రకారం, యూదా ఆచారం ప్రకారం శుద్దీకరణ కావించెను (లూకా 2:22).
- తన ఆర్ధిక పరిస్థితిబట్టి ఒక జతగువ్వలను అర్పించెను (లూకా 2:33)

తన భార్య అయిన మరియమ్మను మరియు బిడ్డను తీసుకొని శత్రుదేశమైన ఐగుప్తునకు పలాయనమై పోయెను. పైన తెలుపబడిన ప్రతి సందర్భం మనకు భోధించినది ఏమనగా యోసేపు నీతిమంతుడు కనుక మానవ మాత్రులకు భయపడకుండా దేవుని చిత్తాన్ని నెరవేర్చుటలో తన ఆనందాన్ని సంతోషాన్ని అన్నింటికన్నంటే మిన్నగా తన జీవితానికి పరమార్ధాన్ని ఇచ్చేలా జీవించాడు.

కష్టాలు, నష్టాలు, నిందలు, అవమానములు చేత త్రోసివేయబడక దైవ దర్శనం (కలల) ద్వారా నడిపించబడ్డారు. దేవునితో ఉన్న సత్సాంగత్యం పునీత యోసేపుగారికి బలంగా మారింది.

## కంటి చూపు వలన కాక విశ్వాసం వలన నడిచిన పునీత యోసేపు

ప్రపంచంలో దేవుడు ప్రతి మానవుని ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో సృష్టించారు. మనిషి ఏ ఉద్దేశ్యము కొరకు సృష్టించబడ్డాడో, ఆ ప్రత్యేకింపబడిన ఉద్దేశ్యము నెరవేర్చు వాని జీవితం చిరస్మరణీయం.

దైవ చిత్తాన్ని అంగీకరించడం కంటే ఎక్కువ పవిత్రమైనది, పరిపూర్ణమైనది మరొకటి లేదు. – పునీత విన్సెంట్ దె పాల్

“దైవచిత్తం ఇది మానవుని దృష్టికి అగోచరం కాని విశ్వాసపు దృష్టితో నడుచుకొను వ్యక్తులకు మాత్రం సుస్పష్టం”. పునీత యోసేపుగారు కూడా అగోచరములైన క్రియలను విశ్వాస కన్నులతో చూస్తూ అసాధ్య క్రియలను నమ్మి దేవుని చేయుదములను పరిపూర్తి చేసిన వ్యక్తి.(2 కొరింతీ 4:18)

## ఉన్నత పిలుపు అందుకొన్న పునీత యోసేపుగారు

లోకంలో ఎంతోమంది తమ పిలుపును తెలుసుకొనక అన్య మార్గాలలో నడుస్తూ జీవిత అర్థాన్ని, ఆశయాలను కోల్పోతున్నాము.

ఉదా : బైబిల్లో యవ్వనంలో ఉన్న ఓ వ్యక్తి దేవుని తెలుసుకొనక ముందు తను ఒక హంతకుడుగా ఉన్నాడు. కాని ఎప్పుడైతే క్రీస్తును కలిసాడో తన జీవిత శైలిని మార్చుకొని ఇక “నేను కాదు జీవించేది నాలో క్రీస్తు జీవిస్తున్నాడు” (గలతీ 2:20) అని పలికిన వ్యక్తి, సౌలుగా పిలువబడిన పునీత పౌలు. కాని అదే యవ్వన దశలలో ఉన్న మరో వ్యక్తి ఎప్పుడైతే తాను దేవుని స్వరాన్ని ఆలకించారో అంతే అప్పటి నుండి యోసేపు లోకానుసారంగా వచ్చే ప్రణాళికలు కాక దేవుని చేతిలో తన జీవితాన్ని అర్పించడానికి సిద్ధపడ్డాడు. తన అంగీకారాన్ని తెలపడం ద్వారా ఆత్మలో జన్మించిన యోసేపు తన జీవితాన్ని దేవుని చేతులలో అంకితం చేసి దేవుడు తనలో పనిచేయుటకు, దైవవాక్కు తనలో పనిచేయుటకు దేవుని ప్రణాళిక పనిచేయుటకు విధేయించాడు.

తన పిలుపును గ్రహించుకొన్న యోసేపు తన జీవితాన్ని సార్థక పరచుకొనడమేకాక ఇతరులు కూడా వారి వారి జీవితములలో దేవుని చిత్తాన్ని తెలుసుకొనుటకు సహకరించారు. నా అంచనా ప్రకారం యోసేపుగారు తన పిలుపు అంగీకరించడం వలన మరియతల్లి తనకు ఇవ్వబడిన పిలుపులో మరింత ధృడంలో నిలువబడి తన జీవిత పర్యంతము దైవపిలుపులో స్థిరముగా ఉండుటకు యోసేపుగారు పిలుపు మార్గదర్శకంగా బలంగా, అండగా నిలచినది.

## అగోచరములను చూచి అసాధ్యములను నమ్ముట

దేవదూత మరియతల్లికి మంగళవార్త అందించిన తరువాత నుండి మరియతల్లి శరీరంలో మార్పుల వలన మరియమ్మ ఒక క్రొత్త రకపు అనుభూతిని పొంది ఉండవచ్చు. కాని సాధారణగా కనీసం 2 లేదా 3 మాసముల వరకు గర్భిణి స్త్రీలో బయట మార్పులు ఏమి కనిపించవు. ఈ తరుణంలో దేవదూత యోసేపుగారికి మంగళవార్తను వినిపించినపుడు ఈయను మరియమ్మ చూడలేదు, గర్భంలో శిశువును తాకలేదు. ఎటువంటి అనుభూతి లేదు కాని దూత సందేశము అందించిన వెంటనే వాక్య రూపి అయిన దేవుడు నిరంతరం జీవించువాడు లోకం అంతయు ఎదురు చూస్తున్న రక్షకుడు అయిన యేసు యోసేపుగారి మనస్సులో జన్మించారు. పునీత యోసేపుగారు తన విశ్వాసపు కన్నులతో అగోచరములైన సంఘటనను తన అంత:రంగంలో చూచి ఉండవచ్చు, వాస్తవానికి ఈయనకు వచ్చినది కేవలం కలయే అయినా తెరవబడినది విశ్వాసపు కన్నులు. మానవ దృష్టిలో కన్యగర్భం ధరించడం అసాధ్యం నమ్మశక్యం కానిది. కాని "దేవునికి సమస్తము సాధ్యము" (లూకా 1:37) అసాధ్యమైన వాటిని విధేయత కలిగిన హృదయంతో దేవుని చిత్తాన్ని నమ్మి దైవ సంకల్పము నేరవేర్చడానికి దేవునితో చేతులు కలిపిన మహానీయుడు పునీత యోసేపుగారు.

## దేవుని వాక్యమును కొనియాడుట

కీర్తన 119:72 "దేవుని వాక్కు వేలకొలది బంగారం, వెండి నాణెముల కంటే గొప్పది". దావీదు గొప్ప సంపన్నుడైన రాజు అయినప్పటికి తన జీవితంలో దేవుని వాక్కు ఒక మహత్తరమైన నిధివంటిది అని జ్ఞప్తి యందు ఉంచుకొన్నాడు. దావీదు వంశస్థుడై యోసేపుగారి ప్రవర్తన చూపినప్పుడు ఆయన కూడ తన జీవితంలో రాజుకు ఉన్నత ఆస్తిపాస్తులు లేకున్నను, దేవుని వాక్కును తన జీవితమునుకు గొప్ప బహుమానంలా, నిధి లాగును, అతి ముఖ్యమైనదిగా భావించి తన ప్రతి కదలికను దివ్య వాక్కు మీదనే ఆధారం చేస్తున్న వ్యక్తి. మత్తయి 6:33 "మొదట దేవుని రాజ్యమును (వాక్యమున) వెదకుము అన్నియు

ఒసగబడును" దేవుని వాక్కు ఉన్నవానికి సమస్తము కలిగి ఉన్నట్లే, దేవుని వాక్కుతో నింపబడిన జీవితము విజయవంతమైనది. దేవుని వాక్కు (దేవుడు) లేక మనము ఏమి చేయజాలము (యోహాను 15:5), అహారం శరీర పోషణకు అవసరం అయితే; (ద్వితీయో 8:3) "మానవుడు కేవలం రొట్టె వలన మాత్రమే కాక దేవుని నోటి నుండి వచ్చు ప్రతి వాక్కు వలన జీవించును" అని చెప్పబడిన సత్యమును గ్రహించి ఉన్న యోసేపు కేవలం శరీర సంరక్షణ కొరకు మాత్రమే కాక తను దేవుని వాక్కునే బలముగా మార్చుకొని దేవుని వాక్కులో సంతోషమును సమాధానము కనుగొని ఈ వాక్కు తనను బలపరుస్తున్నది అని తెలుసుకొని నెహెమ్యా 8:10 ఆ "దేవుని వాక్కుతో తాను పొందుకొనే ఆనందమే తన బలముగా మార్చున్న దివ్య తనయుడు", పునీత యోసేపుగారు.

## దివ్యవాక్కు రక్షణ ఆయుధము (సంపూర్ణ కవచము)

పునీత పౌలుగారి మాటలలో ఎఫెసీ 6:12-19 ఈ లోకంలో మన పోరాటం కేవలం, రక్త మాంసములతో మాత్రమే కాదు కాని అంతరంగ శక్తులతో పోరాటము చేయుచున్నాము. ఉన్నత పోరాటం, మంచి పోరాటం, శ్రేష్టమైన పోరాటం, పోరాడిన వారిలో పునీత యోసేపుగారు కూడ ఒక్కరు అయితే ఈ భయంకర పోరాటమునకు ఆయుధములు ఏవనగా

సత్యము - నడుమునకు తోలుదట్టీగా
నీతిని - కవచముగాను
విశ్వాసము - డాలుగా
రక్షణ - శిరస్త్రాణముగాను
వాక్కు - ఖడ్గముగను

హెబ్రీ 4:12 "రెండు అంచులగల ఖడ్గమును" ధరించవలెను అని ముందుగానే ఎరిగి ఉన్న పునీత యోసేపుగారి జీవితములో సంపూర్ణ కవచమునకు ఉండవలసిన అన్ని ఆయుధములు చూస్తూ ఉన్నాము. తను పొందుకున్న రెండు అంచులు కలిగిన ఖడ్గమును చేతబూని, విశ్వాసము అనే డాలును ఎత్తిపట్టి, సత్యమును నడుము దట్టిగా బిగించి, రక్షణ అనే

శిరస్త్రాణమును మన అందరికి ధరింపచేయడానికి వెనకడుగు వేయని పరలోక వీరుడు, పవిత్రుడు. దేవదూత చెప్పిన వాక్యమును చెక్కు చెదరకుండా వాక్యమును నమ్మిన యోసేపు వ్యాకధారి అయిన శ్రీ యేసునకు అండగా నిలిచిన ఉన్నాడు.

## పరివర్తన కలిగించే వాక్కు

శూన్యమై, అంధకారముతో నిరాకారముగా ఉన్న భూమిని ఒక్క మాటతో మార్చి సుందర భువిగా మలచినది శక్తిగల వాక్యం. “బండలాంటి మనస్సును మాంసముగా మార్చే” శక్తి గలది (యెహెజ్కేలు 36:26) దివ్యవాక్కు. మోషే మనస్సును మార్చి ఇస్రాయేలీయులకు నాయకునిగా మార్చినది దివ్యవాక్కు. ఈ విధంగా అనేక ఉదాహరణలు వాక్కు ద్వారా మార్చబడిన మనుషులను జీవితాలను చూడవచ్చు. నూతన నిబంధనలో వివాహమునకు సిద్ధపడుతున్న యోసేపు జీవితంలో వచ్చిన కల వివాదస్పదమైన కలవరాన్ని తెచ్చింది కానీ అప్పటి వరకు కూడా ఈ విషయాన్ని విన్న యోసేపుగారు బహిరంగముగా కాక రహస్యముగా పరిత్యజించుటకు నిశ్చయించుకొని ఉండెను (మత్తయి : 1:19) కాని దేవదూత అనగా దర్శనం ద్వారా దైవ వాక్కు ఎప్పుడైతే యోసేపుగారి వ్యక్తిగత జీవితములో వినిపించబడినదో వెంటనే తన మనస్సును మార్చుకొన్నట్లుగా దేవుని స్వరమును విధేయుడైనట్లుగా మరియమ్మను తన భార్యగా అంగీకరించినట్లుగా చూస్తున్నాం. ఈ దైవవాక్కు సజీవమైనది చైతన్యమైనది. (హెబ్రీ 4:12)

ఈ లోకంలో దేవుడు మాట్లాడిన మాట మీద మాత్రమే నమ్మకం కలిగిన మన పితాపితరులు, దైవమునకు విధేయులై తమ మనస్సులను, ప్రవర్తనను, వ్యక్తిత్వమును మార్చుకొంటూ దేవునికి ప్రీతి కలిగించే జీవితం జీవించారు. దేవుని వాక్యమును నమ్మడానికి (విశ్వసించడానికి) ధైర్యం అవసరం. ఇస్రాయేలియులు, మిద్యానీయుల చేతులలో కష్టాలు అనుభవిస్తూ ఉన్న సమయంలో, గిద్యోను అనే వ్యక్తి జీవిస్తూ ఉండేవారు ఆయన తన పని తాను చేసుకుంటూ ఉండుగా దేవదూత తనను “దేవుడు నీకు తోడుగా ఉన్నారు”

అని సంబోధించెను కానీ గిద్యోను మాత్రం ఏదో హాస్యాస్పదముగా (న్యాయాది 6:12) తలంచెను. తను ముందుగా దేవుని వాక్యమును తనకు ఇచ్చిన పిలుపును నమ్మలేక పోయెను కాని (న్యాయాదిపతులు 6:14-16) లో మిద్యానీయులపై నీ ద్వారా ఇస్రాయేలుకు విజయం దయచేస్తాను అని పలికిన దేవుని వాక్యమును తన దీన స్థితిలో, అనేక శ్రమలు, అనుమానముల మధ్యలో ధైర్యముగా నమ్మి, విజయాన్ని సాధించాడు. అదేవిధంగా దావీదు కూడా గొల్యాతును ఎదురించడంలో చేసిన ధైర్యం ఈ రోజు మనందర ముందు గొప్ప సాక్ష్యంగా నిలుస్తుంది. అదే గోత్రంలో అదే విశ్వాస బీజాలతో దేవుని ద్వారా ఏర్పాటు చేయబడిన యోసేపుగారి జీవితములో కూడా అదే ధైర్యం తన జీవితంలో దివ్యవాక్కును అంగీకరించు లాగును సహాకరించినది.

**దివ్య వాక్కుచే నడిపించబడువారికి ఈ లోకం తప్పక విధేయించును** గాడాందకారంలో నడచినను ఆయన బడిత కోల తోడుగా ఉండును జిగట గలిగిన మన్నులో నుండి లేవనెత్తి సమతలమగు భూమిపై నిలిపేది దైవవాక్యం. దైవభీతి కలిగిన వారికి మాత్రమే దైవ వాక్కు వారి 'త్రోవలో వెలుగై ఉండి' (కీర్తన 119:105) 'మన అడుగులు కుడికి వేయవలెనా లేకా ఎడమకు వేయవలెనో' కూడా దివ్యవాక్కు మనకు బోధించుచునే యుండును (యెషయా 30:21). ఇంత దివ్యమైన వాక్కు మన మధ్యలోని వచ్చినప్పుడు "ఎడారి సంతసించును మరు భూమి ప్రమోదము చెందును, పుష్పించును అలసిన హస్తములు వణుకు మోకాళ్ళకు సత్తువ తెచ్చును, ఎండిన నేల సరస్సు అగును. ఎడారిలో రాజపదములు అగును" (యెషయా 35:1-5) ఈ వాక్కును, వాగ్దత్తమును నమ్మి జీవించిన వారు మనకు ముందు నడిచిన విశ్వాస వీరులు. ఈ వాక్కు నేటికి కూడా సజీవం (హెబ్రీ 13:8) "నిన్న నేడు ఒకే రీతిగా ఉండే వాక్యం" ఈ వాక్కు మధురమైన మహిమ కలిగిన వాక్కు అన్ని విధాలుగా ఈ వాక్కును తన జీవితంలో అనుభవించి, వాక్కు రూపి అయిన దేవుని స్పృసించి దైవకుమారుని ఆత్మ శరీర కీడులనుండి కాపాడడానికి దివ్యవాక్కుచే నడిపింపబడిన యోసేపుగారు చిరస్మరణీయులు.

## ప్రభువును నమ్మువారు సియోను కొండవలె నిశ్చలముగను శాస్వతముగా నిలుతురు (కీర్తన 125:1)

ప్రభు వాక్యమును నమ్మిన యోసేపుగారు అలలు నిండిన సముద్రంలో ప్రయాణించినను, బందువులు వెలివేసినను కారు చీకట్లు కమ్ముకొచ్చినను, లోకమంతయు ఎదురు నిలిచినను యోసేపుగారు మాత్రం చలనమొందుక, దేవుని వాక్యమును నమ్మి స్థిరమైన సియోను పర్వతం వలె శాశ్వతముగా నిశ్చలంగా నిలచిన వ్యక్తి.

సర్వోన్నతుడైన దేవుని నమ్మినవారు ధన్యులు (యెషయా 84:2) ప్రభుయేసు పలికినట్లు (యోహాను 15:7) "మీరు నాయందును నామాటలు మీయందు నిలచియున్నచో మీరు ఏది కోరినను ఓసగబడును". ఎందుకనగా (1 పేతురు 1:24-25) మానవులు గడ్డి పూచ వంటి వారు కాని దేవుని వాక్కు ఎప్పటికి నిలిచి ఉండును. ( మత్తయి 5:18) దేవుని వాక్కులో ఒక్క అల్ప అక్షరముకూడ వ్యర్థము కాక అంతము జరిగితీరును ఇటువంటి సజీవ వాక్యం నమ్మిన వారిని దేవుని కృప అవరించి ఉండును (కీర్తన 32:10). అంతేకాక "వెలుగు వారిపై ప్రకాశించును ప్రభు తేజస్సు వారిపై వెలుగొందుచుండును (యెషయా 60:1) దైవ వాక్కునే తన జీవిత చుక్కానికిలా మార్చుకున్న పునీత యోసేపుగారి జీవితంలో ఇవి అన్నియు జరిగెను.

## ముగింపు

దేవుని ఆలోచనలు మానవ ఆలోచనలు పోల్చదగినవి కావు. "దేవుడు హృదయులను అవలోకించువాడు కాని మానవుడు వెలుపలి రూపము చూచువాడు" (1 సమూ 16:2) దేవుని ఆలోచన ఎప్పుడు తప్పుకాదు. క్రీస్తు భగవానునికి భూలోక తల్లి తండ్రిని ఎన్నుకోవడంలో దేవాది దేవుని నిర్ణయం సభ (లూకా 8:20-21) "దేవుని వాక్కును ఆలకించువారు నా తల్లితండ్రులు మరియు సోదరులు" అని క్రీస్తు ప్రభు తన మాటలలో పలుకుతున్నారు. పునీత యోసేపుగారు రక్షణ ప్రణాళికలో తన పాత్రను ప్రారంభించిన నాటినుండి దేవుని వాక్కును ఆలకించి, అంగీకరించి, ఆచరించిన వ్యక్తి. పునీత యోసేపు గారు తన జీవిత ప్రయాణం అంతయు దివ్య వాక్కును పాఠించి దివ్య

బాలయేసుని పెంచి, పోషించే తండ్రిగా నిలబడ్డాడు. అట్లే తల్లి మరియ మాత కూడా దేవుని వాక్కును నిత్యము ప్రాటిస్తునే వచ్చారు చివరిగా (మత్తయి 13:17) ప్రకారం ఈ సంగటనలను వినుటకు, చూచుటకు అనేక మంది ప్రవక్తలు కాంక్షించారు కానీ సాద్యపడలేదు కాని పునీత యోసేపు మరియమ్మ గార్ల వారి జీవితంలో శ్రీ యేసుని బాల్యం, జీవిత ప్రయాణం చూడగలగారు అంటే తప్పక వారు దివ్యవాక్కును అనుసరించిన వారే. అంతేగాక (లూకా 9:62) "నాగటి మీద చేయిపెట్టి వెనకకు చూడువాడు ఎవ్వడు దేవుని రాజ్యమునకు యోగ్యుడు కాడు." ఒకవేళ పునీత యోసేపుగారు సాధారణమైన జీవితమును జీవించి ఉండినవాడు అయితే దైవచిత్తం నేరవేర్చగలిగే వాడు కాదు. పునీత యోసేపుగారు నాగటి మీద చేయి పెట్టి తన తుది శ్వాస వరకు దైవాంకితమైన జీవితం జీవించి మంచి పోరాటాన్ని పోరాడి జీవకిరీటాన్ని గెలుచుకున్నారు.

విశ్వాసంతో దేవుని వాక్కును విని
నిరీక్షణతో దేవుని వాక్కును నమ్మి
ప్రేమతో దివ్యవాక్కును అనుసరించి
దివిలో దేవునికి స్నేహితునిగా, భువిలో దేవుని పనిచేస్తూ
మట్టి పాత్రగా ఉన్న తన జీవితం మహిమగల
పరలోక ప్రణాళిక నెరవేర్చే సాధనంగా ఉపయోగించి
సార్ధకం చేసుకున్న దైవవాక్కును అనుసరించిన పుణ్యచరుతుడు
దేవునికి నమ్మక ప్రాత్రుడైన యోసేపు గారి ప్రార్థన వేడుదల
మనకు సహాయము చేయును గాక!....

# పునీత యోసేపుగారి ప్రార్థన

మా విమోచకుడగు ప్రభు యేసుని సంరక్షకుడా !

పవిత్ర కన్య మరియ భర్తయగు

పునీత యోసేపుగారా మీకు వందనము!

దేవాది దేవుడు తమ ఏకైక కుమారుని మీకప్పగించారు.

మరియతల్లి మీయందు తన ప్రగాఢ నమ్మకముంచారు.


మీతో కలసి క్రీస్తు ప్రభువు మనుష్యుడయ్యారు.

పునీత యోసేపుగారా ! మాకును మీరు తండ్రిగానుండండి.

మా జీవన మార్గములో మాకు మార్గ చూపరిగానుండండి.

మాకు దేవుని కృపను, కరుణను, ధైర్యమును ప్రాప్తింపచేయండి.

సకల కీడుల నుండి మమ్ము సంరక్షించండి. ఆమెన్




భక్త యోహాను ప్రచురణలు
భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 040-27201427, 27200370
e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org
Printed at : Jeevan Institute of Printing